సత్యమేవ జయతే

సాక్షి

'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి.
దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 305

సోమవారం 26-1-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సోనోవిజన్ రిపబ్లిక్ డే డిస్కౌంట్ సేల్

రిపబ్లిక్‌డే కు సోనోవిజన్ అందించే డిస్కౌంట్‌లో అన్ని పెద్ద కంపెనీల LED, వాషింగ్‌మెషిన్స్, రిఫ్రిజిరేటర్స్, AC, ఎయిర్ కూలర్స్, మొబైల్స్ & ల్యాప్‌టాప్స్ Premium మోడల్స్ సోనోవిజన్‌లో లభిస్తున్నాయి. ముఖ్యంగా సోనోవిజన్‌లో రిపబ్లిక్‌డే డిస్కౌంట్ సేల్ సందర్భంగా 22.5% వరకు లభించే క్యాష్‌బ్యాక్స్ పట్ల కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

అందరికన్నా తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్ అందించే అతిపెద్ద ఎలక్ట్రానిక్ స్టోర్

Lowest Prices GUARANTEED Best Service

సోనోవిజన్ రిపబ్లిక్ డే సేల్

Happy Republic Day

LG 195 Cm (77") OLED — Flexi EMI : 6999/-
SAMSUNG 189 Cm (75") 4K QLED — Flexi EMI : 2990/-
SONY 164 Cm (65") LED 4K Ultra HD Smart — Flexi EMI : 2995/-
LG 164 Cm (65") LED 4K UHD — Flexi EMI : 2999/-
Haier 139 Cm (55") LED 4K HD Smart — Flexi EMI : 1994/-
TCL 139 Cm (55") Mini LED — EMI : 3500/-
LLOYD 108 Cm (43") LED 4K UHD — EMI : 2059/-

vivo 5G X - 300 Pro 8/0, 12/0, 24/0 Schemes Available 10% Cash Back — EMI : 4666/-
oppo F-31, F-31 PRO 5G 8/0, 9/0 Schemes & 12/1 Scheme Available — EMI : 2500/-
iPhone 17, 17 Pro 4000/- Cash Back 12/0, 24/0 & 24/8 Schemes Available. Selected Bank Cards (Exchange Bonus 8000/-) iPhone 16 EMI : 3454/- iPhone 16+ EMI : 3745/-
SAMSUNG S-25 Ultra Mobile 7000/- Cash Back 24/0 Scheme Available — EMI : 4875/-
ONEPLUS 15 5G Ram Expandable Instant Cash Back ICICI Credit Card 12/4 Scheme Available — EMI : 3750/-
realme 15 - 5G 6/0, 8/2, 10/3 Schemes Available Selected Models — EMI : 3700/-
mi Redmi 5G Note 15 Series 6/0, 8/0, 10/2, 12/4 Schemes Available
Smart Watch, Ear Buds, Mobile Accessories — Boat, Realme, Fastrack, Hapipola

hp 12/4 Scheme Available — EMI : 4333/-
Lenovo 12/4 Scheme Available — EMI : 4166/-
DELL 15/5 Scheme Available — EMI : 4583/-
ASUS 12/4 Scheme Available — EMI : 3960/-
MacBook 24/0 Scheme Available — EMI : 4166/-
boAt JBL Sound Bar

LG 5 & 3 Star Inverter A.C — Starting EMI : 2709/-
LLOYD 5 & 3 Star Inverter A.C — Starting EMI : 2625/-
BLUE STAR 5 & 3 Star Inverter A.C — Starting EMI : 2792/-
VOLTAS 5 & 3 Star Inverter A.C — Starting EMI : 2584/-
DAIKIN 5 & 3 Star Inverter A.C — Starting EMI : 2750/-
Godrej 5 & 3 Star Inverter A.C — Starting EMI : 2417/-
HITACHI 5 & 3 Star Inverter A.C — Starting EMI : 2667/-
Haier 5 & 3 Star Inverter A.C — Starting EMI : 2625/-

LG FL W/M 12/7 Kg 100% Dryer — EMI : 4709/-
LG FL W/M 9-Kg — EMI : 2692/-
SAMSUNG FL W/M 12-Kg — EMI : 2900/-
BOSCH FL W/M 7-Kg — EMI : 2742/-
LG TL W/M 7-Kg — EMI : 1435/-
Whirlpool TL W/M 7-Kg — EMI : 1267/-
IFB TL W/M 7-Kg — EMI : 1617/-
LG Semi W/M 7-Kg — EMI : 884/-
LLOYD Semi W/M 7-Kg — EMI : 850/-

LG RF SBS 635 Ltrs — EMI : 4999/-
SAMSUNG RF SBS 650 Ltrs — EMI : 5750/-
LG RF FF 466 Ltrs — EMI : 2555/-
LG RF FF 272 Ltrs — EMI : 1833/-
Godrej RF FF 270 Ltrs — EMI : 1791/-
LG RF FF 246 Ltrs — EMI : 1833/-
Haier RF FF 240 Ltrs — EMI : 1899/-
Whirlpool RF FF 235 Ltrs — EMI : 1800/-
LG RF DC 210 Ltrs — EMI : 1708/-
VOLTAS beko RF DC 175 Ltrs — EMI : 1250/-
LLOYD RF DC 188 Ltrs — EMI : 1160/-

KITCHEN SMALL APPLIANCES
Water Dispenser — Starting Price Rs: 9500/-
Water Purifier RO — Starting Price Rs: 13000/-
Water Geyser 10 Litres — Starting Price Rs: 6700/-
Microwave Oven — Starting Price Rs: 7500/-
Air Chimney — Starting Price Rs: 8100/-
3 Burner Glass Cooktop — Starting Price Rs: 5000/-
Wet Grinder — Starting Price Rs: 3100/-
Rice Cooker — Starting Price Rs: 1650/-
Mixer Grinder 3 Jar, 750 Watts — Starting Price Rs: 2900/-
Juicer, Kettle, Air Fryer, Iron Box, Blender
T & C Apply

BAJAJ Built for Life | Preethi | Prestige | HAVELLS | morphy richards | KENT Mineral RO | EUREKA FORBES | FABER | pureit | Livpure | V-GUARD | Sunflame | Crompton | AO Smith | Butterfly | Vidiem

అందరికన్నా తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్

విశాఖపట్నం
డైమండ్‌పార్క్-1, ద్వారకా నగర్, వైజాగ్. - 8333924946
డైమండ్‌పార్క్ - 2 ద్వారకా నగర్, వైజాగ్ 9246667474, 8333924929
3వ కొత్త షోరూం : ద్వారకానగర్, పోలక్‌స్కూల్ ఎదురు, డైమండ్‌పార్క్ వైజాగ్ - 8712635857, 858, 859.
దువ్వాడ స్టేషన్ రోడ్, కుర్మన్నపాలెం. 8712416261, 62, 63.
శ్రీకన్య థియేటర్ ఎదురు, గాజువాక 9246667575, 9154281127
న్యూ గాజువాక జంక్షన్, గాజువాక. 9440804187, 9100991705
న్యూ సుకన్య థియేటర్, గోపాలపట్నం 9100991704, 9154281129
భారత్ పెట్రోల్ బంక్ ఎదురు, గోపాలపట్నం. 8712635833
కార్‌షెడ్ జంక్షన్, మధురవాడ. 9246666214, 9390006613

తూర్పు గోదావరి
కోటిపల్లి బస్టాండ్, రాజమండ్రి. 9246662288, 9246666212
జె.యన్.రోడ్, రాజమండ్రి. 9100991700, 9154281119
ఇన్నస్‌పేట, రాజమండ్రి. 9154281197, 98, 99
రాజమండ్రి - 4. కోటిపల్లి బస్టాండ్ వి.టి.కాలేజ్ రోడ్ - 9246666212.
రామయ్య స్ట్రీట్, కాకినాడ. 9246665511, 9246666201
సర్పవరం జంక్షన్, కాకినాడ. 7331149376, 77, 78

శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా
చెన్నయ్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు. 9246666206, 9154279913
ముత్తుకూరు గేట్, మిని బైపాస్ రోడ్, నెల్లూరు. - 8712600519, 20, 21
ఒంగోలు, బాపూజి మార్కెట్. 9246666329, 9154279911

పశ్చిమ గోదావరి
జువ్వల పాలెం రోడ్, భీమవరం. 8333924936, 9154281175
బడేటి పార్క్ ఎదురు, ఏలూరు. 9246666205, 9154281172
అశోక్ నగర్, ఏలూరు. 9390006620, 9154281112
అంబికాదేవి టెంపుల్, సత్రంపాడు, ఏలూరు - 8712635838, 839
పైడిపర్రు రోడ్, తణుకు. 8333924938, 9154281115
తాడేపల్లిగూడెం, గొల్లగూడెం సెంటర్. 8712635854, 55, 56
అమలాపురం, కె.యస్.ఎఫ్. రోడ్. 8712416257, 58, 59.
విజయనగరం 3 లాంతర్ల సెంటర్, 9246666208, 9154281239
ఐస్ ఫ్యాక్టరి జంక్షన్, 8712600523, 8712600535
శ్రీకాకుళం, రామలక్ష్మణ్ జంక్షన్, జి.టి.రోడ్. - 9154281140, 41

విజయవాడ ఎన్.టి.ఆర్. జిల్లా, కృష్ణా జిల్లా
రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ. 9440804182, 9246666202
కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్, విజయవాడ. 9440804183, 9246666209
ఆల్ ఇండియా రేడియో ఎదురు, యం.జి.రోడ్, విజయవాడ. 9246666203, 9154281640
మోహన్‌దాస్ థియేటర్ దగ్గర, పటమట, విజయవాడ. 9246661616, 9100991702
దుర్గా ప్లాజా, యం.జి.రోడ్, పటమట, విజయవాడ. 8712417841, 42, 43.
రింగ్ రోడ్, విజయవాడ. 8712600531, 532, 533
పాయకాపురం, విజయవాడ. 8712648704, 05, 06.
విజయప్లాజా (విజయటాకీస్) ఏలూరు రోడ్, విజయవాడ. 9154281648, 649, 650.
ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట, విజయవాడ. 9100991701, 9246666664
ఎనికేపాడు - 1, విజయవాడ. 9100991703, 9154281626
ఎనికేపాడు - 2, ఏలూరు రోడ్, విజయవాడ. 8712416250, 51, 52.
గొల్లపూడి, విజయవాడ. 8333924930, 9154281628
కానూరు, యం.జి.రోడ్, విజయవాడ. 8712600536, 8712600537
మెయిన్ రోడ్ సెంటర్, పోరంకి 9154281645, 46, 47
గుడివాడ, ఏలూరు రోడ్. 9100991708, 9154281178, 79
మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు. 7331149379, 80, 81

గుంటూరు జిల్లా
జిన్నాటవర్ సెంటర్, గుంటూరు. 9154279910, 9440804185
లక్ష్మీపురం, మెయిన్ రోడ్, గుంటూరు. 9246667373, 9154867822, 23, 24
లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905
బ్రాడీపేట్, గుంటూరు. 9246666215, 9100991706
రత్నాటాకీస్ దగ్గర, తెనాలి. 8333924937, 9154279903
టౌన్ చర్చ్ ఎదురు, బోస్ రోడ్, తెనాలి. 9246666211, 9154279901
మునిసిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లె. 9390006609, 9154281200
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి - 7331149366, 367, 368
బాపట్ల మెయిన్ రోడ్, బాపట్ల. 9246666207.
నరసరావుపేట
రైల్వేస్టేషన్ రోడ్, అరండల్‌పేట, 8712648710, 11, 12.

రాయలసీమ
న్యూ బాలాజి కాలని, ఎయిర్ బైపాస్ రోడ్, తిరుపతి - 7331149370, 371, 372
అలిపిరి రోడ్, లీలామహల్ జంక్షన్, తిరుపతి - 9100991707, 9154279918
నేతాజి రోడ్, తిరుపతి. 9440804186, 9154279916
ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురు, పార్క్ రోడ్, కర్నూలు - 9154281642, 43.
అమ్మా హాస్పిటల్ సెంటర్, సి-క్యాంప్ ఆఫీస్, కర్నూలు - 8333924947, 48
అంబేద్కర్ నగర్ స్ట్రీట్, ఆదోని. 8712417853, 54, 55.
హెచ్.పి.పెట్రోల్ బంక్ ప్రక్కన, సుభాష్ రోడ్, అనంతపురం - 9154281191, 92
రాజీవ్ గాంధి పార్క్ రోడ్, యస్.ఆర్.రాజీవ్ పార్క్ కడప - 9154281194, 96
పలమనేరు రోడ్, దర్గా ఎదురు, చిత్తూరు. 8712600528, 8712600530
తపోవనం స్కూల్ ఎదురు, వెల్లూరు రోడ్డు, చిత్తూరు. 8712635836, 46, 47
టి.టి.డి. కళ్యాణ మండపం ఎదురు, శ్రీనివాస నగర్ నంద్యాల - 8712600525, 526, 527

ఖమ్మం
కస్పాబజార్, ఖమ్మం. 9246666319, 9154281634
వైరా రోడ్, ఖమ్మం. 9100991709, 9154281635
పర్ణశాల ఎదురు, వైరారోడ్, ఖమ్మం. 8333924931, 9154281637, 38
కొత్తగూడెం
కొత్తగూడెం, భద్రాచలం రోడ్. 9154867825, 26, 27
సూర్యాపేట, కుడకుడ రోడ్. 8712648761, 62, 63
నల్గొండ, ప్రకాశం బజార్. 8712648715, 16, 17.
వరంగల్
అదాలత్ సర్కిల్, హనుమకొండ. 8712648718, 19, 20.
కరీంనగర్
వి. పార్క్ ఎదురుగా, జగిత్యాల రోడ్ 8712635843, 44, 45
వేములవాడ రోడ్, మంకమ్మతోట 8712635841, 42

హైదరాబాద్
పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181
మెట్రోస్టేషన్ దగ్గర, కూకట్‌పల్లి. 9154281180, 9154281181
హైదర్ నగర్, హైదరాబాద్. 7331149363, 364, 365
మలక్‌పేట్, హైదరాబాద్. 8333924932 / 933
ఎల్.బి.నగర్, డి-మార్ట్ ఎదురు. 8333924943, 9154281188
బి.యన్.రెడ్డి నగర్, సాగర్ రోడ్. 8712648707, 708, 709
ప్యారడైస్ కాలని, షాద్‌నగర్. 8712648701, 02, 03.
మహబూబ్‌నగర్, మెట్టుగడ్డ గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర. 8712635851, 52, 53
నిజామాబాద్, వినాయక్ నగర్. 8712648766, 67, 68.
మిర్యాలగూడ, ఎన్‌ఎస్ సాగర్ రోడ్, వైష్ణవిగ్రాండ్ దగ్గర - 8712635848

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16+4 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 305

సోమవారం 26-1-2026
పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

154 పరుగులు.. 60 బంతుల్లోనే..

న్యూజిల్యాండ్‌తో 5 టి20ల సిరీస్‌ను రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే భారత్ చేజిక్కించుకుంది. ఆదివారం జరిగిన మూడో టి20లో 8 వికెట్లతో కివీస్‌పై గెలుపొందింది.

వివరాలు 8లో ▸

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తేజస్వీ

రాష్ట్రీయ జనతాదళ్ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ తన చిన్న కుమారుడు, రాజకీయ వారసుడు తేజస్వీ యాదవ్‌కు ప్రమోషన్ కల్పించారు. పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు.

వివరాలు 6లో ▸



నోరి దత్తాత్రేయుడు | గరిమెళ్ల | వెంపటి | మురళీమోహన్ | రాజేంద్రప్రసాద్

వికసించిన పద్మాలు

- గణతంత్ర దినోత్సవ వేళ ప్రతిష్టాత్మక పురస్కారాల ప్రకటన
- ఈ ఏడాది 131 మందికి పద్మ అవార్డులు
- ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్.. 113 మందికి పద్మశ్రీ
- ధర్మేంద్రకు పద్మవిభూషణ్.. మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌లకు పద్మభూషణ్
- తెలుగు రాష్ట్రాల నుంచి నోరి దత్తాత్రేయుడుకి పద్మభూషణ్
- రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పద్మశ్రీ
- మురళీమోహన్, రాజేంద్రప్రసాద్, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, వెంపటి కుటుంబశాస్త్రిలకు పద్మశ్రీ

2లో

రీ సర్వేతో భూ తగాదాలన్నీ

సమసిపోతున్నాయి

గతంలో పలుమార్లు స్పష్టం చేసిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్

- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాకముందు కూడా రైతులతో మాట్లాడాను.. రీసర్వే వల్ల మేలు జరుగుతుందని చెప్పారు
- పాత రోజుల్లో ఒక గ్రామంలో సర్వే చేయాలంటే రెండేళ్లు పట్టేది
- అప్పట్లో చెయిన్ వేసేవాళ్లు.. అది లూజుగా వదిలితే ఆ మేర భూమి తగ్గిపోయేది
- ఓ వ్యక్తి చనిపోయి 15 ఏళ్లయినా అతని పేరుపై ఉన్న భూమి కొడుకు పేరుపై ఎక్కేది కాదు
- భూమి కొనుక్కున్న వాళ్ల పరిస్థితీ ఇంతే.. కొత్త వివరాలు రికార్డుల్లోకి ఎక్కవు
- ఇలాంటివన్నీ ఇప్పుడు రీ సర్వే ద్వారా క్లియర్ చేస్తున్నాం
- భయాలు, అనుమానాలకు తావు లేకుండా కచ్చితంగా హద్దుల నిర్ధారణ
- సాయిప్రసాద్ ఆధ్వర్యంలోనే 2022 నుంచి 2024 వరకూ ముమ్మరంగా సాగిన రీ సర్వే
- ఇప్పుడు కూడా ఆయనే రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
- జగన్ హయాంలో రీ సర్వే బాగా జరిగింది కాబట్టే ఆయన కొనసాగింపు
- త్వరలో చీఫ్ సెక్రటరీగానూ బాధ్యతలు
- తద్వారా ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేశారని స్పష్టత
- ఇటీవల దావోస్ సదస్సులో ఐఎంఎఫ్ ఎండీ గీతా గోపీనాథ్ సైతం రీ సర్వేపై ప్రశంసలు
- ఇది చరిత్రాత్మక కార్యక్రమమన్న పలువురు ఐఏఎస్ అధికారులు

3లో

కొందామా? అమ్ముదామా?

బంగారం, వెండి ధరల పరుగుతో సందేహాలు

- 11,12ల్లో ▸

ఏమనుకుంటున్నావ్.. నన్నే పక్కకెళ్లమంటావా?

విశాఖ ఉత్సవ్‌లో కలెక్టర్‌పై రెచ్చిపోయిన టీడీపీ మేయర్

14లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹72	ఫారం దగ్గర లైవ్ బర్డ్	150 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	257 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	177 కిలో	స్కిన్ లెస్	292 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

'వెలిగొండ'నూ కొట్టేద్దాం!

ప్రాజెక్టును పూర్తి చేయకపోయినా మరో క్రెడిట్ చోరీకి సిద్ధమవుతున్న చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే రికార్డు సమయంలో రెండు టన్నెల్స్ పనులన్నీ పూర్తి

కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ రూ.1,046.46 కోట్లు వ్యయం

దశాబ్దాల కల సాకారం చేస్తూ ప్రాజెక్టు పనులను పరుగులెత్తించిన వైఎస్ జగన్

వెలిగొండ జంట సొరంగాలు

- శ్రీశైలంలో నీటిమట్టం 841 అడుగులకు చేరగానే సొరంగాల ద్వారా నీటిని తరలించడానికి లైన్ క్లియర్
- అయినా నల్లమలసాగర్‌కు నీటిని తరలించడంలో చంద్రబాబు సర్కారు ఘోర వైఫల్యం
- 2024లో కృష్ణా జలాలు అందుతాయన్న ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల ప్రజల ఆశలు అడియాశలు
- కేవలం రూ.992 కోట్లతో పునరావాసం కల్పించి ఉంటే 2025 ఖరీఫ్ సీజన్‌లోనే నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ
- వైఎస్ జగన్‌కు మంచి పేరొస్తుందనే దుర్బుద్ధితో నిర్వాసితులకు పునరావాసం కల్పించని వైనం
- త్వరలో సందర్శనకు సన్నద్ధం.. జగన్ కృషినంతా తన ఖాతాలో వేసుకునే యత్నం
- ఆది నుంచి సీఎం చంద్రబాబు తీరు ఇంతే అంటున్న సాగు నీటి రంగ నిపుణులు

14లో

క్లుప్తంగా...

‘పద్మ’ పురస్కారాలకు ఎంపికైన వారికి వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: ప్రతిష్టాత్మక ‘పద్మ’ పురస్కారాలకు ఎంపికైన వారికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ‘తమ విశిష్ట సేవలతో దేశానికి, తెలుగు రాష్ట్రాలకు పేరు తెచ్చిన ‘పద్మ’ పురస్కార గ్రహీతలు అందరికీ హృదయపూర్వక అభినందనలు. వివిధ రంగాల్లో మీరు సాధించిన అత్యున్నత గుర్తింపు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. మీ సేవలు నిరంతరం కొనసాగాలని ఆశిస్తున్నాను’ అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

నాంపల్లి అగ్ని ప్రమాదంలో ఐదుగురు మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: హైదరాబాద్ నాంపల్లిలోని ఫర్నీచర్ షాపులో అగ్ని ప్రమాదం ఘటనలో ఐదుగురు మరణించడం అత్యంత విషాదకరమని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ ఘటన తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనది ఓటు హక్కు

సీఎస్ విజయానంద్

సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.విజయానంద్ అన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకొని, ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆదివారం విజయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎస్ మాట్లాడుతూ ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యతని చెప్పారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ మాట్లాడుతూ గతంలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి జనవరి ఒకటో తేదీని మాత్రమే ప్రామాణికంగా తీసుకునేవారని చెప్పారు. ఇప్పుడు కొత్త చట్టం ప్రకారం సంవత్సరంలో నాలుగు తేదీల (జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1)ను ప్రమాణికంగా తీసుకుంటున్నట్లు వివరించారు. తొలుత భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ వర్చువల్‌గా తన సందేశాన్ని అందిస్తూ.. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా దేశంలోని ఓటర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. గత ఎన్నికల నిర్వహణలో కలెక్టర్లుగా పని చేసినవారికి వివిధ అవార్డులు అందించారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

హైకోర్టు నాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తదితరులు

ఒంగోలు: ప్రతి ఒక్కరూ చట్టాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని ప్రకాశం జిల్లా పోర్టుఫోలియో జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సూచించారు. ఒంగోలు 7వ అదనపు జిల్లా జడ్జి టి.రాజావెంకటాద్రి, ఆయన కుమారుడు, హైకోర్టు న్యాయవాది టీవీఎస్‌ఎం కులదీప్ సంయుక్తంగా రచించిన ‘ది గ్లింప్స్ ఇన్ టు ద క్రిమినల్ మేజర్ యాక్ట్స్’ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చట్టాలపై అందరూ అవగాహన పెంపొందించుకోవడం ద్వారా న్యాయసేవలు త్వరితగతిన అందుతాయని చెప్పారు. ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి టి.రాజ్యలక్ష్మి, తిరుపతి ఫ్యామిలీ కోర్టు జడ్జి జి.రాంగోపాల్, ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు, హైకోర్టు రిజిస్ట్రార్లు భూపాల్‌రెడ్డి, ఏడుకొండలు, శ్రీనివాసశర్మ, పలువురు జడ్జిలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇదండీ సంగతి

...ఆంధ్రప్రదేశ్, తెలంగాణ శకటాలు మేడం!

వికసించిన పద్మాలు

గణతంత్ర దినోత్సవ వేళ 131 మందికి పద్మ అవార్డులు

ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు

సాక్షి, న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవ వేళ కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డులను ప్రకటించింది. 2026 సంవత్సరానికి గాను ఆదివారం విడుదల చేసిన ఈ జాబితాలో వివిధ రంగాలకు చెందిన 131 మంది ప్రముఖులకు స్థానం దక్కింది. ఇందులో 5 పద్మవిభూషణ్, 13 పద్మభూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. ఈసారి అవార్డు గ్రహీతల్లో 19 మంది మహిళలు ఉండగా, 16 మందికి మరణానంతరం పురస్కారాలు ప్రకటించారు. అలాగే విదేశీయులు, ఎన్నారైల విభాగంలో ఆరుగురు ఎంపికయ్యారు. కళలు, సామాజిక సేవ, ప్రజా వ్యవహారాలు, సైన్స్, వైద్యం, సాహిత్యం, క్రీడలు తదితర రంగాల్లో నిష్ణాతులైన వారికి పద్మ పురస్కారాలు ప్రకటించారు. దేశానికి అసాధారణ సేవలందించినందుకు ఇచ్చే పద్మవిభూషణ్ పురస్కారం ఈసారి బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్రసింగ్ దేవల్ (మహారాష్ట్ర), కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్‌లను మరణానంతరం వరించింది. వీరితో పాటు ప్రజా వ్యవహారాల విభాగంలో కె.టి.థామస్ (కేరళ), కళల విభాగంలో ఎస్.రాజమ్(ఉత్తర ప్రదేశ్), సాహిత్యం, విద్య విభాగంలో పి.నారాయణన్ (కేరళ) ఈ అత్యున్నత గౌరవానికి ఎంపికయ్యారు. ఇక విశిష్ట సేవలకుగాను ఇచ్చే పద్మభూషణ్ జాబితాలో ప్రముఖ గాయని అల్కా యాగ్నిక్, మలయాళీ నటుడు మమ్ముట్టి, మాజీ గవర్నర్ భగత్ సింగ్ కోష్యారీ, పారిశ్రామికవేత్త ఉదయ్ కోటక్, టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్, ప్రచార రంగ దిగ్గజం పియూష్ పాండే వంటి వారున్నారు.

పద్మవిభూషణ్

ధర్మేంద్ర

అచ్యుతానందన్

పద్మభూషణ్



మమ్ముట్టి

అల్కా యాగ్నిక్

పద్మశ్రీ

జగదీశ్‌కుమార్

దీపికారెడ్డి

జి.వెంకట్రావు

పి.విజయ్ ఆనందరెడ్డి

జి.చంద్రమౌళి

టి.కుమారస్వామి

ఎం.రామారెడ్డి

తెలుగు రాష్ట్రాలకు పద్మ పంట

తెలుగు రాష్ట్రాలకు ఈసారి పద్మ పురస్కారాల్లో పెద్దపీట దక్కింది. ఆంధ్రప్రదేశ్ నుంచి సీనియర్ నటుడు, మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్‌ను కళల విభాగంలో పద్మశ్రీ వరించింది. అలాగే గద్దె బాబూ రాజేంద్ర ప్రసాద్(కళలు), మరణానంతరం గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ (కళలు), వెంపటి కుటుంబ శాస్త్రి(సాహిత్యం) ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి దీపికారెడ్డి(కళలు), వైద్య రంగంలో గుడూరు వెంకట రావు, పాల్కొండ విజయ్‌ఆనంద్‌రెడ్డి పద్మశ్రీ అందుకోనున్నారు. సైన్స్ రంగంలో చంద్రమౌళి గడ్డమనుగు, కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్, కుమారస్వామి తంగరాజ్, పశుసంవర్ధక విభాగంలో రామారెడ్డి మామిడి (మరణానంతరం) తెలంగాణ కీర్తిని ఇనుమడింపజేశారు. అలాగే.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మాజీ చైర్మన్, తెలంగాణలోని నల్లగొండ జిల్లాకు చెందిన మామిడాల జగదీశ్ కుమార్‌ను సాహిత్యం, విద్య రంగంలో పద్మశ్రీ వరించింది. క్రీడా, సినీ రంగాలకు చెందిన పలువురు ఇతర ప్రముఖులకు కూడా పద్మశ్రీ దక్కింది. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ భుల్లర్, హాకీ క్రీడాకారిణి సవితా పునియాలను పద్మశ్రీ వరించింది. సినీ రంగం నుంచి బెంగాలీ నటుడు ప్రోసెన్‌జిత్ ఛటర్జీ, మరణానంతరం నటుడు సతీష్ షా, అనిల్ కుమార్ రస్తోగి ఈ జాబితాలో ఉన్నారు. మార్చి లేదా ఏప్రిల్‌లో రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా వీరు పురస్కారాలు అందుకోనున్నారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి పద్మశ్రీకి ఎంపికైన వారు

మాగంటి మురళీమోహన్ (కళలు)
గద్దె బాబూ రాజేంద్ర ప్రసాద్ (కళలు)
గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం)- కళలు
వెంపటి కుటుంబ శాస్త్రి (సాహిత్యం, విద్య)

తెలంగాణ నుంచి పద్మశ్రీకి ఎంపికైన వారు

దీపికా రెడ్డి (కళలు)
గూడూరు వెంకట రావు (వైద్యం)
పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి(వైద్యం)
చంద్రమౌళి గడ్డమణుగు (సైన్స్, ఇంజనీరింగ్)
కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్ (సైన్స్, ఇంజనీరింగ్)
కుమారస్వామి తంగరాజ్(సైన్స్, ఇంజనీరింగ్)
రామారెడ్డి మామిడి (మరణానంతరం)
-పశుసంవర్ధక విభాగం

పద్మవిభూషణ్ (5)

దేశానికి అసాధారణ సేవలందించినందుకు ఇచ్చే రెండో అత్యున్నత పురస్కారం ఐదుగురిని వరించింది.

ధర్మేంద్రసింగ్ దేవల్ (మరణానంతరం): కళలు (మహారాష్ట్ర)
కె.టి.థామస్: ప్రజా వ్యవహారాలు (కేరళ)
ఎస్.రాజమ్: కళలు (ఉత్తర ప్రదేశ్)
పి.నారాయణన్: సాహిత్యం, విద్య (కేరళ)
వి.ఎస్.అచ్యుతానందన్ (మరణానంతరం): ప్రజా వ్యవహారాలు (కేరళ)

పద్మభూషణ్ (13)

విశిష్ట సేవలకు గాను 13 మందిని పద్మభూషణ్ వరించింది. వీరిలో కొందరు..

నోరి దత్తాత్రేయుడు: వైద్యం (ఆంధ్రప్రదేశ్)
అల్కా యాగ్నిక్: కళలు (మహారాష్ట్ర)
మమ్ముట్టి: కళలు (కేరళ)
ఉదయ్ కోటక్: వాణిజ్యం, పరిశ్రమలు (మహారాష్ట్ర)
భగత్ సింగ్ కోష్యారీ: ప్రజా వ్యవహారాలు (ఉత్తరాఖండ్)
విజయ్ అమృత్‌రాజ్: క్రీడలు (అమెరికా)
పీయూష్ పాండే (మరణానంతరం) - కళలు (మహారాష్ట్ర)

113 మందికి పద్మశ్రీ

వివిధ రంగాల్లో విశేష సేవలందించిన 113 మందికి పద్మశ్రీ పురస్కారం దక్కింది. వీరిలో కొందరు...

రోహిత్ శర్మ: క్రీడా విభాగం (మహారాష్ట్ర)
హర్మన్‌ప్రీత్ కౌర్ భుల్లర్: భారత మహిళా క్రికెటర్ (పంజాబ్)
సవితా పునియా: హాకీ క్రీడాకారిణి (హరియాణా)
ప్రోసెన్‌జిత్ ఛటర్జీ: కళలు (పశ్చిమ బెంగాల్)
సతీష్ షా (మరణానంతరం): కళలు (మహారాష్ట్ర)
అనిల్ కుమార్ రస్తోగి: కళలు (ఉత్తర ప్రదేశ్)

పేదరికం నుంచి ప్రపంచ స్థాయికి..

విఖ్యాత క్యాన్సర్ వైద్యులు నోరి దత్తాత్రేయుడుకు పద్మభూషణ్

- తల్లి కష్టాన్ని గుర్తెరిగి ప్రపంచంలోనే టాప్ ఆంకాలజిస్టుల్లో ఒకరిగా గుర్తింపు
- అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సొంతం
- కృష్ణాజిల్లా వాసుల హర్షాతిరేకాలు
- క్యాన్సర్ నియంత్రణలో భాగంగా ఏపీ ప్రభుత్వ సలహాదారుగా నియమించిన వైఎస్ జగన్ సర్కారు

వైఎస్ జగన్‌తో డాక్టర్ నోరి దంపతులు (ఫైల్)

సాక్షి, అమరావతి/మచిలీపట్నం టౌన్/కర్నూలు (హాస్పిటల్): క్యాన్సర్ మరణ శాసనం కాదు... సరైన సమయంలో గుర్తిస్తే ఆ మహమ్మారిని జయించవచ్చని నిరూపించి అంతర్జాతీయంగా ప్రసిద్ధిగాంచిన తెలుగుతేజం, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడును ‘పద్మ’ పురస్కారం వరించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులను ఆదివారం ప్రకటించింది. వైద్య విభాగంలో డాక్టర్ నోరి దత్తాత్రేయుడును పద్మభూషణ్‌కు ఎంపిక చేసింది. దీంతో ఆయన చిన్న వయసు నుంచి నడయాడిన కృష్ణాజిల్లా మచిలీపట్నం, మంటాడ, తోట్లవల్లూరు ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నోరి దత్తాత్రేయుడు మంటాడ గ్రామంలో 1947 అక్టోబరు 21న జన్మించారు. తల్లిదండ్రులు కనకదుర్గ, సత్యనారాయణ. జిల్లాలోని తోట్లవల్లూరులో ప్రాథమిక విద్యాభ్యాసం, ఉన్నత, పీయూసీ, బీఎస్సీ విద్యను మచిలీపట్నంలోని జైహింద్ హైస్కూల్, ఆంధ్ర జాతీయ కళాశాలలో పూర్తిచేశారు. ఆ తర్వాత కర్నూలు ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి 1971లో ఎంబీబీఎస్ పట్టా తీసుకున్న ఆయన, ఉస్మానియా మెడికల్ కళాశాలలో పీజీ పూర్తిచేశారు. 1962లో ప్రీ-యూనివర్సిటీ, 1965లో బీఎస్సీ, ఉస్మానియాలో ఎండీ చేసినప్పుడు అత్యధిక మార్కులు రావడంతో మెరిట్ స్కాలర్‌షిప్ ఇచ్చారు. ఫిబ్రవరి 1972 నుంచి ఏడాదిపాటు గాంధీ ఆస్పత్రిలో పనిచేశారు. 1973 నుంచి 1976 వరకు హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న రేడియం ఇన్‌స్టిట్యూట్ అండ్ క్యాన్సర్ ఆస్పత్రిలో రెసిడెంట్ డాక్టర్‌గా పనిచేశారు. అనంతరం అమెరికా వెళ్లారు. తల్లిదండ్రులకు 12 మంది సంతానంలో ఆఖరివాడైన నోరి దత్తాత్రేయుడు నాలుగో ఏటలోనే తండ్రిని కృష్ణా వరదల్లో కోల్పోయారు. అనంతరం.. అత్యంత పేదరికం అనుభవిస్తూ తన తల్లి కష్టాన్ని గుర్తెరిగిన ఆయన ప్రపంచంలోనే టాప్ ఆంకాలజిస్టుల్లో ఒకరిగా ఎదిగారు. క్యాన్సర్ వ్యాధికి సంబంధించి నాలుగు పుస్తకాలు, 200లకు పైగా పేపర్ ప్రజెంటేషన్లు చేశారు. ప్రస్తుతం న్యూయార్క్‌లోని ప్రెస్‌బైటేరియన్ హాస్పిటల్‌లో రేడియేషన్ ఆంకాలజీ విభాగం వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు.

సలహాదారునిగా నియమించిన జగన్ సర్కార్

క్యాన్సర్ నియంత్రణపై ప్రత్యేక దృష్టిపెట్టిన గత వైఎస్ జగన్ ప్రభుత్వం డాక్టర్ నోరిని సలహాదారునిగా నియమించింది. ప్రభుత్వ సలహాదారు (సమగ్ర క్యాన్సర్ సంరక్షణ)గా 2021లో నియమితులయ్యారు. గత ప్రభుత్వంలో కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ రూపకల్పన, అమలులో డాక్టర్ నోరి సలహాలు, సూచనలు ఇచ్చారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేస్తే మరణాలు, వ్యాధి భారాన్ని నియంత్రించేందుకు క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వంలోనూ ఆయన సలహాదారునిగా ఉన్నారు.

జాతీయ అంతర్జాతీయ అవార్డులు..

క్యాన్సర్ చికిత్సల్లో విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టడంలో నోరి దత్తాత్రేయుడు కీలకపాత్ర పోషించి ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందారు. క్యాన్సర్ బాధితులకు రేడియేషన్ థెరపీలో రేడియేషన్ మోతాదును అత్యంత కచ్చితంగా లెక్కించడం కోసం బ్రాకీ థెరపీని కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన అనేక క్లినికల్ ట్రయల్స్‌కు ఆయన ప్రధాన పరిశోధకుడిగా ఉన్నారు. ఆయన మెమోరియల్ స్లోన్-కెట్టరింగ్ క్యాన్సర్ సెంటర్ అలూమ్ని సొసైటీ విశిష్ట పూర్వ విద్యార్థుల అవార్డు పొందారు.

నోరి దత్తాత్రేయుడు అందుకున్న అవార్డులు

- 1984లో అమెరికన్ క్యాన్సర్ సొసైటీ వారు క్లినికల్ ఫెలోషిప్ ఫ్యాకల్టీ అవార్డు ఇచ్చారు.
- 1990లో అమెరికన్ కాలేజీ ఆఫ్ రేడియేషన్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు.
- 1994లో అలూమిని సొసైటీ, మెమోరియల్ స్లాన్-కెటరింగ్ క్యాన్సర్ సెంటర్ డిస్టింగ్విష్డ్ అలునినస్ అవార్డు అందుకున్నారు.
- 2000లో ఇప్పటివరకు కాస్టల్ అండ్ కానల్లే పబ్లికేషన్ వారి అమెరికా బెస్ట్ డాక్టర్, లేడీస్ హోం జర్నల్ నిర్వహించే సర్వేలో మహిళల క్యాన్సర్ నివారణలో ఉత్తమ డాక్టర్‌గా ఎంపిక.
- 2014లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో అత్యున్నత పౌర పురస్కారం.. ఎల్లిస్ ఐలాండ్ మెడల్ ఆఫ్ హానర్..
- 2015లో భారతదేశ నాలుగో అత్యున్నత పౌర పురస్కారం ‘పద్మశ్రీ’
- 1995లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గోల్డ్ మెడల్ అందుకున్నారు.
- 2003లో అమెరికన్ కాలేజీ ఆఫ్ రేడియేషన్ ఆంకాలజీ ఫెలోషిప్ అందుకున్నారు.
- అనేక ఏళ్లుగా అమెరికాలో క్యాన్సర్ బాధితులకు అందిస్తున్న ఉన్నత సేవలకుగాను అమెరికన్ క్యాన్సర్ సొసైటీ నోరి దత్తాత్రేయుడికి ‘ట్రిబ్యూట్ టు లైఫ్’ గౌరవంతో సత్కరించింది.
- మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, మాజీ సీఎం ఎన్టీఆర్ సతీమణి బసవతారకం, ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ వంటి ప్రముఖులకు నోరి దత్తాత్రేయుడు క్యాన్సర్ చికిత్స చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు పద్మభూషణ్ రావడంపట్ల కేఎంసీ పూర్వ విద్యార్థులు, వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.

కుగ్రామంలో వికసించిన మరో ‘పద్మం’

వెంపటి కుటుంబ శాస్త్రికి పద్మశ్రీ అవార్డు

- సంస్కృతంలో దిట్ట.. రుగ్వేదంలో పట్టు
- దేశంలో ఉన్న ప్రముఖ సంస్కృత విశ్వవిద్యాలయాల్లో వీసీగా విధులు
- భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పీఠంలో తొలి ఆచార్యుడు
- కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షాతిరేకాలు
- మరోసారి వార్తల్లో నిలిచిన కృష్ణాజిల్లా టేకుపల్లి గ్రామం

వెంపటి కుటుంబశాస్త్రి జన్మించిన స్థలం ఇదే



వి.కుటుంబ శాస్త్రి

మోపిదేవి/గుడ్లవల్లేరు: పండితులు, విద్వాంసులకు నిలయమైన టేకుపల్లి గ్రామంలో మరో ‘పద్మం’ వికసించింది. వెంపటి కుటుంబ శాస్త్రికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంతో కృష్ణాజిల్లాలోని ఈ గ్రామం మరోసారి వార్తల్లోకి వచ్చింది. మండలంలోని టేకుపల్లిలో వెంపటి జగన్నాథం, రాజ్యలక్ష్మి దంపతుల ఆరుగురు కుమారుల్లో ఒకరు కుటుంబ శాస్త్రి. సంస్కృతంలో దిట్ట. ప్రస్తుతం తిరుపతిలో ఉంటున్నారు. దేశంలో ఉన్న ప్రముఖ సంస్కృత విశ్వవిద్యాలయాలు న్యూఢిల్లీ రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్, వారణాసి సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం, గుజరాత్ శ్రీ సోమనాథ్ సంస్కృత విశ్వవిద్యాలయాలకు ఉప కులపతి (వైస్ చాన్స్‌లర్)గా కుటుంబశాస్త్రి పనిచేశారు. తిరుమల సంస్కృత విశ్వవిద్యాలయ వీసీగా కూడా పనిచేశారు. భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పీఠంలో తొలి ఆచార్యుడిగా పనిచేశారు. కేంద్ర మానవ వనరుల మంత్రిగా మురళీమనోహర్ జోషి ఉన్న సమయంలో సంస్కృత సంబంధమైన అనేక పదవులను అలంకరించారు. ప్రస్తుతం సంస్కృతంపై ఈయన లోతైన అధ్యయనం చేస్తున్నారు. తల్లిదండ్రులు వెంపటి రాజ్యలక్ష్మి, జగన్నాథం పేరున ఫౌండేషన్ ఏర్పాటుచేసి స్వగ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టేకుపల్లి గ్రామానికి చెందిన అమరగాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావుకు కూడా గతంలో పద్మశ్రీ లభించింది.

కుటుంబ నేపథ్యం..

వెంపటి కుటుంబశాస్త్రి ఆగస్టు 12, 1950లో జన్మించారు. ఎంఏ పీహెచ్‌డీ చేశారు. తిరుపతిలోని వేద పాఠశాలలో రుగ్వేద అధ్యాయాన్ని పూర్తిచేశారు. వాల్తేరులోని ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి విద్యా ప్రవీణ (ఎంఏ), ప్రాచ్య శీర్షిక పరీక్షలో మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి శిరోమణి (ఎంఏ), మరో ప్రాచ్య శీర్షిక పరీక్షలో అర్హత సాధించారు. 1992లో తమిళనాడులోని తిరుచిరాపల్లిలోని సంస్కృత సాహిత్య పరిషత్ నుంచి వేదాంత కేసరి బిరుదు పొందారు. 2004 ఢిల్లీలోని మందాకిని విద్వత్ పరిషత్ నుంచి విద్యాసాగర్ అవార్డు అందుకున్నారు. ఇలా అనేక అవార్డులు అందుకున్న కుటుంబ శాస్త్రి దివిసీమ వాసి కావడంతో ఈ ప్రాంతం వారు, కుటుంబ సభ్యుల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

‘గరిమెళ్ల’ గళానికి ‘పద్మశ్రీ’ పరిమళం

- అన్నమయ్య కీర్తనలకు వైవిధ్యమైన బాణీలు కట్టిన ఘనాపాటి
- శాస్త్రీయ, ఆధ్యాత్మిక గాయకుడుగా గుర్తింపు
- శ్రీ వేంకటేశ్వరునికి సంకీర్తన నైవేద్యాన్ని సమర్పించిన సంగీత తపస్వి
- నిత్యనూతన గానంతో సంగీత ప్రియులను అలరించిన మధుర గాయకుడు

తిరుపతి కల్చరల్/రాజమహేంద్రవరం సిటీ: అన్నమయ్య సంకీర్తనల పదార్చనే జీవితంగా నిరంతరం తపించి తన స్వర కీర్తనలతో అలరారింపజేసిన సంగీత తపస్వి గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌ని పద్మశ్రీ వరించింది. శ్రీవారి పరమభక్తుడు అన్నమయ్య సంకీర్తనలకు రాగాలనద్ది, వైవిధ్యభరితంగా బాణీలు కట్టి భిన్నమైన స్వర ప్రయోగాలతో సాహిత్య సౌరభంతో అన్నమయ్య కీర్తలను జనబాహుళ్యం చేసిన ఘనాపాటిగా గరిమెళ్ల ప్రసిద్ధి చెందారు. సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి శిష్యరికంతో మరింత రాటుతేలిన ఆయన శాస్త్రీయ, ఆధ్యాత్మిక గాయకుడుగా గుర్తింపు పొందారు. గరిమెళ్ల 1978లో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుడిగా ప్రవేశించి అపార ప్రతిభతో టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా ఎదిగారు. అన్నమయ్య కీర్తనలకు స్వపరపరిచి ఆలపించి తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి సంకీర్తన నైవేద్యాన్ని సమర్పించారు. టీటీడీతో పాటు కంచి కామకోటి పీఠం (2010), అహోబిల మఠం (2020) ఆస్థాన సంగీత విద్వాంసులుగా కూడా గరిమెళ్ల పనిచేశారు.

అంచెలంచెలుగా.. గొప్ప సంగీత విద్వాంసుడిగా..

రాజమండ్రిలో 1948 నవంబరు 9న కృష్ణవేణి, నరసింహారావు దంపతులకు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ జన్మించారు. ఆయన తండ్రి నరసింహారావు కూడా విద్యాంసుడు కావడంతోపాటు ప్రముఖ సినీగాయని జానకి స్వయాన పిన్నమ. వారి స్ఫూర్తితో ఆయన చిన్నప్పటి నుంచి సంగీతంపట్ల ఆసక్తితో అంచెలంచెలుగా ఎదిగి గొప్ప సంగీత విద్యాంసుడుగా గుర్తింపు పొందారు. చివరి దశలో తిరుపతిలో స్థిరపడ్డారు. ఆయనకు భార్య రాధ, కుమారులు అనిల్‌కుమార్, పవన్‌కుమార్. గరిమెళ్ల నిత్యం సంగీతార్చనతో తన ఆధ్యాత్మిక భక్తి పారవశాన్ని చాటుకున్నారు. 2025 మార్చి 9న తిరుపతిలో తన తుదిశ్వాస వరకు నిత్య నూతన మధుర గానంతో సంగీత ప్రియులను అలరిస్తూ, సంగీతోపాసన చేస్తూ నాదయోగిగా పరమపదాన్ని చేరుకున్న ధన్యజీవి, మధుర గాయకుడు, స్వరకర్త, మహా వాగ్గేయకారుడు బాలకృష్ణ ప్రసాద్.



గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ (ఫైల్)

జనరంజకంగా అపూర్వ రాగాల సృష్టికర్త

‘వినరో భాగ్యము విష్ణుకథ, జగడపు చనవుల జాజర, పిడికిట తలంబ్రాల పెండ్లికూతురు’ లాంటి పలు కీర్తనలకు ఆయనే స్వరాలు సమకూర్చారు. సంప్రదాయ కర్ణాటక, లలిత, జానపద సంగీతంలోనూ ఆయన ప్రసిద్ధులు. రాగమే ధ్యాసగా, ఆధ్యాత్మిక సంగీతమే జీవితంగా పయనిస్తూ వేయికి పైగా అన్నమాచార్య సంకీర్తనలను శాస్త్రీయ లలిత, జానపద బాణీలలో జనరంజకంగా స్వరపరిచి ఆ కీర్తనల సాహిత్య పరిమళాలను పండిత, పామరులకు విస్తరింపజేశారు. బహుళ ప్రచారంలో మోహన, హంసధ్వని, శంకరాభరణం, తోడి, కల్యాణి, మాయామాళవగౌళ రాగాలను సరళమైన పద్ధతిలో స్వరపరిచి నోటేషన్‌లతోపాటు చిన్నచిన్న పుస్తకాలుగా అందుబాటులోకి తెచ్చారు. రతిపతిప్రియ, వరం, నటహిందోళం, శివరంజని, పాడి, మిశ్రవకుళాభరణం వంటి రాగాల్లో ఆయన స్వరపరిచిన సంకీర్తనలు ఎంతో అలరింపజేశాయి. సుందరరంజని, సుమశ్రీసుకామవర్ధని, సుమగంధి, సునాదనంది, సత్యప్రియ, సంజీవి, సింధుప్రియ, శ్యామకాంభోజి, వాణీప్రియ, చిత్రకల్యాణి, నిషాది, ప్రసూన, కోమలి వంటి సుమారు 20 అపూర్వ రాగాలను సృష్టించి అందులో కీర్తనలను రచించి పుస్తకాలుగా, ఆడియో రూపంలో తీసుకొచ్చారు.

పురస్కారాలు అనేకం..

సంగీతమే జీవితంగా.. అనునిత్యం ఆధ్యాత్మిక సంకీర్తనల స్వరధారణలో గరిమెళ్ల సంగీత యజ్ఞ ప్రతిభకు విశేష పురస్కారాలు వరించాయి. అన్నమాచార్య సంకీర్తన మహతి, హరికీర్తనాచార్యలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్యాతిక సంస్థల పురస్కారాలు ఎన్నో అందుకున్నారు. శ్రీపద్మావతి మహిళా వర్శిటీ నుంచి డాక్టరేట్ డిగ్రీ పొందారు. పొట్టి శ్రీరాముల తెలుగు వర్శిటీ నుంచి విశిష్ట పురస్కారంతో పాటు రాష్ట్రపతి చేతుల మీదుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం అందుకున్న ప్రతిభాశాలి. అంతటి సంగీత విద్వాంసుడు 2025 మార్చి 9న తుదిశ్వాస విడిచారు. ఆయన మరణాంతరం కేంద్ర ప్రభుత్వం గరిమెళ్ల సంగీత సేవా ప్రతిభను గుర్తించి 2025 ఏడాదికి పద్మశ్రీ అవార్డుతో సత్కరిస్తోంది. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కు పద్మశ్రీ వరించడంతో సంగీతాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్యాగరాజస్వామి ఆరాధానోత్సవాల పంచరత్న కీర్తనల గోష్టిగానం తరహాలో ప్రపంచవ్యాప్తంగా సప్తగిరి సంకీర్తనల గోష్టిగానాన్ని ప్రచారం చేసిన ఘనత గరిమెళ్లకే దక్కింది.

రీ సర్వేతో భూ తగాదాలన్నీ సమసిపోతున్నాయి

గతంలో పలుమార్లు స్పష్టం చేసిన రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్

సాక్షి, అమరావతి: 'పాత రోజుల్లో ఒక గ్రామం సర్వే చేయాలంటే రెండు సంవత్సరాలు పట్టేది. సర్వేయర్ అక్కడ క్యాంపులో ఉంటాడు. ఒకరోజు ఉంటాడు.. ఒకరోజు ఉండడు.. చాలా సమయం తీసుకునే వారు. పాత రోజుల్లో చెయిన్ వేసేవాళ్లు. అది కొద్దిగా లూజుగా అటూ ఇటూ వదిలితే పక్కకు జరిగేది. ఆ మేర భూమిని తగ్గించేసేవారు. ఇప్పుడు అవన్నీ పోతాయి. లాటిట్యూడ్, లాంగిట్యూడ్ (అక్షాంశాలు, రేఖాంశాలు) ఆధారంగా కచ్చితమైన పాయింట్ (ల్యాట్ లాంగ్) స్పష్టంగా వచ్చేస్తుంది. ఆ పథకం పేరు కూడా కచ్చితంగా సరిపోతుంది. ఓ వ్యక్తి చనిపోయి 15 ఏళ్లు అయినప్పటికీ అతని పేరుపై ఉన్న భూమి కొడుకు పేరుపైకి ఎక్కదు. మా వాళ్లు ఎక్కించి ఉండరు. భూమి కొనుకున్న వాళ్ల పరిస్థితి కూడా ఇంతే. కొత్త వివరాలు రికార్డుల్లోకి ఎక్కవు. ఇలాంటివన్నీ ఇప్పుడు క్లియర్ చేస్తున్నాం. భయాలు, వివాదాలకు తావు లేకుండా కచ్చితంగా హద్దుల నిర్ధారణ జరుగుతోంది' అని 2022 ఆగస్టు 2వ తేదీన నాటి సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన సమీక్షలో అప్పటి రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ స్పష్టం చేశారు. 2022లో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భూ పరిపాలన చీఫ్ కమిషనర్‌గా భూముల రీ సర్వే ఆయన నేతృత్వంలోనే జరిగింది. వారంలో రెండుసార్లు ఆయన జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించి సర్వే వేగంగా జరగడానికి అవసరమైన చర్యలు తీసుకునే వారు. ప్రతి రోజూ రీ సర్వే స్టేటస్ రిపోర్టు తయారు చేయించేవారు. రీ సర్వే అద్భుతంగా జరుగుతోందని, ఎంతో ముందు చూపుతో ఈ కార్యక్రమం చేపట్టారని ఆయన చాలా సందర్భాల్లో ప్రశంసించారు. ఎల్లో మీడియా రీ సర్వేకు వ్యతిరేకంగా పని గట్టుకుని కథనాలు రాసినప్పుడు ఆయన మీడియా సమావేశాలు పెట్టి బాగా జరుగుతోందని, దీని వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పేవారు. సాయిప్రసాద్ 2014–19 మధ్య చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కూడా ఆయన పేషీలో పని చేశారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వంలో కూడా ఆయన కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కూడా ఆయనే.

> నేను రెవెన్యూ శాఖలో (ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పోస్టింగ్ ఇవ్వక ముందు) చేరక ముందే తూర్పుగోదావరి జిల్లాలోని పాలగుమ్మి గ్రామానికి వెళ్లి రీ సర్వే ఎలా జరుగుతుందో చూశాను. మూడు గంటలు అక్కడే ఉండి పరిశీలించాక అక్కడి నుంచే సిద్ధార్థ జైన్‌కు ఫోన్ చేసి బాగా చేస్తున్నారని చెప్పా. ఒక సెంటు అటూ ఇటూ అవుతుందేమోనన్న భయంతో పాటు అనుమానాలు ఉండేవి. కానీ అలాంటిదేమీ జరగలేదు. దీని వల్ల చాలా మేలు జరుగుతోందని సిద్ధార్థ్‌కు చెప్పాను. రెవెన్యూ శాఖలో జాయిన్ అయ్యాక గుంటూరు జిల్లాలో రెండు మూడు గ్రామాలకు వెళ్లి రైతులతో రీ సర్వే గురించి మాట్లాడాను. చాలా బాగుందని చెప్పారు. ఈ కార్యక్రమం పూర్తయ్యాక ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది.
>
> – 2022 మార్చి 31న రీ సర్వేపై సమీక్షలో రెవిన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్

త్వరలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి ఆయన ప్రధాన కార్యదర్శిగా ఉంటారని గతంలోనే ప్రభుత్వం జీఓ జారీ చేసింది.

రీ సర్వే బాగా జరిగిందని చంద్రబాబు అంగీకరించినట్లే

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విప్లవాత్మకంగా ప్రారంభమై విజయవంతంగా అమలవుతున్న భూముల రీ సర్వేపై చంద్రబాబు రెండు నాల్కల ధోరణి చర్చనీయాంశంగా మారింది. జగన్ హయాంలో జరిగిన రీ సర్వేను అన్ని రకాలుగా తప్పు పట్టిన చంద్రబాబు.. అప్పట్లో ఆ కార్యక్రమాన్ని అమలు చేసిన అప్పటి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్‌కు ఇప్పుడు తన ప్రభుత్వంలో అదే రెవెన్యూ శాఖను అప్పగించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.
- పైగా తదుపరి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఆయన్ను ఎంపిక చేయడాన్ని ఎత్తి చూపుతున్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సాయిప్రసాద్.. రీ సర్వే బాగా జరుగుతోందని పలుమార్లు సమీక్షా సమావేశాల్లో వెల్లడించారు. ఇప్పుడు ఆయనకు అత్యున్నత స్థాయి పోస్టింగ్ ఇవ్వడం ద్వారా గతంలో ఆయన మాట్లాడిన మాటలు, చేసిన కార్యక్రమాలను.. వైఎస్ జగన్ ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేను అంగీకరించినట్లేనని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.
- ఇటీవల దావోస్‌లో జరిగిన సదస్సులో ఐఎంఎఫ్ (ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్) ఎండీ గీతా గోపీనాథ్ సైతం గత ప్రభుత్వంలో రాష్ట్రంలో చేపట్టిన రీ సర్వేను ప్రశంసించారు. సీఎం చంద్రబాబు అక్కడ ఉండగానే ఆమె ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం గమనార్హం. ఇలాంటి భూ సంస్కరణలు అత్యంత ఆవశ్యకమని ఆమె కొనియాడటం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఎంతో మంది ఐఏఎస్ అధికారులు సైతం రీ సర్వేను మెచ్చుకుంటున్నారు. ఇది అత్యంత సాహసోపేత కార్యక్రమమని, వందేళ్ల తర్వాత చేపట్టిన మహా యజ్ఞమని చెబుతున్నారు. తమ జీవితంలో చాలా సంతృప్తిని ఇచ్చిన కార్యక్రమమని.. రీ సర్వేలో పాలు పంచుకున్న అధికారులందరూ వ్యక్తిగత సంభాషణల్లో చర్చించుకుంటున్నారు.
- వీటన్నింటినీ బట్టి చూస్తే ఎన్నికలకు ముందు చంద్రబాబు, ఎల్లో మీడియా కలిసి పక్కా ప్రణాళికతోనే రీ సర్వేపై దుష్ప్రచారం చేశారని స్పష్టమవుతోంది. ప్రజల్లో విషం నింపి రాజకీయ లబ్ధి కోసం బరితెగించారని ఇట్టే తెలుస్తోంది.

గత 19 నెలల్లో 112 మంది

రైతులు ఆత్మహత్య

'సాక్షి' కథనంపై ప్రభుత్వం వివరణ

సాక్షి, అమరావతి : గత 19 నెలల్లో 112 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు త్రీమెన్ కమిటీ నిర్ధారించిందని, అందులో 47 మంది కౌలు రైతులు ఉన్నారని వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ చెప్పారు. 'కౌలు రైతులు కకావికలు' శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో అర్హత పొందిన కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలిప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. 2025–26లో రూ.8 వేల కోట్లను రుణ లక్ష్యంగా నిర్దేశించామని చెప్పారు. భూ యజమాని అంగీకారం లభించని పరిస్థితుల్లో, కౌలు రైతులను జాయింట్ లయబిలిటీ గ్రూపులు (జేఎల్‌జీ)గా ఏర్పాటు చేసి సంస్థాగతంగా రుణాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏపీ నూతన కౌలు చట్టం–2024 ముసాయిదా రూపొందించామని, ఈ చట్టంపై అవగాహన కల్పిస్తూ రైతుల సలహాలు, సూచనలు తీసుకునేందుకు ఇప్పటికే గుంటూరు, కర్నూలు, తూర్పు గోదావరి, విశాఖపట్నం, కోనసీమ ప్రాంతాల్లో ప్రాంతీయ సమావేశాలు నిర్వహించామని తెలిపారు. 8.24 లక్షల మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేశామన్నారు. ఇదిలా ఉండగా కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ సాయం రూపాయి కూడా అందక పోవడంపై మాత్రం ప్రభుత్వం స్పందించ లేదు.

గీతం భూములపై సీబీఐ దర్యాప్తు చేయాలి

కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ డిమాండ్

సాక్షి, విశాఖపట్నం: సుప్రీంకోర్టు తీర్పులు, చట్టాలను ఉల్లంఘించి నిషేధిత జాబితాలో ఉన్న భూములను కూడా గీతం యూనివర్సిటీకి కట్టబెట్టడం దురదృష్టకరమని విశ్రాంత ఐఏఎస్ అధికారి, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ పేర్కొన్నారు. గీతం యూనివర్సిటీకి ప్రభుత్వ భూములను ధారాదత్తం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తూ ఆదివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్(సీసీఎల్‌ఏ) జయలక్ష్మికి బహిరంగ లేఖలు రాశారు. విశాఖపట్నం ఎండాడలోని సర్వే నంబర్లు 15/1 నుంచి 15/5 వరకు, 16/4, 17/29, 17/30, 18/2, 20/5, 20/10, 20/12, 19/1, 19/2, 19/9లోని భూములు, రుషికొండలోని సర్వే నంబర్లు 37/2, 38/1బి, 55/4, 55/5, 61/5, 61/6లోని భూములను గీతం యూనివర్సిటీకి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా నిర్ణయించిందని లేఖలో పేర్కొన్నారు. ఇందులో ఎండాడలోని సర్వే నంబర్లు 15/1 నుంచి 15/5 వరకు, 16/4, 17/29, 17/30, 18/2, 20/5, 19/1, 19/2, 19/9, అదేవిధంగా రుషికొండలోని సర్వే నంబర్లు 37/2, 55/5లోని భూములు రిజిస్ట్రేషన్ శాఖ నిషేధిత జాబితాలో ఉన్నాయని వివరించారు. అయినా ఈ భూములను గీతం యూనివర్సిటీకి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవడం చట్టవిరుద్ధమన్నారు.

గత ఏడాది రూ.1,500 కోట్ల విలువైన భూమి బదలాయింపు

మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే రూ.1,500 కోట్ల విలువైన ఎండాడ సర్వే నంబర్ 17లోని 67.37 ఎకరాల ప్రభుత్వ అదనపు భూమి నిషేధిత జాబితాలో ఉన్నా కూడా గీతం సంస్థకి గుట్టుచప్పుడు కాకుండా గతేడాది జనవరి 30న కలెక్టర్ బదలాయించేశారని శర్మ ఆ లేఖలో పేర్కొన్నారు. ఏ నిబంధనల కింద ఈ బదలాయింపు జరిగిందో జిల్లా కలెక్టర్, చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు జవాబు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇప్పుడు మరో భూ పందేరం కోసం జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పులు, చట్టాలకు విరుద్ధంగా సాగుతున్న ఈ భూముల బదలాయింపు విషయంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

చిన్న పరిశ్రమలు ఢమాల్

18 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 3,041 ఎంఎస్‌ఎంఈలు మూత

- ఉపాధి కోల్పోయిన 39,327 మంది
- ప్రస్తుత పరిస్థితితో పోలిస్తే కరోనా సమయంలో మూతపడినవి బహు తక్కువ
- నాలుగేళ్లతో పోలిస్తే 7 రెట్లు ఉపాధిని దెబ్బతీసిన ఎంఎస్‌ఎంఈ రంగం
- కేంద్ర ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ వెల్లడి
- రాయితీల కోసం ఇప్పటికే రోడ్డెక్కిన ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు
- ఇంటికో పారిశ్రామికవేత్త కాదు.. ఇంటికో భిక్షగాడు తయారవుతున్నాడంటున్న ఎంఎస్‌ఎంఈ సంఘాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత అత్యధికంగా ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ(ఎంఎస్‌ఎంఈ)లు తీవ్రమైన గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నాయి. బడా బాబులకు రాయితీల జల్లులు కురిపిస్తున్న చంద్రబాబు సర్కారు అత్యధికమంది ఆధారపడిన ఎంఎస్‌ఎంఈ రంగాన్ని గాలికి వదిలేయడంతో తీవ్ర సంక్షోభంలో చిక్కుకుపోయాయి. తమకు ఇవ్వాల్సిన ఇన్సెంటివ్‌లు ఇవ్వడానికి దిక్కులేదు కానీ ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేస్తామని చెప్పడంపై ఎంఎస్‌ఎంఈల యజమానులు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు మండిపడుతున్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక గడచిన 18 నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో 3,041 ఎంఎస్‌ఎంఈ యూనిట్లు మూతపడినట్టు కేంద్ర ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి జితన్ రామ్ మాంఝీ స్వయంగా రాజ్యసభకు తెలియచేశారు. ఈ యూనిట్లు మూత పడటం ద్వారా 39,327 మంది ఉపాధి కోల్లోయినట్లు తెలిపారు. ఇదే సమయంలో జాతీయ స్థాయిలో మూతపడిన యూనిట్లలో ఏపీ వాటా 3.73 శాతం ఉండగా.. 7.44 శాతం మంది ఉపాధి కోల్పోయారు.

కోవిడ్ కాలంలోనూ ఇలాంటి పరిస్థితి లేదు

రాష్ట్రంలో ఈ స్థాయిలో ఉపాధి కోల్పోవడం ఇదే ప్రథమం అని అధికారులు వెల్లడిస్తున్నారు. కోవిడ్ వంటి సంక్షోభం వచ్చినప్పుడు కూడా ఈ స్థాయిలో యూనిట్లు మూతపడలేదన్న విషయాన్ని కేంద్ర మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కరోనా తర్వాత నాలుగేళ్ల కాలంలో రాష్ట్రంలో 873 యూనిట్లు మూతపడటంతో 5,075 మంది ఉపాధి కోల్పోయారు. అంటే గత ప్రభుత్వ నాలుగేళ్ల కాలంతో పోలిస్తే ఈ 18 నెలల కాలంలోనే ఏకంగా 774 శాతం అధికంగా 39,327 మంది ఉపాధి కోల్పోవడం రాష్ట్రంలోని ఎంఎస్‌ఎంఈల దుస్థితికి అద్దం పడుతోంది.

విద్యుత్ బిల్లుల షాక్

టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే బిల్లుల రూపంలో ఎంఎస్‌ఎంఈలకు భారీగా షాకిచ్చింది. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఏపీలోని ఎంఎస్‌ఎంఈలపై విద్యుత్ బిల్లుల భారం విపరీతంగా పెరిగిపోయింది. విజయవాడ కేంద్రంగా పనిచేసే ఒక ఎంఎస్‌ఎంఈకి సగటున యూనిట్ ఛార్జీ రూ.13.55 చేస్తుండగా.. తమిళనాడులో సగటున యూనిట్ ధర రూ.7–8గా ఉంది. అంటే యూనిట్‌కు దాదాపు రూ.6 అదనం. ఈ స్థాయిలో విద్యుత్ బిల్లులు బాదితే ఇతర రాష్ట్రాలతో ఎలా పోటీపడాలని ఆ సంస్థ ప్రతినిధి వాపోయారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడం, మానవ వనరుల కొరత, ముడి సరుకుల ధరలు పెరుగుదల, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వంటి కారణాలు ఎంఎస్‌ఎంఈలు మూతపడేలా చేస్తున్నాయి. ఇంకోపక్క ఎంఎస్‌ఎంఈలు తయారు చేస్తున్న ఉత్పత్తులను ప్రభుత్వ శాఖలు కూడా కొనుగోలు చేయకపోవడం, ప్రభుత్వ అసమర్థ విధానాలతో ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోవడం వంటివి ఎంఎస్‌ఎంఈ యూనిట్లు గడ్డు పరిస్థితులను ఎదుర్కొనే విధంగా చేస్తున్నాయి.

ఇలాగైతే ఇంటికో భిక్షగాడు

ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేస్తున్నామంటూ గల్లీ నుంచి అమెరికా వరకు ప్రతీ వేదికపైనా సీఎం చంద్రబాబు చెబుతున్న మాటలకు భిన్నంగా రాష్ట్రంలో పరిస్థితులు తయారయ్యాయి. మాకివ్వాల్సిన ప్రోత్సాహకాలనిచ్చి ఆదుకోండి మహాప్రభో అని ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తలు 4 నెలలుగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా కూడా లేదు. కేవలం ఎంఎస్‌ఎంఈలకు రూ.1,900 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. విశాఖ పెట్టుబడుల సమావేశం ముందు కేవలం రూ.438 కోట్లు చెల్లించి చేతులు దులిపేసుకున్నారు. ఇందులో కూడా అత్యధిక శాతం కియా, పరిశ్రమల మంత్రి టీజీ భరత్‌కు చెందిన కంపెనీలకే చెల్లించడం పట్ల దళిత పారిశ్రామికవేత్తల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోవిడ్ సమయంలో వైఎస్ జగన్ సర్కారు కులం, మతం, పార్టీ చూడకుండా ఎంఎస్‌ఎంఈ యూనిట్లకు రీస్టార్ట్ ప్యాకేజీ ప్రకటించి ఆదుకుంటే.. ప్రస్తుత ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘిస్తూ కేవలం ఆ పార్టీ మద్దతుదారులకు మాత్రమే ప్రోత్సాహకాలను విడుదల చేస్తోందని దళిత పారిశ్రామికవేత్తల జేఏసీ ఆరోపిస్తోంది. ఈ విధంగా చేస్తే రాష్ట్రానికి కొత్తగా పెట్టుబడులు ఏమొస్తాయని నిలదీస్తున్నారు. సీఎం చంద్రబాబు చెప్పినట్టు ఇంటికో పారిశ్రామికవేత్త సంగతి దేవుడెరుగు.. ఇంటికో భిక్షగాడు తయారవుతారంటూ ఎద్దేవా చేస్తున్నారు.

30వ వర్ధంతి
26 జనవరి 2026

డాక్టర్ బి.వి. రావు
~ 1935 - 1996 ~

"ప్రతిఫలాపేక్ష లేకుండా తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన వాడు జననమరణచక్రం నుండి విముక్తుడై, అనుబంధనాలలో అతీతమైన ఉత్తమ స్థితిని పొందగలడు..."
భగవద్గీత. 2వ అధ్యాయము, 51వ శ్లోకము

లక్షలాది కోళ్ళ పెంపకందారుల కుటుంబాలలో ఆనందం నింపిన కర్మయోగికి ఆయన 30వ వర్ధంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము మరియు ఆయన ఆశయాలకు పునరంకితమవుతున్నాము.

V H GROUP
వేంకటేశ్వర హేచరీస్ గ్రూప్
NECC
NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
(Non-Govt. Public Charitable Trust)

గొప్ప లక్ష్యం వైపు కదులుతున్నప్పుడు,
లక్ష్యానికి దారి తీసే మార్గం కూడా
అంతే గొప్పగా ఉండాలని గుర్తుంచుకోండి.
– డా॥ బాబూ రాజేంద్ర ప్రసాద్

సాక్షి
సోమవారం, 26 జనవరి 2026

సహనమే శరణ్యం

సహనం, ఓరిమి, క్షమ – ఉత్తములైన మనుషుల సహజ లక్షణాలని వేద పురాణేతిహాసాలు, వివిధ మత గ్రంథాలు, నీతిశాస్త్రాలు చెబుతున్నాయి. 'క్షమా భూమిః క్షమా సర్వం/ క్షమయా ధార్యతే జగత్' అని అథర్వణ వేదం చెబుతోంది. 'క్షమా దానం క్షమా సత్యం క్షమా యజ్ఞః చ పుత్రికాః/ క్షమా యశః క్షమా ధర్మః క్షమాయాం విష్ఠితం జగత్' అని వాల్మీకి రామాయణం చెబుతోంది. 'క్షమా ధర్మః క్షమా యజ్ఞః/ క్షమా వేదః క్షమా శ్రుతిః/ క్షమయా ధార్యతే లోకః క్షమయా కిం న సాధ్యతే' అని వ్యాస మహాభారతం చెబుతోంది. క్షమను మించిన సుగుణం లేదు, క్షమతో సాధ్యం కానిది లేదు అని ఈ శ్లోకాల సారాంశం.

'ఖంతీ పరమం తపో తితిక్షా' అని బుద్ధుని ధమ్మపదం చెబుతోంది. అంటే, సహనమే అత్యున్నత తపస్సు అని అర్థం. 'సహన శీలః సజ్జనః/ కోపహీన సదా భవేత్/ కోపోహి శత్రురత్యంతం/ తస్మాత్ క్షమైవ శ్రేయసీ' అని భర్తృహరి నీతి శతకం చెబుతోంది. ఇదే నీతిని 'తన కోపమె తన శత్రువు/ తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ/ తన సంతోషమె స్వర్గము/ తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ' అని సుమతీ శతకం చెబుతోంది.'గర్విష్ఠుల కంటే సహనము గలవాడు మేలు' అని బైబిల్ చెబుతోంది. 'నిశ్చయంగా అల్లాహ్ సహనశీలురతో ఉంటాడు' అని ఖురాన్ చెబుతోంది.

పురాణేతిహాసాలు, వివిధ మతాల పవిత్ర గ్రంథాలు, నీతిశాస్త్రాలు చెప్పిన ఈ మాటలను ప్రవచనాల్లోను, ఉపన్యాసాల్లోను తరచు ఉట్టంకిస్తుంటారు. అయితే, వీటిని ఆచరించడాన్నే మనుషులు మరచిపోతుంటారు. ఎదుటి మనిషి తమకు నచ్చని అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తే చాలు, ఒక్కసారిగా సహనం నశించి, కోపం కట్టలు తెంచుకుంటుంది. అప్పటి వరకు వల్లించిన నీతులన్నీ ఒక్కసారిగా మరపు మరుగున పడిపోయి, బూతుల ప్రవాహం వరదలా పోటెత్తుతుంది. తగవు మొదలై బాహాబాహీ సిగపట్ల వరకు వ్యవహారం ముదురుతుంది. మనుషుల్లో సహనం నశించినప్పుడే సమాజంలో నేరాలు, ఘోరాలు జరుగుతుంటాయి. పౌరుల్లో సహనం నశించి, తప్పటడుగులు వేస్తే, చక్కదిద్దే పనిని పాలనా వ్యవస్థలు చేపడతాయి.

దురదృష్టవశాత్తూ పాలనా వ్యవస్థలు కూడా సహనం కోల్పోయి, కక్ష సాధింపులకు తెగబడుతున్న రోజులు దాపురించాయి. సత్యం పట్ల అసహనం, ప్రశ్న పట్ల అసహనం, ధిక్కారం పట్ల అసహనం, భిన్నాభిప్రాయం పట్ల అసహనం పెచ్చుమీరిన పాలకులు సత్యాన్ని ప్రకటించే పాత్రికేయుల పట్ల, ప్రశ్నించే పౌరుల పట్ల, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే విపక్ష నేతల పట్ల కక్ష సాధింపు చర్యలకు తెగబడే ధోరణి పెరుగుతోంది. ధిక్కార స్వరాలను వినిపించే వారిని కటకటాల్లోకి నెట్టే వైఖరి ప్రబలుతోంది. పట్టించుకోవలసిన అనేక సమస్యలను పట్టించుకోకుండా, భిన్నస్వరాలపై కక్ష సాధింపు చర్యలకే ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వాలు ప్రజాస్వామ్యం మనుగడకే ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ఇవన్నీ ఇటీవలి కాలంలో మన దేశంలో కనిపిస్తున్న పరిస్థితులు.

ప్రపంచ పరిస్థితులు కూడా ఏమంత భిన్నంగా లేవు. ఆర్థికబలం, ఆయుధ బలగం దండిగా కలిగిన అగ్రరాజ్యాలు బలహీన దేశాలపై అసహనంతో యుద్ధాలకు తెగబడుతున్నాయి. బలహీన దేశాల అధినేతలను చెరబడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం దాదాపు దేశాలు ప్రత్యక్షంగా యుద్ధాలను ఎదుర్కొంటున్నాయి. సుమారు మరో ఇరవై దేశాలు అంతర్యుద్ధాలతో అట్టుడుకుతున్నాయి. ఇంకో పదిహేను దేశాలు ప్రచ్ఛన్న యుద్ధాలతోను, చొరబాట్లు, సైనిక హింస తదితర సమస్యలతో సతమతం అవుతున్నాయి. ఈ దారుణ దుర్భర పరిస్థితులకు మూలకారణం అసహనం.

ప్రపంచంలో యుద్ధాలు సద్దుమణగాలన్నా; దేశాల్లో పౌరుల స్వేచ్ఛకు భద్రత దొరకాలన్నా; విభిన్న మతాలు, జాతుల మధ్య సామరస్యం పెరగాలన్నా సహనమే కీలకం. 'క్షమా బలమశక్తానాం/ శక్తానాం భూషణం క్షమా' అని మహాభారతం చెబుతోంది. బలహీనులకు క్షమే బలం; బలవంతులకు అది అలంకారం. మనుషుల్లో క్షమ, ఓరిమి, సహనం వంటి సహజ సుగుణాలు పెరిగినప్పుడే ప్రపంచంలో శాంతి పరిఢవిల్లుతుంది. మన గణతంత్రం 'ఘన'తంత్రమవుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.అష్టమి రా.7.09 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** అశ్విని ప.10.58 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ఉ.7.12 నుండి 8.43 వరకు, తదుపరి రా.7.59 నుండి 9.29 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.33 నుండి 1.19 వరకు, తదుపరి ప.2.45 నుండి 3.32 వరకు, **అమృత ఘడియలు:** తె.4.57 నుండి 6.27 వరకు, **భీష్మాష్టమి.**

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.48
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

బటన్

నాకు తరచూ అనిపిస్తుంటుంది, మన నోటికి బ్యాక్‌స్పేస్ బటన్ ఉంటే బాగుండేదని! ఈ డిజిటల్ యుగంలో మనం మాట్లాడే ముందు ఆలోచించమని మనకు గుర్తు చేసే ఒక 'బెల్' మైండ్‌లో ఉండకూడదా అనుకుంటాను. మాటలు జర భద్రం!

– ఫ్రాన్సిస్ క్లీటస్, ఇండో–అమెరికన్ కార్టూనిస్ట్

నచ్చాలి!

తెరపై ఒక సన్నివేశ దృశ్యాన్ని అభినందించటానికి మీకు సినిమాటోగ్రఫీ తెలియనవసరం లేదు. మీరు చూస్తున్నది మీకు నచ్చితే, అది మంచి సినిమాటోగ్రఫీనే! మీరు ప్రకృతిని చూసి పరవశించిపోవాలంటే, మీకు ప్రకృతి జ్ఞానం అవసరం లేదు. ఇదీ అంతే!

– పి.సి. శ్రీరామ్, సినిమాటోగ్రాఫర్

యజమాని

స్త్రీలు శక్తిమంతులు. పురుషులతో సమానంగా ప్రతిదీ చేయగలరు. అంతకు మించి కూడా చేయగలరు. అయితే స్త్రీ, ఆ శక్తిని తనలో వెతికి పట్టుకోవాలి. ప్రతి మనిషినీ అపారమైన శక్తి నడిపిస్తుంది. కనుక ఏ మనిషీ మరొక మనిషి జీవితానికి యజమాని కాదు!.

– అనితా నాయర్, నవలా రచయిత్రి

వైకల్యం

నన్ను నేను వికలాంగుడిగా భావించను. నేను అథ్లెట్ అవటానికే పుట్టానని నమ్ముతాను. ప్రయత్నం, అంకిత భావం, నిరంతర సాధన... గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఆటగాడిని నిలబెట్టాయి. మనోబలం ఉంటే విజయం సాధించటం కష్టం కాదు!

– గిరీశ్ నాగరాజె గౌడ, పారాలింపిక్ హై జంపర్

అండ

ఏళ్లుగా నేను బ్రాంకైటిస్, సైనస్ సమస్యలతో పోరాడుతున్నాను. అంతే తప్ప పాడటం మానేయాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఎందుకంటే పాట నాకు అండగా లేకుంటే, నా జీవితం గురించి నేను చాలా నెగటివ్‌గా ఆలోచిస్తాను. ధైర్యాన్ని కోల్పోతాను.

– కవితా కృష్ణమూర్తి, నేపథ్య గాయని

ఒక శాతం



అదృష్టం అంటే అనుకోని విధంగా అవకాశం రావటం కాదు. అవకాశాలను గుర్తించి, వాటిని సద్వినియోగం చేసుకునే మానవ సామర్థ్యం. జీవితంలో 99 శాతం అదృష్టమే! మిగిలిన ఆ ఒక్క శాతంతో మీరు ఆ అదృష్టాన్ని కనిపెట్టడానికి కష్టపడవలసి ఉంటుంది.

– అశ్విన్ సంఘీ, రచయిత

రాజ్యాంగం ఓ 'సోషల్ డాక్యుమెంట్'

సందర్భం



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

రాజ్యాంగ పరిషత్‌లో 1949 నవంబర్ 26న ఆమోదించుకొని శాసనంగా రూపొందించుకొన్న భారత రాజ్యాంగం, 1950 జనవరి 26న అమలులోకి వచ్చింది. ప్రపంచ దేశాల్లోని రాజ్యాంగాలను అధ్యయనం చేసి రెండేళ్ల 11 నెలల 11 రోజుల సుదీర్ఘ కసరత్తు చేశాక బి.ఆర్. అంబేడ్కర్ నేతృత్వంలోని కమిటీ దేశానికి ఓ ఆదర్శప్రాయమైన రాజ్యాంగాన్ని అందించింది. భారత రాజ్యాంగంలో పేర్కొన్న స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమానత్వ భావనలను ఫ్రెంచ్ రాజ్యాంగం స్ఫూర్తిగా తీసుకొన్నారు. పంచవర్ష ప్రణాళికలను రష్యా నుంచి, మార్గదర్శక సూత్రాలను ఐర్లాండ్ నుంచి, సుప్రీం కోర్టు విధివిధానాలను జపాన్ నుంచి స్వీకరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగించే పరిపాలనకు రాజ్యాంగమే మార్గదర్శి. చట్టాల రూపకల్పనకు దిక్సూచి. దేశ ప్రజలకు రాజ్యాంగం అనేక హక్కుల్ని కల్పించింది. బాధ్యతలను అందించింది. ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛతోపాటు, ప్రభుత్వాలు చేసిన హామీలను, చేసిన చట్టాల అమలులో లోపాల్ని సవాలు చేసే హక్కును రాజ్యాంగం కల్పించింది.

ప్రపంచంలోని అనేక దేశాలు రాజకీయ, సామాజిక అస్థిరతలతో కుప్పకూలాయి. కానీ, ఎంతో విశాలమైనదీ, అతి పెద్ద జనాభాతో కూడి అనేక భిన్న సంస్కృతులు, భాషలు, వర్గాలు, సంప్రదాయాలు కలిగి ఉన్నప్పటికీ 'భిన్నత్వంలో ఏకత్వం'లా సుదృఢంగా భారతదేశం 8 దశాబ్దాలుగా నిలబడగలిగిందంటే నిస్సందేహంగా మనకున్న అతి గొప్పదైన రాజ్యాంగమే కారణం. రాజ్యాంగం కేవలం ఒక నియమాల సంకలనం కాదు. సమసమాజ నిర్మాణం లక్ష్యంగా ముందుకు దారిచూపే ఓ 'దీపం'. దేశాన్ని ఏ విధంగా అభివృద్ధి పథంలోకి నడిపించాలో నిరంతరం గుర్తు చేసే ఓ దార్శనిక పత్రం.

ప్రవేశిక ప్రాధాన్యం

రాజ్యాంగ ప్రవేశిక భారతదేశాన్ని సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, ప్రజాతంత్ర, గణతంత్ర రాజ్యంగా ఉండాలని నిర్దేశించింది. ప్రవేశికలో 'భారత ప్రజలమైన మేము' అనే వాక్యంతో మొదలుపెట్టి 'ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకొంటున్నాము' అని ఉంటుంది. భారత రాజ్యాంగం దేశంలో ఏ ఒక్క వర్గానిదో, మతానిదో కాదు. కులం, మతం, వర్గం, భాష, లింగ వివక్ష, విద్య... ఇంకా ఇతర ప్రమాణాలతో నిమిత్తం లేకుండా దేశంలోని ప్రతి ఒక్కరి సమానత్వం కోసం ఏర్పరిచింది. సార్వభౌమత్వం అంటే అర్థం ప్రజలు మాత్రమే సర్వాధికారులు. ప్రభుత్వాలన్నది ప్రజలకు సేవ చేయడానికి ఉనికిలో ఉంటాయి. ప్రభుత్వాల అధికారాలన్నీ ప్రజల చేత, ప్రజల తరఫున, ప్రజల కోసం పాలించడానికి ఇవ్వబడేవే!

◆ రాజ్యాంగం కేవలం ఓ నియమాల సంకలనం కాదు. సమసమాజ నిర్మాణం లక్ష్యంగా ముందుకు దారిచూపే ఓ 'దీపం'. దేశాన్ని ఏ విధంగా అభివృద్ధి పథంలోకి నడిపించాలో నిరంతరం గుర్తు చేసే ఓ దార్శనిక పత్రం.

రాజ్యాగం గొప్పదైనంత మాత్రాన ఆశించిన ఫలితాలు అందవని ముసాయిదా ప్రతిని సమర్పించి 1949 నవంబర్ 26న చేసిన చరిత్రాత్మక ప్రసంగంలోనే అంబేడ్కర్ పేర్కొన్నారు. ''రాజ్యాంగం ఎలా పని చేస్తుందన్నది దాని స్వభావంపై ఆధారపడిలేదు. శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ అనే అంగాలను మాత్రమే రాజ్యాంగం ప్రసాదించింది. ప్రజలు, రాజకీయ పార్టీలు ఎలాంటి ఆకాంక్షలను, రాజకీయాలను కోరుకొంటున్నారన్న దానిపైనే వాటి పనితీరు ఆధారపడి ఉంటుంది'' అంటూ స్పష్టం చేశారు.

మంచీ... చెడూ...

రాజ్యాంగబద్ధమైన పాలనలో దేశం కొన్ని మైలురాళ్లు చేరుకున్న మాట వాస్తవం. 1947లో దేశ ప్రజల సగటు ఆయుష్షు 32 సంవత్సరాలు మాత్రమే. ఇప్పుడు అది 72 సంవత్సరాలకు పెరిగింది. అక్షరాస్యత 16% నుండి 80 శాతానికి చేరింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి 35.773 కోట్ల టన్నులకు పెరిగింది. 1947లో కేవలం 1,500 గ్రామాలకు మాత్రమే విద్యుదీకరణ జరగగా ఇప్పుడు దాదాపుగా ప్రతి గ్రామానికీ విద్యుత్ సౌకర్యాలు ఏర్పర్చుకోగలిగాము. రహదారుల నిర్మాణం కూడా 4 లక్షల కిలోమీటర్ల నుంచి నేడు 60 లక్షల కిలోమీటర్లకు చేరుకోగలిగాము. అంటరానితనం చట్టపరంగా తొలగించబడింది. దళితులు, గిరిజనులపై జరిగే అకృత్యాల నుండి పరిరక్షించే చట్టాలు రూపొందించబడ్డాయి. వివక్షకు గురైన వర్గాల ప్రజలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆహారం, సమాచారం హక్కుగా కల్పించబడ్డాయి. నిరాదరణకు గురైన సామాజిక వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు రాష్ట్రపతులుగా, ముఖ్యమంత్రులుగా, న్యాయమూర్తులుగా నియమించబడటం చెప్పుకోదగిన మార్పు. అల్ప సంఖ్యాక వర్గాలకు చెందినవారి సంస్కృతి, మతపర విశ్వాసాలకు చట్టపరంగా రక్షణలు కల్పించడం జరిగింది.

అయితే, రాజ్యాంగం కల్పించిన మహత్తర అవకాశాలను పూర్తి స్థాయిలో ఈ 8 దశాబ్దాల రాజకీయ నాయకత్వం సద్వినియోగం చేసుకోలేకపోయిందనడం ఓ చేదు వాస్తవం. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల స్ఫూర్తి అమలు కాలేదు. ఫలితంగానే, దేశ సంపద కొద్దిమంది వ్యక్తుల గుప్పిట్లోకి పోయింది. 90 శాతం సంపద 10 శాతం మంది వద్ద పోగుపడింది. ధనికులు మరింత ధనికులు కాగా, పేదలు మరింత పేదలు అవుతున్నారు. విధానపరమైన వైఫల్యాలే దేశాభివృద్ధికి అవరోధంగా మారుతున్నాయి. రాజ్యాంగం ద్వారా రూపొందించే సంస్థలలో ప్రజా భాగస్వామ్యం, పాత్ర తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

అవగాహన పెరగాలి!

రాజ్యాంగంలో ఏర్పర్చుకొన్న సంక్షేమ రాజ్యస్థాపన లక్ష్యాలకు దూరంగా ప్రభుత్వాలు జరగడంతోనే ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఏటా ప్రవేశపెడుతున్న లక్షల కోట్ల బడ్జెట్లలో సంక్షేమానికి కేటాయింపులు నామమాత్రంగా ఉంటున్నాయి. ఇవి ప్రాధాన్య రంగాల స్థాయి నుంచి మొక్కుబడి స్థాయికి దిగజారిపోయాయి. ప్రభుత్వాలకు ఆదాయం ప్రజల పన్నుల ద్వారా సమకూరుతున్నదే. పన్నుల్లో ఎంతమేరకు తిరిగి ప్రజల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నారో లెక్కలు తీస్తే సామాన్య ప్రజలకు జరుగుతున్న అన్యాయం అర్థం అవుతుంది.

సామాజిక న్యాయం జరగకపోతే రాజ్యాంగం ఆశించిన తీరులో అభివృద్ధి జరగదు. రాజ్యాంగ సూత్రాల స్ఫూర్తితో పని చేస్తేనే పేదరిక నిర్మూలన, సమ్మిళిత అభివృద్ధి సాధ్యపడతాయి. అధికార వికేంద్రీకరణ జరగాలి. అన్ని వర్గాల ప్రజలను సాధికారుల్ని చేయగలిగితేనే... భారత రాజ్యాంగం ఆశించిన మేరకు ఫలితాలు అందుతాయి. భారత రాజ్యాంగాన్ని ఓ సోషల్ డాక్యుమెంట్‌గా అమలు చేసినప్పుడే ప్రజల మధ్య ఉన్న ఆర్థిక, సామాజిక అంతరాలు తగ్గుతాయి. రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పర్చుకోవాలి. రాజ్యాంగం అందించిన హక్కులను ఉపయోగించుకొని ప్రభుత్వాలను నిలదీయాలి.

వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, ఏపీ శాసన పరిషత్ సభ్యులు
(నేడు గణతంత్ర దినోత్సవం)

రాజ్యాంగ విలువలపై దాడి

అభిప్రాయం

జూలకంటి రంగారెడ్డి

బ్రిటిష్ వలస పాలన నుండి దేశాన్ని విముక్తం చేయడానికి అనేకమంది చేసిన బలిదానాల ఫలితంగా 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. డా॥ బీఆర్ అంబేడ్కర్ సారథ్యంలో రూపొందిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమల్లోకి రావడంతో మన దేశం సర్వసత్తాక, సార్వభౌమ, లౌకిక, గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించింది. 1976లో జరిగిన 42వ సవరణ ద్వారా రాజ్యాంగంలో 'సామ్యవాదం' అనే పదాన్ని చేర్చారు. దేశానికి సొంత రాజ్యాంగం వచ్చి 76 ఏళ్లు పూర్తయి 77వ గణతంత్ర వేడుకలకు సిద్ధమవుతున్నాం. అయితే, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో దేశ సార్వభౌమాధికారం, లౌకికత్వం, ఫెడరల్ స్ఫూర్తి తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.

2014లో అధికారంలోకి రాకముందు బీజేపీ నాయకులు అనేక ప్రజాకర్షక వాగ్దానాలు చేశారు. కానీ అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుతున్నా, దేశంలో ఇంధన ధరలు మాత్రం వంద రూపాయలు దాటాయి. రూపాయి విలువను పెంచుతామన్న ప్రగల్భాలు ఆవిరై, 2026 నాటికి డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ దాదాపు 91 రూపాయలకు పడిపోయింది. 'మేక్ ఇన్ ఇండియా', 'వికసిత్ భారత్' వంటి ఆడంబరమైన నినాదాలు వినిపిస్తున్నా, ఆచరణలో దేశాభివృద్ధి వెనక్కు మళ్లుతోంది.

◆ తమకు ఓట్లు వేయరనే అనుమానం ఉన్న కోట్లాది మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారు. ముసాయిదా జాబితాల ప్రకారం దాదాపు 10 కోట్ల మంది తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉంది.

సంపద కేంద్రీకరణ

దేశంలోని సంపద పంపిణీలో దారుణమైన అసమానతలు నెలకొన్నాయి. కేవలం ఒక శాతం జనాభా చేతుల్లో సుమారు 40 శాతం సంపద ఉండగా, కేవలం 162 మంది కుబేరుల వద్దే సుమారు 22 శాతం సంపద పోగుపడింది. మిగిలిన 144 కోట్ల ప్రజల వద్ద ఉన్నది కేవలం 60 శాతం లోపు సంపదే! అమెరికా, బ్రెజిల్ వంటి దేశాల కంటే భారత్‌లో ఆర్థిక అసమానతలు వేగంగా పెరుగుతున్నాయి. 2023 ఒక్క ఏడాదిలోనే కొత్తగా 91 మంది కార్పొరేట్ మహా కుబేరులు పుట్టుకొచ్చారు. మరోవైపు దేశంలో పేదరికం పెరిగిపోతోంది. ఇందుకు నానాటికీ పెరుగుతున్న రేషన్ కార్డుల సంఖ్యే ఒక ఉదాహరణ.

కేంద్రం తన 'నూతన విద్యా చట్టం– 2020' ద్వారా రాష్ట్రాల అధికారాలను హరిస్తోంది. చరిత్రను వక్రీకరిస్తూ, శాస్త్రీయ అంశాలను సిలబస్ నుంచి తొలగిస్తున్నారు. 'భారత్ శిక్షా అధిష్ఠాన్–2025' పేరుతో రాబోతున్న కొత్త చట్టం వల్ల యూజీసీ, ఏఐసీటీఈ వంటి స్వయం ప్రతిపత్తి గల సంస్థలు రద్దయ్యే ప్రమాదం ఉంది. విద్య పూర్తిగా వ్యాపారంగా మారి, పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందని ద్రాక్షలా మారుతున్నాయి. ప్రతిపక్షాల ఒత్తిడితో ఈ బిల్లు ప్రస్తుతం సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది.

ఉపాధి అవకాశాలు క్రమంగా తగ్గుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 'వీబీ జీ రామ్ జీ' అని పేరు మార్చి, నిధుల్లో కోత విధిస్తూ పథకాన్ని నీరుగారుస్తున్నారు. విద్య, వైద్యం కోసం ప్రజలు తమ ఆదాయంలో సింహభాగం ఖర్చు చేయాల్సి వస్తోంది.

ప్రస్తుత రాజ్యాంగం స్థానంలో మనువాద రాజ్యాంగాన్ని తెచ్చేందుకు పాలక వర్గం ప్రయత్నిస్తోంది. ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారు. లద్దాఖ్ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ నుంచి సోషల్ మీడియా ద్వారా సమస్యలను ప్రశ్నిస్తున్న 14 ఏళ్ల దళిత బాలుడు అశ్వమిత్ గౌతమ్ వరకు అందరిపైనా నిర్బంధం ప్రయోగిస్తున్నారు.

తమకు ఓట్లు వేయరనే అనుమానం ఉన్న కోట్లాది మంది పేర్లను అధికారంలో ఉన్నవారు ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారు. ముసాయిదా జాబితాల ప్రకారం దాదాపు 10 కోట్ల మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో రాజ్యాంగ విలువల రక్షణకు, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఏకం కావాలి. 77వ గణతంత్ర దినోత్సవ స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడమే నేటి అవసరం.

వ్యాసకర్త సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

సచివాలయాలపై నిశ్శబ్ద దాడి

ఇన్ బాక్స్

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ అనేది ఏదో ఒక ప్రభుత్వ పథకం కాదు. అది ప్రజలకు ప్రభుత్వాన్ని దగ్గర చేసిన పరిపాలనా విప్లవం. రోజువారీ అవసరాల నుంచి సంక్షేమ పథకాల అమలు వరకు సచివాలయాలే ప్రజలకు తొలి ద్వారం. అలాంటి వ్యవస్థ నుంచి పోస్టులను తీసుకొని ఇతర శాఖల అవసరాలకు వాడుకోవాలన్న ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి సర్కార్ తాజా నిర్ణయం, ప్రభుత్వ ఉద్దేశాలపై తీవ్ర అనుమానాలను రేకెత్తిస్తోంది.

రెవెన్యూ (దేవాయదాయ–1)శాఖ జారీ చేసిన మెమో ప్రకారం ఏపీ దేవాదాయ శాఖలో 140 ఖాళీలను భర్తీకి ఏపీపీఎస్సీకి ప్రతిపాదన పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇందులో అసలు సమస్య ఖాళీల సంఖ్య కాదు. ఆ ఖాళీలను భర్తీ చేసే విధానమే! ముఖ్యంగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్–3 పోస్టుల కోసం గ్రామ/వార్డు సచివాలయాల (జీఎస్‌డబ్ల్యూఎస్) విభాగం నుంచి 'మిగులు సిబ్బంది'ని సర్దుబాటు చేయాలన్న ఆలోచన, వాస్తవ పరిస్థితికి పూర్తి విరుద్ధంగా ఉంది.

క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏంటన్నది కూటమి ప్రభుత్వానికి తెలియదా? ఇప్పటికే అనేక సచివాలయాలు సిబ్బంది కొరతతో నలిగిపోతున్నాయి. ఒకే ఉద్యోగి మీద రెండు, మూడు విభాగాల బాధ్యతలు ఉన్నాయి. ప్రజలు గంటల తరబడి సచివాలయాల చుట్టూ తిరుగుతున్న దృశ్యాలు సాధారణమే. అలాంటి పరిస్థితుల్లో 'మిగులు సిబ్బంది' అన్న మాట వినిపించడం విడ్డూరం. నిరుద్యోగ సమస్య నానాటికీ పెరుగుతున్న తరుణంలో దేవాదాయ శాఖలో ఖాళీలు ఉంటే ప్రత్యక్ష నియామ కాల ద్వారా భర్తీ చేసి నిరుద్యోగులను ఆదుకోవాలి. అంతే కానీ వేరే శాఖల నుంచి ఉద్యోగులను తరలించడం సరికాదు.

రాజకీయంగా చూస్తే ఇది సచివాలయ వ్యవస్థ ప్రాధాన్యాన్ని క్రమంగా తగ్గించే దీర్ఘకాలిక వ్యూహంలో భాగమన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఒకప్పుడు గొప్పగా ప్రచారం చేసిన 'గవర్నెన్స్ మోడల్' ఇప్పుడు ప్రభుత్వానికి భారంగా మారిందా? పరిపాలనను మళ్లీ కార్యాలయాల గడపలకే పరిమితం చేయాలన్న ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉందా అన్న ప్రశ్నలు సహజంగానే ఉత్పన్నమవుతున్నాయి.

మొత్తంగా చూస్తే దేవాదాయశాఖ పోస్టుల సర్దుబాటు నిర్ణయం ఒక శాఖ సమస్యను పరిష్కరించడానికి తీసుకున్నదైతే, మరో కీలక ప్రజా వ్యవస్థను బలహీనపరుస్తోంది. ఇది తాత్కాలిక పరిపాలనా చర్యగా ఆగుతుందా? లేక సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే మొదటి అడుగుగా మారుతుందా?

– గొట్టాపు త్రినాధరావు । జర్నలిస్ట్, విజయనగరం

వేతనం లేని పని

డేటా పాయింట్



'టైమ్ యూజ్ సర్వే' (2024) ప్రకారం, పురుషుల కంటే మహిళల పనిగంటలు ఎక్కువగా ఉంటున్నాయి. పైగా వాటికి ఏ వేతనమూ ఉండదు. సగటున పురుషులు 7 గంటలు వేతన పనిలో, 1.5 గంటలు వేతనం లేని పనిలో ఉంటే – మహిళలు 5.1 గంటలు వేతన పనిలో, 4.5 గంటలు వేతనం లేని పనుల్లో నిమగ్నం అవుతున్నారు. ఇది అన్ని వయసుల మహిళలకూ వర్తిస్తుంది.

వయసుల వారీగా	వేతన పని గంటలు	వేతనం లేని పని గంటలు
15-19	4.4	3.3
20-24	5.2	4.2
25-29	5.1	5.1
30-34	5	5.3
35-39	5.1	5
40-44	5.1	4.6
45-49	5.2	4.2
50-54	5.1	4
55-59	5	3.9

దేశభక్తి – దైవభక్తి

దేశభక్తి అంటే ఏమి? దైవభక్తి అంటే ఏమి? అవి రెండా, లేక ఒకటేనా? మొదట దేశభక్తి అంటే ఏమిటో చూద్దాం. 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అంటాడు ప్రఖ్యాత తెలుగుకవి గురజాడ అప్పారావు. అంటే భారత దేశం అంటే భారతీయులందరూ అనే కదా! ఏదో ఒక కులం వారో, మతం వారో, వర్గం వారో కాదు, అందరూ కలిస్తేనే భారతదేశం. కాబట్టి దేశం పట్ల భక్తి అంటే అందరి పట్ల ప్రేమ అనే అర్థం. అందరి శ్రేయస్సు కొరకై పాటుపడటమే దేశభక్తి అవుతుంది.

దేశ సరిహద్దుల్లో ఉంటే విదేశీయులు మన దేశంలోకి చొరబడకుండా చూస్తే అది దేశభక్తి అవుతుంది. ఇంట్లో గదిలో కూర్చుని, తీవ్రంగా యోచించి, తపించి, దేశ ప్రజలందరూ కుల, మత, ప్రాంత, లింగ భేదాలతో దేశాన్ని ఛిన్నాభిన్నం చేయకుండా, సమైక్యంగా ఉండి దేశ ప్రగతికై పాటుబడే విధంగా జీవించటానికి ప్రోత్సహించే రచనలను చేస్తే అదీ దేశభక్తి అవుతుంది. శత్రువుల్ని ఎదుర్కోవటానికి తుపాకుల్ని చేపట్టవచ్చు, కలాన్నీ చేపట్టవచ్చు. 'నేను తుపాకీకి భయపడను గానీ కలానికి భయపడతాను' అంటాడు నెపోలియన్.

ఇద్దరు ప్రముఖ దేశభక్తులను పేర్కొనమంటే మనకు వెంటనే మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్ గుర్తొస్తారు. ఒకరు కలాన్ని, మరొకరు తుపాకీని చేబట్టారు. తమ ప్రాణాలను సైతం దేశం కొరకు సమర్పించటానికి వీరిద్దరికీ ప్రేరణ కల్పించిన మహనీయుడు స్వామి వివేకానంద. తోటి మనుషుల్లో దైవాన్ని చూడటమే అసలైన దైవభక్తి అనీ, వారి శ్రేయస్సు కొరకై తపించటమే నిజమైన పూజ అనీ, నరుని ఆరాధనే నారాయణుని ఆరాధన అనీ ఉద్ఘాటించి వారిని ప్రాణత్యాగానికి సిద్ధపరచినవాడు స్వామి వివేకానంద. దేశభక్తి దేశప్రజలకు పరిమితమైతే దైవభక్తి యావత్ప్రపంచానికీ విస్తరిస్తుంది. స్వచ్ఛమైన దేశభక్తి, దైవభక్తి – రెండూ ఒకటే!

– రాచమడుగు శ్రీనివాసులు

ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, కుటుంబ సభ్యులు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి, కుటుంబ సభ్యులు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, కుటుంబ సభ్యులు

శ్రీవారి సన్నిధిలో న్యాయమూర్తులు

తిరుమల శ్రీవారిని ఆదివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీ రమణ దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

– తిరుమల

న్యాయమూర్తి జస్టిస్ సుజాతకు అప్పన్న చిత్రపటాన్ని అందజేస్తున్న సూపరింటెండెంట్

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి సుజాత

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో న్యాయమూర్తి పేరిట అర్చకులు పూజలు చేశారు. అనంతరం వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

– సింహాచలం

బగళాముఖి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

బాపట్ల జిల్లా చందోలులోని బగళాముఖి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి హరిహరనాథశర్మ కుటుంబ సభ్యులు, హైకోర్టు రెవెన్యూ జీపీ సుష్మ కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. తొలుత న్యాయమూర్తి కుటుంబ సభ్యులు, రెవెన్యూ జీపీ కుటుంబ సభ్యులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఈవో, ట్రస్ట్ బోర్డు చైర్మన్ చక్రధర్‌రెడ్డి, న్యాయమూర్తి దంపతులకు, రెవెన్యూ జీపీ సుష్మ దంపతులకు బగళాముఖి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

– కర్లపాలెం

జస్టిస్ హరిహరనాథశర్మ దంపతులకు ప్రసాదం అందిస్తున్న ఈవో

పంచ రథాలపై 'రవి'తేజం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఆదివారం రథ సప్తమి వేడుక వైభవంగా సాగింది. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో వేకువజామున రాఘవేంద్రుల మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం చేశారు. ఏక కాలంలో పంచరథాలపై భానుడు, ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను గజ, చెక్క, అంబారి, స్వర్ణ, నవరత్న రథాలపై ఊరేగించారు. ఈ వేడుకలను తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

సూర్యప్రభ వాహనంపై అప్పన్న విహారం

సింహాచలం: రథసప్తమి సందర్భంగా విశాఖ జిల్లా సింహాచలంలో కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆదివారం సూర్యభగవానుడిగా దర్శనమిచ్చాడు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ఉన్న పురాతన రాతిరథంపై వేంచేపు చేసి విశేషంగా అభిషేకాలు, అరుణపారాయణ పఠనం నిర్వహించారు. సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో సూర్యప్రభవాహనంపై తిరువీధి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గన్ మిస్‌ఫైర్ అయి కానిస్టేబుల్ మృతి

పెద్దయ్య (ఫైల్)

డోన్ టౌన్: గన్ మిస్‌ఫైర్ కావడంతో నంద్యాల జిల్లా డోన్ రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీగా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ పెద్దయ్య(49) మృతి చెందారు. గుంతకల్లు రైల్వే జీఆర్‌పీ డీఎస్పీ శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం.. విధులు ముగించుకొన్న పెద్దయ్య శనివారం వేకువ జామున మూడు గంటల సమయంలో జీఆర్‌పీ ఔట్‌పోస్ట్ స్టేషన్‌లో గన్ సరెండర్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు మిస్ ఫైర్ కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కర్నూలు జిల్లా బెళగల్ గ్రామానికి చెందిన పెద్దయ్య 1995 బ్యాచ్‌లో ఏఆర్ కానిస్టేబుల్. కర్నూలులో ఉంటూ డోన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న డోన్ డీఎస్పీ శ్రీనివాస్, పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి, కర్నూలు రైల్వే జీఆర్‌పీ సర్కిల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఐ బిందుమాధవి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. పెద్దయ్యకు భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అంత్యక్రియల నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు డీఎస్పీ శ్రీనివాసాచారి రూ.లక్ష నగదు అందజేశారు.

సప్తవాహనాలపై సప్తగిరీశుని వైభవం

తిరుమలలో ఘనంగా రథసప్తమి.. లక్షా 50 వేల మంది హాజరు

చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న మలయప్ప

తిరుమల: రథసప్తమి సందర్భంగా తిరుమలలో ఆదివారం శ్రీవారు సప్త వాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. లక్షా 50 వేల మందికి పైగా తరలివచ్చిన భక్తజనులు వాహన సేవలను దర్శించుకుని పునీతులయ్యారు. సూర్యోదయాన సూర్య ప్రభ వాహనంతో ప్రారంభమైన సప్తవాహన సేవోత్సవం, రాత్రి చంద్ర ప్రభ వాహనంతో సమాప్తమైంది. శ్రీమలయప్ప స్వామివారు సూర్యప్రభ, చిన్న శేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వాహన సేవల ముందు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దేవుని ఆశీర్వాదం ప్రతి ఒక్కరిపై ఉండాలి

- బైబిల్ మిషన్ అధ్యక్షుడు శామ్యూల్ కిరణ్
- ఘనంగా ప్రారంభమైన బైబిల్ మిషన్ మహోత్సవాలు

బైబిల్ మిషన్ మహోత్సవాలకు హాజరైన భక్తులు

వాక్యోపదేశం చేస్తున్న శామ్యూల్ కిరణ్

పెదకాకాని: లోకరక్షకుడైన ఏసుప్రభువు ఆశీర్వాదం ప్రతి ఒక్కరిపై ఉండాలని బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ ఆకాంక్షించారు. బైబిల్ మిషన్ 88వ మహోత్సవాలు ఆదివారం గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట ఏర్పాటు చేసిన భారీ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ వాక్యోపదేశం చేశారు. బైబిల్ మిషన్ మహోత్సవాల్లో పాల్గొనడం ద్వారా దేవుని ఆశీర్వాదం, దీవెనలు పొందగలమని, అన్ని అంశాల్లో విజయం సాధించగలమని భక్తులు విశ్వసిస్తారని ఆయన చెప్పారు. బైబిల్ మిషన్ జాయింట్ సెక్రెటరీ రెవరెండ్ జె.ఆగమనరావు, రెవరెండ్ డి.సుధాకర్ తదితరులు దైవ సందేశాలు అందించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కేరళ, బిహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలతోపాటు సింగపూర్, మలేషియా, అమెరికా, దుబాయ్ వంటి దేశాల నుంచి వచ్చిన భక్తులతో సభల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పెదకాకాని స్వస్తిశాలలో కూడా భక్తుల రద్దీ నెలకొంది. బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.జాన్ దేవదాసు, సెక్రటరీ రెవరెండ్ కె.ప్రశాంత్‌కుమార్, రెవరెండ్ ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో భారీగా ట్రాఫిక్ జామ్

శ్రీశైలం ముఖద్వారం నుంచి క్షేత్రం వరకు వాహనాల రద్దీ

శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రానికి అధిక సంఖ్యలో వాహనాలు తరలి రావడంతో ఆదివారం ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది. వరుస సెలవు దినాలు కలిసి రావడంతో పాటు రథసప్తమి సందర్భంగా భక్తుల రద్దీ పెరిగింది. శనివారం సాయంత్రం వరకు ఓ మోస్తరుగా శ్రీశైలానికి వస్తున్న వాహనాల సంఖ్య ఆదివారం ఉదయం మరింత పెరిగింది. మరోవైపు శనివారం సాయంత్రం శ్రీశైలం చేరుకున్న వాహనదారులు ఆదివారం ఉదయం వచ్చిన వారు మధ్యాహ్నం తిరుగు ప్రయాణం అయ్యేసరికి వచ్చి వెళ్లే వాహనాల రద్దీతో శ్రీశైలం నుంచి ముఖద్వారం వరకు ట్రాఫిక్ జాం ఏర్పడింది. శ్రీశైలం వన్‌టౌన్ పోలీసులు, హోంగార్డులు, దేవస్థానం ప్రైవేట్ భద్రతా సిబ్బంది ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు దారికి తెచ్చే ప్రయత్నం చేశారు. కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ముఖద్వారం నుంచి శ్రీశైలం రావడానికి గంటకుపైగా సమయం పట్టగా, వెళ్లే వాహనాలకు అంతకుమించి సమయం పట్టింది. సోమవారం కూడా భక్తుల రద్దీతో పాటు వాహనాల తాకిడి యథావిధిగా కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

శుభాంశు శుక్లాకు అశోక చక్ర

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో అడుగు పెట్టిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు ప్రభుత్వం అత్యున్నత సాహస పురస్కారం అశోక చక్రను ప్రకటించింది. ఎస్‌యూ–30 ఎంకెఐ, మిగ్–21, మిగ్–29, జాగ్వార్, హాక్, డార్నియర్, ఏఎన్–32 వంటి యుద్ధ విమానాలను నడిపిన శుక్లాకు 2 వేల గంటల ఫ్లయింగ్ అనుభవముంది. శుక్లా గతేడాది జూన్‌లో యాగ్జియం–4 మిషన్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లి 18 రోజులు గడపడం తెలిసిందే. తొలిసారిగా 1984లో రష్యా సూయజ్ మిషన్‌లో రాకేశ్ శర్మ రూపంలో భారత వ్యోమగామి అంతరిక్షంలోకి వెళ్లగా..41 ఏళ్ల తర్వాత శుభాంశు ఆ ఘనత సాధించి రికార్డు నెలకొల్పారు. తాజాగా, రాష్ట్రపతి ముర్ము ప్రకటించిన 70 మంది సాహస అవార్డు గ్రహీతల్లో ఆయన కూడా ఉన్నారు. వీరి ఆరుగురికి మరణానంతరం పురస్కారం ప్రకటించారు. మేజర్ అర్షదీప్ సింగ్, గ్రూప్ కెప్టెన్ బాలకృష్ణన్ నాయర్, నాయబ్ సుబేదార్ డోలేశ్వర్ సుబ్బాకు కీర్తి చక్ర ప్రకటించారు.

ఆర్జేడీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తేజస్వీ యాదవ్

పట్నా: రాష్ట్రీయ జనతాదళ్ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ తన చిన్న కుమారుడు రాజకీయ వారసుడు తేజస్వీ యాదవ్ (36)కు ప్రమోషన్ కల్పించారు. తేజస్వీకి పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలను అప్పగించారు. ఆదివారం జరిగిన పార్టీ జాతీయ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆర్జేడీ ఎక్స్‌లో తెలిపింది. సమావేశానికి లాలు ప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్‌తోపాటు లాలు పెద్ద కుమార్తె, పాటలీపుత్ర ఎంపీ మిసా భారతి తదితరులు హాజరయ్యారని పేర్కొంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తేజస్వీ యాదవ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా పోటీ చేసిన మహాగఠ్‌బంధన్ ఘోర పరాజయం మూటగట్టుకోవడం తెల్సిందే. తేజస్వీ, ఆయన సన్నిహితుడు సంజయ్ యాదవ్‌లే అందుకు కారణమంటూ లాలు పెద్ద కుమార్తె రోహిణీ ఆచార్య ఆరోపణలు చేయడం తెల్సిందే. మరో కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను లాలు యాదవ్ గతేడాది పార్టీ నుంచి బహిష్కరించారు.

కరిగిపోతున్న అమెరికా కలలు!

హెచ్–1బీ వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూలు 2027కు వాయిదా

- భారత్‌లోనే చిక్కుకుపోయిన వేలాది మంది వీసాదారులు
- యూఎస్ కాన్సులేట్లలో నానాటికీ పెరిగిపోతున్న బ్యాక్‌లాగ్‌లు
- షెడ్యూల్ లోగా అమెరికాకు వెళ్లకపోతే ఉద్యోగాలకు ఎసరు
- విదేశీయులకు వీసాలిచ్చే ఉద్దేశం అమెరికాకు లేదు: నిపుణులు

హెచ్–1బీ వీసా కలిగిన భారతీయ వృత్తి నిపుణులకు మరో శరాఘాతం తగిలింది. భార్యా పిల్లలకు దూరం కావడంతోపాటు ఏకంగా ఉద్యోగాలకు, అమెరికా స్వప్నాలకు ముప్పు ముంచుకొచ్చే పరిస్థితి ఏర్పడింది. వీసా–స్టాంపింగ్ ఇంటర్వ్యూలు అనూహ్యంగా వాయిదా పడుతున్నాయి. భారత్‌లోని యూఎస్ కాన్సులేట్లలో బ్యాక్‌లాగ్‌లు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇంటర్వ్యూలకు స్లాట్లు దొరకడం గగనంగా మారింది. వచ్చే ఏడాది దాకా స్లాట్లు ఖాళీగా లేవంటే పరిస్థితి తీవ్రతను ఊహించుకోవచ్చు. హెచ్–1బీ వీసా ఇంటర్వ్యూలన్నీ ఏకంగా 2027కు వాయిదా పడుతున్నాయి! ఈ ఏడాది ఫిబ్రవరి 18న జరగాల్సిన ఇంటర్వ్యూ వచ్చే ఏడాది మే 24 తేదీకి రీ షెడ్యూల్ కావడం గమనార్హం. హెచ్–1బీ వీసాలతో అమెరికాలో ఉద్యోగాలు చేసుకుంటున్న భారతీయ వృత్తి నిపుణుల్లో పలువురు అత్యవసర పనులు లేదా వీసా స్టాంపింగ్ గడువు ముగియడంతో స్వదేశానికి చేరుకున్నారు. వారంతా మళ్లీ అమెరికా వెళ్లాలంటే ఇక్కడి యూఎస్ కాన్సులేట్లలో వీసా–స్టాంపింగ్ ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుంది. ఇలాంటివారు వేలాది మంది ఉంటారని అంచనా. ఇంటర్వ్యూకు హాజరయ్యే వీలు లేక వారంతా ప్రస్తుతం స్వదేశంలోనే చిక్కుకుపోయారు. వారి కుటుంబాలేమో అమెరికాలోనే ఉండిపోయాయి. కంపెనీల యాజమాన్యాలు విధించిన గడువులోగా అమెరికా చేరుకోకపోతే ఉద్యోగం ఊడిపోవడం ఖాయమని వారిప్పుడు ఆందోళన చెందుతున్నారు. హెచ్–1బీ వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూ వచ్చే ఏడాదికి వాయిదా పడినట్లు ఈ–మెయిల్స్ వస్తున్నాయని దరఖాస్తుదారులు చెబుతున్నారు. కొన్ని ఇంటర్వ్యూలనైతే పూర్తిగా రద్దు చేస్తున్నట్లు సమాచారం.

ఎందుకీ పరిస్థితి?

అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తోంది. విదేశీ ఉద్యోగులపై ఆంక్షలు విధిస్తోంది. హెచ్–1బీ సహా ఇతర వీసాల దరఖాస్తుదారులపైనా ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. వారి సోషల్ మీడియా ఖాతాలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నారు. సోషల్ మీడియాలో చేసిన పోస్టులను, కామెంట్లను అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు జల్లెడపడుతున్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా చాలు దరఖాస్తులను బుట్టదాఖలు చేస్తున్నారు. కొత్త నిబంధనల వల్ల హెచ్–1బీ వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూలు తొలుత 2025 డిసెంబర్‌లో వాయిదా పడ్డాయి. ఇంటర్వ్యూ తేదీలను మొదట 2026 మార్చి నెల.. తర్వాత జూన్.. అనంతరం అక్టోబర్‌కు రీషెడ్యూల్ చేశారు. అవి కూడా వచ్చే ఏడాదికి వాయిదా పడుతున్నాయి. అంటే 18 నెలలకుపైగా వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పటికైనా అవకాశం దక్కుతుందన్న నమ్మకం లేదు. ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతాలోని అమెరికా కాన్సులేట్లలో బ్యాక్‌లాగ్‌లు పేరుకుపోయాయి. రెగ్యులర్ ఇంటర్వ్యూ స్లాట్లు దొరకడం లేదు. ఇప్పట్లో పరిస్థితి మారే అవకాశం లేని ఇమ్మిగ్రేషన్ నిపుణులు చెబుతున్నారు. అమెరికాలో ఉన్న హెచ్–1బీ వీసాదారులు ప్రస్తుతానికి అక్కడే ఉండిపోవాలని, ఇండియాకు వచ్చే సాహసం చేయొద్దని సూచిస్తున్నారు. ఒకవేళ వచ్చినా తిరిగివెళ్తారన్న గ్యారంటీ లేదని అంటున్నారు.

తదుపరి పరిణామాలేమిటి?

భారతీయులు ఇతర దేశాల్లోని అమెరికా కాన్సులేట్లలో వీసా స్టాంపింగ్ చేయించుకొనే అవకాశం గతంలో ఉండేది. ట్రంప్ సర్కార్ ఆ వెసులుబాటును కూడా రద్దు చేసింది. ఎవరైనా సరే సొంత దేశంలోనే వీసా స్టాంపింగ్ కోసం ప్రయత్నించాలని తేల్చిచెప్పింది. ఇంటర్వ్యూలు పదేపదే వాయిదా పడుతుండడంతో హెచ్–1బీ వీసాదారులు ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం అమెరికాకు చేరుకోలేకపోతున్నారు. దాంతో వ్యక్తిగత, ఉద్యోగ జీవితంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భార్యాపిల్లలను దగ్గరుండి చూసుకోలేని దుస్థితి. పిల్లల చదువులు, ఉద్యోగ కాంట్రాక్టులు, హౌసింగ్ అగ్రిమెంట్లు చిన్నాభిన్నమవుతున్నాయి. చాలామంది తమ ఆవేదనను సోషల్ మీడియా ద్వారా వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ ప్రభుత్వం ఇదంతా ఉద్దేశపూర్వకంగానే చేస్తోందని, తాము అమెరికాకు వెళ్లకుండా కుట్రలు సాగిస్తోందని దుమ్మెత్తి పోస్తున్నారు. హెచ్–1బీ వీసాదారులు ఎక్కువకాలం అమెరికా బయట ఉండి.. వీసా గడువు ముగిసిపోతే మరిన్ని కష్టాలు తప్పవు. ఎందుకంటే వీసా కోసం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. దరఖాస్తు రుసుమును వారు పనిచేస్తున్న అమెరికా కంపెనీ భరించాలి. హెచ్–1బీ వీసా దరఖాస్తు ఫీజును ట్రంప్ ప్రభుత్వం లక్ష డాలర్లకు పెంచేసింది. అంత భారం భరించడానికి అమెరికా కంపెనీలు ఇష్టపడడం లేదు. విదేశీ వృత్తి నిపుణులను వదులుకోవడానికి సిద్ధపడుతున్నాయి. అంటే వీసా గడువు ముగిసేలోగా అమెరికాలో అడుగుపెట్టకపోతే ఉద్యోగంపై ఆశలు వదులుకోవాల్సిందే.

ఆ ఆలోచన మానుకోండి

భారతీయుల కోసం గత 50 రోజుల్లో కొత్తగా వీసా ఇంటర్వ్యూ స్లాట్లు తెరిచినట్లు తాను వినలేదని అమెరికాలోని హూస్టన్‌కు చెందిన ఇమ్మిగ్రేషన్ సంస్థ ప్రతినిధి ఎమిలీ న్యూమన్ చెప్పారు. భారతీయులకు వీసాలు ఇవ్వాలన్న తొందర అమెరికా అధికారులకు ఎంతమాత్రం లేదన్నారు. సాధ్యమైనంత వరకు వీసాలు ఇవ్వకుండా ఉండడానికే ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇది జో బైడెన్ పరిపాలన కాదని, ప్రస్తుతం పూర్తిగా విరుద్ధమైన పాలన అమెరికాలో కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. విదేశీయులకు వీసాలు ఇచ్చి, అమెరికాకు రప్పించుకోవాలన్న ఆలోచన ట్రంప్ ప్రభుత్వానికి లేదని స్పష్టంచేశారు. హెచ్–1బీ వీసాదారులు అమెరికాలోనే ఉండిపోవాలని, స్వదేశాలకు వెళ్లాలన్న ఆలోచన ఉంటే తక్షణమే మానుకోవాలని సూచించారు.

అమెరికా కంపెనీలకూ నష్టమే

అమెరికాలో టెక్నాలజీ సంస్థలు, విద్య, వైద్య రంగాల కంపెనీలు తమకు అవసరమైన వృత్తి నిపుణుల కోసం ప్రధానంగా విదేశీయులపైనే ఆధారపడుతున్నాయి. వారికి హెచ్–1బీ వీసాలు లభించడానికి సహకరిస్తున్నాయి. వేలాది మంది హెచ్–1బీ వీసాదారులు స్వదేశాల్లోనే ఉండిపోవడం వల్ల ఆయా కంపెనీలు నష్టపోయే పరిస్థితి ఉత్పన్నమవుతోంది. ప్రాజెక్టులకు అంతరాయం కలుగుతోంది. వ్యయం పెరిగిపోతోంది. మరోవైపు అమెరికాలో కార్యకలాపాలు సాగిస్తున్న విప్రో, టీసీఎస్, టెక్ మహీంద్రా లాంటి భారతీయ ఐటీ కంపెనీలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. విదేశీ నిపుణులను కాకుండా అమెరికన్లను నియమించుకొనేందుకు ఆసక్తి చూపుతున్నాయి. విదేశీయులపై ఆధారపడే పరిస్థితి లేకపోవడమే ఇందుకు కారణం. కఠినమైన వీసా నిబంధనల వల్ల అంతిమంగా అమెరికాకు నష్టం వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నిబంధనలు తట్టుకోలేని వృత్తి నిపుణులు అమెరికాను కాకుండా ఇతర దేశాలను తమ గమ్యస్థానంగా ఎంచుకొనే అవకాశం ఉందని అంటున్నారు. వారు చివరకు ప్రత్యామ్నాయాలు వెతుక్కుంటారని, ఫలితంగా అమెరికాలోకి విదేశీ నిపుణుల రాక ఆగిపోతుందని చెబుతున్నారు. అదే జరిగితే ఇక్కడ ఉత్పత్తి కుంటుపడుతుందని, ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇది ప్రజాస్వామిక పోరాటం.. మీరే కమాండర్లు

అసెంబ్లీ ఎన్నికలపై పార్టీ కేడర్‌కు టీవీకే చీఫ్ విజయ్ దిశా నిర్దేశం

మామల్లపురం: సినీ నటుడు, తమిళగ వెంట్రి కళగం(టీవీకే)చీఫ్ పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. 'తమిళనాడు అసెంబ్లీకి మరికొద్ది నెలల్లో జరిగే ఎన్నికలు కేవలం ఎన్నికలు మాత్రమే కాదు..తీవ్రమైన ప్రజాస్వామిక పోరాటం. ఈ పోరాటంలో కమాండర్లు మీరే'అంటూ ఉత్తేజపరిచారు. ఆదివారం మామల్లపురంలో జరిగిన సమావేశంలో పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రసంగించారు. అవినీతి, దుర్మార్గ పాలనను అంతం చేసే సత్తా కేవలం టీవీకేకు మాత్రమే ఉందంటూ డీఎంకే, ఏడీఎంకేల నుద్దేశించి వ్యాఖ్యానించారు. తమిళనాడుకు హాని కల్గించే శక్తుల నుంచి ప్రజలను కాపాడటమే టీవీకే లక్ష్యమని చెప్పారు. ఈ విషయంలో ఎవ్వరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ప్రకటించారు. డీఎంకే సర్కార్ కూడా మోదీ సర్కారుకు పరోక్షంగా లొంగిపోయిందన్నారు. ఈ సందర్భగా పార్టీ గుర్తు విజిల్ ఊదుతూ పార్టీ కార్యకర్తలను ఆయన ఉత్సాహపరిచారు.

గేమింగ్ యాప్ విన్‌జోపై ఈడీ చార్జిషీట్

రూ. 734 కోట్లు కొల్లగొట్టినట్లు ఆరోపణలు

న్యూఢిల్లీ: రియల్ మనీ ఆన్‌లైన్ గేమింగ్ యాప్, దాని ప్రమోటర్లపై చార్జిషీట్లు వేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆదివారం తెలిపింది. కృత్రిమ మేధను ఉపయోగించుకుని ప్రజల నుంచి ప్రమోటర్లు రూ.734 కోట్లు కొల్లగొట్టారని ఆరోపించింది. ఈ మేరకు బెంగళూరులోని ఈడీ జోనల్ కార్యాలయం ఈ నెల 23న మనీలాండరింగ్ కేసుల ప్రత్యేక కోర్టులో ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. విన్‌జో ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్లు పావన్ నందా, సౌమ్యా సింగ్ రాథోడ్‌లతోపాటు అనుబంధ సంస్థలైన విన్‌జో యూఎస్, జో ప్రైవేట్ లిమిటెడ్, విన్‌జో ఎస్‌జీల పేర్లను చార్జిషీటులో నిందితులుగా చేర్చామంది. విన్‌జో మొబైల్ యాప్‌లో ఆఫర్ చేసిన 100కు పైగా గేమ్‌లకు 25 కోట్ల మంది యూజర్లు ఉన్నారని, వీరిలో అత్యధికులు టయర్–3, టయర్–4 నగరాల పరిధిలోని వారేనని ఈడీ వివరించింది.కేంద్ర ప్రభుత్వం 2025 ఆగస్టులో ఆన్‌లైన్ గేమ్‌లను నిషేధించాక కూడా ఈ యాప్ పనిచేసిందని, ఆ సమయంలో జనం నుంచి వసూలు చేసిన సుమారు రూ.48 కోట్లను తిరిగి చెల్లించలేదని ఆరోపించింది.

ఓటర్లే భాగ్యవిధాతలు

ఓటర్‌గా నమోదు కావడం ప్రతి పౌరుడి విధి

- ప్రజాస్వామ్య ప్రక్రియల్లో భాగస్వాములుగా మారాలి
- దేశ తలరాతను మార్చే శక్తి యువ ఓటర్లకు ఉంది
- 'మై–భారత్' వాలంటీర్లకు ప్రధాని నరేంద్ర మోదీ లేఖ

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్య ప్రక్రియల్లో ప్రజలంతా భాగస్వాములుగా మారాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఓటర్‌గా నమోదు కావడం రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాదని.. భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అది ప్రతి పౌరుడు విధి అని తేల్చిచెప్పారు. ఓటు ద్వారా మన గొంతుకను వినిపించవచ్చని అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ ఆదివారం 'మై–భారత్ వాలంటీర్ల'కు ఈ మేరకు లేఖ రాశారు. దేశ అభివృద్ధి ప్రయాణానికి భాగ్యవిధాతలు ఓటర్లేనని పేర్కొన్నారు. భవిష్యత్తు భారతదేశాన్ని ఓటర్లే నిర్ధారిస్తారని వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరుగా ఉండడం అనేది ఒక బాధ్యత, గొప్ప హక్కు అని ఉద్ఘాటించారు. ఎన్నికల్లో ఓటు వేయడం పవిత్రమైన రాజ్యాంగ హక్కును గౌరవించినట్లే అవుతుందన్నారు. వేలిపై వేసే సిరా గౌరవానికి చిహ్నమని, అది ప్రజాస్వామ్యాన్ని మరింత ఉన్నతంగా మారుస్తుందని వెల్లడించారు.

ప్రజాస్వామ్యంలోకి ఆహ్వానిద్దాం

''మన బంధు మిత్రుల్లో తొలిసారిగా ఓటర్‌గా నమోదైనవారు చాలామంది ఉండొచ్చు. ఆ యువ ఓటర్లకు అది మధురమైన, ప్రత్యేకత కలిగిన సందర్భం. ప్రజాస్వామ్యంలోకి వారిని ఆహ్వానిద్దాం. దేశ తలరాతను మార్చే శక్తి వారికి ఉందనడంలో సందేహం లేదు. మై–భారత్ వాలంటీర్లు సానుకూలమైన పని జరిగేదా వేచి చూడాలనుకోవడం లేదు. అవసరమైన పని జరగడానికి వారే చొరవ తీసుకుంటున్నారు. ఓటు ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన పెంచాలి. అర్హులైనవారంతా ఓటర్లుగా నమోదయ్యేలా చైతన్యం కలిగించాలి. ప్రజాస్వామ్య ప్రక్రియలు బలోపేతం కావడానికి కృషి చేస్తున్నవారికి నా అభినందనలు. వికసిత్ భారత్ పునాది బలోపేతం కావాలంటే ప్రజాస్వామ్య ప్రక్రియల్లో మనం పాల్గొందాం. తద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని గౌరవిద్దాం. ప్రపంచంలో మనది అతిపెద్ద ప్రజాస్వామ్యం అని చెబుతుంటారు. అదే సమయంలో మనదేశం ప్రజాస్వామ్యానికి తల్లి కూడా. ప్రజాస్వామ్య విలువలు మన మూలాల్లోనే ఉన్నాయి. శతాబ్దాల క్రితమే ఇక్కడ ప్రజాస్వామ్య వర్ధిల్లింది.

మిఠాయిలు పంచి వేడుక చేసుకోండి

మీ చుట్టూ ఉన్నవారు తొలిసారిగా ఓటర్‌గా మారితే ఆ సందర్భాన్ని వేడుక చేసుకోండి. మిఠాయిలు పంచుకోండి. ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడంలో మన పాఠశాలలు, కళాశాలలది కీలక పాత్ర. 18 ఏళ్లు దాటినవారంతా తప్పనిసరిగా ఓటర్లుగా మారాలి. అది బాధ్యతగా భావించాలి. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటే హిమాలయాలపైనా ఉన్నా, అండమాన్ నికోబార్ దీవుల్లో ఉన్నా, ఎడారిలో ఉన్నా, అడవుల్లో ఉన్నాసరే మన గొంతు వినిపించవచ్చు. ప్రజాస్వామ్య ఆశయాల పట్ల అంకితభావం మనకు నిరంతరం స్ఫూర్తినిస్తుంది. ప్రజాస్వామ్యంలో చురుగ్గా పాలుపంచుకోవాలని మన నారీశక్తిని ప్రత్యేకంగా కోరుతున్నా. సమగ్ర ప్రజాస్వామ్యంలో యువతులు కీలక పాత్ర పోషించాలి. వారి భాగస్వామ్యం దేశ పునాదిని బలోపేతం చేస్తుంది''అని మోదీ స్పష్టం చేశారు. ప్రజలకు జాతీయ ఓటర్ల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నాణ్యతకు మరో పేరుగా మన ఉత్పత్తులు

- తయారీలో నాణ్యత మన బాధ్యత కావాలి
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: భారతీయ ఉత్పత్తులను అత్యున్నత నాణ్యత మారుపేరుగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. ఉత్పత్తుల విషయంలో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని పరిశ్రమలకు, స్టార్టప్ కంపెనీలకు సూచించారు. తయారీ రంగంలో ఉత్కృష్టతను బెంచ్‌మార్క్‌గా మనం నిర్ధారించాలన్నారు. మోదీ ఆదివారం 130వ 'మన్ కీ బాత్'లో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించిన రేడియోలో ప్రసంగించారు. లోపాలకు తావులేకుండా అత్యంత నాణ్యంగా ఉత్పత్తులను తయారు చేయాలని చెప్పారు. భారతీయ వస్తువులు అంటే టాప్ క్వాలిటీ అనే పేరు రావాలన్నారు. వస్త్రాలు, టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఆఖరికి ప్యాకేజింగ్ కూడా నాణ్యతతో అందించాలన్నారు. భారత స్టార్టప్ ప్రయాణంలో యువత ఉత్సాహంగా పాలుపంచుకుంటున్నారని కొనియాడారు.

యువ మిత్రులకు సెల్యూట్

''మన దేశంప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్‌ల వ్యవస్థ . దశాబ్దం క్రితం మనకు ఏమాత్రం తెలియని రంగాల్లో నేడు స్టార్టప్‌లు ఏర్పాటయ్యాయి. కృత్రిమ మేధ(ఏఐ), అంతరిక్షం, అణు ఇంధనం, సెమీకండక్టర్లు, రవాణా, గ్రీన్ హైడ్రోజన్, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో స్టార్టప్ కంపెనీలు సేవలందిస్తున్నాయి. ఆయా కంపెనీల్లో భాగస్వాములైన నా యువ మిత్రులకు సెల్యూట్. నేడు ప్రపంచం మొత్తం మనల్ని జాగ్రత్తగా గమనిస్తోంది. వస్తువుల తయారీలో నాణ్యత మన బాధ్యత కావాలి'' అని ప్రధాని అన్నారు.

మనది శాంతి సందేశం

- రక్షణ స్వావలంబనతోనే 'సిందూర్' విజయం
- 'వికసిత్ భారత్'లో మహిళలదే కీలక పాత్ర

గణతంత్ర సందేశంలో రాష్ట్రపతి

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఘర్షణలు, సంక్షోభాలు, అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో మానవాళి భద్రతకు కీలకమైన శాంతి సందేశాన్ని భారత్ ఇస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆమె ఆదివారం దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ''ప్రపంచ శాంతికి ప్రార్థించడం మన సంప్రదాయం. ప్రపంచమంతటా శాంతియుత వాతావరణం వెల్లివిరిస్తేనే మానవాళి భవిత సురక్షితం'' అని స్పష్టంచేశారు.

మహిళా శక్తి భేష్

దేశ భద్రతకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్రపతి అన్నారు. ''రక్షణ రంగంలో స్వావలంబనతో ఆపరేషన్ సిందూర్ చరిత్రాత్మక విజయం సాధించింది. నారీ శక్తి పెరుగుతుండటం హర్షణీయం. '2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్' లక్ష్య సాధనలో మహిళలదే కీలక పాత్ర. స్వయం సహాయక సంఘాల నుంచి అంతరిక్షం, రక్షణ రంగాల దాకా వారి కృషి ప్రశంసనీయం. పంచాయతీరాజ్ వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యం 46 శాతానికి చేరింది. నారీశక్తి వందన్ అధినియమ్‌తో రాజకీయ సాధికారత సాధ్యమవుతోంది. ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్, అంధుల మహిళల టీ20 ప్రపంచ కప్ గెల్చుకున్నారు. సైనిక దళాలు సహా ఎన్నో కీలక రంగాల్లో ముమ్ముందుకు దూసుకెళ్తున్నారు. బేటీ బచావో–బేటీ పడావోతో విద్యా రంగంలో చక్కటి విజయాలు సాధిస్తున్నారు. టెక్నాలజీ, శాసన సంస్కరణలతో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అంతరం తగ్గుతోంది. కాలం చెల్లిన వేలాది నిబంధనలు, చట్టాలను రద్దు చేసుకున్నాం. డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో గ్లోబల్ లీడర్‌గా ఎదిగాం. ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో సగం మన దేశంలోనే జరుగుతున్నాయి. వలసవాద మనస్తత్వాన్ని వదిలించుకుందాం. సాంస్కృతిక రంగంలోనూ స్వావలంబన సాధించాలి. వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయ్యాయి. దేశ ఐక్యతలో దాని పాత్ర శ్లాఘనీయం. పేదరిక నిర్మూలనలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం. దాదాపు 81 కోట్ల మంది వేర్వేరు ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతున్నారు. గిరిజన, అణగారిన వర్గాల అభ్యున్నతిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది'' అని వివరించారు.

స్ఫూర్తిదాయకం: మోదీ

రాష్ట్రపతి ముర్ము గణతంత్ర దినోత్సవ ప్రసంగం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకొనే దిశగా ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మన రాజ్యాంగ విశిష్టతను ఆమె వివరించారని ఎక్స్ పోస్టులో చెప్పారు.

అమెరికాను వణికిస్తున్న చలి తుఫాన్

వేలాదిగా విమానసర్వీసులు రద్దు ● విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

వాషింగ్టన్: భీకర శీతాకాలపు తుఫాన్ అమెరికాను వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు మైనస్‌లలో నమోదవుతున్నాయి. దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఏకంగా 14,100 విమాన సర్వీసులు రద్దు కాగా, 8 వేల విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. రహదారులపై మంచు పేరుకుపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి, ప్రమాదాలు పెరుగుతున్నాయి. విద్యుత్ తీగలు తెగిపోయి లక్షలాది ఇళ్లు చీకట్లలో మగ్గుతున్నాయి. హీటింగ్ వ్యవస్థలు సైతం పనిచేయకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. పాఠశాలలు, కార్యాలయాలు మూతపడ్డాయి. ప్రజలు ఇళ్లలోనే ఉండిపోవాలని అధికారులు సూచించారు. ఇవే పరిస్థితులు సోమవారం కూడా కొనసాగే అవకాశముందని అంచనా వేసింది. పలు రాష్ట్రాలకు అత్యవసర పరిస్థితిని ప్రకటించేందుకు అధ్యక్షుడు ట్రంప్ అనుమతినిచ్చారు.

కెనడాలో భారత సంతతి వ్యక్తి మృతి

బర్న్‌బీ: కెనడాలోని బ్రిటిష్ కొలంబియా రాష్ట్రంలో రెండు ముఠాల మధ్య జరిగిన కాల్పుల్లో భారత సంతతికి చెందిన దిల్‌రాజ్ గిల్(28) అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ నెల 22వ తేదీన సాయంత్రం 5.30 గంటల సమయంలో బర్న్‌బీలోని కెనడా వేలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడిని వాంకోవర్‌కు చెందిన దిల్‌రాజ్ గిల్‌గా గుర్తించామని తెలిపింది. గ్యాంగ్‌ల మధ్య ఆధిపత్య పోరులో భాగంగా ఉద్దేశపూర్వకంగా జరిగిన హత్యగా భావిస్తున్నామని తెలిపింది. కాల్పులు జరిగిన వెంటనే నిందితుడు లేదా నిందితులు ఆ ప్రాంతం నుంచి పరారయ్యారని, వాహనం దహనంతో వారికి సంబంధముంటుందని అనుమానాలున్నాయని ఆర్‌సీఎంపీ పేర్కొంది. వివిధ ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు జరుగుతోందని వివరించింది.

మానవత్వం లేని చట్టంతో అరాచకమే

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

పణాజీ: మానవత్వం ప్రతిబింబించని చట్టంతో అరాచకమే ప్రబలుతుందని, అదే సమయంలో చట్టంలేని మానవత్వం నిరంకుశానికి దారితీస్తుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 'చట్టం ఒక సజీవ వ్యవస్థ. అది నిలకడకు, మార్పునకు సమతుల్యతను పాటించాలి. చట్టం మార్పును అడ్డుకోరాదు. అదే సమయంలో, సరైన ఆలోచన లేకుండా కేవలం కొత్తదనం కోసం దేనినీ గుడ్డిగా స్వీకరించకూడదు. లేదంటే నైతిక స్థానాన్ని కోల్పోతుంది'అని ఆయన అభిప్రాయపడ్డారు. మార్పును ఆకళింపు చేసుకోలేని చట్టం శుద్ధంగా ఉండజాలదన్నారు. ఆదివారం ఆయన గోవాలో ఇంటర్నేషనల్ లీగల్ కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంతోపాటు గోవా స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ డ్రగ్స్ వ్యసనంపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ప్రతి చట్ట వ్యవస్థ కూడా శతాబ్దాల తరబడి జరిగిన పోరాటాలు, చర్చలు, రాజీలు, నైతిక ధైర్యం నుంచి అందిన ఒక వారసత్వంగా ఆయన అభివర్ణించారు. వారసత్వంగా అందుతూ, అనేక పరీక్షలకు తట్టుకుని నిలబడిన న్యాయ వ్యవస్థకు తాము యజమానులం కాదు, కేవలం తాత్కాలిక సంరక్షకులం మాత్రమే అనే విషయం తన మదిలో ఎప్పుడూ మెదులుతూ ఉంటుందన్నారు. 'మాదక ద్రవ్యాల వాడకం కేవలం నేరం మాత్రమే కాదు, అది ఒక సామాజిక, మానసిక, వైద్యపరమైన సమస్యగా గుర్తించాలి. అవగాహన ద్వారానే ఇది పరిష్కారం కావాలే తప్ప, శిక్షలు హెచ్చరికల ద్వారా కాదు'అని సీజేఐ అన్నారు. 'డ్రగ్స్ వ్యసనం నిశ్శబ్దంగా మన ఇళ్లలోకి, తరగతి గదుల్లోకి, సమాజంలోకి ప్రవేశించి, భవిష్యత్తును నాశనం చేస్తుంది. ఇది కేవలం వ్యక్తులనే కాదు, సమాజాన్నే పాడు చేస్తుంది'అని ఆయన హెచ్చరించారు.

జడ్జీల బదిలీల్లో ప్రభుత్వ జోక్యం

జస్టిస్ భూయాన్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: హైకోర్టు న్యాయమూర్తుల బదిలీలు, కొలీజియం నిర్ణయాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకుంటోందంటూ సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఆందోళనకర పరిణామం న్యాయ వ్యవస్థ స్వతంత్రతకు భంగకరమన్నారు. ''ఇటీవల జస్టిస్ అతుల్ శ్రీధరన్‌ను మధ్యప్రదేశ్ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. కేంద్ర ప్రభుత్వ విన్నపం మేరకే జరిగిందని నాటి ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థపై కార్యనిర్వాహక వ్యవస్థ (ప్రభుత్వం) ప్రభావం ఉందని దీంతో స్పష్టమవుతోంది'' అని జస్టిస్ భూయాన్ పేర్కొన్నారు. ''ప్రభుత్వానికి అసౌకర్యం కలిగించేలా ఉత్తర్వులను ఇచ్చినంతమాత్రానే హైకోర్టు జడ్జిని బదిలీ చేస్తారా? ఇవి న్యాయవ్యవస్థ స్వతంత్రతకే గొడ్డలి పెట్టు కాదా? కొలీజియం విధానం సమగ్రతను ఇవి దెబ్బ తీసినట్లు కాదా? హైకోర్టు న్యాయమూర్తుల నియామకం, బదిలీల్లో ప్రభుత్వానికి ఎటువంటి పాత్రా ఉండరాదు'' అని కుండబద్దలు కొట్టారు.

ఇరాన్‌లో మృతులు 30 వేల పైమాటే?

టెహ్రాన్: ఇరాన్ వ్యాప్తంగా ఈ నెల 8, 9వ తేదీల్లో జరిగిన నిరసనల్లోనే కనీసం 30 వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఆ దేశ ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల సమాచారాన్ని ఉటంకిస్తూ టైమ్ పత్రిక ఈ విషయం తెలిపింది. గురు, శుక్రవారాల్లోనూ ఇరాన్ భద్రతా విభాగాల సిబ్బంది ఇంతే కర్కశంగా వ్యవహరించారని, మరణాలు కూడా అదే స్థాయిలో ఉండొచ్చన్న అంచనాలున్నాయి. మృతదేహాలున్న ప్లాస్టిక్ బ్యాగులు ప్రభుత్వ ఆస్పత్రుల ఆవరణల్లో గుట్టలుగా పడి ఉన్నాయని, అంబులెన్సులకు బదులుగా వీటిని తరలించేందుకు 18 చక్రాలుండే సెమీ ట్రయిలర్‌లను వాడుతున్నారని పేర్కొంది. జనవరి 21న సుప్రీం నేత ఖమేనీకి అందించిన సమాచారం ప్రకారం నిరసనల్లో 3,117 మంది మాత్రమే చనిపోయినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ఆస్పత్రుల రికార్డుల ఆధారంగా చూస్తే 30,304 మంది మృతుల్లో 5,459 మంది వివరాలను మాత్రమే ఇప్పటి వరకు ధ్రువీకరించారు.

రెండేళ్ల చిన్నారితో పాటు తండ్రి నిర్బంధం

అమెరికాలో ఇమిగ్రేషన్ అధికారుల తీరుపై విమర్శలు

వాషింగ్టన్: అమెరికాలోని మినియాపొలిస్‌లో ఇమిగ్రేషన్ అధికారుల అమానవీయ చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా కారులో వెళ్తున్న ఓ వ్యక్తిని, అతడి రెండేళ్ల కుమార్తెను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఈక్వెడార్‌కు చెందిన వీరు అక్రమ వలసదారులని అధికారులు చెబుతున్నారు. వారి కారును అడ్డగించి, అద్దాలు పగులగొట్టి నిర్బంధంలోకి తీసుకున్నారు. అతను ఈక్వెడార్ నుంచి దొంగచాటుగా దేశంలోకి ప్రవేశించాడని హోం ల్యాండ్ సెక్యూరిటీ పేర్కొంది. చిన్నారి సంరక్షణ బాధ్యతను తీసుకునేందుకు తల్లి నిరాకరించడంతో తిరిగి తండ్రి వద్దే ఉంచామని వివరించింది.

క్లుప్తంగా...

అగ్నికీలల్లో ఐదుగురు ఆహుతి

18గంటలపాటు బచ్చాస్ షోరూంలో ఎగసిపడిన మంటలు

సాక్షి, హైదరాబాద్/అబిడ్స్: హైదరాబాద్‌లోని నాంపల్లి స్టేషన్ రోడ్‌లో సాయి బిశ్వాస్ చాంబర్స్‌లో ఉన్న బచ్చాస్ ఫర్నిచర్ క్యాసిల్ సంస్థలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదం ఐదుగురిని పొట్టన పెట్టుకుంది. శనివారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటు చేసుకోగా.. ఆదివారం ఉదయానికి మంటలు అదుపులోకి వచ్చాయి. రాత్రి వరకూ సెల్లార్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి పొగలు వస్తూనే ఉన్నాయి. అబిడ్స్ పోలీసులు దుకాణ యజమాని సతీశ్ బచ్చాను అరెస్టు చేశారు. ప్రాథమిక అంచనా ప్రకారం శనివారం మధ్యాహ్నం 1.10 గంటల సమయంలో బచ్చాస్ దుకాణం సెల్లార్ వెనుక వైపు మంటలు అంటుకున్నాయి. ఇవి గ్రౌండ్‌తోపాటు మొదటి అంతస్తుకు పాకాయి. భవనం సెల్లార్‌లో ఉన్న పెయింట్స్, రసాయనాల వల్లే మంటల తీవ్రత పెరిగిందని చెబుతున్నారు. సెల్లార్‌లో వెనుక వైపు కుడి పక్కగా రెండు చిన్న గదులు ఉన్నాయి. ఒకదాంట్లో గుల్బర్గా నుంచి వలసవచ్చి స్వీపర్‌గా పనిచేస్తున్న బేబి(46), మరో గదిలో వాచ్‌మెన్ తోకల యాదయ్య, అతని భార్య లక్ష్మి, కుమా రులు ప్రణీత్ (11), అఖిల్ (8) ఉంటున్నారు. ప్రమాదంలో బేబి సజీవ దహనమైంది. ప్రణీత్, అఖిల్ ఊపిరాడక మరణించారు.

కాపాడటానికి వెళ్లి ఇద్దరు..

సుభాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఇంతియాజ్ (28), శాస్త్రీపురం వాసి హబీబ్ (35) బచ్చాస్ ఫర్నిచర్ దుకాణంలో ఆటోడ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరు ప్రమాదం సమయంలో చిన్నారులు ప్రణీత్, అఖిల్‌ను కాపాడడానికి ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు తీసుకొని వెళ్లారు. అయితే అప్పటికే మంటలు తీవ్రం కావడంతో హబీబ్ సజీవ దహనమయ్యాడు. ఇంతియాజ్ కూడా ఊపిరాడక మరణించాడు.

బడ్జెట్ సమావేశాల్లోనే అమరావతి బిల్లు

టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఈ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు పెట్టనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దీనిపై కేంద్రంలోని సంబంధిత మంత్రి, అధికారులతో మాట్లాడుతూ ఉండాలని ఆయన టీడీపీ ఎంపీలకు సూచించారు. ఆదివారం ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో టీడీపీకి చెందిన ఎంపీలందరూ మాట్లాడాలని సూచించారు. వెనకబడిన ఉత్తరాంధ్ర–రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, పూర్వోదయ పథకం, పోలవరం–నల్లమల సాగర్‌ను ప్రాధాన్యంగా తీసుకోవాలని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఇంకా రావాల్సిన రూ.12 వేల కోట్ల గురించి ప్రస్తావించాలన్నారు.

మద్యం మత్తులో స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తి

ఘటనా స్థలంలో ప్రతాప్ మృతదేహం

చిలకలూరిపేట టౌన్: మద్యం మత్తులో స్నేహితుడిని హత్య చేసిన ఘటన పల్నాడు జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిలకలూరిపేటలోని రాగన్నపాలెం జమ్మిచెట్టు సమీపంలో ఉండే బోయిడి ప్రతాప్, నాగరాజులు మిత్రులు. ఆదివారం మద్యం తాగిన క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి అదికాస్తా ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో కూరగాయలు కోసే కత్తితో ప్రతాప్ పొట్టభాగంలో నాగరాజు పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ప్రతాప్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రతాప్ కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాల్మన్ హత్యపై త్వరలో ఛలో ఢిల్లీ

టీడీపీ దాడులపై ఢిల్లీ స్థాయిలో వైఎస్సార్‌సీపీ ఉద్యమం

- ఈ అరాచకాలను పార్లమెంట్‌లో చెబుతాం
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాడతాం
- స్పష్టం చేసిన పార్టీ నాయకులు
- నరసరావుపేట, పిన్నెల్లిలో సాల్మన్‌కు నివాళులర్పించిన పార్టీ నేతలు

సాల్మన్ సంతాప సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, చిత్రంలో పార్టీ ముఖ్యనేతలు

నరసరావుపేట/దాచేపల్లి/పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా పిన్నెల్లిలో టీడీపీ గూండాల చేతుల్లో హత్యకు గురైన మందా సాల్మన్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు. సాల్మన్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని చెప్పారు. త్వరలో ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామని, చంద్రబాబు ప్రభుత్వ అరాచకాలను పార్లమెంటులో చెబుతామని తెలిపారు. జాతీయ మానవ హక్కుల సంఘానికి, జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, కోర్టులను ఆశ్రయించి సాల్మన్ హంతకులకు శిక్షపడేవరకు ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సాల్మన్ సంస్మరణ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు సాల్మన్‌కు నివాళులర్పించారు. చంద్రబాబు ప్రభుత్వ అరాచకాల్ని ఎండగట్టారు. అనంతరం వారు పిన్నెల్లి గ్రామానికి వెళ్లి సాల్మన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నరసరావుపేటలోను, పిన్నెల్లిలోను వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ చంద్రబాబు దృష్టిలో దళితుల ఓట్లకున్న విలువ వారి ప్రాణాలకు లేదని చెప్పారు. అందుకే అధికారంలోకి వచ్చిన నాటినుంచి దళితులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో ఎర్ర బుక్ అనే వెర్రి పరిపాలన సాగుతోంది. పల్నాడు జిల్లాలో ఆటవిక రాజ్యాన్ని తలపిస్తున్నారు. గురజాలలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్ గూండా రాజ్యం నడుపుతున్నారు. దాడిచేసి చంపారంటూ పిన్నెల్లి నుంచి ఫోన్‌చేసిన వారిని.. గ్రామంలోకి ఎందుకొచ్చారని ప్రశ్నించిన సీఐ భాస్కర్‌రావుకు న్యాయస్థానాల ద్వారా శిక్షపడేలా చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు, దౌర్జన్యాలు, దళిత మహిళల మీద అఘాయిత్యాలు ఎక్కువైపోయాయి. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో దళితులను గ్రామ బహిష్కరణ చేసినా ఆయన పట్టించుకోలేదు. పిన్నెల్లి గ్రామం నుంచి 300 కుటుంబాలు బయటకు వెళ్లి జీవించాల్సిన దుస్థితి వచ్చిందంటే ఇది పోలీసుల చేతగానితనమే. పలుకూరుకు చెందిన 400 కుటుంబాలు గ్రామాన్ని విడిచిపోయి బతుకుతున్నాయి' అని చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీ మద్దిల గురుమూర్తి, మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ మంత్రులు మేకతోటి సుచరిత, మేరుగ నాగార్జున, విడదల రజని, సాకే శైలజానాథ్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ టీజేఆర్ సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, మాజీ ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్, పార్టీ గ్రీవెన్స్ సెల్ ప్రెసిడెంట్ నారాయణమూర్తి, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూనూరు గౌతమ్‌రెడ్డి, సత్తెనపల్లి సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కందుల ఎజ్రా, జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ పథకాలు చరిత్రలో నిలిచిపోతాయి

- వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు
- చిన్నంపేటలో మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణ

మాట్లాడుతున్న దూలం నాగేశ్వరరావు, చిత్రంలో పేర్ని నాని, మేకా ప్రతాప్ అప్పారావు తదితరులు

చాట్రాయి: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలంలోని చిన్నంపేటలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జలయజ్ఞం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, 108 వంటి పథకాలతో పేదల గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. సీఎం చంద్రబాబును గుర్తు చేసేలా ఒక్క పథకమైనా ఉందా అని ప్రశ్నించారు. నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలను కాపీ కొట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టడం తప్ప చంద్రబాబు ప్రజలకు ఏమైనా మేలు చేశారా అని ప్రశ్నించారు.

బాబు, పవన్ పదవులకు రాజీనామా చేయాలి

పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాదంలో గొడ్డు కొవ్వు, పంది కొవ్వు కలిసిందని అసత్య ప్రచారం చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ పవన్ కళ్యాణ్ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని మాజీ మంత్రి, కృష్ణా జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పేర్ని నాని డిమాండ్ చేశారు. లడ్డూలో ఎలాంటి కొవ్వుకలవ లేదని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ 50 ఏళ్ల ఇండస్ట్రీ, నాలుగుసార్లు ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబు తన పాలనకు గుర్తుగా ఒక్క పథకమైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన మెడికల్ కాలేజీలను రద్దు చేస్తే ఒక్కరు కూడా టెండర్‌కి రాలేదని అదే జగన్‌మోహన్‌రెడ్డి 2.0 అని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామల, పార్టీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము తదితరులు పాల్గొన్నారు.

'సీమ' ప్రయోజనాలను తాకట్టు పెట్టిన చంద్రబాబు

- రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సమాధి కడుతున్నారు
- హంద్రీ–నీవా కాలువ వెడల్పుపైనా అనుమానాలే
- వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి

అనంతపురం: రాయలసీమ ప్రాంత ప్రయోజనాలను సీఎం చంద్రబాబు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి తాకట్టు పెట్టారని వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. ఇందులో భాగంగానే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సమాధి కడుతున్నారని విమర్శించారు. ఆదివారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఆపేయడంతో ప్రజల నుంచి తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. ఈ నేపథ్యంలో హంద్రీ–నీవా ద్వారా 190 రోజుల్లో 40 టీఎంసీలు తరలించామంటూ జిల్లాకు చెందిన మంత్రులు కొత్త డ్రామాకు తెరలేపారని మండిపడ్డారు. హంద్రీ–నీవాకు ఎన్టీఆర్ శంకుస్థాపన చేస్తే ఆ తర్వాత చంద్రబాబు 40 టీఎంసీలను కాస్తా 5 టీఎంసీలకే కుదించారని గుర్తు చేశారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 5 టీఎంసీల జీఓను రద్దు చేసి 40 టీఎంసీలకు పునరుద్ధరించారన్నారు. ఆ తర్వాత పనులు వేగవంతం అయ్యాయని, దాని ఫలితంగానే 2012 నుంచి రాయలసీమకు కృష్ణా జలాలు వస్తున్నాయన్నారు. 2019లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక 6,300 క్యూసెక్కుల సామర్థ్యంతో పనులు చేయడానికి నిధులు మంజూరు చేయడంతో పాటు వైఎస్సార్‌సీపీ హయాంలోనే టెండర్లు పూర్తయ్యాయని చెప్పారు. శ్రీశైలంలో 800 అడుగుల నుంచే నీటిని తీసుకునేలా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.

హంద్రీ–నీవాపై ఆత్మపరిశీలన చేసుకోవాలి

వంద రోజుల్లో హంద్రీ–నీవా తొలి, రెండో దశ కాలువ వెడల్పు పనులకు రూ.3 వేల కోట్లు ఖర్చు చేశామని మంత్రులు గొప్పలు చెప్పుకుంటున్నారని వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. నిజంగా 3,850 క్యూసెక్కులు తరలించి ఉంటే 190 రోజుల్లో సుమారు 63 టీఎంసీలు తరలించి ఉండాలని, మరి ఎందుకు 40 టీఎంసీలే వచ్చాయని ప్రశ్నించారు. మరోవైపు శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 798 అడుగుల్లోనే తెలంగాణ ప్రభుత్వం విద్యుదుత్పత్తి పేరుతో నీటిని తోడేస్తోందని.. 800 అడుగులకు చేరగానే సాగుకు విడుదల చేసుకుంటున్నా చంద్రబాబు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో తొలి దశ కాలువ వెడల్పు చేశామని చెప్పి.. తీరా ఇప్పుడు 2,500 క్యూసెక్కులు కూడా తీసుకురావడం లేదన్నారు. ఇందుకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేరుకు మాత్రమే హంద్రీ–నీవా వెడల్పు చేశారని, రూ.3 వేల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని నిలదీశారు. రాయలసీమ ప్రయోజనాలను కాపాడేందుకు వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

'అనంత నీరు సంరక్షణ' అమోఘం

'మన్‌కీ బాత్'లో కొనియాడిన ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లోని కరువు ప్రాంతమైన అనంతపురంలో ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణలో విశేష విజయాన్ని సాధించారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. తీవ్రమైన నీటి కొరతతో ఎన్నాళ్లుగానో ఇబ్బందులు పడుతున్న ఈ జిల్లాలో 'అనంత నీరు సంరక్షణం ప్రాజెక్ట్' కీలక మార్పులకు దారి తీసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం 'మన్‌కీ బాత్'లో మాట్లాడిన ప్రధానిమోదీ ఉత్తర్‌ప్రదేశ్‌లో తంసా నదితో పాటు అనంతపురంలో నీటి సంరక్షణ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. 'మన దేశ ప్రజలు ఎంతో సృజనాత్మకులు. సమస్యలకు పరిష్కారాలు వెతకడం మన దేశవాసుల సహజ స్వభావం. కొందరు స్టార్టప్‌ల ద్వారా ఇది చేస్తే, మరికొందరు సమాజం కలిసికట్టుగా ముందుకు రావడం ద్వారా పరిష్కారాలను కనుగొంటారు. ఇలాంటి ఒక గొప్ప ప్రయత్నం ఉత్తరప్రదేశ్‌లోని ఆజంఘర్, అనంతపురంలో కనిపించింది. ఆజంఘర్ ప్రజలు తమ ప్రాంతంలో ప్రవహించే తంసా నదికి కొత్త జీవం పోశారు. తంసా నది ఆ ప్రాంత సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వానికి సాక్ష్యం. అయోధ్య మీదుగా ప్రవహించి గంగా నదిలో కలిసే ఈ నది కాలక్రమంలో కాలుష్యం వల్ల ప్రవాహం ఆగిపోయి.. మట్టి, చెత్త, మలినాలతో పూర్తిగా నిండిపోయింది. ఈ నదికి మళ్లీ ప్రాణం పోయాలనే సంకల్పంతో అక్కడి ప్రజలు ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యంగా భావించి పని చేయడంతో తంసా మళ్లీ జీవం పోసుకుంది. ఇలాంటి ప్రజా భాగస్వామ్యంతో కూడిన మరో గొప్ప ప్రయత్నం ఏపీలోని అనంతపురంలోనూ కనిపించింది. తీవ్ర కరువుతో ఇబ్బంది పడే అనంతపురం ప్రాంతంలో నీటి కొరత ఎక్కువ. చాలాచోట్ల దీర్ఘకాలం వర్షాలు పడవు. కొన్నిసార్లు అనంతపురాన్ని ఎడారి ప్రాంతంతో పోలుస్తారు. ఈ సమస్యకు పరిష్కారం కోసం స్థానిక ప్రజలు ముందుగా చెరువులు, కుంటలను శుభ్రం చేయాలని నిర్ణయించారు. పరిపాలనా యంత్రాంగం సహకారంతో 'అనంత నీరు సంరక్షణ ప్రాజెక్ట్' ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా 10కి పైగా జలాశయాలు పునరుద్ధరించబడ్డాయి. ప్రస్తుతం ఆ జలాశయాలు నీటితో నిండుతున్నాయి. అదే సమయంలో 7,000కి పైగా మొక్కలు నాటారు. నీటి సంరక్షణతో పాటు అనంతపురంలో పచ్చదనం కూడా పెరిగి పర్యావరణ వ్యవస్థకే కొత్త జీవం ఏర్పడింది' అని ప్రధాని కొనియాడారు.

మలేషియాలో తెలుగుకు ప్రాధాన్యం

భారతీయ సంస్కృతి, పండుగలు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును సాధిస్తున్నాయని ప్రధాని మోదీ గుర్తు చేశారు. మలేషియాలోని భారతీయ సమాజం విశేష కృషి చేస్తోందన్న ప్రధాని, అక్కడ ప్రస్తుతం 500కిపైగా తమిళ పాఠశాలలు ఉండడం విశేషమన్నారు. భారత్ – మలేషియా సాంస్కృతిక బంధాలను బలపరిచే కీలక సంస్థగా 'మలేషియా ఇండియా హెరిటేజ్ సొసైటీ' నిలుస్తోందన్నారు. ఈ పాఠశాలల్లో తమిళ భాషతో పాటు ఇతర సబ్జెక్టులను కూడా తమిళంలోనే బోధిస్తున్నారని తెలిపారు. తెలుగు, పంజాబీ సహా ఇతర భారతీయ భాషలకూ ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు.

తమ్ముడిని నరికి చంపిన అన్న

మడకశిర రూరల్: శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో వరుసకు తమ్ముడైన వ్యక్తిని అన్న కొడవలితో నరికిచంపాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బి.రాయాపురం గ్రామానికి చెందిన రాధాకృష్ణ(41) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పంటకు నీరు పెట్టడానికి వ్యవసాయ బోరు బావి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో వరుసకు అన్న అయిన ఈరేగౌడ్ కూడా అక్కడికి వెళ్లాడు. రాధాకృష్ణతో గొడవ పడ్డాడు. అనంతరం కొడవలితో రాధాకృష్ణను విచక్షణారహితంగా నరికి చంపాడు. ఎడమ చేయి మణికట్టును నరికి వేరు చేశాడు. అనంతరం గ్రామంలోకి వెళ్లి రాధాకృష్ణను చంపేశానని చెప్పాడు. హతుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోలీసులు మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. హత్యకు గల అసలు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటన స్థలాన్ని మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్, ఎస్‌ఐ లావణ్య, సిబ్బందితో పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా, రాధాకృష్ణను హత్య చేశాక ఈరేగౌడ్ గ్రామంలోని వెళ్లి ఇంకా ఇద్దరిని చంపి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోతానని చెబుతూ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో అప్రమత్తమై ఈరేగౌడ్ కోసం ముమ్మరంగా గాలించి, చివరకు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

అధికారులపై అక్రమ క్వారీ నిర్వాహకుల దాడి

- బోయకొండ రిజర్వు ఫారెస్ట్‌లో అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్న కూటమి నేత
- పరిశీలనకు వెళ్లిన రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులపై క్వారీ సిబ్బంది దాడి
- ఐదుగురిని అరెస్టు చేసిన అటవీ అధికారులు

ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న సీఐ

పుంగనూరు: అన్నమయ్య జిల్లా బోయకొండ రిజర్వు ఫారెస్ట్‌లో జరుగుతున్న అక్రమ క్వారీ పనులను నిలిపేందుకు వెళ్లిన రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులపై దాడి చేయడంతో ఐదుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్‌ఓ శ్రీరాములు తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక ఫారెస్ట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పుంగనూరు సమీపంలోని 103 సర్వే నంబర్‌లో రిజర్వు ఫారెస్ట్ భూముల్లో కూటమి పార్టీకి చెందిన నాయకుడు సూర్యరాక్స్ యజమాని హరినాథ్ అక్రమ క్వారీ నిర్వహిస్తున్నాడని తెలిపారు. ఈ పనులు చేయరాదంటూ పలుమార్లు నోటీసులు జారీ చేయడంతో పాటు రెండు కేసులు కూడా నమోదు చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైనింగ్ ఆపివేయాలని యజమాని హరినాథ్‌కు నోటీసులు జారీ చేశామన్నారు. కాగా ఆదివారం రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు అక్రమ క్వారీ పరిశీలనకు వెళ్లగా అక్కడే ఉన్న సిబ్బంది సయ్యద్, పళణి, రవి, వెంకటేష్ అడ్డుకుని తమపై దాడి చేసినట్లు ఎఫ్‌ఆర్‌ఓ చెప్పారు. కోర్టులో కేసులు వేస్తూ, తప్పుదారి పట్టిస్తూ మైనింగ్ క్వారీ తవ్వకాలు కొనసాగిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ విషయమై మైనింగ్ అధికారులకు లేఖ రాసినా వారు స్పందించకపోవడంతో, జిల్లా అధికారులకు నివేదికలు పంపామన్నారు. కాగా కూటమి నాయకుడిగా చెలామణి అవుతున్న హరినాథ్ వ్యాపారాలకు కొందరు అధికారులు పరోక్షంగా మద్దతు ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

క్వారీ సిబ్బంది ధర్నా..

పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయం వద్ద క్వారీ సిబ్బంది ఆదివారం రాత్రి ధర్నా చేశారు. అవినీతి రేంజర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాయుడు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. ఫారెస్ట్, రెవెన్యూ అధికారులపై దాడి చేసిన కేసులో నలుగురు నిందితులతో పాటు యజమాని హరినాథ్‌పై కేసు నమోదు చేశారని చెప్పడంతో ఆందోళన విరమించారు.

వివాహేతర సంబంధం మహిళ ప్రాణాన్ని బలి తీసుకుంది

పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని పరస్పరం దాడి చేసుకున్న ఇరువర్గాలు

కొల్లా దుర్గ (ఫైల్)

చేబ్రోలు: వివాహేతర సంబంధం నేపథ్యంలో రేగిన చిచ్చు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం సుద్దపల్లిలో ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా సుద్దపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట మల్లేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తతో విభేదాల కారణంగా ఒంటరిగా కొడుకుతో కలిసి తెనాలిలోని సీఎం కాలనీలో ఉంటున్న కొల్లా దుర్గ(28)తో ఆరేళ్లుగా వివాహేతర సంబంధం నడుపుతున్నాడు. కొంతకాలంగా మల్లేష్‌కు, దుర్గకు మధ్య మనస్పర్థలొచ్చాయి. ఇవి కేసుల వరకు వెళ్లాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి మల్లేష్ ఇంటికి వెళ్లిన కొల్లా దుర్గతో అతని కుటుంబ సభ్యులు గొడవ పడ్డారు. ఆవేశంలో దుర్గతోపాటు మల్లేష్ కుటుంబ సభ్యులు పరస్పరం పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. ఈ ఘటనలో దుర్గకు 80శాతం శరీరం కాలిపోయింది. మల్లేష్ భార్య, పిల్లలతో సహా తొమ్మిది మందికి కాలిన గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ కొల్లా దుర్గ ఆదివారం ఉదయం మరణించింది.

కేసును పక్కదారి పట్టిస్తున్నారు

తన కుమార్తె దుర్గది ముమ్మాటికీ హత్యేనని ఆమె తల్లి ప్రతివాడ చిన్ని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తమ ఫిర్యాదును తీసుకోవడం లేదని ఆరోపించారు. మృతురాలి తల్లి, అక్కచెల్లెళ్లు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ దుర్గపై పెట్రోల్ పోసి నిప్పంటించి దారుణంగా చంపారని కన్నీరుమున్నీరయ్యారు.

రీ సర్వేను బహిష్కరిస్తాం

ఐక్యతను తెలియజేస్తున్న గ్రామ సర్వేయర్లు

- సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలే శరణ్యం
- గ్రామ సర్వేయర్ల అసోసియేషన్ అల్టిమేటం
- మెమోలు, షోకాజ్ వేధింపులు, సస్పెన్షన్లు ఆపకపోతే సహించేది లేదని హెచ్చరిక

తిరుపతి అర్బన్: గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 27 నుంచి భూముల రీ సర్వేను బహిష్కరిస్తామని గ్రామ సర్వేయర్ల అసోసియేషన్ హెచ్చరించింది. సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి ఆందోళనలకైనా సిద్ధమని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. ఆదివారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో మహాప్రస్థానం పేరిట రాష్ట్రస్థాయిలో గ్రామ సర్వేయర్ల సమావేశం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూరాడ మధుబాబు మాట్లాడుతూ.. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పరిష్కారం చూపాలనిడిమాండ్ చేశారు. లేదంటే పోరాటాలకు వెనుకాడేది లేదని తేల్చి చెప్పారు. నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేస్తున్నా చిన్నచిన్న సాకులు చూపిస్తూ పదేపదే మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేయడమే కాకుండా సస్పెన్షన్ విధించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. రీసర్వే విధుల్లో ఉంటున్న గ్రామ సర్వేయర్ల ప్రయాణ భత్యం, కరువు భత్యం, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.మహేష్‌నాయుడు మాట్లాడుతూ.. జాబ్ చార్టులకు విరుద్ధంగా జాయింట్ ఖాతాల తొలగింపు, పట్టాదారులను నిర్ణయించడం తదితర కీలక అంశాలు రెవెన్యూ అధికారులు చేయాల్సి ఉంటే బలవంతంగా సర్వేయర్లపై రుద్దడం తగదన్నారు. లాప్‌టాప్‌లు, రోవర్లు, స్టేషనరీ సరిపడినంతగా సరఫరా చేయకుండా ఇక్కట్లకు గురిచేస్తున్నారని వెల్లడించారు. రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో 4,722 మంది గ్రామ సర్వేయర్లను సర్వే సంబంధిత శాఖల్లో కౌన్సెలింగ్ విధానంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. గ్రేడ్–1కి సంబంధించి పదోన్నతులు 70శాతం ఇవ్వాల్సి ఉందని గుర్తుచేశారు. ఐదేళ్ల సర్వే పూర్తి చేసుకున్న వారికి కనీస బేసిక్ రూ.32 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సర్కారు బడులను బలోపేతం చేయాలి

ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య నేతలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పడిపోతోందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశాన్ని నిర్వహించి 'ప్రభుత్వ బడులను కాపాడుకుందాం' వంటి నినాదాలతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో విద్యార్థుల చేరికలు పూర్తిగా పడిపోతున్నాయన్నారు. 2021లో రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య 46 లక్షలు ఉండగా.. ఈ విద్యా సంవత్సరం 31.5 లక్షలకు పడిపోయిందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు జనవరి, ఫిబ్రవరి నెలల నుంచే అడ్మిషన్ల కోసం క్యాంపెయిన్ చేపడతాయన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం జూన్‌లో ఆ ప్రక్రియ చేపడుతోందన్నారు. దీనివల్ల నష్టం జరుగుతోందన్నారు. ప్రభుత్వం బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను వినియోగించాలని, సర్కార్ బడుల బలోపేతానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

టెట్ రద్దు కోరుతూ దేశవ్యాప్త సమ్మె

మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

పెనమలూరు: టెట్ రద్దు కోరుతూ దేశవ్యాప్త సమ్మె చేస్తామని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రకటించారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం పోరంకిలో ఆదివారం ఎస్టీయూ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దశాబ్దాల పాటు ఉద్యోగుల సర్వీసులో కొనసాగుతున్న వారిని ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్ష ఉత్తీర్ణులు కావాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సవరించాలని లేదా పార్లమెంట్‌లో విద్యా హక్కు సవరణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా శాఖ అధ్యక్షుడు పి.ఇమ్మానుయేల్, కార్యదర్శి యు.కృష్ణమూర్తి, ఉపాధ్యాయ వాణి చీఫ్ ఎడిటర్ శేఖర్ పాల్గొన్నారు.

ఉద్యోగులు బానిసలు కాదు

దేవరపల్లి సురేష్‌బాబు

అనితను పరామర్శిస్తున్న సురేష్‌బాబు

చల్లపల్లి: అధికారులు వ్యక్తిగత ద్వేషం, జులుం ప్రదర్శించడానికి ప్రభుత్వ కార్యాలయాలు వారి జాగీరు కాదని, ఉద్యోగులు బానిసలు కాదన్న విషయాన్ని గ్రహించాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు. పని భారం, ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కృష్ణాజిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళం పీహెచ్‌సీ స్టాఫ్‌నర్సు కాజ అనితను చల్లపల్లి ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం ఆయన పరామర్శించారు. ఆమెకు ధైర్యం చెప్పి వేధింపులకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సురేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో పలువురు అధికారులు దర్పం ప్రదర్శిస్తూ కింది ఉద్యోగులను వేధింపులకు గురిచేయటం బాధాకరమన్నారు. సమన్వయంతో పనిచేయించుకోవాలే తప్ప చీటికీ మాటికీ మెమోలు పేరుతో వేధించటం సరికాదన్నారు. అనిత ఎదుర్కొంటున్న వేధింపులపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బెంగళూరు గెలిస్తే నేరుగా ఫైనల్‌కు... నేడు ముంబై ఇండియన్స్‌తో 'ఢీ'

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) వరుస విజయాలకు బ్రేక్ పడినప్పటికీ నేరుగా ఫైనల్ చేరే అవకాశాలైతే బోలెడున్నాయి. ఇప్పటికే పాయింట్ల పట్టికలో 5 విజయాలతో అగ్రస్థానంలో ఉన్న ఆర్‌సీబీ జట్టు... డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌తో నేడు జరిగే మ్యాచ్‌లో గెలిస్తే ఎంచక్కా టైటిల్ పోరుకే అర్హత సాధిస్తుంది. ఐదు జట్ల మధ్య జరుగుతున్న ఈ లీగ్‌లో పాయింట్ల పట్టికలో 'టాప్'లో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్ చేరుకుంటుంది. మరోవైపు ముంబై ఇండియన్స్ నిలకడలేని ప్రదర్శనతో అగచాట్లు పడుతోంది. ఈ మ్యాచ్ ఆర్‌సీబీ కంటే ముంబైకే కీలకం కానుంది. ఇది కూడా ఓడితే ఓ రకంగా ప్లేఆఫ్స్ అవకాశాల్ని సంక్లిష్టం చేసుకుంటుంది. ఈ నేపథ్యంలో హర్మన్‌ప్రీత్ బృందం స్మృతి మంధాన సారథ్యంలోని బెంగళూరుకు వరుసగా మరో పరాజయాన్ని రుచి చూపించేందుకు బరిలోకి దిగుతోంది.

రాత్రి 7.30 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్ స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్, జియో హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

'పద్మభూషణ్' విజయ్ అమృత్‌రాజ్

- భారత టెన్నిస్ దిగ్గజానికి దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారం
- క్రికెటర్లు రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు 'పద్మశ్రీ'

సవిత

ప్రవీణ్

న్యూఢిల్లీ: తన ఆటతీరుతో అంతర్జాతీయ స్థాయిలో భారత టెన్నిస్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన విజయ్ అమృత్‌రాజ్‌ను కేంద్ర ప్రభుత్వం సముచితరీతిలో గౌరవించింది. 2026 సంవత్సరానికి ప్రకటించిన కేంద్ర పౌర పురస్కారాల్లో విజయ్ అమృత్‌రాజ్‌కు మూడో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మ భూషణ్' లభించింది. ఈసారి క్రీడా విభాగంలో మొత్తం తొమ్మిది మంది 'పద్మ' అవార్డులకు ఎంపికయ్యారు. క్రికెటర్లు రోహిత్ శర్మ (మహారాష్ట్ర), హర్మన్‌ప్రీత్ కౌర్ భుల్లర్ (పంజాబ్)... పారాథ్లెట్ ప్రవీణ్ కుమార్ (ఉత్తర ప్రదేశ్), భారత మహిళల హాకీ జట్టు గోల్‌కీపర్ సవితా పూనియా (హరియాణా), హాకీ కోచ్ బల్‌దేవ్ సింగ్ (పంజాబ్), యుద్ధకళల్లో వెటరన్ కోచ్‌లు భగవాన్‌దాస్ రైక్వార్ (మధ్య ప్రదేశ్), పజానివెల్ (పుదుచ్చేరి), జార్జియాకు చెందిన రెజ్లింగ్ కోచ్, దివంగత వ్లాదిమిర్ మెస్త్‌విరిష్‌విలిలకు 'పద్మశ్రీ' అవార్డులు లభించాయి. ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు గెలిచిన భారత రెజ్లర్లు యోగేశ్వర్ దత్, బజరంగ్ పూనియాలకు వ్లాదిమిర్ శిక్షణ ఇచ్చారు. 35 ఏళ్ల సవితా పూనియా భారత హాకీ జట్టుకు 308 మ్యాచ్‌ల్లో గోల్‌కీపర్‌గా వ్యవహరించింది. టోక్యో, రియో ఒలింపిక్స్‌లో పోటీపడింది. మూడుసార్లు అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ఉత్తమ గోల్‌కీపర్‌గా ఎంపికైంది. పారాథ్లెటిక్స్‌లో హైజంప్ ఈవెంట్‌లో ఆడే 22 ఏళ్ల ప్రవీణ్ రెండు ఒలింపిక్ పతకాలు సాధించాడు. టి64 కేటగిరీలో పోటీపడే ప్రవీణ్ 2024 పారిస్ పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకం, 2020 టోక్యో పారాలింపిక్స్‌లో రజత పతకం సాధించాడు. గత ఏడాది ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెల్చుకున్నాడు. 2022 ఆసియా పారా క్రీడల్లో బంగారు పతకం సొంతం చేసుకున్నాడు.

తమిళనాడుకు చెందిన 72 ఏళ్ల విజయ్ అమృత్‌రాజ్ అమెరికాలోని కాలిఫోర్నియాలో స్థిరపడ్డారు. 1970 నుంచి 1993 వరకు ఆయన ప్రొఫెషనల్ కెరీర్ సాగింది. విజయ్ 15 సింగిల్స్ టైటిల్స్, 13 డబుల్స్ టైటిల్స్ సాధించారు. ఓవరాల్‌గా 405 మ్యాచ్‌ల్లో గెలిచారు. 312 మ్యాచ్‌ల్లో ఓడిపోయారు. 1980లో కెరీర్ బెస్ట్ 18వ ర్యాంక్‌ను అందుకున్నారు. 13,30,503 డాలర్ల ప్రైజ్‌మనీ సంపాదించారు. టెన్నిస్‌లోని నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఆయన బరిలోకి దిగారు. 32 సార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఆడిన విజయ్ వింబుల్డన్‌లో రెండుసార్లు (1973, 1981), యూఎస్ ఓపెన్‌లో రెండుసార్లు (1973, 1974) క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. 2024లో అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు సంపాదించిన విజయ్... ప్రపంచ పురుషుల టీమ్ టెన్నిస్ టోర్నీ డేవిస్‌కప్‌లోనూ ఆకట్టుకున్నారు. డేవిస్‌కప్‌లో రెండుసార్లు (1974, 1987) భారత జట్టు రన్నరప్‌గా నిలవడంలో కీలకపాత్ర పోషించారు. 1983లో 'పద్మశ్రీ' పొందిన విజయ్‌కు 1974లో 'అర్జున అవార్డు' కూడా లభించింది. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్ర టెన్నిస్ సంఘం అధ్యక్షుడిగా ఉన్న విజయ్ హాలీవుడ్ సినిమాల్లోనూ నటించారు.

తన నాయకత్వ పటిమతో రోహిత్ శర్మ భారత క్రికెట్ జట్టుకు ఎన్నో గొప్ప విజయాలు అందించాడు. రోహిత్ కెప్టెన్సీలోనే టీమిండియా 2024లో టి20 ప్రపంచకప్ టైటిల్... 2025లో చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ సాధించింది. ఐపీఎల్‌లో రోహిత్ సారథ్యంలో ముంబై ఇండియన్స్ జట్టు ఐదుసార్లు విజేతగా నిలిచింది. 2024లో అంతర్జాతీయ టి20ల నుంచి, 2025లో టెస్టు క్రికెట్ నుంచి రిటైరైన రోహిత్ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 38 ఏళ్ల రోహిత్ భారత్ తరఫున 67 టెస్టులు ఆడి 4301 పరుగులు... 282 వన్డేలు ఆడి 11,577 పరుగులు... 159 టి20లు ఆడి 4231 పరుగులు సాధించాడు.

గత 17 ఏళ్లుగా భారత మహిళల క్రికెట్ జట్టులో సభ్యురాలిగా ఉన్న హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీలో గత ఏడాది టీమిండియా వన్డే వరల్డ్‌కప్ టైటిల్ గెలిచింది. స్వదేశంలో జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికా జట్టును ఓడించిన భారత్ తొలిసారి ఈ ఘనత సాధించింది. 36 ఏళ్ల హర్మన్ ఇప్పటి వరకు 6 టెస్టులు ఆడి 200 పరుగులు... 161 వన్డేలు ఆడి 4409 పరుగులు, 187 టి20లు ఆడి 3784 పరుగులు చేసింది. మూడు ఫార్మాట్‌లలో కలిపి 8 సెంచరీలు, 38 అర్ధ సెంచరీలు సాధించిన హర్మన్ 75 వికెట్లు కూడా పడగొట్టింది.

లక్ష్యం 154... 60 బంతుల్లోనే ఉఫ్...

- మూడో టి20లోనూ న్యూజిలాండ్‌పై భారత్‌దే గెలుపు
- టీమిండియా 3–0తో సిరీస్ సొంతం
- కూల్చేసిన బుమ్రా
- దంచేసిన అభిషేక్, సూర్య
- 28న విశాఖలో నాలుగో మ్యాచ్

అభిషేక్ శర్మ, సూర్యకుమార్

బుమ్రా

గువాహటి: న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై మూడు వన్డేల సిరీస్‌ను కోల్పోయిన టీమిండియా... ఐదు టి20ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే చేజిక్కించుకుంది. ఆదివారం జరిగిన మూడో టి20లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్ 8 వికెట్లతో కివీస్‌పై గెలుపొందింది. 3–0తో సిరీస్‌ను వశం చేసుకుంది. టాస్ నెగ్గిన టీమిండియా ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (40 బంతుల్లో 48; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. చాప్‌మన్ (23 బంతుల్లో 32; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ సాంట్నర్ (17 బంతుల్లో 27; 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. ప్రపంచకప్‌కు ముందు ప్రీమియం బౌలర్ బుమ్రా (3/17) తన పేస్ వాడి ఏంటో నిలకడగా చూపించాడు. హార్దిక్ పాండ్యా, రవి బిష్ణోయ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి గెలిచింది. అభిషేక్ శర్మ (20 బంతుల్లో 68 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు), కెప్టెన్ సూర్యకుమార్ (26 బంతుల్లో 57 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ షాతో స్టేడియాన్ని ఊపేశారు. బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. సిరీస్‌లోని నాలుగో మ్యాచ్ బుధవారం విశాఖపట్నంలో జరుగుతుంది.

అభి'షో'... 14 బంతుల్లో ఫిఫ్టీ!

తొలి బంతికే సామ్సన్ (0) క్లీన్‌బౌల్డ్... ఈ మ్యాచ్‌లో కివీస్ శిబిరం సంతోషించిన క్షణమిదే! తర్వాత గడిచిన క్షణాలు... పడిన బంతులు... వేసిన బౌలర్లు... పడిన పాట్లు... అన్ని ఇన్నీ కావు మరి! ఇషాన్ కిషన్ (13 బంతుల్లో 28; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మూడో బంతికి సిక్స్‌తో మొదలుపెట్టిన విధ్వంసం... అతను అవుటైనా కూడా ప్రతి ఓవర్లోనూ కొనసాగింది. ఓపెనర్ అభిషేక్, కెప్టెన్ సూర్యకుమార్ 'హైలైట్స్'నే ఇన్నింగ్స్ అసాంతం చూపించారు. అభి, ఇషాన్, సూర్య ముగ్గురు కలిసి 10 సిక్స్‌లు బాదారు. అంటే సగటున ఓవర్‌కు ఒక్కోటి వచ్చింది. బౌండరీలైతే 16! ఎంత సులువుగా వచ్చాయంటే! ప్రత్యర్థి ఫీల్డర్లు, బౌలర్లు మొత్తం 20 ఓవర్లు కష్టపడకుండానే సగం ఓవర్లతోనే ముగించేలా బౌండరీల భరతం పట్టారు భారత బ్యాటర్లు. ఈ క్రమంలో అభిషేక్ కేవలం 14 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. సూర్య 25 బంతుల్లో పూర్తి చేసుకున్నాడు. ఇద్దరు అబేధ్యమైన మూడో వికెట్‌కు కేవలం 40 బంతుల్లోనే 102 పరుగులు జోడించడం విశేషం. 3.1 ఓవర్లో 50 దాటిన భారత్ స్కోరు 6.3 ఓవర్లలో వందకు చేరుకుంది. 9.5 ఓవర్లలో 150ని సైతం అధిగమించింది.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) పాండ్యా (బి) హర్షిత్ 1; సీఫర్ట్ (బి) బుమ్రా 12; రచిన్ (సి) బిష్ణోయ్ (బి) పాండ్యా 4; ఫిలిప్స్ (సి) ఇషాన్ (బి) బిష్ణోయ్ 48; చాప్‌మన్ (సి) సామ్సన్ (బి) బిష్ణోయ్ 32; మిచెల్ (సి) ఇషాన్ (బి) పాండ్యా 14; సాంట్నర్ (సి) అభిషేక్ (బి) బుమ్రా 27; జేమీసన్ (బి) బుమ్రా 3; హెన్రీ (రనౌట్) 1; ఇష్ సోధి (నాటౌట్) 2; డఫీ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 153. వికెట్ల పతనం:** 1–2, 2–13, 3–34, 4–86, 5–112, 6–112, 7–132, 8–134, 9–144. **బౌలింగ్:** హర్షిత్ రాణా 4–0–35–1, హార్దిక్ పాండ్యా 3–0–23–2, రవి బిష్ణోయ్ 4–0–18–2, బుమ్రా 4–0–17–3, కుల్దీప్ 3–0–32–0, శివమ్ దూబే 2–0–24–0.

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (బి) హెన్రీ 0; అభిషేక్ శర్మ (నాటౌట్) 68; ఇషాన్ (సి) చాప్‌మన్ (బి) సోధి 28; సూర్యకుమార్ (నాటౌట్) 57; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (10 ఓవర్లలో 2 వికెట్లకు) 155. వికెట్ల పతనం:** 1–0, 2–53. **బౌలింగ్:** హెన్రీ 2–0–28–1, డఫీ 2–0–38–0, జేమీసన్ 1–0–17–0, ఇష్ సోధి 2–0–28–1, సాంట్నర్ 2–0–28–0, ఫిలిప్స్ 1–0–16–0.

విదర్భపై ఆంధ్ర ఘనవిజయం | ముంబై చేతిలో హైదరాబాద్ ఓటమి

ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్, జొకోవిచ్, సబలెంకా

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

పదితోనే ఆర్‌బీఐలో కొలువు

ఆర్‌బీఐ జాబ్స్

- » 572 ఆఫీస్ అటెండెంట్ పోస్టులకు నోటిఫికేషన్
- » పదో తరగతి ఉత్తీర్ణతతో పోటీ పడొచ్చు
- » ప్రారంభంలోనే నెలకు రూ.46వేల వేతనం

సర్కారీ కొలువు కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. పదో తరగతి అర్హతతోనే కేంద్ర బ్యాంకులో ఉద్యోగం సొంతం చేసుకోవచ్చు. ఆర్‌బీఐ 572 ఆఫీస్ అటెండెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత పరీక్ష ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు రూ.46 వేల వేతనం అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఆర్‌బీఐలో ఉద్యోగాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

పదో తరగతి అర్హతతోనే ప్రభుత్వ ఉద్యోగానికి పోటీపడే అవకాశం వచ్చింది. అదీకూడా కేంద్ర బ్యాంకు ఆర్‌బీఐలో కొలువు. దీనికి ఉన్నత విద్యార్హతలున్న వారు అర్హులు కాదు. కాబట్టి పోటీ కూడా తక్కువగానే ఉంటుందని చెప్పొచ్చు. నోటిఫికేషన్‌లోనే పరీక్ష తేదీ కూడా ప్రకటించారు. మరో 40 రోజుల్లోనే (ఫిబ్రవరి 28, మార్చి 1) పరీక్ష నిర్వహించనున్నారు. కాబట్టి ఇప్పటినుంచే పక్కా ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే పోటీలో నిలిచే అవకాశం ఉంటుంది.

- **పోస్టు పేరు:** ఆఫీస్ అటెండెంట్
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 572

అర్హతలు

- సంబంధిత రాష్ట్రం/యూటీ నుంచి పదో తరగతి(ఎస్ఎస్‌సీ/మెట్రిక్యులేషన్) ఉత్తీర్ణత ఉండాలి. ఉన్నత విద్యార్హతలు కలిగిన వారు అర్హులు కాదు.
- **వయసు:** 01.01.2026 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

ప్రారంభంలోనే నెలకు రూ.46,029 వేతనం అందుతుంది. దీనికి హెచ్‌ఆర్‌ఏ అదనం. పని తీరు, అర్హతలు, అంతర్గత పరీక్షల ద్వారా బ్యాంకులో పదోన్నతుల ద్వారా ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. ఆర్‌బీఐలో ఆఫీస్ అటెండెంట్ అనేది గ్రూప్4 పోస్టులు. దీనికి ఎంపికైన వారు ఆఫీస్ ఫైల్స్, రికార్డులు, ఇతర ఉపకరణాల నిర్వహణ,ఒకచోటు నుంచి మరోచోటుకు తీసుకెళ్లడం, కార్యాలయం లేదా సదరు విభాగం తెరవడం, మూసివేత తదితర బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ఎంపిక విధానం

ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభ, లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్టుల ఆధారంగా ఎంపిక చేస్తారు. అభ్యర్థులు ఏ బ్రాంచ్‌లోని ఖాళీలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే సంబంధిత శాఖ/కార్యాలయం ఉన్న ప్రాంత స్థానిక భాషలో మాట్లాడటం, రాయడం, చదవడం వచ్చి ఉండాలి. ఇందుకోసం నిర్వహించే లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్టులో అర్హత సాధించాల్సి ఉంటుంది.

120 మార్కులకు పరీక్ష

ఆన్‌లైన్ విధానంలో మొత్తం 120 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో నాలుగు విభాగాల నుంచి ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. రీజనింగ్‌లో 30 ప్రశ్నలు–30 మార్కులకు, జనరల్ ఇంగ్లిష్ 30 ప్రశ్నలు– 30 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్ 30 ప్రశ్నలు–30 మార్కులకు, న్యూమరికల్ ఎబిలిటీ 30 ప్రశ్నలు– 30 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కు తగ్గిస్తారు. ప్రతి విభాగంలోనూ కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. కనీస అర్హత మార్కులు సాధించిన వారి జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్టుకు ఎంపిక చేస్తారు. ఇందులోనూ ప్రతిభ చూపితే మెడికల్ టెస్టులు, ధ్రువపత్రాల పరిశీలన అనంతరం తుది ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 15.01.2026
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 04.02.2026
- **పరీక్ష తేదీలు:** 2026, ఫిబ్రవరి 28, మార్చి 1
- **వెబ్‌సైట్:** https://www.rbi.org.in

అధ్యాపక వృత్తికి 'సెట్'

- » ఏపీ సెట్ నోటిఫికేషన్ విడుదల
- » అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ లెక్చరర్ పోస్టులకు అర్హత పరీక్ష
- » పీజీ ఉత్తీర్ణతతో దరఖాస్తు చేసుకునే అవకాశం
- » మొత్తం 30 సబ్జెక్టులలో సెట్ నిర్వహణ
- » ఒక సారి స్కోర్ పొందితే శాశ్వత గుర్తింపు

ఏపీ సెట్ 2026

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబిటీ టెస్ట్.. సంక్షిప్తంగా ఏపీ సెట్. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి.. ఆంధ్రప్రదేశ్‌లో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టాలనుకునే వారికి చక్కటి మార్గం. భవిష్యత్తులో ఏపీలోని వర్సిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్స్, అదే విధంగా యూనివర్సిటీ స్థాయిలో అసిస్టెంట్ ప్రొఫెసర్స్ నియామకాల్లో సెట్ ఉత్తీర్ణత ఉంటేనే దరఖాస్తుకు అనుమతి లభిస్తుంది. తాజాగా.. ఏపీ సెట్ 2025 నోటిఫికేషన్ విడుదలైంది. మార్చి 28, 29 తేదీల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. ఏపీ సెట్-2025తో ప్రయోజనాలు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్తులో నిర్వహించే లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర స్థాయిలోనే ఏపీ సెట్‌ను నిర్వహించనున్నారు. దీనికి యూజీసీ నుంచి అనుమతి లభించింది.

అర్హతలు

సంబంధిత సబ్జెక్ట్‌తో పీజీలో జనరల్ కేటగిరీ అభ్యర్థులు 55 శాతం మార్కులతో, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. ✦ పీజీ చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా అర్హులే. అయితే సెట్ ఫలితాల సమయానికి నిర్దేశిత శాతంలో ఉత్తీర్ణత సాధించాలి.

✦ **వయసు:** ఎలాంటి వయో పరిమితి లేదు.

మొత్తం 30 సబ్జెక్టులు

ఏపీ సెట్ నోటిఫికేసన్ ప్రకారం– 30 సబ్జెక్టులలో ఏపీ సెట్‌ను నిర్వహించనున్నారు. జాబితాలో ఉన్న సబ్జెక్టుల వివరాలు.. ఆంత్రోపాలజీ, హిస్టరీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఎర్త్ అట్మాస్పియరిక్ ఓసియన్ అండ్ ప్లానెటరీ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జాగ్రఫీ, హిందీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, లా, లైఫ్ సైన్సెస్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మేనేజ్‌మెంట్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సంస్కృతం, సోషియాలజీ, సోషల్ వర్క్, ఉర్దూ, తెలుగు, విజువల్ ఆర్ట్స్.

రెండు పేపర్లు.. 300 మార్కులు

✦ ఏపీ సెట్‌ను రెండు పేపర్లుగా 300 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో–పేపర్–1 టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు–100 మార్కులకు, పేపర్–2 సబ్జెక్ట్ పేపర్ 100 ప్రశ్నలు – 200 మార్కులకు ఉంటాయి. వీటిల్లో –పేపర్–1 అభ్యర్థులందరికీ ఉమ్మడి పేపర్‌గా ఉంటుంది. పేపర్–2ను మాత్రం అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నలతో రూపొందిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. పేపర్–1కు గంట, పేపర్–2కు రెండు గంటల సమయం అందుబాటులో ఉంటుంది.

✦ సబ్జెక్ట్ పేపర్స్‌కు సంబంధించి.. కామర్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ పేపర్లను ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో అందిస్తారు. లాంగ్వేజ్ మినహా మిగతా సబ్జెక్టులకు సంబంధించి ఇంగ్లిష్‌లోనే ప్రశ్న పత్రం ఉంటుంది.

స్కోర్‌కు శాశ్వత గుర్తింపు

రాష్ట్రంలోని యూనివర్సిటీలు, డిగ్రీ కళాశాలల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులకు అర్హత పరీక్ష ఏపీ సెట్. ఈ పరీక్ష స్కోర్‌కు జీవిత కాలం గుర్తింపు ఉంటుంది. అంటే ఏపీ సెట్‌లో ఒక సారి అర్హత సాధిస్తే.. భవిష్యత్తులో అన్ని నియామకాలకు పోటీ పడొచ్చు.

ఆరు శాతం మందికే ఉత్తీర్ణత

ఏపీ సెట్ విషయంలో అభ్యర్థులు గుర్తించాల్సిన మరో ముఖ్యమైన విషయం.. మొత్తం అభ్యర్థుల్లో ఆరు శాతం మందినే ఉత్తీర్ణులుగా ప్రకటించే విధానం. నిర్దేశిత విధానం ప్రకారం.. మొత్తం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ఆరు శాతం మందిని మాత్రమే ఉత్తీర్ణులుగా ప్రకటిస్తారు. మొత్తంగా చూస్తే లక్ష మంది పోటీ పడితే.. ఆరు వేల మంది మాత్రమే అర్హత సాధిస్తారు. జనరల్/ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 40 శాతం, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు సాధించాలి. అప్పుడే తుది విజేతలను ప్రకటించే క్రమంలో పరిగణిస్తారు.

బెస్ట్ స్కోర్‌కు మార్గమిదే

కేవలం ఆరు శాతం మందిని మాత్రమే విజేతలుగా ప్రకటించే ఏపీ సెట్‌లో.. విజయం సాధించాలంటే.. అభ్యర్థులు పరిశోధనల పట్ల తమకున్న ఆసక్తి మొదలు, సబ్జెక్ట్ పరంగా సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవడం ముఖ్యం.

పేపర్-1

రెండు కేటగిరీల అభ్యర్థులందరికీ ఉమ్మడి పేపర్‌గా నిర్దేశించిన పేపర్–1లో అభ్యర్థుల్లోని టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాలు (టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్– గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు అడుగుతారు.

పేపర్-2.. సబ్జెక్ట్ సంబంధిత ప్రశ్నలు

✦ పేపర్–2లో అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్ నుంచే ప్రశ్నలు అడుగుతారు. ఇందులో ప్రశ్నలు.. పీజీ స్పెషలైజేషన్ సిలబస్ స్థాయిలో ఉంటాయి. అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు అన్ని అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

✦ ఆయా అంశాలను చదివేటప్పుడే అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌తో అభ్యసించడం ఎంతో ముఖ్యం. కారణం.. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానం ఇచ్చేటప్పుడు ప్రాక్టికల్ థింకింగ్, అప్లికేషన్ ఓరియెంటేషన్‌లు ఎంతో అవసరమవుతున్నాయి. క్రిటికల్ థింకింగ్, అనలిటికల్ అప్రోచ్ అలవరచుకుంటే.. ప్రశ్నలు ఏ తీరులో అడిగినా సమాధానాలు ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2026, ఫిబ్రవరి 9
- ✦ **ఏపీ సెట్ తేదీలు:** 2026, మార్చి 28, 29
- ✦ **పరీక్ష కేంద్రాలు:** ఏపీలోని అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాలు
- ✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.apset.net.in

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 350 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ (రిక్రూట్‌మెంట్–ప్రమోషన్).. సెంట్రల్ ఆఫీస్ రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 350.
- » **పోస్టుల వివరాలు:** ఫారెన్ ఎక్స్ఛేంజ్ ఆఫీసర్ (స్కేల్–3)–50, మార్కెటింగ్ ఆఫీసర్ (స్కేల్–1)–300.
- » **అర్హత:** పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్/మాస్టర్స్ డిగ్రీ, ఎంబీఏ/పీజీడీఎం ఉత్తీర్ణులవ్వాలి. ఫారెన్ ఎక్స్ఛేంజ్ ఆఫీసర్‌కు ఫారెక్స్/ట్రేడ్ ఫైనాన్స్‌లో బ్యాంకింగ్ అనుభవం తప్పనిసరిగా ఉండాలి. మార్కెటింగ్ ఆఫీసర్‌కు మార్కెటింగ్ స్పెషలైజేషన్‌తో బీఎఫ్ఎస్ఐ రంగంలో అనుభవం అవసరం.
- » **వయసు:** స్కేల్–3 పోస్టులకు 30 నుంచి 38 ఏళ్లు, స్కేల్–1 పోస్టులకు 23 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **పే స్కేల్:** స్కేల్–3 పోస్టులకు రూ.1,05,280, స్కేల్–1 పోస్టులకు రూ.85,920.
- » **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష/పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 20.01.2026
- » **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 03.02.2026
- » **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** ఫిబ్రవరి/మార్చి 2026.
- » **ఇంటర్వ్యూ తేదీలు:** మార్చి/ఏప్రిల్ 2026.
- » **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియాలో 90 పోస్టులు

న్యూఢిల్లీలోని సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియా 2026–27 సంవత్సరానికి సంబంధించి ఒప్పంద ప్రాతిపదికన లా క్లర్క్ కమ్ రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 90.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(లా) ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు న్యాయవాదిగా నమోదు కోసం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొంది ఉండాలి.
- » **వయసు:** 07.02.2026 నాటికి 20 ఏళ్లలోపు ఉండాలి, 32 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రూ.1,00,000.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష(సీబీటీ), ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 20.01.2026.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.02.2026.
- » **వెబ్‌సైట్:** https://www.sci.gov.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: పర్యావరణం » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: భూగోళశాస్త్రం
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: జనరల్ ఇంగ్లిష్

What are the effects of the Continued extraction of ores?

CHAPTER - 5
MINERALS AND ENERGY RESOURCES

KEY POINTS

- Silica, limestone, aluminium oxide and phosphate are abrasive minerals.
- Fluoride comes from a mineral called fluorite.
- Titanium oxide is used to make toothpaste white.
- Our mineral intake is only 0.3%.
- Without minerals, the body cannot use 99.7% of food.
- A mineral is a natural, solid substance with a fixed structure.
- Rocks are made of minerals.
- About 2000 minerals are known.
- Minerals are found in ores.
- Small mineral deposits are called veins.
- Large mineral deposits are called lodes.
- Ocean water has salt, magnesium and bromine.
- Ocean floors have manganese nodules.
- A long narrow mining tunnel is called a rat-hole.
- Coal mining in Jowai and Cherrapunjee (Meghalaya) uses rat-hole mining.
- The National Green Tribunal banned rat-hole mining.
- Peninsular rocks have coal, metals and mica.
- Gujarat and Assam have petroleum deposits.
- A mineral becomes a mine when it is useful and in demand.
- India exports many ferrous minerals.
- Iron ore is important for industries.
- Magnetite is the best quality iron ore.
- Hematite is the main industrial iron ore.
- Odisha and Chhattisgarh are major iron ore states.
- Kudre means horse in Kannada.
- Bailadila means hump of an ox.
- Iron ore is exported to Japan and South Korea through Visakhapatnam.
- Kudremukh has one of the largest iron ore deposits.
- Manganese is used to make steel and alloys.
- Copper, bauxite, lead, zinc and gold are non-ferrous minerals.
- Non-ferrous minerals are used in engineering and electrical work.
- India does not have enough copper reserves.
- Copper is soft, flexible and conducts electricity well.
- Copper is used in electrical and electronic industries.
- Major copper mines are in Balaghat, Khetri and Singhbhum.
- Bauxite is a clay-like mineral used to make aluminium.
- Odisha has the largest bauxite deposits, mainly in Panchpatmali.

4 MARKS QUESTIONS

1. Explain the Minerals occur in the igneous and metamorphic rocks.

A. 1. Minerals may occur in the cracks, crevices, faults or joints.
2. The smaller occurrences are called veins.
3. The larger occurrences are called lodes.
4. Magma cool and solidify as they rise forming mineral deposits.
5. Eg: tin, copper, zinc and lead.

2. Write about Sedimentary minerals / rocks.

1. Several minerals occur in beds or layers.
2. They formed by deposition, accumulation and concentration.
3. Coal and iron ore have been concentrated because of long periods under great heat and pressure.
4. Another group of sedimentary minerals include gypsum, potash salt and sodium salt.
5. These are formed because of evaporation.

3. What are 'Placer deposits'.

1. Minerals may occur as alluvial deposits in the base of hills.
2. These generally contain heavy minerals.
3. They are not corroded by water.
4. Eg: Gold, silver, tin and platinum.

4. Write about Copper.

1. India is deficient in the reserve and production of copper.
2. Copper is malleable, ductile and a good conductor
3. Copper is used in electrical, electronics, chemical industries.
4. Leading copper mines are Balaghat, Khetri & Singhbhum.

5. Write about Rat-Hole Mining.

1. Mining in a long narrow tunnel, known as 'Rat hole'.
2. Many tribal individuals owned the minerals in north-east India.
3. In Meghalaya, there are coal, iron ore, limestone and dolomite.
4. Coal mining in Jowai and Cherapunjee is done by 'Rat hole'.
5. National Green Tribunal declared Rat hole mining is illegal.

6. What are the major iron ore belts in India?

1. Maharashtra-Goa belt.
2. Ballari-Chitradurga-Chikkamagaluru-Tumakuru belt.
3. Durg-Bastar-Chandrapur belt.
4. Odisha-Jharkhand belt.

7. Give examples for Non-metallic minerals.

1. Mica	5. Salt
2. Potash	6. Sulphur
3. Granite	7. Limestone
4. Marble	8. Sandstone

8. What are the features of Mica?

1. Has excellent di-electric strength
2. Low power loss factor
3. Insulating properties
4. Resistance to high voltage
5. Mica is one of the most indispensable minerals

9. Write about non-Ferrous Minerals.

1. Non-ferrous minerals production is low in India.
2. Non-ferrous minerals: copper, bauxite, lead, zinc and gold.
3. Non-ferrous minerals are used in metallurgical, engineering and electrical industries.

10. What are the features of Aluminium?

1. It combines the strength of metals such as iron.
2. Extreme lightness.
3. Good conductivity.
4. Great malleability.

11. What are the uses of Coal?

1. For power generation.
2. To supply energy to industry.
3. To supply energy for domestic needs.

12. Write about Lignite coal.

1. Lignite is a low-grade brown coal.
2. It is soft with high moisture content.
3. The principal lignite reserves are in Neyveli in Tamil Nadu.

13. What are the Tidal Energy areas in India?

1. The Gulf of Khambhat
2. The Gulf of Kuchchh (Gujarat)
3. Gangetic delta in Sundarban regions(West Bengal)

14. What are the effects of the Continued extraction of ores?

1. Leads to increasing costs
2. We must dig greater depths.
3. Decrease the quality of minerals.

15. Write about Hazira-Vijaipur- Jagdishpur (HVJ) pipeline.

1. Hazira-Vijaipur-Jagdishpur is the first gas pipeline in India.
2. Its length is 1,700 kms.
3. HVJ pipeline was constructed by GAIL.
4. It was linked to Mumbai High and Bassein gas fields.

16. Write about Hydro electricity.

1. Hydro electricity is generated by fast flowing water.
2. Hydro electricity is a renewable resource.
3. Hydro electricity projects are Bhakra Nangal, Damodar etc.

17. Write about Non-Conventional Sources of Energy.

1. Renewable energy sources are solar energy, wind, tide etc.
2. These are called non-conventional energy sources.
3. India has abundance of sunlight, water, wind and biomass.

18. Write about the Solar Energy in India.

1. India has enormous possibilities of tapping solar energy.
2. Photovoltaic technology converts sunlight into electricity.
3. Solar energy is fast becoming popular in rural areas.

19. Write about the Wind power / energy sources in India.

1. India has great potential of wind power.
2. The largest wind farm cluster is in Tamil Nadu.
3. Andhra Pradesh, Karnataka have important wind farms.
4. Nagercoil and Jaisalmer are known for effective use of wind

20. Write about Nuclear or Atomic Energy.

1. Nuclear is obtained by altering the structure of atoms.

Continued on next page..

2. Here energy is released in the form of heat.
3. It is used to generate electric power.
4. Uranium and Thorium are used for generating nuclear power.
5. They are available in Jharkhand and the Aravalli ranges.
6. The Monazite sands of Kerala is also rich in Thorium.

21. Write about Biogas energy sources in India.

1. Animal and human waste are used to produce biogas.
2. Decomposition of organic matter yields gas.
3. It has higher thermal efficiency than kerosene, dung cake.
4. The plants using cattle dung are known as 'Gobar gas plants'.
5. These provide energy and manure.
6. Biogas is by far the most efficient use of cattle dung.

22. Write about Tidal Energy sources in India.

1. Oceanic tides can be used to generate electricity.
2. Floodgate dams are built across inlets.
3. During high tide water flows into the inlet and gets trapped.

23. Write about Geo-thermal Energy sources in India.

1. Electricity produced by using the heat from the earth's interior.
2. The Earth grows hotter with increasing depth.
3. The hot springs steam is used to generate electricity.
4. There are several hundred hot springs in India.
5. Two experimental projects have been set up in India.
   i. The Parvati valley near Manikarn in Himachal Pradesh.
   ii. The Puga Valley, Ladakh.

24. Write about Iron Ore.

1. Iron ore is the backbone of industrial development.
2. Magnetite is the finest iron ore.
3. Magnetite has excellent magnetic qualities.
4. Hematite ore is the most important industrial iron ore.
5. Hematite has a slightly lower iron content than magnetite.
6. Iron ore producing states : Odisha, Chhattisgarh, Karnataka.
7. The remaining production (3%) was from other states.

25. Write about Bauxite.

1. Bauxite is a clay-like substance.
2. From bauxite alumina and aluminium are obtained
3. Bauxite is formed by the decomposition of aluminium silicates.
4. Bauxite deposits are found in the Amarkantak plateau, Maikal hills.
5. Odisha is the largest bauxite producing state.
6. Panchpatmali deposits in Koraput district are the most important bauxite deposits in the state.

26. What are the impacts of mining on the health of the miners and the environment?

1. The dust and noxious fumes spread in these regions.
2. It leads the miners vulnerable to pulmonary diseases.
3. The risk of collapsing mine roofs, inundation occurs regularly.
4. Fires in coalmines are a constant threat to miners.
5. The water sources get contaminated due to mining
6. Dumping of waste and slurry leads to degradation of land, soil.
7. It increases stream and river pollution.
8. Thus, mining is also known as "killer industry".

27. Write about energy resources.

1. Energy can be generated from fuel minerals.
2. Firewood and cattle dung cake are most common in rural India.
3. More than 70% energy requirement in rural households is met by Firewood and cattle dung cake.
4. Using dung cake too is being discouraged.
5. Dung cake consumes most valuable manure.

28. Write about Petroleum availability in India.

1. Petroleum is the next major energy source after coal.
2. It provides fuel for heat and lighting.
3. It provides lubricants for machinery.
4. It provides raw materials for many manufacturing industries.
5. It is available in Mumbai High, Gujarat and Assam.
6. Ankleshwar is the most important field of Gujarat.
7. Assam is the oldest oil producing state of India.
8. Digboi, Naharkatiya are the important oil fields in Assam.

29. What are the uses of Natural Gas?

1. Natural Gas is found with petroleum deposits.
2. It can be used as a domestic and industrial fuel.
3. It is used as fuel in power sector to generate electricity
4. It is used for heating purpose in industries.
5. It is used in chemical, petrochemical and fertilizer industries
6. It is used as transport fuel and as cooking fuel.
7. It is found in Mumbai High, Cambay and Krishna-Godavari basins.
8. It provided impetus to Indian gas market development.

30. What are the advantages of solar energy?

1. It is renewable.
2. It is free once we install panels.
3. It does not cause pollution.
4. It is available everywhere in India.
5. It reduces electricity bills.
6. It helps fight climate change.

31. Distinguish between conventional and non-conventional sources of energy

Conventional sources of energy	**Non-conventional sources of energy**
1. They are non-renewable.	1. They are renewable.
2. They come from fossil fuels.	2. They come from nature.
3. They cause pollution.	3. They don't cause pollution.
4. Coal, oil, and natural gas.	4. Solar, wind, tidal, biomass.

32. What is a mineral?

1. Geologists define mineral as a "homogeneous, naturally occurring substance with a definable internal structure."
2. Rocks are combinations of homogeneous substances called minerals.
3. Nearly 2000 minerals have been identified.

33. How are minerals formed in igneous and metamorphic rocks?

1. The minerals in igneous rocks are formed from the magma.
2. Minerals may occur in the cracks, crevices, faults or joints.
3. The smaller occurrences are called veins.
4. The larger occurrences are called lodes.
5. They cool and solidify as they rise.
6. Eg: Tin, copper, zinc and lead.

34. Write about the thermal power plants in Andhra Pradesh.

1. Simhadhri Super Thermal Power Project.
2. Vijjeswaram Thermal Power Project.
3. Nellore Thermal Power Station.
4. GVK Jegurupadu Power plant.
5. Vemagiri Power Generation Limited.
6. Rayalaseema Thermal Power Station.
7. Vijayawada Thermal Power Station.

35. Why do we need to conserve mineral resources ? / Explain the need for conserving mineral resources.

1. Mineral resources found on the earth surface are limited.
2. We are rapidly consuming mineral resources.
3. Minerals required millions of years to be created.
4. The geological process of mineral formation is so slow.
5. Mineral resources are finite and non-renewable.
6. So, we need to conserve the mineral resources.

36. Describe the distribution of coal in India.

1. The major resources of Gondwana coal are in Damodar valley.
2. Jharia, Raniganj, Bokaro are important coalfields.
3. Godavari, Mahanadi, Son and Wardha valleys contain coal.
4. Tertiary coals occur in the north-eastern states.
5. Coal loses weight on use as it is reduced to ash.
6. Heavy industries and thermal power stations are located near the coalfields.

37. Why do you think that solar energy has a bright future in India?

1. India is located on either side of the Tropic of Cancer.
2. India has enormous possibilities of tapping solar energy.
3. Solar energy is fast becoming popular in rural areas.
4. India has many sunny days a year.
5. It can help India reduce its dependence on fossil fuel.
6. Solar energy is a clean and renewable source of energy.
7. It can replace firewood and dung cakes.
8. This helps conserve the environment.
9. It ensures a sufficient supply of manure for agriculture.

Prepared by
K. Suresh,
Subject Expert

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. Arrange the following in chronological order
I. Russian revolution
II. Formation of United Nations Organisation
III. Great Depression
IV. Versailles Treaty
A) I, III, II, IV B) I, IV, III, II
C) II, III, I, IV D) I, IV, II, IV

2. One of the following was not a demand of Soviets
A) Preserve peace
B) Control of prices
C) Nationalisation of banks
D) rapid industrialisation

3. Identify correct match
A) Hitler- Fascism
B) Mussolini- Nazism
C) George Orwell- Animal farm
D) Roosevelt- UNO

4. By this Hitler established dictatorship in Germany
A) Enabling Act B) Gestapo
C) Secret police D) Work creation programmes

5. One of the following is not the reason for world wars
A) Militarism B) Versailles treaty
C) Nationalism D) Imperialism

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

గతవారం (22-12-25 నుంచి 26-12-25 వరకు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
112	76
85,041	26,042

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,511	▲	75
డోజోన్స్	49,112	▽	271
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,143	▽	7
డాక్స్	24,900	▲	44
షాంఘై	4,136	▲	13
నికాయ్	53,847	▲	158

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	91.10	92.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	121.50	124.55
€	యూరో	ఎస్‌బీఐ	105.70	108.50
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.14	58.52
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	60.07	63.98
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	69.10	72.82
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.54	25.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	24.06	25.32
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.26	14.09

విశ్రాంత జీవనంలోనూ ‘ఫండి’ంచొచ్చు!

స్టాక్ మార్కెట్ పెట్టుబడులంటేనే కాస్త టెన్షన్. ఎందుకంటే ఇక్కడ రాబడుల వెనకాల రిస్కూ ఉంటుంది. వయసులో ఉన్నవారికైతే ఓకే. మార్కెట్లు పడినా కొన్నాళ్లు వేచిచూస్తే మళ్లీ సర్దుకుంటాయి. మరి రిటైరీల మాటేంటి? నెలవారీ ఆదాయంతోనే నెట్టుకురావాల్సిన సీనియర్ సిటిజన్లు ఈ టెన్షన్లతో సుఖవంతమైన జీవితాన్ని ఆస్వాదించటం సాధ్యమా? అలాగని ఎఫ్‌డీలపైనే ఆధారపడితే అంతకంతకూ వడ్డీ రేట్లు తగ్గుతూ పోతున్నాయి. పైపెచ్చు జీవన వ్యయాలు, వైద్యం ఖర్చుల్లాంటివి పెరిగిపోతున్నాయి. మరి విశ్రాంత జీవనం గౌరవప్రదంగా, ఆర్థికంగా స్వేచ్ఛతో సాగించాలంటే దారేంటి? ద్రవ్యోల్బణాన్ని మించి కాకపోయినా బ్యాంకు ఎఫ్‌డీలకన్నా మెరుగైన రాబడి అందించే సాధనాలు ఏమున్నాయి? మ్యుచువల్ ఫండ్స్ వైపు మళ్లొచ్చా? అసలు సీనియర్ సిటిజన్లకు అవి మంచివేనా అనే ప్రశ్నలకు అంత తేలిగ్గా సమాధానాలు దొర కవు. కాకపోతే ఆచి తూచి, సరైన వ్యూహంతో ఎంచుకుంటే సీనియర్ సిటిజన్లకూ ఫండ్స్ ప్రయోజనకరంగానే ఉంటాయనేది నిపుణుల మాట. దాన్ని వివరించే ప్రయత్నమే ఈ వెల్త్ స్టోరీ....

- ఫండ్లకు కొంత కేటాయిస్తే మెరుగైన ఆదాయం
- స్థిరమైన ఆదాయానికి ఎఫ్‌డీలు తప్పనిసరి
- అత్యవసరమైతే తీసుకునేలా సేవింగ్స్‌లోనూ కొంత
- ఒకచోట తక్కువ వచ్చినా మరోచోట ఎక్కువ రాబడి
- ప్రశాంతమైన జీవితానికి డైవర్సిఫికేషన్ తప్పనిసరి
- సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ ద్వారా నెలవారీ మొత్తం

పోర్ట్‌ఫోలియో ఇలా..

ఖర్చులకు తగ్గట్లుగా రాబడిని పొందాలంటే అందుకు అనుగుణమైన విధంగా పెట్టుబడులూ ఉండాలి. ముందే అనుకున్నట్లుగా బ్యాంక్ ఎఫ్‌డీల మీదే ఆధారపడే పరిస్థితి ఉండదు కాబట్టి, మ్యూచువల్ ఫండ్స్ దన్నుతో పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను వైవిధ్యంగా తీర్చిదిద్దుకోవాలి.



సీనియర్ సిటిజన్లకు పెట్టుబడి ఆప్షన్లు..

- **బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీములు – స్థిరత్వం కోసం**
  ఇవి పెట్టుబడులకు భద్రతనిచ్చేలా, రాబడులు అంచనాలకు తగ్గట్లుగా ఉంటాయి. క్రమం తప్పకుండా వడ్డీ ఆదాయం వస్తుంది. కాకపోతే పెరిగే ధరలకు తగ్గ స్థాయిలో రాబడి ఉండక పోవచ్చు. కాబట్టి పోర్ట్‌ఫోలియోలో వీటికి 30–40 శాతం పెట్టుబడిని కేటాయించవచ్చు.
- **డెట్ మ్యూచువల్ ఫండ్స్**
  వీటిలో వివిధ కేటగిరీలున్నా.. సీనియర్ సిటిజన్లకు ఈ కిందివి అనువైనవిగా ఉంటాయి.
  - సంప్రదాయ హైబ్రిడ్ ఫండ్స్
  - స్వల్పకాలిక ఫండ్స్
  - కార్పొరేట్ బాండ్ ఫండ్స్

వీటిని ఎందుకు పరిశీలించవచ్చంటే, ఇవి ఎఫ్‌డీలతో పోలిస్తే పన్నుల అనంతరం మరింత మెరుగైన రాబడిని అందిస్తాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు నగదు కింద మార్చుకునే (లిక్విడిటీ) వీలుంటుంది. విత్‌డ్రాయల్ సులభతరంగా ఉంటుంది. వీటికి 30–35 శాతం కేటాయించవచ్చు.

- **ఎస్‌డబ్ల్యూపీ (సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్) – పొదుపు మొత్తం నుంచి నెలవారీ జీతం**

ఎస్‌డబ్ల్యూపీ అనేది మ్యుచువల్ ఫండ్స్ నుంచి ప్రతి నెలా ఇంత మొత్తాన్ని విత్‌డ్రా చేసుకునేందుకు వీలు కల్పిస్తుంది. దీన్ని పెన్షనో లేదా శాలరీగానో అనుకోవచ్చు. వడ్డీ ఆదాయంతో పోలిస్తే దీనిపై పన్ను ప్రయోజనాలు పొందవచ్చు. ఎంత విత్‌డ్రా చేసుకోవాలనేది ఎప్పటికప్పుడు మార్చుకోవచ్చు. డెట్ లేదా కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్‌తో కలిపి ఉపయోగించుకోవచ్చు.

- **ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ – పరిమిత స్థాయిలోనే, కాకపోతే కీలకం**

సీనియర్ సిటిజన్స్ అయినంత మాత్రాన షేర్లకు పూర్తిగా దూరంగా ఉండాల్సిన పనిలేదు. లార్జ్ క్యాప్ లేదా ఇండెక్స్ ఫండ్స్ లాంటివి ఎంచుకోవచ్చు. పెట్టుబడుల్లో 10–20 శాతానికి మించకుండా ఈక్విటీలకు కేటాయించవచ్చు. దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణం నుంచి పొదుపు మొత్తాలను కాపాడుకోవడానికి ఈ ఫండ్స్ ఉపయోగపడతాయి.

శాంపిల్ రిటైర్మెంట్ పోర్ట్‌ఫోలియో
(రూ. 1 కోటి నిధి)

- **బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు + ఎస్‌సీఎస్‌ఎస్:** రూ. 35 లక్షలు
- **డెట్/కన్జర్వేటివ్ హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్స్:** రూ. 35 లక్షలు
- **ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ / ఇండెక్స్ ఫండ్స్:** రూ. 15 లక్షలు
- **ఎమర్జెన్సీ నగదు – సేవింగ్స్:** రూ. 15 లక్షలు

పోర్ట్‌ఫోలియోను ఇలా తీర్చిదిద్దుకుంటే ఒక మోస్తరు స్థిరత్వంతో ప్రతి నెలా సుమారు రూ.45,000 నుంచి రూ. 55,000 వరకు అందుకోవడానికి ఆస్కారం ఉంటుంది.

ప్రాధాన్యాలు మారుతాయి..

వయస్సు పెరిగే కొద్దీ ప్రాధాన్యాలు మారుతాయి. యువ ఇన్వెస్టర్లతో పోలిస్తే సీనియర్ సిటిజన్ల ఆర్థిక అవసరాలు, ప్రణాళికలు వేరుగా ఉంటాయి. వారికి రాబడికన్నా తమ పెట్టుబడిని కాపాడుకోవటం ముఖ్యం. క్రమం తప్పకుండా, కచ్చితంగా కొంత మొత్తం ఆదాయంగా చేతికి అందటం అంతకన్నా ముఖ్యం. అది కూడా పెరిగే ధరలను తట్టుకునే భరోసానివ్వాలి. ఆరోగ్యం పరంగానో లేక మరొకటో అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే చేతిలో నగదు ఉండాలి. ఇలా ఒకటా, రెండా.. పెట్టుబడి పెట్టేటప్పుడు ఎన్నో విషయాలు చూసుకోవాలి. మ్యూచువల్ ఫండ్స్‌ని సరిగ్గా ఉపయోగించుకోగలిగితే, సంప్రదాయ పెట్టుబడి సాధనాలకు తోడుగా ఉంటూ, ఈ లక్ష్యాలను సాధించుకోవడంలో సహాయకరంగానూ ఉంటాయి.

సౌకర్యవంతంగా జీవించాలంటే...

ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో, అద్దెను మినహాయించి తక్కువలో తక్కువగా, ఓ మధ్యతరగతి సీనియర్ సిటిజన్ కుటుంబ ఖర్చులు ఇలా ఉంటున్నాయి...

- కరెంటు, ఇంటి మెయింటెనెన్సు మొదలైనవి: రూ. 8,000–10,000
- **నిత్యావసరాలు :** రూ. 10,000–12,000

వైద్యం, ఔషధాల ఖర్చులు: రూ. 5,000–7,000
ప్రయాణాలు, వ్యక్తిగత అవసరాల ఖర్చులు: రూ. 5,000–6,000
ఇలా, ఒక మోస్తరు సౌకర్యవంతంగా జీవించాలంటే నెలకు సింపుల్‌గా రూ. 30,000 నుంచి రూ. 40,000 వరకు అవసరమవుతోంది.
మరికాస్త సౌకర్యవంతంగా ఉండాలంటే (ట్రావెల్, హాబీలు, పని మనుషులు) ఖర్చులు నెలకు రూ. 45,000–60,000 వరకు పెరుగుతాయి.

ఇంత ఆదాయం రావాలంటే ఎంత దాచిపెట్టాలి?

రిటైర్మెంట్ తర్వాత కూడా ఖర్చుల కోసం నెలకు రూ. 30,000 నుంచి రూ. 60,000 వరకు అందుకోవాలంటే, అందుకు ఏ స్థాయిలో పెట్టుబడులు ఉండాలి? వార్షికంగా ఎంత మొత్తం రాబడిని ఆశించవచ్చు అనేది మరో ప్రశ్న. సీనియర్ సిటిజన్లకు, పెట్టుబడి భారీగా వృద్ధి చెందడం కన్నా, రాబడిపరమైన భద్రత అవసరం కాబట్టి తక్కువలో తక్కువగా ఏటా 6–7 శాతం రాబడిని ఆశించవచ్చు. దాన్ని బట్టి, పెద్దగా రిస్కులు ఉండని, పోర్ట్‌ఫోలియో డైవర్సిఫికేషన్ ప్రాతిపదికన చూస్తే..

నెలవారీగా రాబడి (రూ.)	అవసరమయ్యే నిధి (రూ.)
30,000	55-60 లక్షలు
40,000	70-75 లక్షలు
50,000	85 లక్షలు - 1 కోటి

సీనియర్ సిటిజన్స్ గుర్తుంచుకోతగిన కీలకమైన అయిదు సూత్రాలు ..

- భారీ రాబడుల హామీలతో ఊరించే స్కీములకు దూరంగా ఉండాలి
- వడ్డీపై మాత్రమే ఆధారపడకుండా ఎస్‌డబ్ల్యూపీని ఉపయోగించుకోవాలి



- చేతిలో ఉన్న మొత్తం నిధిని ఒకే సాధనంలో ఇన్వెస్ట్ చేయొద్దు.
- నామినేషన్లు, వీలునామా అప్‌డేటెడ్‌గా ఉండేలా చూసుకోవాలి
- తగినంత స్థాయిలో హెల్త్ ఇన్సూరెన్స్ ఉండాలి.

బడ్జెట్, ఫెడ్ పైనే ఫోకస్

వచ్చే నెల తొలి రోజున కేంద్ర ప్రభుత్వం సార్వత్రిక బడ్జెట్‌కు తెరతీయనుంది. మరోపక్క బుధవారం (28న) యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై సమీక్ష చేపట్టనుంది. ఈ నెల డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగియనుండటంతోపాటు ఫిబ్రవరి సిరీస్ ప్రారంభంకానుంది. వెరసి ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లను పలు అంశాలు ప్రభావితం చేయనున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం..

– సాక్షి, బిజినెస్ డెస్క్

- డెరివేటివ్స్ ముగింపు కీలకం
- 27న, 29న ఆటుపోట్లకు చాన్స్
- 28న ఫెడ్ పాలసీ నిర్ణయాలు
- ఫిబ్రవరి 1న బడ్జెట్– స్టాక్స్‌లో ట్రేడింగ్
- నేడు స్టాక్ మార్కెట్లు పనిచేయవు
- ఈ వారం స్టాక్ మార్కెట్లపై అంచనాలు

రిపబ్లిక్ డే సందర్భంగా నేడు(26న) స్టాక్ మార్కెట్లు పనిచేయవు. దీంతో ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితంకానుంది. అయితే ఆదివారం(ఫిబ్రవరి 1న) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో 2026–27 బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. దీంతో ఆదివారం సైతం స్టాక్ ఎక్స్ఛేంజీలు ట్రేడింగ్‌కు వీలు కల్పిస్తున్నాయి. ఎన్ఎస్ఈలో జనవరి ఎఫ్అండ్ఓ కాంట్రాక్టుల గడువు రేపు(27న) ముగియనుంది. బీఎస్ఈలో వీటి ఎక్స్‌పైరీ గురువారం(29న)కాగా.. రెండు ఎక్స్ఛేంజీలలోనూ ఫిబ్రవరి సిరీస్ ప్రారంభంకానుంది. కాగా.. యూరోపియన్ యూనియన్– భారత్ మధ్య వాణిజ్య డీల్ కుదిరితే ఇన్వెస్టర్లకు ఉపశమనం లభించే వీలుంది.

వడ్డీ తగ్గించేనా?

కొత్త ఏడాదిలో రెండురోజులపాటు నిర్వహిస్తున్న తొలి పాలసీ సమీక్షా సమావేశంలో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించవచ్చని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. ఇందుకు ద్రవ్యోల్బణం, ఉపాధిసహా.. ఫెడ్ చైర్మన్ పావెల్‌పై రాజకీయంగా, లీగల్‌గా ఒత్తిడి కొనసాగుతుండటం ప్రభావం చూపవచ్చని పేర్కొన్నారు. వెరసి ఫెడ్ ఫండ్స్ రేట్లు 3.5–3.75 శాతంవద్దే కొనసాగే వీలుంది. గురువారం(29న) నవంబర్ నెలకు యూఎస్ వాణిజ్య గణాంకాలు వెలువడనున్నాయి. అక్టోబర్‌లో వాణిజ్య లోటు 29.4 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

ఇతర దేశీ అంశాల ఎఫెక్ట్

- విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) దేశీ స్టాక్స్‌లో అమ్మకాలకే కట్టుబడుతున్నారు. ఈ నెలలో ఇప్పటివరకూ రూ. 36,591 కోట్ల పెట్టుబడులను నికరంగా వెనక్కి తీసుకున్నారు. దీంతో రూపాయిపై సైతం ఒత్తిడి పడుతున్నట్లు ఆర్థికవేత్తలు చెబుతు న్నారు. వెరసి డాలరుతో మారకంలో రూపాయి గత వారం 91.97కు పతనమైన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు.
- 2025 డిసెంబర్ నెలకు పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ) గణాంకాలు 28న విడుదలకానున్నాయి. నవంబర్‌లో ఐఐపీ 6.7 % ఎగసింది.
- మరిన్ని దిగ్గజాలు 2026 క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాలు ప్రకటించనున్నాయి. జాబితాలో యాక్సిస్ బ్యాంక్, ఎల్అండ్‌టీ, మారుతీ, ఐటీసీ, బజాజ్ ఆటో, ఎన్‌టీపీసీ తదితరాలున్నాయి.

మరింత డీలా..

- గత వారం సెంటిమెంటు బలహీనపడటంతో మార్కెట్లు పతన బాటలో సాగాయి. సెన్సెక్స్ 2,033 పాయింట్లు క్షీణించి 81,538 వద్ద నిలిచింది. నిఫ్టీ 646 పాయింట్లు పడిపోయి వద్ద 25,049 ముగిసింది.
- ఈ వారం సైతం అమ్మకాలతో మార్కెట్లు మరింత నీరసించవచ్చని సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు. ఈ అంచనాల ప్రకారం నిఫ్టీకి 24,300– 24,000 పాయింట్ల వద్ద కీలక మద్దతు లభించవచ్చు. బలపడితే 25,400–25,600 పాయింట్లకు చేరే వీలుంది.
- సెన్సెక్స్ 80,000– 79,500 పాయింట్ల స్థాయిలో మద్దతు అందుకునే వీలుంది. ఒకవేళ ఊపందుకుంటే 82,000–82,600 పాయింట్లవరకూ బలపడవచ్చు.

స్టాక్స్ వ్యూ

ఆర్‌బీఎల్ బ్యాంక్	బ్రోకరేజ్: ఎమ్‌కే గ్లోబల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 289 **టార్గెట్: రూ. 375**

ఎందుకంటే: బ్యాంక్‌లో భారీగా ఇన్వెస్ట్ చేసేందుకు ఎమిరేట్స్ ఎన్‌బీడీ(ఈఎన్‌బీడీ) కుదుర్చుకున్న డీల్, వృద్ధి అవకాశాలు తదితర అంశాలపై ఇటీవలే ఎండీ, సీఈవో ఆర్.సుబ్రమణ్యకుమార్‌తో సమావేశమయ్యాం. 2026 ఫిబ్రవరికల్లా నియంత్రిత అనుమతులు లభించగలవని ఎండీ అభిప్రాయపడ్డారు. మరోపక్క బ్యాంక్ వాటాదారులకు షేరుకి రూ. 280 చొప్పున 26 శాతం వాటా కొనుగోలుకి ఈఎన్‌బీడీ ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. ప్రిఫరెన్స్ షేర్ల ద్వారా పెట్టుబడులు సమకూర్చనుంది. దీంతో డీల్ తదుపరి బ్యాంక్ భారీ మూలధనాన్ని సమకూర్చుకోవడం ద్వారా మరింత బలపడనుంది. వెరసి డీల్ బ్యాంక్‌కు గేమ్‌ఛేంజర్‌కానుంది. నెట్‌వర్త్ రూ. 45,000 కోట్లకు, 39 శాతానికి సీఈటీ–1 బలపడనుంది. ఈ నేపథ్యంలో అసెట్స్– లయబిలిటీ(ఆర్గానిక్, ఇనార్గానిక్)తోపాటు.. ఫీజు అవకాశాలు మెరుగుపడనుండటం ద్వారా బ్యాంక్ భారీగా బలపడనుంది. అధిక ఈక్విటీ నిధుల వాటా, మెరుగైన డెట్ రేటింగ్, ఎన్ఆర్ఐ నిధుల రాక ప్రభావంతో నిధుల సమీకరణ వ్యయాలు తగ్గనున్నట్లు యాజమాన్యం భావిస్తోంది. ఫలితంగా లోన్ పోర్ట్‌ఫోలియోకు సంబంధించి మార్టిగేజ్, కార్పొరేట్స్‌వైపు వ్యూహాత్మకంగా దృష్టి సారించనుంది. తద్వారా ఆర్‌వోఏ, ఆర్‌వోఆర్‌డబ్ల్యూఏ మెరుగుపడనున్నాయి. అంతేకాకుండా ఇతర సంస్థల కొనుగోలు అవకాశాలను అన్వేషించడం ద్వారా లయబిలిటీ– అసెట్ మిక్స్‌ను పటిష్టపరచుకోనుంది. దీంతో దీర్ఘకాలంలో ఆర్‌వోఈ వృద్ధికి వీలుంటుంది. అయితే ఇటీవల వడ్డీ రేట్ల కోత కారణంగా మార్జిన్లుసహా ఈ ఏడాది(2025–26) ఆర్జనపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. అయితే వృద్ధి అవకాశాలరీత్యా వచ్చే రెండేళ్లలో ఆర్జన 8 శాతంమేర మెరుగుపడే వీలుంది.

ఒర్క్లా ఇండియా	బ్రోకరేజ్: ఐసీఐసీఐ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 591 **టార్గెట్: రూ. 800**

ఎందుకంటే: సుప్రసిద్ధ బ్రాండ్లు ఎంటీఆర్, ఈస్టర్న్ సహకారంతో ఒర్క్లా ఇండియా కీలక రాష్ట్రాలు కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మెజారిటీ మార్కెట్ వాటాను ఆక్రమిస్తోంది. ప్రాంతీయ రుచులపై పట్టు సాధించడం ద్వారా పోటీలో అగ్రపథాన నిలుస్తోంది. వివిధ సుగంధ ద్రవ్యాలు, సెమీకుక్‌డ్ ఆహార పదార్థాల(కన్వీనియెన్స్ ఫుడ్) విభాగాలలో కార్యకలాపాలు విస్తరించింది. కీలక మార్కెట్లలో ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియో విస్తరణ, కుటుంబ కొనుగోళ్లు పెరగడంతో దేశీయంగా అమ్మకాలను స్థిరంగా పెంచుకుంటోంది. మొత్తం టర్నోవర్‌లో 21 శాతం వాటా ఆక్రమిస్తున్న ఎగుమతులు కంపెనీ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. బ్రాండెడ్ సుగంధ ద్రవ్యాల ఎగుమతుల్లో 22 శాతం వాటా ఆక్రమిస్తుండటం ద్వారా విదేశాలలోని భారతీయులలో కంపెనీకున్న ప్రాధాన్యతను చాటుకుంటోంది. ఈ నేపథ్యంలో అత్యుత్తమ ప్రొడక్ట్ మిక్స్‌సహా, పటిష్ట నిర్వహణ సామర్థ్యం కారణంగా మార్జిన్లు బలపడటంతోపాటు.. నగదు ఆర్జన మెరుగుపడనుంది. వెరసి కీలక రేషియో ఆర్‌వోసీఈ పుంజుకోనుంది. ఈ ఏడాదితోపాటు రానున్న రెండేళ్ల(2026–27/2027–28)లో వార్షిక ప్రాతిపదికన ఆదాయం 9 శాతం, నిర్వహణ లాభం(ఇబిటా) 11 శాతం , నికర లాభం 10 శాతం చొప్పున వృద్ధి చూపనున్నట్లు అంచనా వేస్తున్నాం. ఇందుకు ప్రధానంగా అమ్మకాల పరిమాణం 6 శాతం చొప్పున పుంజుకోవడం ద్వారా తోడ్పాటునివ్వనున్నట్లు భావిస్తున్నాం. ఈ బాటలో ఎగుమతి ఆదాయం సైతం వార్షికంగా 12 శాతం చొప్పున బలపడనున్నట్లు అంచనా. నిర్వహణ వ్యయాల నియంత్రణ, ఉత్తమ ఎగ్జిక్యూషన్ కారణంగా ఈ కాలంలో ఇబిటా మార్జిన్ 1 శాతం మెరుగుపడి 17.6 శాతానికి చేరవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పాఠకుల ప్రశ్నలు.. నిపుణుల సమాధానాలు

మీ సందేహాలకు నిపుణుల ద్వారా సమాధానాలు కావాలంటే business@sakshi.comకు మెయిల్ చేయండి.

రియల్టీ..

నిర్మాణంలో ఉన్న ఇంటిని కొనుగోలు చేయటం మేలా... లేక నిర్మాణం పూర్తయిన ఇంటిని కొనుగోలు చేయాలా?

రెండింట్లోనూ దేనికుండే లాభాలు,దేనికి ఉండే ఇబ్బందులు దానికున్నాయి. ఎందుకంటే నిర్మాణం పూర్తయి తక్షణం వెళ్లగల ఇంటిని కొనుక్కోవటం సురక్షితం. వెంటనే వెళ్లిపోవచ్చు. వేచి చూడాల్సిన అవసరం లేదు. కాకపోతే ఇలాంటి ఇళ్ల ధర సహజంగానే ఎక్కువ ఉంటుంది. ఇక నిర్మాణంలో ఉన్న ఇల్లయితే ధర కాస్త తక్కువగా ఉంటుంది. కాకపోతే ఎప్పటికి పూర్తవుతుంది... ఎప్పుడు డెలివరీ ఇస్తారు అనే విషయాలకు గ్యారంటీ ఉండదు. ఇవన్నీ బిల్డరు పూర్వ చరిత్రను చూసి ముందుకు వెళ్లాల్సిన విషయాలే. కాకపోతే ఎంత పేరున్న బిల్డరయినా ఒకోసారి ఇబ్బందులో పడొచ్చు. దానివల్ల మనకు ఇవ్వాల్సిన ఇల్లు ఆలస్యం కావచ్చు. అందుకని మీ అవసరం, వేచిచూసే సామర్థ్యాన్ని బట్టి దేన్ని తీసుకోవాలో నిర్ణయించుకోవాలి.

బ్యాంకింగ్..

ఎఫ్‌డీ చేయాలనుకుంటున్నాను. వడ్డీ రేటును బట్టి బ్యాంకును ఎంచుకోవాలా? లేక సర్వీసును చూశా?

మీరు ఎంత మొత్తాన్ని ఎఫ్‌డీ చేయాలనుకుంటున్నారనేది ఇక్కడ ముఖ్యం. ఎందుకంటే అది తక్కువ మొత్తమే అనుకోండి. వడ్డీ రేటు చూసి ఎఫ్‌డీ చెయ్యండి. అలాకాకుండా ఎక్కువ మొత్తాన్ని డిపాజిట్ చేయాలనుకున్నానుకోండి. అపుడు బ్యాంకు అందిస్తున్న సేవలు, డిజిటల్ సౌకర్యాలు, ఆ బ్యాంకు ఎంత సురక్షితమైనది... అనే అంశాలన్నీ చూడాలి. 0.1 లేదా 0.25 వడ్డీ శాతం కన్నా మన సొమ్ము భద్రంగా ఉండటం ముఖ్యం కదా!. అందుకే మీరు ఎంత ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నారనే అంశాన్ని బట్టి బ్యాంకును ఎంచుకోండి. మీరు చేసే ఎఫ్‌డీ గనక రూ.5 లక్షలు లేదా అంతకన్నా తక్కువ ఉంటే.. అది ఏ బ్యాంకులో డిపాజిట్ చేసినా ఆ మొత్తానికి డిపాజిట్ క్రెడిట్ గ్యారంటీ పథకం కింద బీమా ఉంటుంది. కాబట్టి సురక్షితం.

బంగారం

సావరిన్ గోల్డ్ బాండ్స్ సురక్షితమేనా? అందులో ఇన్వెస్ట్ చేయొచ్చా?

సావరిన్ గోల్డ్ బాండ్లు పూర్తిగా సురక్షితం. వాటికి ఆర్‌బీఐ ద్వారా కేంద్ర ప్రభుత్వ గ్యారంటీ ఇస్తోంది. కాకపోతే ప్రస్తుతం ఈ సావరిన్ గోల్డ్ బాండ్లను జారీ చెయ్యటాన్ని కేంద్రం నిలిపేసింది. గతంలో జారీ చేసినపుడు కొన్నవాటికి మాత్రం మెచ్యూరిటీ అయిన వెంటనే చెల్లింపులు జరుగుతున్నాయి. ఇవి మరికొన్ని సంవత్సరాలు జరుగుతాయి కూడా. ఈ బాండ్స్‌లో ఇన్వెస్ట్ చేసిన వారికి బంగారం ధర ఎంత పెరిగితే అంత చెల్లించటంతో పాటు ఏటా 2.5 శాతం మొత్తాన్ని అదనంగా కూడా చెల్లిస్తారు. భౌతికంగా బంగారం కొనటం కన్నా ఇదే ఎక్కువ లాభం కదా!. కాకపోతే ఇందులో ఉండే రిస్కల్లా ఒకటే. బంగారం ధర తగ్గితే చెల్లించేటపుడు తగ్గిన ధరే చెల్లిస్తారు. ఏడేళ్ల పాటు కాలపరిమితి ఉండటంతో పాటు ఐదేళ్ల లాకిన్ కూడా ఉంది.

స్టాక్ మార్కెట్...

1న బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు కనక ఆదివారమైనా స్టాక్ మార్కెట్ పనిచేస్తుందని ప్రకటించారు. బడ్జెట్‌కు, స్టాక్ మార్కెట్‌కు సంబంధమేంటి?

బడ్జెట్ ప్రవేశపెట్టిననాడు సెలవు దినమైతే ఆ రోజున స్టాక్ మార్కెట్ ప్రత్యేకంగా పనిచేయటమన్నది ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మొదలైన సంప్రదాయం. గత సంవత్సరం కూడా ఫిబ్రవరి 1 శనివారం వచ్చింది. ఆ రోజునా స్టాక్ మార్కెట్లు పనిచేశాయి. ఇపుడు ఆదివారం కూడా పని చేస్తాయని ప్రకటించారు. వాస్తవానికి బడ్జెట్ అనేది పెద్దగా పట్టించుకోవాల్సిన విషయం కాదని గతంలో కేంద్ర ప్రభుత్వమే ప్రకటించింది. కానీ ఇపుడు బడ్జెట్ సమయంలో మార్కెట్ ఎలా ప్రతిస్పందిస్తుందనేది లైవ్‌లో దేశ ప్రజలకు తెలుస్తుందని, తమ నిర్ణయాలకు మార్కెట్ ఆమోదం ఉందో లేదో కూడా తెలిసిపోతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

మ్యూచువల్ ఫండ్స్...



సాధారణ డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయటం సురక్షితమేనా?

షేర్లలో ఇన్వెస్ట్ చేసే మ్యూచువల్ ఫండ్స్‌తో పోలిస్తే బాండ్లలో ఇన్వెస్ట్ చేసే డెట్ ఫండ్స్ చాలా సురక్షితం. అలాగని వాటిలో రిస్కు ఉండదని కాదు. అవి ఏ బాండ్లు కొంటున్నాయనేదాన్ని బట్టి అవెంత సురక్షితమో చెప్పొచ్చు. సాధారణంగా డెట్‌ఫండ్స్ ప్రభుత్వ సెక్యూరిటీల్లోను, ట్రెజరీ బిల్స్‌లోను, కార్పొరేట్ బాండ్లలోను, మనీమార్కెట్ సాధనాల్లోను ఇన్వెస్ట్ చేస్తుంటాయి. వీటిలో హెచ్చుతగ్గులు తక్కువ. తక్కువైనా... స్థిరమైన రాబడులుంటాయి. అయితే ఈ ఫండ్లు కార్పొరేట్ బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. సదరు కంపెనీ క్రెడిట్ రేటింగ్ తగ్గితే అది కొంతమేర రిస్కే. ఇక వడ్డీరేట్లు పెరిగినపుడు బాండ్ల ధరలు తగ్గుతాయి. మార్కెట్ పరిస్థితులు బాగులేకుంటే ఫండ్లు తమ బాండ్లను అమ్మటానికి ప్రయత్నించినా ఎవరూ కొనకపోవచ్చు. ఈ రిస్కులు దృష్టిలో పెట్టుకోవాలి.

ఇన్సూరెన్స్

ఆయుష్ ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చులు హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ పరిధిలోకి వస్తాయా?

మన దేశంలో ఇపుడు చాలా పాలసీలు ఆయుష్ ట్రీట్‌మెంట్‌కు కవరేజీ ఇస్తున్నాయి. కొన్ని షరతులుంటున్నాయి. ఆయుర్వేద, యోగ, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి వంటి చికిత్సలన్నీ ఆయుష్ పరిధిలోకి వస్తాయి. అయితే ప్రభుత్వ ఆసుపత్రిలోనో, లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆసుపత్రిలోనో, ఎన్ఏబీహెచ్ అక్రిడిటేషన్ ఉన్న ఆయుష్ ఆసుపత్రిలోనో తీసుకున్న చికిత్సకే కవరేజీ ఇస్తున్నారు. ఔట్‌పేషెంట్ చికిత్సలకు కాకుండా... ఆసుపత్రిలో చేరిన చికిత్సలకే ఇది వర్తిస్తుంది. గుర్తింపు లేని ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా, నేరుగా మందులు కొనుక్కున్నా, వెల్‌నెస్ థెరపీ, స్పా, రిజువనేషన్ చికిత్సలకు ఇది వర్తించదు. పైపెచ్చు చాలా పాలసీలు కవరేజీ మొత్తాన్ని ఏడాదికి రూ.25వేల నుంచి రూ.50 వేలకు పరిమితం చేస్తున్నాయి.

భవిష్యత్ నాయకులు అంటే ఇతరులను
శక్తివంతులను చేసి ముందుకు నడిపించేవారే.

- బిల్‌గేట్స్, అమెరికన్ వ్యాపారవేత్త,
మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు

కొందామా... అమ్ముదామా?

బంగారం తులం లక్ష అంటే..? అమ్మో! అన్నారు!!. లక్ష దాటడమే అబ్బురం అనుకున్నారు. అలాంటిది నెలల వ్యవధిలో ఏకంగా రూ.1.65 లక్షలు దాటేసింది. ఇక వెండి గురించైతే చెప్పక్కర్లేదు. ఏడాదిన్నర కిందటి వరకూ కిలో లక్ష రూపాయలలోపే. లక్ష దాటడమే గగనం అనుకున్నారంతా. కానీ ఈ ఏడాదిన్నరలోనే ఏకంగా రూ.3.4 లక్షలకు చేరిపోయింది. నిజానికి ఊహలకు కూడా అందని పరుగులివి. సెంట్రల్ బ్యాంక్‌లు సైతం కొండంత నమ్మకంతో పసిడిని కొనుగోలు చేస్తుండటం... వ్యక్తిగత వినియోగ అవసరాలకు తోడు రిటైల్ ఇన్వెస్టర్లు, సంపన్నులు సైతం బంగారంవైపు చూస్తుండటం పసిడిని పరుగులు పెట్టిస్తున్నాయి. ఇక పారిశ్రామిక (సోలార్, ఈవీ తదితర) డిమాండ్ పెద్ద ఎత్తున పెరగ్గా.. సరఫరా ఆ స్థాయిలో లేకపోవడం, పెట్టుబడులకు సైతం ఇన్వెస్టర్లు మక్కువ చూపిస్తుండడంతో వెండి ధరలు ఆకాశమే హద్దుగా రివ్వుమంటున్నాయి. ఈ విలువైన లోహాల ధరలు గడిచిన మూడేళ్లుగా ఎప్పటికప్పుడు కొత్త గరిష్టాలను నమోదు చేస్తుండడంతో రాబడుల కాంక్షతో కొందరు దూకుడుగా పెట్టుబడులు పెడుతున్నారు. మరిప్పుడు ఏం చేయాలి? కొత్తగా కొనాలనుకున్న వారి పరిస్థితేంటి? ఇళ్లలో కిలోలకు కిలోలు వెండి ఉన్నవారు మంచి రేటు వచ్చింది కనక దాన్ని విక్రయిస్తే మంచిదా? ఒకవేళ బంగారం, వెండి వంటి మెటల్స్‌లో ఇన్వెస్ట్ చేయాలంటే ఎలా? ఈటీఎఫ్‌లవైపు చూడొచ్చా? అందరికీ ఇవే సందేహాలు. వాటికి సమాధానమే ఈ వెల్త్ స్టోరీ...

బంగారం, వెండి ధరల పరుగుతో సందేహాలు

- ఏడాదిలోనే విపరీతంగా పెరగటంతో కొనుగోళ్లపై భయం
- 'టార్గెట్' చేరుకుంటే కొంత విక్రయించొచ్చు: నిపుణులు
- వేగంగా పెరిగాయి కనక స్వల్పకాలంలో కరెక్షన్‌కూ అవకాశాలు
- దీర్ఘకాలంలో మాత్రం పటిష్టమైన రాబడులొచ్చే చాన్స్
- ప్రస్తుతానికి ఏకమొత్తంగా కాకుండా సిప్ నయమని సూచనలు
- హెడ్జింగ్ కోసం తప్పనిసరిగా పోర్ట్‌ఫోలియోలో బంగారం, వెండి

దీర్ఘకాలంలో ధరల తీరు

బంగారం			వెండి		
సంవత్సరం	బంగారం ధరల శ్రేణి (రూ..లలో)	రాబడి%	సంవత్సరం	వెండి ధరల శ్రేణి (రూ..లలో)	రాబడి%
2000-01	4,400-4,300	2	2000	7,900	3.8
2001-02	4,300-4,900	16	2001	7,215	-8.7
2002-03	4,990-5,600	12	2002	7,875	9.1
2003-04	5,600-6,307	13	2003	7,695	-2.3
2004-05	6,307-7,000	11	2004	11,770	52.9
2005-07	7,000-10,800	30*	2005	10,675	-9.3
2007-08	10,800-12,500	16	2006	17,405	63.0
2008-09	12,500-14,500	16	2007	19,520	12.1
2009-10	14,500-18,500	28	2008	23,625	21.0
2010-11	18,500-26,400	43	2009	22,165	-6.2
2011-12	26,400-31,050	18	2010	27,255	22.9
2012-13	31,050-29,600	-5	2011	56,900	108.8
2013-14	29,600-28,006	-5	2012	56,290	-1.1
2014-15	28,006-24,931	-11	2013	54,030	4.0
2015-16	24,931-27,745	10	2014	43,070	20.3
2016-17	27,445-29,156	6	2015	37,825	-12.2
2017-18	29,156-31,391	8	2016	36,800	2.7
2018-19	31,391-39,108	25	2017	37,900	3.0
2019-20	39,108-50,151	28	2018	41,300	9.0
2020-21	50,151-48,099	-4	2019	40,600	-1.7
2021-22	48,099-55,017	14	2020	63,400	56.2
2022-23	55,017-63,203	15	2021	62,500	-1.4
2023-24	63,203-78,245	24	2022	55,100	-11.8
2024-25	78,245-1,02,170	31	2023	78,600	42.7
2025-26	1,02,170-1,57,200	54	2024	95,700	21.8
రెండేళ్లకు*			2025	2,11,000	120.4

పెట్టుబడుల కేటాయింపులు ఇలా..

రిస్క్ సామర్థ్యం	ఈక్విటీ	డెట్	బంగారం	వెండి
రక్షణాత్మక ధోరణి	30	50	15	5
మధ్యస్థ ధోరణి	50	35	10	5
దూకుడు ధోరణి	70	15	10	5

(అన్నీ శాతాల్లో)

దీర్ఘకాలంలో కాంపౌండెడ్ రాబడి

బంగారం	
20 ఏళ్లలో (2005-2025)	ఏటా 11-15 శాతం
30 ఏళ్లలో (1995-2025)	ఏటా 10-12 శాతం
1950-2023 మధ్య	9-10 శాతం
వెండి..	
1995-2025 మధ్య	ఏటా 12.1 శాతం

ఉరుకులు పరుగులు ఎందుకంటే...

- 2025 జనవరి నుంచి బంగారం ధర అంతర్జాతీయ మార్కెట్లో 79 శాతం పెరిగింది. ఔన్స్‌కు 2,780 డాలర్ల నుంచి 4,965 డాలర్లకు చేరగా, వెండి ఔన్స్ 30 డాలర్ల నుంచి 100 డాలర్ల స్థాయిని తాకింది. ఈ కాలంలో వెండి ఏకంగా 223 శాతం ర్యాలీ చేసింది.
- అంతర్జాతీయంగా వృద్ధి అంచనాలు మసకబారినప్పుడు లేదా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఎగసినప్పుడు (పలు దేశాల మధ్య ఘర్షణలు/ యుద్ధాలు తలెత్తడం).. ఇన్వెస్టర్లు రక్షణాత్మక ధోరణితో తమ పెట్టుబడుల్లో కొంత భాగాన్ని బంగారం, వెండిలోకి మళ్లిస్తుంటారు. అలాంటి ఆర్థిక అనిశ్చితుల్లో పెట్టుబడుల విలువ కాపాడుకునే హెడ్జింగ్ సాధనంగా బంగారానికి గుర్తింపు ఉంది.
- డాలర్ బలహీనత సైతం బంగారం, వెండి ధరలకు ఆజ్యం పోసేదే. డాలర్ విలువ తగ్గినప్పుడు ఇతర కరెన్సీల వారికి బంగారం, వెండి చౌకగా మారతాయి. కనుక అదనపు డిమాండ్ ఏర్పడుతుంది.
- యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించొచ్చన్న అంచనాలు కూడా ఒక కారణమే. వడ్డీ రేట్లు దిగొచ్చే క్రమంలో ఈల్డ్స్ తగ్గి బాండ్ల ఆకర్షణీయత కోల్పోతాయి. దీంతో అదనపు రాబడి వస్తుందనే కారణంతో పసిడి, వెండిలోకి పెట్టుబడులు పరుగెడుతుంటాయి.
- ఆర్‌బీఐ నుంచి అంతర్జాతీయంగా ఎన్నో దేశాల కేంద్ర బ్యాంక్‌లు తమ విదేశీ మారకం నిల్వల్లో బంగారానికి వెయిటేజీ పెంచుతున్నాయి. గత రెండు మూడేళ్లుగా కొన్ని సెంట్రల్ బ్యాంక్‌లు బంగారం నిల్వలు అదే పనిగా పెంచుకుంటూ వెళుతున్నాయి.
- గోల్డ్, సిల్వర్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు)లోకి వచ్చే పెట్టుబడులు కూడా పెరగడం ధరలను మరింత ఎగిసేలా చేస్తోంది.
- వెండికి ప్రధానంగా పారిశ్రామిక రంగం నుంచి డిమాండ్ ఎప్పుడూ ఉంటుంది. ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెళ్లు, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెద్ద ఎత్తున పెరుగుతుండడంతో వీటి తయారీకి అదే స్థాయిలో వెండి అవసరం ఏర్పడుతోంది. ఈ స్థాయిలో సరఫరా పెరగకపోవడం ధరలను నడిపిస్తోంది.
- మన రూపాయి ఇటీవలి కాలంలో డాలర్‌తో విలువను కోల్పోతూ వస్తోంది. బంగారం, వెండిని డాలర్ రూపంలోనే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇది కూడా దేశీయంగా వాటి ధరలు అంతర్జాతీయ మార్కెట్ కంటే పెరిగేలా చేస్తోంది.
- ఒకవైపు ఈక్విటీలు ఏడాదిన్నరగా ఎలాంటి ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నాయి. మరోవైపు బంగారం, వెండి గణనీయంగా ర్యాలీ చేస్తుండడంతో.. ఇన్వెస్టర్లు వాటివైపు ఆకర్షితం అవుతుండడం ధరలను మరింత పెరిగేలా చేస్తోంది.

రిటైల్ ఇన్వెస్టర్లు ఏం చేయాలి?

- బంగారం, వెండి ధరల పరుగును చూసి హడావిడిగా పెట్టుబడులు పెట్టేయాల్సిన పనిలేదు. ఉన్నట్టుండి వీటి ధరలు గణనీయంగా పెరగడమే కాదు.. వీటిల్లో దిద్దుబాటూ అదే విధంగా ఉండొచ్చు. స్వల్పకాలంలో వీటి డిమాండ్, ధరల తీరును కచ్చితంగా అంచనా వేయలేం.

దీర్ఘకాలంలో మాత్రం బంగారం, వెండి మూలాలు పటిష్టమే అనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. కాబట్టి ధరలను చూసి ఉద్రేకపడాల్సిన పనే లేదు.

- ఇప్పటికే భౌతిక బంగారం కొనుగోలు చేసిన వారు గరిష్ఠ ధరల వద్ద విక్రయించి లాభం స్వీకరించాలనుకుంటే లేదా లిక్విడిటీ (నగదు లభ్యత) పెంచుకోవాలంటే లేదా తాము అనుకున్న లక్ష్యానికి చేరువ అయితే ముందుకెళ్లొచ్చు.
- భౌతిక రూపంలో విక్రయించే వారు జీఎస్టీ చార్జీలు, తరుగు రూపంలో లాభంలో కొంత నష్టపోవాల్సి ఉంటుందని గుర్తు పెట్టుకోవాలి.
- అనుకున్న లక్ష్యానికి బంగారం ధరలు చేరినట్టయితే పాక్షికంగా విక్రయించడం మంచి ఆలోచనే.
- ధరల పరుగు చూసి, మరింత పెరిగితే కొనలేమోమోనన్న భయం అవసరం లేదు. అధిక ధరల వద్ద కొనుగోలు చేసినప్పుడు స్వల్పకాలంలో కరెక్షన్ల రిస్క్ కూడా ఉంటుంది.
- బంగారం హెడ్జింగ్‌గానూ పనిచేస్తుంది కనుక కొనుగోలు చేసి, దీర్ఘకాలం పాటు నిల్వ ఉంచుకుంటే మంచి రాబడిని ఆశించొచ్చు. కాకపోతే దాని భద్రత కోసం చేయాల్సిన వ్యయాలు, జీఎస్టీ ఇతరత్రా చార్జీల ప్రకారం చూస్తే.. డిజిటల్ సాధనాలు అనుకూలం.
- వెండి భౌతిక రూపంలో కొనుగోలు చేస్తే, తర్వాత నగదుగా మార్చుకోవడం కష్టం కావొచ్చు.
- డిజిటల్ రూపంలో అయితే బంగారం, సిల్వర్ ఈటీఎఫ్‌లు, ఫండ్ ఆఫ్ ఫండ్స్, డిజిటల్ గోల్డ్ అందుబాటులో ఉన్నాయి.

'సిప్' రూపంలోనే బెటర్...

- గరిష్ఠ ధరల వద్ద ఒకేసారి పెట్టుబడి పెట్టడం కాకుండా నెలవారీ నిర్ణీత మొత్తాన్ని గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేసుకోవడం అన్నింటిలోకి మెరుగైన మార్గమన్నది విశ్లేషకుల సూచన.
- ఇక్కడి నుంచి ధరలు ఇంకా ముందుకే వెళ్లినా, లేక పతనాన్ని చూసినా పెట్టుబడి కొనసాగుతుంది. కొనుగోలు ధర సగటుగా మారుతుంది.
- పెట్టుబడుల్లో వైవిధ్యానికి.. పోర్ట్‌ఫోలియో హెడ్జింగ్ కోసం చూసే వారు దీర్ఘకాలం కోసం బంగారంలో సిప్ రూపంలోఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

ఎంత పెట్టుబడి..?

ఒకరు తమ మొత్తం పెట్టుబడుల్లో బంగారం, వెండికి కేటాయింపులు 10–20 శాతానికి పరిమితం చేసుకోవాలన్నది నిపుణుల సూచన. ఇలా చేయడం వల్ల ఒక విభాగంలో అధిక ఎక్స్‌పోజర్‌ను నివారించొచ్చు. అధిక రాబడులను ఇచ్చే ఈక్విటీల తోపాటు, పెట్టుబడులకు రక్షణనిచ్చే డెట్ సాధనాలు, బంగారం–వెండి మధ్య తగినంత సమతుల్యం ఉండేలా చూసుకోవచ్చు.

న్యూ ఫండ్ ఆఫర్స్

ఐసీఐసీఐ ప్రు నుంచి ఐసిఫ్ పథకాలు

ICICI PRUDENTIAL MUTUAL FUND

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యుచువల్ ఫండ్ సంస్థ స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (సిఫ్) విభాగంలో రెండు కొత్త ఫండ్స్‌ని ప్రవేశపెట్టింది. ఐసిఫ్ ఈక్విటీ ఎక్స్–టాప్ 100 లాంగ్–షార్ట్ ఫండ్, ఐసిఫ్ హైబ్రిడ్ లాంగ్–షార్ట్ ఫండ్ వీటిలో ఉన్నాయి. ఈ రెండు న్యూ ఫండ్ ఆఫర్లు జనవరి 30 వరకు అందుబాటులో ఉంటాయి. మొదటిది ఎక్స్–టాప్ 100 స్టాక్స్, వాటి సంబంధిత సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. లాంగ్–షార్ట్ పొజిషనింగ్, డెరివేటివ్ వ్యూహాలతో మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లోని వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకుంటుంది. ఇక రెండోది ఈక్విటీ, డెట్ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈక్విటీ పొజిషన్లలో లాంగ్–షార్ట్ పొజిషన్లు, ఫిక్స్‌డ్ ఇన్‌కం సాధనాలు, డెరివేటివ్ వ్యూహాలతో మార్కెట్ దిశతో సంబంధం లేకుండా మెరుగైన రాబడులు అందించేందుకు ప్రయత్నిస్తుంది. మ్యుచువల్ ఫండ్స్, పీఎంఎస్/ఏఐఎఫ్ సాధనాల మధ్య అంతరాలను భర్తీ చేసే దిశగా సెబీ ఈ సిఫ్ సెగ్మెంట్‌ని ప్రవేశపెట్టింది. దీనికి కనీస పెట్టుబడి రూ. 10 లక్షలుగా ఉంటుంది. వివిధ మార్కెట్ పరిస్థితులవ్యాప్తంగా మెరుగైన పనితీరు కనపర్చే వైవిధ్యమైన పెట్టుబడి వ్యూహాలను ఇన్వెస్టర్లకు అందించే లక్ష్యంతో వీటిని ప్రవేశపెడుతున్నట్లు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ఈడీ శంకరన్ నరేన్ తెలిపారు.

శామ్కో మిడ్‌క్యాప్ ఫండ్

శామ్కో అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్.. శామ్కో మిడ్‌క్యాప్ ఫండ్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. బలమైన ఆదాయం, లాభాలు, ధరల తీరు ఆధారంగా భవిష్యత్తులో బలంగా ఎదిగే మధ్యస్థాయి కంపెనీలను గుర్తించి ఈ పథకం పెట్టుబడులు పెడుతుంది. ఇందుకుగాను 'కేర్' విధానాన్ని అనుసరిస్తుంది. మార్కెట్ విలువ పరంగా 101 నుంచి 250వ స్థానం వరకు ఉన్న కంపెనీలు మిడ్‌క్యాప్ కిందకు వస్తాయి. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 4 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది.

SAMCO MUTUAL FUND

యాక్సిస్ కొత్త మ్యూచువల్ ఫండ్

యాక్సిస్ బీఎస్ఈ సెక్టార్ లీడర్స్ ఇండెక్స్ ఫండ్

AXIS MUTUAL FUND

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ బీఎస్ఈ సెక్టార్ లీడర్స్ ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఫిబ్రవరి 6 వరకు ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో/కొత్త పథకం) పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. కార్తీక్ కుమార్ ఫండ్ నిర్వహణ బాధ్యతలు చూడనున్నారు. ఈ పథకంలో కనీసం రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. బీఎస్ఈ 500 సూచీలోని 21 రంగాల కంపెనీల్లో పెట్టుబడులకు ఈ పథకం అవకాశం కల్పిస్తుంది. ప్రతీ రంగం నుంచి టాప్ 3 కంపెనీలను ఎంపిక చేసి పెట్టుబడులు పెడుతుంది. దీంతో ఆయా రంగాల్లోని అగ్రగామి కంపెనీల్లో ఎక్స్‌పోజర్ లభిస్తుంది.

పెట్టుబడులకు విలువ జోడింపు

నిప్పన్ ఇండియా వ్యాల్యూ ఫండ్

రిస్క్ తక్కువ, రాబడులు మెరుగ్గా ఉండాలని కోరుకునే వారికి వ్యాల్యూ ఫండ్స్ సరిగ్గా సరిపోలుతాయి. ఎందుకంటే ఇవి అధిక వ్యాల్యుయేషన్ల వద్ద స్టాక్స్‌లో పెట్టుబడులకు దూరంగా ఉంటుంటాయి. దీంతో మార్కెట్ కరెక్షన్లలో నష్టాలు పరిమితంగా ఉంటాయి. ఈ విభాగంలో నిప్పన్ ఇండియా వ్యాల్యూ ఫండ్ మెరుగైన పనితీరు చూపిస్తోంది. దీర్ఘకాల పెట్టుబడులు పెట్టుకునే వారు వ్యాల్యూ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఎందుకంటే సాధారణంగా ఇవి దీర్ఘకాలంలోనే మంచి ప్రతిఫలాన్ని ఇస్తుంటాయి. అదే గ్రోత్ ఇన్వెస్టింగ్‌ను అనుసరించే ఫండ్స్‌లో అయితే స్వల్పకాలంలోనే మంచి లాభాలకు అవకాశం ఉంటుంది. అదే సమయంలో నష్టాల రిస్క్ ఎక్కువే ఉంటుంది. కనుక స్వల్పకాలంలో గణనీయమైన లేదా మెరుగైన రాబడులను ఆశించే వారికి వ్యాల్యూ ఫండ్స్ అనుకూలం కాదు.

రాబడులు

ఈ పథకంలో ఐదేళ్ల రోలింగ్ రాబడులు ఏటా 27.1 శాతంగా ఉండడం గమనార్హం. ఈ కాలంలో నిఫ్టీ 500 టీఆర్ఐ రాబడి 21.1 శాతంగానే ఉంది. ఏడాది కాలంలో ఈ పథకం 5.97 శాతం రాబడినిస్తే సూచీ రాబడి 4.57 శాతంగా ఉంది. మూడేళ్లలో నిప్పన్ ఇండియా ఏటా 22.8 శాతం ప్రతిఫలాన్ని తెచ్చి పెట్టగా, నిఫ్టీ 500 టీఆర్ఐ వృద్ధి 16.22 శాతంగా ఉంది. సూచీకంటే ఈ పథకమే కాస్తంత అదనపు రాబడిని ఇస్తున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి.

పెట్టుబడుల విధానం..

వ్యాల్యూ ఫండ్స్ అన్నవి ఒక కంపెనీ వ్యాపారం, మార్కెట్ వాటా, ఆర్థిక బలాలు ఇలా ఎన్నో అంశాలను సమగ్రంగా అధ్యయనం, విశ్లేషణ చేసిన తర్వాతే, అది కూడా వాటి వాస్తవ విలువ కంటే తక్కువ ధరల్లో లేదా సహేతుక వ్యాల్యుయేషన్ల వద్ద ఉన్న వాటికే ప్రాధాన్యం ఇస్తుంది. ఆర్థికంగా ఎంతో బలమైన వ్యాపార సంస్థలు, దీర్ఘకాలంలో మెరుగైన రాబడులను ఇవ్వగల కంపెనీలను గుర్తించి పెట్టుబడులు పెడుతుంది.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.9,153 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఈక్విటీల్లో 97.29 శాతం ఇన్వెస్ట్ చేయగా, 2.69 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. రంగాల వారీ కేటాయింపులను పరిశీలించగా.. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో అత్యధికంగా 36 శాతం ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత ఇండస్ట్రియల్స్ కంపెనీలకు 14.23 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీలకు 13.80 శాతం, ఇంధనం, యుటిలిటీ కంపెనీలకు 12.74 శాతం, మెటీరియల్స్ కంపెనీలకు 10.07 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషినరీ కంపెనీలకు 7.53 శాతం చొప్పున కేటాయింపులు చేసింది. ఎక్స్‌పెన్స్ రేషియో 1.08 శాతంగా ఉంది. అంటే ఇన్వెస్టర్ల పెట్టుబడి విలువలో ఏటా 1.08 శాతం మేర చార్జీల కింద ఫండ్ మినహాయించుకుంటుంది. ఈ పథకంలో కనీసం రూ.100 నుంచి సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	8.75
వేదాంత	3.97
ఇన్ఫోసిస్	3.57
ఎస్‌బీఐ	3.50
ఐసీఐసీఐ బ్యాంక్	3.38
రిలయన్స్ ఇండస్ట్రీస్	3.29
కోటక్ బ్యాంక్	3.20
ఎన్‌టీపీసీ	3.04
భారతీ ఎయిర్‌టెల్	2.94
ఇండస్‌ఇండ్ బ్యాంక్	2.83

బినామీ వ్యవహారాల జోలికెళ్లొద్దు



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి | కె.వి.ఎన్ లావణ్య

ట్యాక్సేషన్ నిపుణులు

బినామీ ఆస్తి అంటే ఏమిటి.? బినామీ వ్యవహారం ఏమిటి.? బినామీదారు ఎవరు? ప్రయోజనం పొందేవారెవరు? మొదలైన విషయాలు ఇప్పటికే తెలుసుకున్నాము. ఈ వ్యవహారాలు చేయడం వల్ల కలిగే కష్టనష్టాలు ఈ వారం తెలుసుకుందాం.!

ఆస్తి జప్తు: బినామీ ఆస్తి అని నిర్ధారణ జరిగితే ఆ ఆస్తిని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం లేదా జప్తు చేసుకుంటుంది.

శిక్షార్హులు: బినామీదారు, ప్రయోజనం పొందే వ్యక్తి (ముసుగు మనిషి), ఈ వ్యవహారాన్ని ప్రేరేపించిన లేదా ప్రోత్సహించిన వ్యక్తి, ఈ ముగ్గురూ చట్టం ప్రకారం శిక్షార్హులే. ఆరోపణలు నిరూపణ అయితే ఒక ఏడాది నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష (కఠినకారాగార శిక్ష) ఉంటుంది. ఇది కాకుండా, బినామీ ఆస్తి ఫెయిర్ మార్కెట్ విలువ మీద 25% జరిమానాగా విధిస్తారు. ముందుగానే తప్పు ఒప్పుకుంటే కొన్ని షరతులకు లోబడి జరిమానాను సడలిస్తారు. బినామీదారు బినామీ ఆస్తిని తిరిగి 'ప్రయోజకుడు' లేదా ఏ ఇతర వ్యక్తికి కూడా బదిలీ చేయకూడదు. ఇలాంటి బదిలీలు చెల్లవు. అలాంటి అమ్మకం జరిగినప్పుడు కొన్న వ్యక్తికి ఎటువంటి విషయం తెలియకపోతే.. నిజమని నమ్మించి అమ్మితే, కొన్న వ్యక్తి నుంచి ఆస్తి తీసుకోరు.

అధికారుల అధికారాలు

ఈ చట్టప్రకారం నాలుగు రకాల అధికారులు ఉన్నారు. వారి అధికారాలు ఏమిటంటే...

(1) సమన్లు జారీ చేయడం (2) సమాచారం కోరడం (3) డాక్యుమెంట్లు స్వాధీనపరచుకోవడం (4) విచారణ చేయడం (5). విచారణలో సహకారం కోసం ఇతర అధికారులను కోరడం.

ఇంకా ఏం చేస్తారు

నోటీసులు ఇస్తారు. విచారిస్తారు. తీర్పు ఇస్తారు. తీర్పు అనుగుణంగా ఆస్తిని స్వాధీనం చేసుకుంటారు. వాటిని అధీనంలోకి తీసుకుంటారు.

ఆద్యులెవరు ..

ఆస్తిని స్వాధీనపరుచుకోవడానికి ముందు.. ఆద్యులు ఎవరంటే ఇన్‌కంటాక్స్ డిపార్టుమెంటు వారు. వారిచ్చిన సమాచారం, డాక్యుమెంట్ల ఆధారంగా చేసుకొని, బినామీ చట్టంలోని అధికారులు రంగంలోకి ప్రవేశిస్తారు. ఈ తరువాత పద్ధతి ప్రకారం పని ముగిస్తారు.

నోటీసు ప్రక్రియ..

నోటీసు ఇవ్వడానికి ప్రక్రియ మారితే.. వ్యక్తిగత పోస్టు ద్వారా లేదా సివిల్ కోడ్ ప్రకారం నోటీసు ద్వారా విచారణ, ప్రశ్నలు, ఇన్వెస్టిగేషన్, సోదాలు, కాగితాల సేకరణ, పత్రాలు అడగడం, ఆ తరువాత తీర్పు ఇవ్వడం, ఎటాచ్‌మెంట్ చేయడం, స్వాధీనపరచుకోవడంలాంటివి జరుగుతాయి. ఆ తరువాత బినామీ ఆస్తి కేంద్ర ప్రభుత్వానికి చెందుతుంది. ఎంక్వైరీ మధ్యలో బినామీదారు/ముసుగు మనిషి మరణిస్తే వారి వారసులకు కేసు బదిలీ చేస్తారు. కోర్టు పద్ధతి ప్రకారం జరుగుతుంది. ఈ ప్రక్రియలో ఏ స్థాయిలోనైనా తప్పుడు సమాచారం ఇచ్చినా., తప్పుడు డాక్యుమెంట్లు సమర్పించినా కఠిన కారాగార శిక్ష, జరిమానాలు పడతాయి.

ఈ రెండు చట్టాలు–చుట్టాలు ..

అటు అదాయపన్ను చట్టం, ఇటు బినామీ వ్యవహారంలో నిషేధిత చట్టం రెండూ కలిసి పనిచేస్తాయి. బినామీ వ్యవహారాల ద్వారా పన్ను ఎగవేత అంశం వెలుగులోకి వస్తుంది. ఇన్‌కం టాక్స్ అధికారులనే సూత్రధారులుగా .. ప్రారంభించే అధికారిని INITIATING OFFICERS గా వ్యవహరించమంటారు. వారే అన్ని తయారు చేస్తారు. డిపార్టుమెంటు వారు ఈ చట్టం ద్వారా సమాచారం, డాక్యుమెంట్లు రాబట్టుకుంటారు. వారి చట్టం ప్రకారం పెనాల్టీలు.. ఆదాయం మీద పన్ను వేసి... మిగతా కార్యక్రమం పూర్తి చేసి బినామీ నిషేధ చట్టం అధికారులకు అప్పగిస్తారు. ఈ అధికార్లు ఆస్తిని జప్తు చేసి కేంద్ర ప్రభుత్వానికి ఇస్తారు. డిక్లేర్ చేయని ఆస్తులు.. డిక్లేర్ చేయని ఆదాయ వివరాలు తెలుసుకొని వాటిని అసెస్సీ పన్ను పరిధిలోకి తెచ్చి.. అసెస్‌మెంట్ చేసి... పన్ను, వడ్డీ, పెనాల్టీలు వసూలు చేసి బినామీ చట్టం అధికార్లకు అప్పగిస్తారు.

ఇప్పుడు అర్థమైందా... బినామీ వ్యవహారాల వెనుకు ఎంత రిస్క్ ఉందో... దగ్గర బంధువులు, వ్యాపారం చేస్తున్న మిత్రులు, బంధువులు, మీరు చిన్న ఉద్యోగి అయితే మీ బాస్‌లు, యజమానులు, అల్లుడు, బావ, వియ్యంకుడు ఇలా అభిమానం అడ్డుపెట్టి, డబ్బులు ఎరచూపి, వారి కష్టాలని మీ దగ్గర వెలిబుచ్చి ట్రాప్ చేస్తారు. వారి వలలో పడకండి!

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

అధికార గణం 'అతి'రథ సేవ

ఆదిత్యుని సాక్షిగా ప్రత్యక్ష నరకం

క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు తొక్కిసలాటలో పలువురికి గాయాలు

- ప్రజాప్రతినిధులు, వీవీఐపీల సేవలోనే తరించిన అధికారులు
- రూ.లక్షలు ఇచ్చిన దాతలకూ అవమానం
- స్పృహ తప్పిన పలువురు భక్తులు
- అరసవల్లి రథ సప్తమి దర్శనం ఏర్పాట్లలో బాబు సర్కారు విఫలం

అరసవల్లి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : రథసప్తమి సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శన ఏర్పాట్లు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. వీవీఐపీల సేవలకు పెద్దపీట వేసి, సామాన్య భక్తులను పూర్తిగా విస్మరించింది. అరగంటలో దర్శనం కల్పిస్తామని ప్రకటించి ఏడెనిమిది గంటలకుపైగా ప్రత్యక్ష నరకం చూపించింది. అధికారులు, పాలకుల సమన్వయ లోపంతో కిక్కిరిసిన క్యూలైన్లలో కొందరు స్పృహ తప్పి పడిపోయారు. ప్రధాన జంక్షన్ల వద్ద తోపులాటలు జరిగాయి. శనివారం అర్ధరాత్రి నుంచే స్వామి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో పడిగాపులు కాసినా దర్శనభాగ్యం కలగకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. తిరుపతి, కాశీబుగ్గ, సింహాచలం వంటి ఘటనల తర్వాత కూడా బాబు సర్కారు తీరు మార లేదనడానికి అరసవల్లిలో తాజాగా భక్తులు పడిన ఇబ్బందులే నిదర్శనం.

తొలిసారిగా టిక్కెట్ల దర్శనాలు రద్దు..

వారం రోజుల రాష్ట్ర స్థాయి పండగలో ఆఖరి ఘట్టమైన ఆదిత్యుని దర్శనం కల్పించడంలో చంద్రబాబు ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయింది. అరగంటలో దర్శనం కల్పిస్తామని ప్రజాప్రతినిధులు ప్రకటించడంతో భక్తులు పోటెత్తారు. అయితే అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. భక్తులకు దర్శనం కల్పించలేక ఆఖరికి దర్శన పాసులను, టిక్కెట్లను రద్దు చేస్తున్నట్లుగా తొలిసారిగా ప్రకటించాల్సిన దుస్థితి ఎదురైంది. శనివారం అర్ధరాత్రి క్షీరాభిషేక సమయంలోనూ పరిస్థితి దయనీయంగా మారింది.

క్షీరాభిషేకానికి పాట్లు

ఆలయంలో ఏటా క్షీరాభిషేక సేవ ఓ పద్ధతిలో జరుగుతుంది. ఈ ఏడాది పోలీసుల ఆంక్షలు, నిర్వహణ లోపం వల్ల సిబ్బంది పాల బకెట్లను తీసుకువెళ్లే మార్గం ఇబ్బందికరంగా మారింది. ఆఖరికి స్వామికి క్షీరాభిషేకం చేయడానికి పాట్లు పడాల్సి వచ్చింది. శఠగోపం, తీర్థం కూడా ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్వామికి పట్టువస్త్రాలను శనివారం అర్ధరాత్రి సమర్పించారు. ఆయన వెంట కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ఉన్నారు. వీరితోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, హోంమంత్రి వంగలపూడి అనిత ఆదిత్యుని దర్శనం చేసుకున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల సేవలో తరించిన అధికారులు సామాన్య, దాతృత్వం కల భక్తులకు నరకం చూపారు. ఆలయ పునర్నిర్మాణ దాత దివంగత వరుదు బాబ్జీరావు కుటుంబం కూడా దర్శనం సమయంలో తోపులాటలో చిక్కుకోవాల్సి వచ్చింది. బాబ్జీరావు కుమార్తె, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఆమె సోదరులూ అవస్థలు పడుతూనే అంతరాలయంలోకి వెళ్లాల్సి వచ్చింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్ తన వాళ్లకు దర్శనాలు కాలేదని మళ్లీ దర్శనానికి వచ్చి.. వైకుంఠ ద్వారం నుంచి బయటకు వచ్చారు. రథ సప్తమి రోజున ఉత్తర ద్వార దర్శనాలు చేయించడంపైనా విమర్శలు చెలరేగాయి.

తొక్కిసలాటలో పలువురు భక్తులు గాయాలపాలైన వీడియో కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సామాన్యుల అవస్థలు వర్ణనాతీతం

కేంద్ర, రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులు, వీవీఐపీలు, స్థానిక ఎమ్మెల్యేల వెనుక వందలాది మంది అనుచరులు రావడంతో రథ సప్తమి అర్ధరాత్రి దర్శనాల్లో సామాన్యులకు ప్రత్యక్ష నరకం కనిపించింది. ఉచిత, రూ.100, రూ.300 క్యూలలో వచ్చే సామాన్య భక్తుల నుంచి రూ.500లు, డోనర్ పాసులు ఉన్న వారూ పెద్ద ఎత్తున ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లల అవస్థలైతే వర్ణణాతీతం. పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రధానంగా కూటమి నేతలు, వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులకు మాత్రమే ప్రత్యేక దర్శనాలు జరిగాయి. క్యూలలో ఉన్న భక్తులు కుయ్యోమొర్రోమన్నా కనీసం వారిని పట్టించుకోలేదు. శనివారం రాత్రి 12 గంటలకు దర్శనాలు మొదలుకుని ఆదివారం సాయంత్రం వరకూ వేలకొద్ది వీవీఐపీ, వీఐపీ పాసులు రావడం గమనార్హం. దీనివల్ల మూడుచోట్ల తోపులాటలు జరిగాయి. ఉదయం 11 గంటల సమయంలో తొక్కిసలాట జరగడంతో పలువురు భక్తులు స్పృహతప్పి పడిపోగా, మరికొందరికి గాయాలయ్యాయి. చిన్నారుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఎటు వెళ్లాలో తెలిపే బోర్డులు ప్రదర్శించకపోవడంతో భక్తులు గందరగోళానికి గురయ్యారు.

రోదిస్తున్న చిన్నారి

తీవ్ర అస్వస్థతకు గురైన భక్తున్ని అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం

వీవీఐపీ గేటు వద్ద తోపులాటలో కిందపడిపోయిన మహిళ

వ్యవస్థలతోనే రాజ్యాంగానికి సవాళ్లు

అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

సాక్షి, అమరావతి/కృష్ణలంక(విజయవాడతూర్పు): దేశంలో రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన వ్యవస్థలే రాజ్యాంగానికి సవాళ్లు విసురుతున్నాయని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ మౌలిక స్వరూపానికీ ముప్పు పొంచి ఉందన్నారు. రాజ్యాంగం మౌలిక స్వరూపం, ప్రాథమిక హక్కులను మార్చే అధికారం పార్లమెంటుకు లేదని 1973లో కేశవానంద భారతి వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. జన విజ్ఞాన వేదిక, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలూ) ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో 'భారత రాజ్యాంగం–సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సెమినార్‌లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. న్యాయస్థానాల నుంచీ రాజ్యాంగానికి సవాళ్లు ఎదురవుతున్నాయని అభిప్రాయపడ్డారు. చట్ట సభల్లో గవర్నర్ ప్రసంగిస్తుండగా ప్రతిపక్షాలు వాకౌట్ చేయడం చూశామని, ఇటీవల ఏకంగా గవర్నర్‌లే వాకౌట్ చేస్తున్న దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ గవర్నర్‌లు ప్రసంగం నుంచి వాకౌట్ చేయడాన్ని తప్పుబట్టారు. రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేసిన వారే విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర ముప్పు

దేశంలో ప్రస్తుతం సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీమ్ (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) స్థానంలో వీబీ–జీ రామ్ జీ బిల్లును గోప్యంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేశారని పేర్కొన్నారు. ఇలా రాష్ట్రాల అధికారాలను హరించేయడం రాజ్యాంగ మౌలిక స్వరూపానికే గొడ్డలి పెట్టు అని అభిప్రాయపడ్డారు. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య తీవ్ర అసమానతలు ఉంటున్నాయని ఆవేదన చెందారు. కొన్ని దశాబ్దాలు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్న ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ అవార్డు గ్రహీత అమర్త్యసేన్‌కు ఎన్నికల సంఘం(ఈసీ) నోటీసు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ లౌకికవాదం చాలా సవాళ్లు ఎదుర్కొంటోందని, ప్రశ్నిస్తే అర్బన్ నక్సల్స్ అని ముద్ర వేస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ హక్కులు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని పేర్కొన్నారు. సెమినార్‌లో ఐలూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీలు బాలసుబ్రహ్మణ్యం, గేయానంద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ర్యాలీపై అక్రమ కేసు నమోదు

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాము బెయిల్‌పై విడుదలై ఇంటికి చేరుకునే క్రమంలో నిర్వహించిన ర్యాలీపై పోలీసులు శనివారం రాత్రి అక్రమ కేసు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మేడపాటి నాగిరెడ్డి, స్వామి, రాంబాబులపై వివిధ సెక్షన్‌లు బనాయించి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం రింగ్‌సెంటర్‌లో బాణాసంచా కాల్చడం , తదితర కారణాలతో పలు సెక్షన్‌లతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీతారామశాస్త్రి కాంస్య విగ్రహం ఆవిష్కరణ

సిరివెన్నెల సీతారామశాస్త్రి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ త్రివిక్రమ్

అనకాపల్లి: తానా సాహిత్య విభాగం, ప్రపంచ సాహిత్య వేదిక అనకాపల్లి సిరివెన్నెల కళాపీఠం ఆధ్వర్యంలో దివంగత ప్రముఖ సినీ గేయ రచయిత పద్మశ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి కాంస్య విగ్రహాన్ని ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం సీతారామశాస్త్రి మహోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ అనకాపల్లిలో పుట్టి పెరిగిన సీతారామశాస్త్రి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాహితీవేత్తగా, గేయ రచయితగా ఈ ప్రాంతానికి ఎంతో గౌరవాన్ని తెచ్చారన్నారు. ఆయన జన్మించిన ప్రాంతంలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి కళాపీఠం ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం అవార్డు ఇవ్వాలనే ఆలోచనతో ఈ కార్యక్రమం మొదలు పెట్టామన్నారు. అనంతరం సీతారామశాస్త్రి జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీతారామశాస్త్రి కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

సరకు హ్యాండ్లింగ్‌లో విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

సాక్షి, విశాఖపట్నం: మేజర్ పోర్టులతో పోటీ పడుతూ సరకు రవాణాలో సరికొత్త రికార్డుతో విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) దూసుకుపోతోంది. తాజాగా రైల్వే రేక్‌ల హ్యాండ్లింగ్‌లో తన రికార్డును తానే తిరగరాసింది. ఈ నెల 24న 24 గంటల్లో 58 రైల్వే రేక్‌ల సరకు ఎగుమతి దిగుమతులు చేసింది. ఇందులో పోర్టులో ఇన్‌కమింగ్ రేక్స్ 26 ఉండగా.. అవుట్ గోయింగ్ రేక్స్ 32 ఉన్నాయని పోర్టు చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. గతేడాది నవంబర్ 15న 57 రేక్స్ హ్యాండ్లింగ్ రికార్డును తిరగరాసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో బెర్తుల ఆధునికీకరణ పనులు పూర్తి చేసి దేశంలోనే నంబర్ వన్ పోర్టుగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు.



క్లుప్తంగా...

8వ శతాబ్దం నాటి తెలుగు శాసనం లభ్యం

8వ శతాబ్దం నాటి తెలుగు అక్షరాల శాసనం

బేస్తవారిపేట: 8వ శతాబ్దం నాటి పురాతన తెలుగు అక్షరాల శాసనం మార్కాపురం జిల్లా బేస్తవారిపేట మండలంలోని పిటికాయగుళ్ల గ్రామం పిఠికేశ్వర ఆలయంలో బయటపడింది. ఆలయ ప్రాంగణంలో (గర్భగుడికి ముందు) ఉన్న ఆరు నిలువు రాతి స్తంభాల్లో ఒకదానిపై శాసనం చెక్కబడింది. ఈ శాసనాన్ని చారిత్రక పరిశోధకుడు తురిమెళ్ల శ్రీనివాసప్రసాద్ గుర్తించి, ఫొటోలను ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపారు. ఇది రేనాడును (పూర్వపు కర్నూలు, కడప జిల్లాలు) పరిపాలించిన బాదామి చాళుక్యుల కాలంనాటి 8వ శతాబ్దానికి చెందిన అచ్చ తెలుగు శాసనంగా ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ధృవీకరించింది. ప్రణమిల్లి ఆచారి అనే వ్యక్తి ఇక్కడ కొత్త కట్ట నిర్మించారని ఆ శాసనంలో ఉందని పేర్కొన్నారు.

దళిత యువతిపై లైంగికదాడి

తిరుపతి క్రైమ్: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తి మాయ మాటలు చెప్పి దళిత యువతిపై లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ మండలంలో నివాసముంటున్న 19 ఏళ్ల దళిత యువతికి కడపకు చెందిన యశ్వంత్‌రాజ అనే వ్యక్తి కొద్దికాలం కిందట ఇన్‌స్టాగ్రామ్ లో పరిచయమయ్యాడు. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఈ నెల 21న ఆ యువకుడు తిరుపతికి వస్తున్నానని యువతికి తెలిపాడు. ఇదే క్రమంలో అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని రామచంద్రనగర్‌లోని ఓ హోటల్ రూమ్‌కి తీసుకువెళ్లి యువతిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్లిన యువతి డీలాగా ఉండడంతో తల్లి గమనించి ఏమైందని ప్రశ్నించగా జరిగిన విషయాన్ని తెలిపింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు 24వ తేదీ రాత్రి ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. యువతిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

స్పృహ కోల్పోతున్నా విధుల్లో అంకితభావం

సమయస్ఫూర్తితో బస్సును పక్కకు ఆపిన ఆర్టీసీ డ్రైవర్

నాగేశ్వరరావు

పొదిలి రూరల్: అస్వస్థతకు గురై, స్పృహ కోల్పోతున్నా ఆర్టీసీ డ్రైవర్ విధి నిర్వహణను మరవలేదు. బస్సు స్టీరింగ్ వదలలేదు. సమయస్ఫూర్తితో నిదానంగా బస్సు నడుపుకుంటూ రోడ్డు పక్కన ఆపేశారు. ఈ ఘటన ఆదివారం మార్కాపురం జిల్లా పొదిలి మండలంలోని కాటూరివారిపాలెం–అగ్రహారం మార్గం మధ్యలో జరిగింది. మార్కాపురానికి చెందిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ఒంగోలు నుంచి మార్కాపురం వెళ్తుండగా మధ్యలో బస్సు డ్రైవర్ జి.నాగేశ్వరరావు ఫిట్స్ లక్షణాలతో ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. స్పృహ కోల్పోతున్నా స్టీరింగ్ వదలకుండా చాకచక్యంగా సమయస్ఫూర్తితో బస్సును రోడు పక్కకు తీసి ఆపేశారు. దీంతో 47 మంది ప్రయాణికులు పెద్ద ప్రమాదం నుంచి బయటపడి ఊపిరి పీల్చుకున్నారు. కండక్టర్ నారాయణమ్మ ఆర్టీసీ ఉన్నతాధికారులకు, 108కు సమాచారం అందించారు. 108లో నాగేశ్వరరావును పొదిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నాగేశ్వరరావు చికిత్స పొందుతున్నారు.

ఏసీబీకి చిక్కిన సీఐ, హెడ్‌కానిస్టేబుల్

నాయుడుపేట టౌన్: తిరుపతి జిల్లా నాయుడుపేట అర్బన్ సీఐ బాబితోపాటు హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహన్‌రాజు ఏసీబీకి చిక్కారు. ఆదివారం రాత్రి ఓ మద్యం షాపు క్యాషియర్ నుంచి హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్‌రాజు రూ.30 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ ఇచ్చిన సమాచారంతో అర్బన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సీఐ బాబినీ అదుపులోకి తీసుకుని రికార్డులను తనిఖీచేశారు. తిరుపతి జిల్లా ఏసీబీ అడిషనల్ ఎస్పీ విమలకుమారి వివరాలు వెల్లడించారు. శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డులోని మద్యం షాపులో క్యాషియర్‌గా పనిచేస్తున్న వ్యక్తి బెల్టుషాపులకు అక్రమంగా మద్యం అమ్ముతున్నాడని సీఐ కేసు నమోదు చేశారు. ప్రతి నెలా కొంత మొత్తం మామూలు కూడా ఇవ్వాలని హుకుం జారీ చేశారు. దీంతో దుకాణ యజమానితోపాటు షాపు క్యాషియర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఏసీబీ అధికారులు షాపు క్యాషియర్‌తో సీఐకి ఫోన్ చేయించి వచ్చి డబ్బు తీసుకెళ్లాలని చెప్పించారు. దీంతో సీఐ బాబి హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహన్‌రాజును పంపారు. అతడికి క్యాషియర్ నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. సీఐని, హెడ్‌కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకున్నారు.

'వెలిగొండ'నూ కొట్టేద్దాం!

- 1996 నుంచి 2004 మధ్య ఈ ప్రాజెక్టుకు చంద్రబాబు వెచ్చించింది కేవలం రూ.పది లక్షలే..
- కమీషన్ల కోసం ప్రయోగశాలగా మార్చుకున్న వైనం
- జలయజ్ఞంలో భాగంగా రూ.3,581.58 కోట్లు వ్యయం చేసి సింహభాగం పనులు పూర్తి చేయించిన మహానేత వైఎస్సార్

వెలిగొండ టన్నెల్స్ నుంచి నల్లమలసాగర్‌కు నీటిని తరలించే కాలువ

ప్రాజెక్టును పూర్తి చేయకపోయినా మరో క్రెడిట్ చోరీకి సిద్ధమవుతున్న చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే రికార్డు సమయంలో రెండు టన్నెల్స్ పనులన్నీ పూర్తి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు మరో క్రెడిట్ చోరీకి సిద్ధమవుతున్నారు. విశాఖలో డేటా సెంటర్, భూముల సమగ్ర రీ సర్వే, గత ప్రభుత్వం చేపట్టిన ఇతరత్రా కార్యక్రమాలను తన ఖాతాలో వేసుకోవడానికి పాట్లు పడుతున్న ఆయన చూపు తాజాగా 'వెలిగొండ' ప్రాజెక్టుపై పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే రికార్డు సమయంలో రెండు టన్నెల్స్ పనులన్నీ పూర్తయినప్పటికీ, నల్లమలసాగర్‌కు నీటిని తరలించడంలో ఘోరంగా విఫలమైన చంద్రబాబు సర్కారు.. ఇప్పుడు గత ప్రభుత్వం కృషినంతటినీ తన ఘనతగా చెప్పుకునేందుకు సన్నద్ధమవుతోంది. త్వరలో సీఎం చంద్రబాబు వెలిగొండ సందర్శించి.. పూర్తయిన పనులన్నీ తన ఘనతేనని చాటుకునేందుకు సిద్ధమైపోయారు. వాస్తవానికి దశాబ్దాల స్వప్నం వెలిగొండ సాకారమైందని.. శ్రీశైలం నుంచి జంట సొరంగాల ద్వారా కృష్ణా జలాలు నల్లమలసాగర్‌కు చేరడంతో తమ కష్టాలు కడతేరుతాయనుకున్న ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల ప్రజల ఆశలను చంద్రబాబు ప్రభుత్వం అడియాశలు చేసింది. ఈ ప్రాజెక్టులో అత్యంత సంక్లిష్టమైన జంట సొరంగాలను (ఆసియాలోనే అతి పొడవైనవి) రికార్డు సమయంలో నాటి సీఎం వైఎస్ జగన్ పూర్తి చేసి.. 2024 మార్చి 6న జాతికి అంకితం చేశారు. నల్లమలసాగర్‌లో ముంపునకు గురయ్యే 11 గ్రామాల్లోని 7,321 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించడానికి 2024 నాటికే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాలనీలను సిద్ధం చేసింది. వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద నిర్వాసితులకు పరిహారం చెల్లించి, రూ.992 కోట్లు వ్యయం చేసి, పునరావాసం కల్పించి 2024 సీజన్‌లో శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 841 అడుగులకు చేరగానే సొరంగాల ద్వారా కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు తరలించి, దుర్భిక్ష ప్రాంతాలను సుభిక్షం చేయడానికి ప్రణాళికను సిద్ధం చేసింది. కేవలం వైఎస్ జగన్‌కు మంచి పేరొస్తుందనే దుర్బుద్ధితోనే నల్లమలసాగర్ నిర్వాసిత కుటుంబాలకు 20 నెలలుగా పునరావాసం కల్పించకుండా చంద్రబాబు సర్కార్ జాప్యం చేస్తోందని సాగు నీటి రంగ నిపుణులు, రైతులు, రైతు సంఘాల నేతలు ఆక్షేపిస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టుపై ఆది నుంచి సీఎం చంద్రబాబుకు ఉన్న కపట ప్రేమ మరోసారి నిరూపితమైందని ఎత్తిచూపుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి 2024–25లో 1,439 టీఎంసీలు, 2025–26లో 1,936.79 టీఎంసీల ప్రవాహం వచ్చి.. ప్రకాశం బ్యారేజీ మీదుగా సముద్రంలోకి 2024–25లో 848.96 టీఎంసీలు, 2025–26లో 1,652.12 టీఎంసీలు కలిశాయని ఎత్తి చూపుతున్నారు.

టీడీపీ హయాంలో నాసిరకంగా పనులు

వైఎస్సార్‌సీపీ సర్కార్ తయారు చేసిన ప్రణాళిక ప్రకారం నిర్వాసితులకు పునరావాసం కల్పించి ఉంటే.. 2025 ఖరీఫ్ సీజన్‌లో కృష్ణా వరద జలాలను వెలిగొండ జంట సొరంగాల ద్వారా ఒడిసిపట్టి.. నల్లమలసాగర్‌కు తరలించి ఉంటే తమ ప్రాంతాలు సుభిక్షం అయ్యేవని రైతులు స్పష్టం చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి జంట సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌ను అనుసంధానం చేసే ఫీడర్ ఛానల్ పనులు 2004 నుంచి 2014 మధ్య చేయగా, మిగిలిన పనులను 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం అత్యంత నాసిరకంగా చేసింది. దీంతో 2025లో కురిసిన భారీ వర్షాలకు టీడీపీ సర్కార్ పనులు చేసిన ప్రాంతాల్లో ఫీడర్ చానల్ కోతకు గురైంది. ఫలితంగా ఇప్పుడు ఫీడర్ ఛానల్ బలహీనంగా ఉన్న చోట్ల రిటైనింగ్ వాల్, మిగతా ప్రాంతాల్లో కాంక్రీట్ లైనింగ్ చేసే పనులను రూ.456 కోట్లతో చేపట్టి.. వాటిని అస్మదీయ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టడం గమనార్హం.

చంద్రబాబు సర్కార్ దోపిడీని కడిగేసిన కాగ్

ఎన్టీఆర్‌కు 1995లో వెన్నుపోటు పొడిచి అధికారాన్ని చేజిక్కించుకున్నాక.. 1996 లోక్‌సభ ఎన్నికల రూపంలో ఎదురైన తొలి గండాన్ని గట్టెక్కేందుకు ఆ ఏడాది మార్చి 5న గొట్టిపడియ వద్ద నాటి సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 1995 నుంచి 2004 వరకు ఈ ప్రాజెక్టు కోసం వెచ్చించింది కేవలం రూ.పది లక్షలు మాత్రమే. అదీ శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన సభ ఏర్పాట్లు, ఖర్చుల కోసం వ్యయం చేశారు. అప్పట్లో చంద్రబాబు పనులు చేపట్టి ఉంటే.. తెలుగుగంగ ప్రాజెక్టుకు కేడబ్ల్యూడీటీ (కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్)–2 నీటిని కేటాయించినట్లే వెలిగొండ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు చేసి ఉండేదని సాగు నీటి రంగ నిపుణులు ఎత్తి చూపుతున్నారు. విభజన నేపథ్యంలో 2014లో మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ప్రజాధనాన్ని దోచుకోవడానికి వెలిగొండ ప్రాజెక్టును ప్రయోగశాలగా మార్చుకున్నారు. 2014 నుంచి 2019 వరకు రూ.1,414.51 కోట్లు ఖర్చు చేసినా, పనుల్లో ఏమాత్రం ప్రగతి కన్పించక పోవడమే చంద్రబాబు సర్కార్ చేసిన దోపిడీకి నిదర్శనం. జీవో–22 (ధరల సర్దుబాటు), జీవో 63 (పనుల పరిమాణం ఆధారంగా బిల్లుల చెల్లింపు)ను వర్తింపజేసి.. కాంట్రాక్టర్లకు ఉత్తినే రూ.630.57 కోట్లు దోచిపెట్టారు. 2017 నాటికే వెలిగొండను పూర్తి చేస్తామని ప్రకటించి.. టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్)ల మరమ్మతుల కోసం కాంట్రాక్టర్లకు రూ.66.44 కోట్లను ఇచ్చేసి, కమీషన్లు వసూలు చేసుకున్నారు. మరమ్మతు చేయకపోవడం వల్ల టీబీఎంలు ఎందుకూ పనికి రాకుండా పోవడమే అందుకు నిదర్శనం. 2017, 2018, 2019 నాటికి పూర్తి చేస్తామంటూ ఎప్పటికప్పుడు చెబుతూ వచ్చారు. వెలిగొండ ప్రాజెక్టులో చంద్రబాబు దోచేయడాన్ని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కడిగి పారేసింది.

వెలిగొండ సొరంగాల తవ్వకం పనులు ఇలా.. (కిలోమీటర్లలో)	వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో	2014-19 (చంద్రబాబు హయాంలో)	2019-24 (వైఎస్ జగన్ హయాంలో)	మొత్తం
టన్నెల్-1	11.586	4.331	2.883	18.800
టన్నెల్-2	8.747	2.355	7.685	18.787
మొత్తం	20.333	6.686	10.568	37.587

ఇంజినీరింగ్ అద్భుతం.. నల్లమలసాగర్

ప్రకాశం జిల్లాలో విస్తరించిన నల్లమల పర్వత శ్రేణులకు సమాంతరంగా వెలుపల ఉన్న కొండలను వెలిగొండలు అంటారు. వెలిగొండ శ్రేణుల్లో సుంకేశుల, కాకర్ల, గొట్టిపడియ వద్ద కొండల మధ్య ఖాళీ ప్రదేశాల(గ్యాప్)ను కలుపుతూ 373.5 మీటర్ల పొడవు, 63.65 మీటర్ల ఎత్తుతో సుంకేశుల డ్యామ్.. 587 మీటర్ల పొడవు, 85.9 మీటర్ల ఎత్తుతో గొట్టిపడియ డ్యామ్.. 356 మీటర్ల పొడవు, 57 మీటర్ల ఎత్తుతో కాకర్ల డ్యామ్‌లు నిర్మించడంతో నల్లమల పర్వత శ్రేణులు, వెలిగొండ కొండల మధ్య 62.40 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో 53.85 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నల్లమలసాగర్ సహజ సిద్ధంగా రూపు దిద్దుకుంది. ఇదో ఇంజినీరింగ్ అద్భుతమని సాగు నీటి రంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు. నల్లమలసాగర్ పనులను మహానేత వైఎస్ పూర్తి చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కొల్లంవాగు ద్వారా రోజుకు 11,583 క్యూసెక్కులు తరలించేలా కొల్లంవాగు కుడి వైపున ఉన్న కొండను తొలచి, రెండు సొరంగాలు (టన్నెల్–1 ద్వారా 3001 క్యూసెక్కులు, టన్నెల్–2 ద్వారా 8,582 క్యూసెక్కులు) తవ్వి.. ఫీడర్ ఛానల్ ద్వారా నల్లమలసాగర్‌కు కృష్ణా జలాలను తరలిస్తారు. వెలిగొండ ప్రాజెక్టులో 18.8 కి.మీల పొడవున తవ్విన రెండు సొరంగాలు ఆసియా ఖండంలోనే అతి పెద్ద నీటి పారుదల సొరంగాలు కావడం గమనార్హం.

ఇచ్చిన మాట మేరకు పూర్తి చేసిన జగన్

- వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తానని పాదయాత్రలో వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఐదేళ్ల పాలనలో రెండేళ్లు కరోనా మహమ్మారి ప్రభావం వల్ల పనులు చేయలేని పరిస్థితి. అయినా సరే.. మొదటి సొరంగం పనుల్లో మిగిలిన 2.883 కిలోమీటర్ల పనులను 2019 నవంబర్లో ప్రారంభించి.. కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ 2021 జనవరి 13 నాటికి పూర్తి చేయించారు.
- 2014–19 మధ్య టీడీపీ సర్కార్ హయాంలో మొదటి సొరంగం రోజుకు సగటున 2.41 మీటర్ల మేర తవ్వితే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోజుకు సగటున 4.12 మీటర్ల మేర తవ్వడం గమనార్హం. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి మొదటి సొరంగం ద్వారా నల్లమలసాగర్‌కు నీటిని విడుదల చేసే హెడ్ రెగ్యులేటర్ పనులను అదే ఏడాది (2021) పూర్తి చేయించారు.
- రెండో సొరంగంలో మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని 2019 ఎన్నికలకు ముందు భారీగా పెంచేసిన చంద్రబాబు.. వాటిని అధిక ధరలకు కట్టబెట్టి, ప్రజాధనాన్ని దోచి పెట్టారు. వాటిని రద్దు చేసిన వైఎస్ జగన్.. రివర్స్ టెండరింగ్ నిర్వహించి, టీడీపీ సర్కార్ అప్పగించిన ధరల కంటే రూ.61.76 కోట్లు తక్కువకు పూర్తి చేసేందుకు ముందుకొచ్చిన సంస్థకు 7.698 కిలోమీటర్ల సొరంగం పనులను అప్పగించారు. తద్వారా చంద్రబాబు అక్రమాలను ప్రజల ముందు పెట్టారు.
- రెండో సొరంగంలో టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్)కు కాలం చెల్లడంతో రోజుకు ఒక మీటర్ పని జరగడం కష్టంగా మారింది. దాంతో 2022లో మనుషుల ద్వారా పనులు చేయించాలని అధికారులకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేశారు. మొదటి సొరంగం నుంచి రెండో సొరంగంలోకి 17.8 కి.మీ, 16.555 కి.మీ, 14.5 కి.మీ, 13.5 కి.మీ, 12.5 కి.మీ వద్ద సొరంగాలను తవ్వి.. అక్కడ మనుషులతో సొరంగాన్ని తవ్వించేలా పనులు చేపట్టారు. తద్వారా రికార్డు సమయంలో 7.685 కి.మీల పొడవున సొరంగం తవ్వకం పనులను 2024 జనవరి 21 నాటికి పూర్తి చేయించారు. హెడ్ రెగ్యులేటర్ పనులు కూడా పూర్తి చేశారు. శ్రీశైలానికి వరద వచ్చేలోగా రెండో సొరంగం నుంచి టీబీఎంను బయటకు తీయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. 2014–19 మధ్య చంద్రబాబు సర్కార్ హయాంలో రెండో సొరంగం రోజుకు సగటున 1.31 మీటర్ల మేర తవ్వితే.. జగన్ ప్రభుత్వ హయాంలో రోజుకు 7.25 మీటర్లు (టీబీఎం ద్వారా 1.45, మనుషుల ద్వారా 6.80 మీటర్లు) తవ్వడం గమనార్హం.
- 2014–19లో టీడీపీ సర్కార్ చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిన తీగలేరు కాలువను నల్లమల సాగర్‌కు అనుసంధానం చేసేలా సొరంగం, హెడ్ రెగ్యులేటర్, తూర్పు ప్రధాన కాలువను నల్లమలసాగర్‌కు అనుసంధానం చేసేలా సొరంగం తవ్వకం పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించింది. శ్రీశైలంలోకి కృష్ణా వరద జలాలు వచ్చిన వెంటనే.. సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌కు తరలించి.. ఆయకట్టుకు నీళ్లందించడానికి లైన్ క్లియర్ చేశారు.
- 2019–24 మధ్య కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ.. ఆర్థిక ఇబ్బందుల్లోనూ వెలిగొండ ప్రాజెక్టుకు రూ.1,046.46 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చు చేసింది. ప్రాజెక్టు పనులకు పెట్టిన ప్రతి పైసా సద్వినియోగమయ్యేలా జాగ్రత్తలు తీసుకుని శరవేగంగా పూర్తి చేయించింది.
- వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో దుర్భిక్ష ప్రాంతాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీటి సరఫరాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ఆ మూడు జిల్లాల్లోని 30 మండలాల్లో 15.25 లక్షల మంది తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది.
- వెనుకబడిన ఉమ్మడి ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధికి వైఎస్ జగన్ రూపొందించిన ప్రణాళికలో భాగంగా దొనకొండలో ఏర్పాటు చేసే మెగా ఇండస్ట్రియల్ హబ్ 2.58 టీఎంసీలు, పామూరు నిమ్జ్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్)కు 1.27 టీఎంసీల సరఫరాకు లైన్ క్లియర్ చేశారు. దొనకొండ, పామూరు ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి ఊతం ఇవ్వడం ద్వారా భారీ ఎత్తున ఉపాధి అవకాశాలను యువతకు కల్పించడానికి ప్రణాళిక రూపొందించారు.

మహానేత వైఎస్ ముందు చూపునకు తార్కాణం

- శ్రీశైలం ప్రాజెక్టుకు వరద వచ్చే 45 రోజుల్లో రోజుకు 85 క్యూమెక్కులు (3,001 క్యూసెక్కులు) చొప్పున తరలించే సామర్థ్యంతో 7 మీటర్ల వ్యాసం, 18.80 కి.మీల పొడవుతో సొరంగం తవ్వి.. వెలిగొండ కొండల్లో నిర్మించే నల్లమల సాగర్‌కు తరలించి.. ప్రకాశం జిల్లాలో దుర్భిక్ష ప్రాంతాలకు సాగు, తాగునీళ్లు అందించాలని 1993–94లో డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) రూపొందించారు. కానీ.. 2004 వరకు ఈ ప్రాజెక్టు పనులను ఎవరూ చేపట్టలేదు.
- మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించాక నదీ జలాలను మళ్లించి తెలుగు నేలను సుభిక్షం చేయడానికి జలయజ్ఞం చేపట్టారు. ఈ క్రమంలో వెలిగొండ ప్రాజెక్టు డీపీఆర్‌ను సమూలంగా మార్చేశారు. కృష్ణా నదికి వరద రోజులు క్రమేణ తగ్గుతున్న నేపథ్యంలో.. శ్రీశైలానికి వరద వచ్చే 45 రోజుల్లోనే రోజుకు 11,584 క్యూసెక్కులు చొప్పున 43.50 టీఎంసీలను తరలించేలా జంట సొరంగాలు (మొదటిది 85 క్యూసెక్కుల సామర్థ్యం, రెండోది 243 క్యూసెక్కుల సామర్థ్యం) తవ్వి.. కొత్తగా 53.85 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే నల్లమలసాగర్‌లో నిల్వ చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. తద్వారా ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో వర్షాభావ ప్రాంతాల్లో 4,47,300 (తీగలేరు కెనాల్ ద్వారా 62 వేలు, తూర్పు ప్రధాన కాలువ ద్వారా 3,70,800, గొట్టిపడియ కాలువ ద్వారా 9,500 ఎకరాలు) ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతోపాటు.. ఆ మూడు జిల్లాల్లో 30 మండలాల్లోని 15.25 లక్షల మంది దాహార్తిని శాశ్వతంగా తీర్చాలనే లక్ష్యంతో వైఎస్ రాజశేఖరరెడ్డి 2004 అక్టోబర్ 27న పనులకు శ్రీకారం చుట్టారు.
- జలయజ్ఞంలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టుకు రూ.3,581.58 కోట్లు ఖర్చు చేసి.. నల్లమలసాగర్‌తోపాటు సొరంగాల్లో చాలా వరకు పనులు పూర్తి చేయించారు. సొరంగాలను నల్లమలసాగర్‌కు అనుసంధానం చేసేలా 21.8 కి.మీల పొడవున 11,585 క్యూసెక్కులను తరలించేలా ఫీడర్ ఛానల్ పనులను చేపట్టారు. తీగలేరు కెనాల్, తూర్పు, పశ్చిమ ప్రధాన కాలువ, గొట్టిపడియ కెనాల్ పనులను చేపట్టారు.

ఏమనుకుంటున్నావ్.. నన్నే పక్కకెళ్లమంటావా?

- విశాఖ ఉత్సవ్‌లో కలెక్టర్‌పై రెచ్చిపోయిన టీడీపీ మేయర్
- హరేందిరప్రసాద్ చేతుల్ని నెట్టేసి వేలు చూపిస్తూ వార్నింగ్ ఇచ్చిన పీలా శ్రీనివాసరావు
- మంత్రుల సమక్షంలోనే వీరంగం

కలెక్టర్‌ను నెట్టేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

కలెక్టర్‌పై మేయర్ ఆగ్రహం వీడియో కోసం క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయండి

సాక్షి, విశాఖపట్నం: 'నేను నగర ప్రథమ పౌరుడిని. నన్ను కూర్చున్నచోట నుంచి లేపి పక్కకెళ్లమంటావా.. ఏమనుకుంటున్నావ్.. అసలేం మాట్లాడుతున్నావ్.. ప్రొటోకాల్ గురించి తెలీదా.. నేను ఈ విషయాన్ని వదలను..' అంటూ విశాఖ నగర టీడీపీ మేయర్ పీలా శ్రీనివాసరావు జిల్లా మేజిస్ట్రేట్ అయిన కలెక్టర్ హరేందిరప్రసాద్‌తో రెచ్చిపోయి మాట్లాడారు. విశాఖ ఉత్సవ్ ప్రారంభోత్సవంలో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీరిద్దరి మధ్య ప్రొటోకాల్ వివాదం తలెత్తినట్లు సమాచారం. విశాఖ ఉత్సవ్ ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్.. మేయర్ శ్రీనివాసరావును కాస్త పక్కన కూర్చోగలరు.. అని అన్నట్లు తెలిసింది. అంతే.. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన మేయర్ శివాలెత్తిపోయారు. హోంమంత్రి అనిత సమక్షంలోనే వాదులాటకు దిగారు. అక్కడ నుంచి విసురుగా లేచి వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. కలెక్టర్ జోక్యం చేసుకుని.. తాను వేరే ఉద్దేశంతో అనలేదని, వచ్చి కూర్చోవాలని సర్ది చెప్పేందుకు యత్నించినా ఆయన శాంతించలేదు. తమాషాగా ఉందా అంటూ కలెక్టర్‌పై రెచ్చిపోయారు. మంత్రులు దుర్గేష్, వీరాంజనేయస్వామి, అనిత కలెక్టర్‌ని వారించసాగారే తప్ప మేయర్‌ని నిలువరించే ప్రయత్నం చేయలేదు. దీంతో పీలా శ్రీనివాసరావు మరింత రెచ్చిపోయి హడావుడి చేశారు. కూర్చోండి.. రండి.. అంటూ కలెక్టర్ మేయర్‌పై చేతులు వేసి బతిమిలాడారు. మేయర్ ఒక్కసారిగా కలెక్టర్ చేతుల్ని బలంగా నెట్టేసి.. వేలు చూపిస్తూ వార్నింగ్ ఇచ్చారు. వెళ్లిపోతాను లెండి.. ఏం మాట్లాడుతున్నావయ్యా.. అంటూ అక్కడి నుంచి విసురుగా వెళ్లిపోయారు. ఈ పరిణామంతో కలెక్టర్ నిశ్చేష్టుడయ్యారు. ముగ్గురు మంత్రులున్నా కనీసం ఈ వివాదాన్ని ఆపేందుకు ప్రయత్నించకపోవడంతో మనస్తాపానికి గురైన కలెక్టర్ అక్కడి నుంచి వెళ్లి కొద్దిసేపు కారులో కూర్చున్నారు. ఈ వివాదానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. జిల్లా మేజిస్ట్రేట్ అయిన కలెక్టర్‌తోనే మేయర్ ఈ విధంగా వ్యవహరించటం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది.

ఏఎస్పీ రవికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం

గణతంత్ర వేడుకల వేళ ఏపీకి మొత్తంగా 19 పతకాలు

రవి మనోహర తిరుమల చారి

సాక్షి, న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవం–2026 సందర్భంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటించిన పతకాల జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం 19 పతకాలు వరించాయి. పోలీస్ విభాగంలో ఒకరికి అత్యంత ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం (పీఎస్‌ఎం) వరించింది. మరో 15 మందికి ప్రతిభావంతమైన సేవా పతకాలు (ఎంఎస్‌ఎం) దక్కాయి. జైళ్ల శాఖ (కరెక్షనల్ సర్వీసెస్) నుంచి ముగ్గురు సిబ్బంది పతకాలకు ఎంపికయ్యారు.

రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం

విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన వారికి ఇచ్చే 'ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్' ఈసారి రాష్ట్రం నుంచి ఒకే ఒక్క పోలీసు అధికారికి దక్కింది. తిరుపతి జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) రవి మనోహర తిరుమల చారి ఈ గౌరవానికి ఎంపికయ్యారు. ఆయన స్వస్థలం కర్నూలు జిల్లా.

పోలీస్ ప్రతిభావంతమైన సేవా పతకాలు

విధి నిర్వహణలో అంకితభావం చాటుకున్న అడిషనల్ ఎస్పీ నుంచి హెడ్‌కానిస్టేబుల్ స్థాయి సిబ్బంది వరకు మొత్తం 15 మందికి 'పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్' లభించింది.

- సింగాల కృష్ణమోహన్, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్
- రాయపు శివారెడ్డి, డీఎస్పీ
- పోలవరపు వెంకట శేష నాగమల్లికార్జునరావు, అసిస్టెంట్ కమాండెంట్
- కరజాడ రామారావు, అసిస్టెంట్ కమాండెంట్
- కుందేటి నరసింహారావు, ఇన్‌స్పెక్టర్
- కామవరపు విక్రమరావు, సబ్ ఇన్‌స్పెక్టర్
- షేక్ షఫీ ఉల్లా, సబ్ ఇన్‌స్పెక్టర్
- కటారి జయరామ్, ఆర్మ్‌డ్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్
- ఈత వెంకటకృష్ణ మునేశ్వరరావు, ఆర్మ్‌డ్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్
- చిన్నావుల శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్
- మాదాసు గంగాధరరావు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్
- అబ్రహం అన్నలదాసు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్
- కొప్పిశెట్టి రామకృష్ణ, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్
- గళ్ల రంగయ్య, హెడ్ కానిస్టేబుల్
- కాశీదేవి నరసింహులు, హెడ్ కానిస్టేబుల్
- జైళ్ల శాఖలో ఉత్తమ సేవలందించినందుకు జైలర్ గొల్లపోతు రవిబాబు, చీఫ్ హెడ్ వార్డర్ దోనేపూడి వెంకట కృష్ణప్రసాద్, హెడ్ వార్డర్ గేరా ఆనందరావుకు 'మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్' లభించాయి.

ఆర్పీఎఫ్ ద.మ. రైల్వే ఐజీకి ప్రతిష్టాత్మక పురస్కారం

అరోమాసింగ్ ఠాకూర్‌ను వరించిన రాష్ట్రపతి విశిష్టసేవా పతకం

మరో ముగ్గురు అధికారులకు రాష్ట్రపతి ప్రతిభా పతకాలు

అరోమా సింగ్ ఠాకూర్

సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్‌ను ప్రతిష్టాత్మక రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం వరించింది. అలాగే దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ ఉత్తమ్‌కుమార్ బందోపాధ్యాయ్, ఎస్ఐ రావుల శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ మహేశ్వర్‌రెడ్డి కర్నాటీకి రాష్ట్రపతి ప్రతిభా పతకాలు లభించాయి. ఈ మేరకు రైల్వేశాఖ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. అరోమాసింగ్ ఠాకూర్ ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తుల పరిరక్షణలో అద్భుత ఫలితాలు సాధించారు. ప్రత్యేకంగా మహిళా ప్రయాణికుల భద్రత కోసం ఆమె ఏర్పాటు చేసిన ఆర్పీఎఫ్ శక్తి బృందాలు రైళ్లలో, రైల్వేస్టేషన్‌లలో అత్యుత్తమ సేవలను అందిస్తున్నాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి గుంటూరు

సోమవారం । 26 । జనవరి । 2026

ఘనంగా జ్యోతి మహోత్సవం

నకరికల్లు: అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన ఉన్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయంలో జ్యోతి మహోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు దిగువకు 2900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 37.3213 టీఎంసీలు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

తెనాలి: వైకుంఠపురంలోని లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం సూర్యప్రభ వాహనంపై స్వామి అమ్మ వార్లను ఉంచి, గ్రామోత్సవం నిర్వహించారు.

న్యూస్‌రీల్

డీఆర్‌ఓ ఖాజావలికి రాష్ట్ర స్థాయి అవార్డు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.ఎస్.కె.ఖాజావలి ఉత్తమ ఎలక్ట్రోరల్ విధానాలను అమలు చేసినందుకు రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా ఈ అవార్డును ఆదివారం అందుకున్నారు. ఈ ఏడాది 'నా భారత్ – నా ఓటు' (మై ఓట్, మై ఇండియా) థీమ్ తో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రియాశీలకంగా పనిచేయడంతో జిల్లా రెవెన్యూ అధికారికి అవార్డు లభించింది.

సూర్యభగవానునికి ప్రత్యేకపూజలు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని అమరేశ్వరాలయంలో ఉన్న సూర్యదేవాలయంలో రథసప్తమి సందర్భంగా సూర్యభగవానునికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతఃకాలనా సూర్యభగవానుడికి ప్రత్యేకంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకా లను పంచామృతాలతో నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్రనామ పూజ చేశా రు. సూర్యదేవాలయ అర్చకుడు సప్తగిరి వరప్రసాద్ మాట్లాడుతూ అమరేశ్వరాలయంలో పరమేశ్వరునికి ఎదురుగా పడమర ముఖంగా సూర్యభగవానుడు ప్రతిష్ఠించటం ప్రత్యేకమన్నారు. ఆలయ అర్చకులు, సిబ్బందితోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా రేణుకమ్మ, నాగేంద్రస్వామి కొలుపులు

నగరంపాలెం(గుంటూరువెస్ట్): గుంటూరులోని శ్రీనగర్ ఆరో వీధిలో కొలువైన త్రిశక్తి పీఠం శ్రీరేణుకమ్మ పెద్దఅంకమ్మ నాగేంద్రస్వామి వార్ల నలభైవ వార్షిక కొలుపుల మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. నిత్య పూజలు అనంతరం భక్తి ప్రపత్తుల నడుమ దేవతమూర్తులను వాహనంపై అలంకరించి, మంగళ వాయిద్యాలు, భాజా భజంత్రీలు, కనకతప్పట్లతో ఊరేగింపుగా నగరోత్సవం కొనసాగింది. ప్రధానవీధుల్లో మహిళలు వారు పోసి కొబ్బరికాయలు కొట్టి సాంబ్రాణి హారతి పట్టారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో త్రిశక్తి పీఠం నిర్వాహకులు కస్తూరి యలమంద వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెడ్డి లేడీస్ హాస్టల్‌కు రూ.25 లక్షలు విరాళం



నాదెండ్ల: పల్నాడు జిల్లా చిరుమామిళ్ల గ్రామానికి చెందిన గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి గుంటూరులోని రెడ్డి లేడీస్ హాస్టల్ బ్లాకు నిర్మాణానికి రూ.25 లక్షలు విరాళాన్ని అందించారు. హాస్టల్ వ్యవస్థాపకురాలు ఉడుముల కోటిరత్నమ్మ ఆధ్వర్యంలో గుంటూరు స్తంభాల గరువులోని రెడ్డి లేడీస్ హాస్టల్ పదేళ్లుగా సేవలందిస్తుంది. ఇందులో ఒక బ్లాక్ నిర్మాణానికయ్యే ఖర్చు రూ.25 లక్షలను హాస్టల్ అధ్యక్ష కార్యదర్శులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, వణుకూరి సూరారెడ్డికి అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని హాస్టల్ నిర్వాహకులు ఆయన్ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హాస్టల్ ఉపాధ్యక్షుడు భీమవరపు పిచ్చిరెడ్డి, జాయింట్ సెక్రటరీ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ రాజేశ్వరరావు, యన్నం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.2 లక్షల విరాళం...

గొరిజవోలు గ్రామంలో రూ.4 కోట్లతో నిర్మిస్తున్న గంగా భ్రమరాంబికా సమేత మల్లిఖార్జునస్వామి ఆలయానికి గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి రూ.2 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందించారు. విరాళాన్ని కమిటీ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డికి అందించారు. కార్యదర్శి చల్లా బసివిరెడ్డి, కోశాధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా కనిపిస్తున్న గుంటూరులోని కలెక్టర్ కార్యాలయం, నగరపాలక సంస్థ కార్యాలయాలు.. గుంటూరు నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో సోమవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు.. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య పాల్గొన్నారు. ఉదయం 11.30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని, జెండా వందనం, కలెక్టర్ ప్రసంగం, సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాల బహూకరణ ఉంటుందని తెలిపారు. – సాక్షి, ఫొటోగ్రాఫర్, గుంటూరు/లక్ష్మీపురం

మందా సాల్మన్ హత్యపై

త్వరలో చలో ఢిల్లీ

- టీడీపీ దాడులపై ఢిల్లీ స్థాయిలో వైఎస్సార్ సీపీ ఉద్యమం
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతాం
- నిందితులను శిక్షించే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టం
- విలేకరుల సమావేశంలో స్పష్టం చేసిన వైఎస్సార్ సీపీ అగ్ర నాయకులు
- పిన్నెల్లి గ్రామంలో మందా సాల్మన్ సంస్మరణ సభ
- నివాళులర్పించిన రాష్ట్ర నాయకులు
- చంద్రబాబు దృష్టిలో దళిత ఓట్లకున్న విలువ వారి ప్రాణాలకు లేదు
- అంబేద్కర్ విగ్రహంపై దాడితో దళితులపై దాడులకు టీడీపీ నాయకుల శ్రీకారం
- దాడులతో వైఎస్సార్‌సీపీ నుంచి దళితులను వేరు చేసే కుట్రలు
- అభివృద్ధి చేయడం చేతకాక దాడులతో దారికి తెచ్చుకునే ఎత్తుగడ
- చంద్రబాబు కుట్రలపై వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం

మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, వేదికపై వైఎస్సార్ సీపీ అగ్ర నేతలు

నరసరావుపేట: చంద్రబాబు దృష్టిలో దళితుల ఓట్లకున్న విలువ వారి ప్రాణాలకు లేదని, అందుకే అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీకి అండగా ఉన్న దళితులపై దాడులు చేసి వారిని పార్టీకి దూరం చేసే కుట్రలు చేస్తున్నారని పార్టీ అగ్ర నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం మీద దాడితోనే దీనికి శ్రీకారం చుట్టడం సిగ్గుచేటన్నారు. టీడీపీ గూండాల దాడిలో మందా సాల్మన్ దారుణ హత్యకు గురై పది రోజులైన సందర్భంగా ఆదివారం నరసరావుపేటలోని కాసు మహేష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాల్మన్ సంస్మరణలో కూటమి ప్రభుత్వంపై నాయకులు తీవ్రంగా విరుచుకుపడ్డారు. అనంతరం నాయకులంతా భారీ ర్యాలీగా పిన్నెల్లి గ్రామానికి వెళ్లి మందా సాల్మన్ కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సాల్మన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి పథకం ప్రకారం నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేసి దాడులు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, చేతనైతే వైఎస్ జగన్ కన్నా ఎక్కువ అభివృద్ధి చేసి పల్నాడు ప్రజల మనసు గెలుచుకోవాలని సవాల్ విసిరారు. అభివృద్ధి చేతకాక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే వారే ఎప్పటికీ అధికారంలో ఉండొచ్చనే పగటి కలలు మానుకోవాలని అన్నారు. వారి వేధింపులను లెక్కచేయకుండా పార్టీ కోసం పోరాడుతున్న కార్యకర్తలను ఈ సందర్భంగా అభినందించారు. త్వరలోనే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి పార్లమెంట్‌లో టీడీపీపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కందుల ఎజ్రా, జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ పాల్గొన్నారు. వారు ఇంకా ఏమన్నారంటే..

ఎస్సీలను నిత్యం వేధిస్తున్నారు..

టీడీపీ అధికారంలోకి రావడంతోనే రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం మీద దాడులు మొదలుపెట్టి ఎస్సీలను నిత్యం వేధిస్తున్నారు. పట్టపగలు హత్యలు చేసి గ్రామాలనే ఖాళీ చేయించే దారుణాలకు పాల్పడుతున్నారు. కూటమి నాయకుల దాడులపై ఎప్పటికప్పుడు పార్లమెంట్‌లో వైఎస్సార్ సీపీ తరఫున గళం వినిపిస్తూనే ఉన్నాం. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే మందా సాల్మన్ దారుణ హత్య జరిగింది. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే రౌడీలతో చేతులు కలుపుతున్న దుర్మార్గ వాతావరణం రాష్ట్రంలో కనిపిస్తోంది. మందా సాల్మన్ హత్యపై జాతీయ మానవహక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ), జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం.

– మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

టీడీపీది పగటి కల

టీడీపీ నాయకుల అరాచక పాలనతో బిహార్ కూడా చిన్నబోయింది. వైఎస్సార్ సీపీ హయాంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు దేశంలో అత్యున్నత స్థాయి అవార్డులు గెలుచుకుంటే, చంద్రబాబు సీఎం అయ్యాక ఏడాదిన్నరలోనే దేశంలోనే 31వ స్థానానికి పడిపోయింది. అంతలా వ్యవస్థలను దిగజార్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. వైఎస్సార్‌సీపీని లేకుండా చేస్తే మళ్లీ అధికారంలోకి రావొచ్చని పగటి కలలు కంటున్నారు. మందా సాల్మన్ హత్యకు కారణమైన ఈ ప్రభుత్వానికి కచ్చితంగా బుద్ధి చెబుతాం.

– నందిగం సురేష్, మాజీ ఎంపీ

గురజాలలో యరపతినేని గూండారాజ్యం

అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే ఏం జరుగుతుందో సాల్మన్ హత్యతో వచ్చిన ప్రజావ్యతిరేకత ద్వారా చంద్రబాబు ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీకి ఇప్పటికే అర్థమైపోయింది. ఈ హత్యలో ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్న వారిని సహకరించిన వారిని ఎవరినీ వదిలిపెట్టం. నిందితులను చట్టపరంగా శిక్షించే దాకా న్యాయస్థానాల్లో పోరాడతాం. గురజాలలో గూండా రాజ్యం నడుపుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్‌కి ప్రజాస్వామ్యం బలం చూపిస్తాం. దాడిచేసి చంపారని ఫోన్ చేసిన బాధితులతో గ్రామంలోకి ఎందుకొచ్చారని ప్రశ్నించిన సీఐ భాస్కరరావుని న్యాయస్థానాల ద్వారా శిక్ష పడేలా చేస్తాం. శాంతిభద్రతల పరిరక్షణలో చూపించిన నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించకతప్పదు.

– కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

సీబీఐతో విచారణ జరిపించాలి

అమాయక దళిత కుటుంబంపై దాడి చేసి చంపితే ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదు. ఫిర్యాదు చేయడానికి వచ్చినా డీజీపీ కనీసం కలవడానికి ఇష్టపడలేదు. దళితుల ప్రాణాలంటే ఈ ప్రభుత్వానికి అంత లెక్కలేనితనం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో దళితులను గ్రామ బహిష్కరణ చేసినా ఆయన పట్టించుకోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా దళితుల మీద దాడులు, దౌర్జన్యాలు, దళిత మహిళల మీద అఘాయిత్యాలు ఎక్కువైపోయాయి. ఈ హత్యపై సీబీఐ విచారణ జరిపించాలి. వైఎస్సార్ సీపీ హయాంలో ఒక మహిళను దారుణంగా చంపితే దళిత చట్టాల ప్రకారం వారిని ప్రభుత్వం ఆదుకుంది. కానీ చంద్రబాబు స్పందించకపోవడం దుర్మార్గం.

– మేరుగ నాగార్జున, మాజీ మంత్రి

జగనన్నని అభిమానిస్తే చంపేస్తారా?

వైఎస్సార్ సీపీకి ఓటు వేశారని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అభిమానించి అండగా ఉన్నారని దళితులను కూటమి ప్రభుత్వం హత్యలు చేయిస్తుంది. జగన్‌ని అభిమానిస్తే చంపేస్తారా..జగన్‌కి అండగా ఉంటే చంపేస్తామని సంకేతాలను చంద్రబాబు ప్రభుత్వం ఇస్తుంది. ఈ రోజు మందా సాల్మన్‌ని చంపి ఆనందంగా ఉండవచ్చు..కానీ రేపు ఖచ్చితంగా ప్రతీకారాలు ఉంటాయనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ప్రతికారం తీర్చుకోలేనంత దద్దమ్మలు దళితులు కాదని, ఓటు అనే ఆయుధం ద్వారా చంద్రబాబుపై ప్రతీకారం తీర్చుకునేందుకు దళితులు సిద్ధంగా ఉన్నారు. సాల్మన్ హత్యని వైఎస్సార్ సీపీ చాలా సీరియస్‌గా తీసుకుంటుంది. సాల్మన్ కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– జూపూడి ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ

పల్నాడు వ్యాప్తంగా ఆటవిక రాజ్యం

ఎమ్మెల్యే యరపతినేని డైరెక్షన్‌లో సీఐ భాస్కర రావు సారథ్యంలో సాల్మన్‌ని దారుణంగా హతమార్చారు. దాదాపు రెండేళ్లుగా గ్రామానికి దూరంగా ఉంటూ భార్యను చూడటానికి వచ్చిన సాల్మన్‌ని చంపడం సిగ్గుచేటు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి పల్నాడు వ్యాప్తంగా ఆటవిక రాజ్యం నడుస్తోంది. గూండాలు, దోపిడీదారులకు అండగా పోలీసులు పనిచేస్తున్నారు. జిల్లాను అభివృద్ధి చేయడం చేతకాక దాడులతో ప్రజలను భయపెట్టాలని చూస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి చేతనైతే అభివృద్ధిలో పోటీపడాలి. మెడికల్ కాలేజీ పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. సాల్మన్ కుటుంబానికి న్యాయం జరిగేదాకా పోరాటం చేస్తాం.

– టీజేఆర్ సుధాకర్‌బాబు, ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే

రాతియుగంవైపు రాష్ట్రం

గత ప్రభుత్వంలో పల్నాడులో శాంతి భద్రతలు నెలకొనేలా కృషిచేశాం. గ్రామాల నుంచి వెళ్లి బయట నివసిస్తున్న వారిని పోలీసుల సాయంతో వెనక్కి రప్పించి కుటుంబంతో ప్రశాంతంగా బతికే వాతావరణం తీసుకొచ్చాం. కానీ సీఎం చంద్రబాబు మాత్రం విజనరీనని చెప్పుకుంటూనే రాష్ట్రాన్ని మళ్లీ రాతి యుగంవైపుకి నడిపిస్తున్నాడు. రెడ్‌బుక్ పాలనతో కక్ష రాజకీయాలకు తెరలేపాడు. గ్రామానికి ఎందుకొచ్చావ్ అని ప్రశ్నిస్తున్న పోలీసులు పనిచేయడం చేతకాని అసమర్థుల కిందే లెక్క. అలాంటి వారు ఉద్యోగాలకు పనికిరారు. తక్షణమే రాజీనామా చేయాలి. బాధితులకు భరోసా ఇవ్వలేకపోవడం ప్రభుత్వ అసమర్థతే అవుతుంది.

– మేకతోటి సుచరిత, మాజీ హోంమంత్రి

టీడీపీ క్షుద్ర రాజకీయాలు

వైఎస్ జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక పార్టీకి అండగా నిలిచే వారి మీద దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేసే నీచ సంస్కృతికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. పోలీసులను అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులు ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నారు. పిన్నెల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీకి ఉన్న ప్రజాబలాన్ని నిర్వీర్యం చేయాలన్న కుట్రతోనే సాల్మన్ హత్య జరిగింది. సాల్మన్ దేహాన్ని ఖననం చేయడానికి కూడా హైడ్రామా చేశారు. కడసారి చూపుకి కూడా నోచుకోనీయకుండా కుటుంబ సభ్యులను, బంధువులను, గ్రామస్తులను అడ్డుకున్నారు. కనీస మానవత్వం లేకుండా అడుగడుగునా క్షుద్ర రాజకీయాలు చేశారు. – పూనూరు గౌతమ్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి

ప్రభుత్వానికి ఎస్సీల బలం చూపిస్తాం..

ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయాలను దోపిడీ, దుర్మార్గాల వైపు నడిపిస్తున్నాడు. శాంతిభద్రతలను కాపాడటం చేతకాని పోలీసులు ఉద్యోగాలకు రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలి. అంతేకానీ అమాయకులైన దళితులను టీడీపీ కక్షలకు బలిపెట్టడం మంచిదికాదు. కూటమి ప్రభుత్వానికి ఎస్సీల బలం చూపిస్తాం. భయపడటానికి పార్టీ కార్యకర్తలు సిద్ధంగా లేరు. వైఎస్ జగన్ నాయకత్వంలో అక్రమాలపై తిరుగుబాటు చేస్తాం. ఊరు బాగుంటే చాలు, ఇదే చివరి హత్య కావాలని చెప్పిన సాల్మన్ బిడ్డల పెద్ద మనసుని అభినందిస్తున్నా. – సాకే శైలజానాథ్, మాజీ మంత్రి

ఘనంగా రథసప్తమి వేడుకలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో ఆదివారం రథసప్తమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో రథసప్తమి పర్వదినం సందర్భంగా ఏడు వాహనాలపై స్వామివారిని ఊరేగించారు. మూడవ వాహనమైన గరుడ వాహనంపై స్వామివారు పూజలు అందుకున్నారు. వాహన కైంకర్యపరులుగా మునగపాటి నాగయ్య, హైమావతి దంపతుల కుమారులు, కుటుంబ సభ్యులు డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు, మరికొంత మంది కైంకర్యంతో పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. విజయకీలాద్రిపై తాడేపల్లిలోని విజయకీలాద్రిపై రథసప్తమి వేడుకలను త్రిదండి చిన్నజీయర్‌స్వామి పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక వాహనంలో అలంకరించి కొండపై ఊరేగింపు నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నజీయర్‌స్వామి రథసప్తమి విశిష్టతను వివరించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విజయకీలాద్రిపై సూర్యభగవానుడికి పూజలు నిర్వహిస్తున్న త్రిదండి చిన్నజీయర్‌స్వామి

మంగళగిరిలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గరుడ వాహనంపై లక్ష్మీ నరసింహస్వామి

గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట ఏర్పాటు చేసిన భారీ పందిళ్లలో మూడు రోజుల పాటు జరిగే 88వ బైబిల్ మిషన్ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాలకు తొలిరోజు భారీ సంఖ్యలో విశ్వాసులు తరలిరాగా, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్ వాక్యోపదేశం చేశారు. ఈ సందర్భంగా కాకాని స్వస్తిశాల సంగీత బృందం క్రైస్తవ భక్తిగీతాలు ఆలపించారు.

– పెదకాకాని

దళితులను బలిగొంటున్న చంద్రబాబు సర్కార్

- రాష్ట్రంలో ఎర్రబుక్ పాలన పేరిట ఎర్రి పరిపాలన
- వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

దాచేపల్లి, పిడుగురాళ్ల: చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక దళితులను బలితీసుకుంటోందని, ఎర్ర బుక్ పాలన పేరిట ఎర్రి పరిపాలన కొనసాగుతోం దని వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దళిత కార్యకర్త మందా సాల్మన్‌ను ఇటీవల టీడీపీ గూండాలు హత్య చేసిన విషయం తెలిసిందే. పిన్నెల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన సాల్మన్ దినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖర్ మాట్లాడుతూ... గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గూండా రాజ్యం సాగుతోందని, నియోజకవర్గాన్ని రక్తమయం చేస్తూ దళితలను అణచివేయడంతోపాటు మరణకాండకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసమర్థ చంద్రబాబు పరిపాలనలో దళితులు, బలహీనవర్గాల వారిని హత్యలు చేస్తున్నారని తెలిపారు. ఇవన్నీ కచ్చితంగా ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. వీటిని ప్రభుత్వమే ప్రోత్సహిస్తూ తెలుగుదేశం నాయకుల ద్వారా చేయిస్తోందని మండిపడ్డారు. పొన్నూరులో టీ స్టాల్ వద్ద ఉన్న ఎస్సీ సర్పంచ్‌పై రాడ్ తీసుకుని దాడి చేస్తే నిందితులపై చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. గురజాల నియోజకవర్గంలోని పిన్నెల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ దళిత కార్యకర్త మందా సాల్మన్‌ని టీడీపీ గూండాలు హత్య చేసినా చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. ఇది ముమ్మాటికీ చంద్రబాబు చేయిస్తున్న నరమేధం అని ఆరోపించారు. సాల్మన్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బాధితులకు న్యాయం జరిగేవరకు ఉద్యమం

చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో దాడులు, వేధింపులు మరీ ఎక్కువగా ఉంటున్నాయి. అయినా అవన్నీ లెక్కచేయకుండా పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు హ్యాట్సాఫ్ చెబుతున్నా. ప్రభుత్వం, పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే మందా సాల్మన్ హత్య జరిగింది. ఇది కచ్చితంగా ప్రభుత్వ హత్యే. వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచిన వ్యక్తుల మీద దాడులు పరిపాటిగా మారాయి. సామాన్యుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. బాధితులనే నిందితులుగా మార్చి చూపిస్తున్నారు. పిన్నెల్లి గ్రామం నుంచి 300 కుటుంబాలు బయటకు వెళ్లి జీవించాల్సిన దుస్థితి వచ్చిందంటే ఇది పోలీసుల చేతకానితనమే. మందా సాల్మన్ కుటుంబానికి న్యాయం చేసే వరకు వైఎస్సార్‌సీపీ పోరాడుతుంది.

– విడదల రజని, మాజీ మంత్రి

పిన్నెల్లి గ్రామంలో శాంతి నెలకొనాలి

చంద్రబాబు దృష్టిలో దళితుల ఓట్లకున్న విలువ వారి ప్రాణాలకు లేదు. చంద్రబాబు సర్కార్ వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు, బహిష్కరణలు, వేధింపులే దీనికి నిదర్శనం. సాల్మన్‌ను దారుణంగా హత్య చేసి పది రోజులవుతున్నా ఇంతవరకు ఏమాత్రం స్పందించని చంద్రబాబు... వైఎస్సార్‌సీపీ సంస్మరణ కార్యక్రమం నిర్వహిస్తుందని తెలుసుకుని గ్రామంలోకి టీడీపీ నాయకులను పంపించి కుటిల రాజకీయాలు చేస్తున్నారు. సాల్మన్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే. దళితుల గ్రామ బహిష్కరణ జరిగి రెండేళ్లవుతుంటే ఒక్కసారి కూడా పట్టించుకోని చంద్రబాబు కారణంగానే ఈ హత్య జరిగింది. సాల్మన్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలి. గ్రామంలో శాంతియుత వాతావరణం తీసుకురావాలి. గ్రామం నుంచి వెళ్లిపోయిన కుటుంబాలను రప్పించాలి. సాల్మన్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది.

– గోపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే

నిందితులను కఠినంగా శిక్షించాలి

వైఎస్సార్‌సీపీ దళిత కార్యకర్త మందా సాల్మన్‌ని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. దళితులను చంపుకుంటూ పోతున్నారు. ఇటువంటి విష సంస్కృతి టీడీపీ నేతలకు తగదు.

– చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్సీ

దళితులపై దాడులు ఆపాలి

సాల్మన్ హత్యను ఈ సమాజం తీవ్రంగా ఖండిస్తోంది. దళితుల మీద దాడులను టీడీపీ నాయకులు ఆపకపోతే రాబోయే రోజుల్లో కచ్చితంగా ప్రతిఫలం అనుభవిస్తారు.

– నారాయణమూర్తి, పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు

పలుకూరు నుంచి వెళ్లిపోయిన 400 కుటుంబాలు

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటయ్యాక వెనుబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల మీద దాడులు నిత్యకృత్యం అయ్యాయి. ఏడాది పాలన పూర్తి కాకుండానే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. 20 నెలల్లో చంద్రబాబు పాలన మీద ప్రజా వ్యతిరేకత పతాకస్థాయికి చేరింది. పిన్నెల్లి మాదిరిగానే బొల్లాపల్లి నియోజకవర్గం పలుకూరులో కూడా టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 400 కుటుంబాలు గ్రామాన్ని విడిచి వెళ్లిపోయాయి. గ్రామంలో భూములన్నీ బీడు బారిపోయాయి. ఇలాంటి దుస్థితిని సృష్టించిన ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. కార్యకర్తలకు, ప్రజలకు పార్టీ అండగా ఉంటుంది.

– బొల్లా బ్రహ్మనాయుడు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే

బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేయాలి

రెండేళ్లుగా 400 కుటుంబాలు ఒక గ్రామాన్ని విడిచి వెళ్లిపోయాయంటే శాంతిభద్రతలు పరిరక్షించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పడానికి వేరే ఉదాహరణలు అవసరం లేదు. సాల్మన్ హత్యకు పోలీసుల నిర్లక్ష్యమే ప్రధాన కారణం. అందుకు కారణమైన పోలీస్ అధికారులను తక్షణం సస్పెండ్ చేయాలి. ఈ దారుణ హత్యపై ప్రభుత్వ పెద్దలు స్పందించకపోగా... కేసును నీరుగార్చాలనే కుట్ర చేస్తున్నారు. సాల్మన్ కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి పరిహారం, ఐదెకరాల పొలం ఇచ్చి ఆదుకోవాలి.

– కొమ్మూరి కనకారావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్

అంత్యక్రియలు నిర్వహించుకోలేని దుస్థితి

సాల్మన్‌ను ప్రత్యర్థులు దారుణంగా ఇనుప రాడ్లతో కొట్టి దాడి చేస్తే, అపస్మారక స్థితిలో ప్రాణాపాయంతో ఆస్పత్రిలో ఉన్న బాధితుడిపైనే పోలీసులు కేసు నమోదు చేశారు. అంటే రెడ్‌బుక్ రాజ్యాంగం అమల్లో పోలీసులు ఎంత అప్రమత్తంగా పనిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు, నిందితులకు అండగా ఉండి బాధితులపైనే కేసులు పెడుతున్నారు. గ్రామం నుంచి వెళ్లిపోయిన 300 కుటుంబాలను వెనక్కి రప్పించే ప్రయత్నం చేయకపోవడం దుర్మార్గం. బయటకెళ్లిన వారు ఎవరైనా మరణిస్తే పోలీసుల రక్షణ లేకుండా గ్రామస్తుడి అంత్యక్రియలు చేసుకోలేని దుస్థితి. పోలీసుల రక్షణలో అంత్యక్రియలు నిర్వహించాలంటే రూ.లక్షలు ఖర్చవుతుందని భయపెడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం మారిన నాటి నుంచి పల్నాడులో ఫ్యాక్షన్ వాతావరణం తీసుకొచ్చారు.

– గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త

క్లుప్తంగా

నీట్ ఎస్ఎస్‌లో డాక్టర్ సాయిపూజకు ఆల్ ఇండియా 39వ ర్యాంక్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇటీవల ప్రకటించిన నీట్ సూపర్ స్పెషాలిటీ పరీక్షా ఫలితాల్లో గుంటూరు మెడికల్ కళాశాలకు చెందిన డాక్టర్ కొండబోలు సాయిపూజ ఆల్ ఇండియా 39వ ర్యాంక్ కైవసం చేసుకున్నారు. గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ అభ్యసించిన సాయిపూజ అదే కళాశాలలో జనరల్ మెడిసిన్ విభాగంలో పీజీ పూర్తి చేశారు. చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆమెకు బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ అవార్డుతో పాటు అనేక విభాగాల్లో గోల్డ్ మెడల్స్ లభించాయి. ఆమె తండ్రి డాక్టర్ కొండబోలు సాంబశివరావు జేకేసీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, తల్లి ఉషా గృహిణి. ఆమె చదువు కొనసాగించడంలో భర్త డాక్టర్ నరేంద్రతో పాటు, అత్తమామలు డాక్టర్ పులుకూరి శివన్నారాయణ. డాక్టర్ లక్ష్మీ ప్రోత్సాహాన్ని అందించారు. అధ్యాపకుల ప్రోత్సాహం, మార్గదర్శకత్వం తాను అఖిల భారతస్థాయిలో 39వ ర్యాంకు సాధించడంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. డాక్టర్ సాయిపూజతోపాటు ఆమె భర్త డాక్టర్ నరేంద్ర, అత్త డాక్టర్ లక్ష్మీ ముగ్గురూ గుంటూరు మెడికల్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు కావడం విశేషం.

రూ.18.43 లక్షల విలువైన సిగరెట్లు సీజ్

తెనాలిరూరల్: తెనాలిలో అక్రమంగా నిల్వ చేసిన సిగరెట్లను విజిలెన్స్, జీఎస్టీ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. సుమారు రూ.18, 43,200 విలువైన ఎటువంటి బిల్లులు లేని సిగరెట్లను అధికారులు గుర్తించారు. పట్టణంలో ఆదివారం జీఎస్టీ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా వివిధ గోడౌన్లపై దాడులు చేశారు. మార్కెట్ ప్రాంతంలోని అంజయ్య వీధిలో కొతరపు నమ్మయ్య నిర్వహిస్తున్న గోడౌన్‌లో రూ. 6.40 లక్షల విలువైన బిల్లులు లేని సిగరెట్లు, అలానే నందులపేట దేవినేని వారి వీధిలో వేములపల్లి మురళీకృష్ణ, ఉయ్యూరు సుబ్బారావుగుప్తాలకు చెందిన రూ. 12,03,200 విలువ గల సిగరెట్లను గుర్తించి సీజ్ చేశారు. గోడౌన్‌ల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి వన్ టౌన్, టూ టౌన్ పోలీసులకు అప్పగించారు.

ఐదు లారీలు సీజ్

తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని పలుప్రాంతాల్లో ఎటువంటి బిల్లులు, అనుమతులు లేకుండా మట్టి, కంకర, ఇసుక తరలిస్తున్న ఐదు లారీలను మంగళగిరి పట్టణ పోలీసులు ఆదివారం తెల్లవారుజామున సీజ్ చేశారు. రాజధాని ప్రాంతంలోని పలు ప్రాంతాల నుంచి మట్టితో పాటు ఇసుక, కంకర అక్రమంగా తరలించడంతో గస్తీ నిర్వహించిన పోలీసులు వాటిని గుర్తించి సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా మరో రెండు లారీలను వదిలివేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల వల్లే ఆ రెండు లారీలు వదిలిపెట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

లీజు వ్యవహారంలో వివాదం

దుగ్గిరాల: లీజు వివాదం నేపథ్యంలో అర్ధరాత్రి డెయిరీ కూల్చివేశారని ఫిర్యాదు అందింది. లీజుదారుడు అంచా నరేంద్ర కుమార్ ఆదివారం దుగ్గిరాల మండలం కంఠంరాజుకొండూరు గ్రామంలో తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి డెయిరీ ఫామ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు 50 మందికి పైగా వచ్చి జేసీబీలతో ధ్వంసం చేసి, 200 కోళ్లను పట్టుకుపోయారని చెప్పారు. 40 గేదెలు, 20 పడ్డలను బయటకు తోలారని తెలిపారు. పని చేస్తున్న వారి సెల్‌ఫోన్లు లాక్కున్నారని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని పంపించి వేశారని ఆయన తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

ఐటీ శాఖకు సొత్తు అప్పగించాలని నిర్ణయం

తెనాలి రూరల్: తెనాలి బాలాజీరావుపేట మహేంద్ర కాలనీలో రేకుల ఇంట్లో పోలీసులు భారీ సొత్తు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. కాలనీలో పేరుబోయిన గురవమ్మ ఇంటి నుండి 700 గ్రాముల బంగారం, 15 కిలోల వెండి, రూ.5.60 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో కొన్నింటికి సంబంధించి ఆమె అల్లుడు గురునాథం త్రీ టౌన్ పోలీసులకు బిల్లులు సమర్పించారు. సుమారు రూ.1.50 కోట్ల విలువైన సొత్తు కావడంతో ఆదాయపన్ను శాఖకు అప్పగించాలని పోలీసులు నిర్ణయించారు. ఒకట్రెండు రోజులలో అప్పగించే అవకాశం ఉంది.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. 10కే వాక్

గుంటూరు నగరంలో 10కే వాక్‌లో పాల్గొన్న యువత

- నడకలో పాల్గొన్న నగర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు
- నడక ఖరీదైన వ్యాయామం కాదు : సినీ నటుడు రాజేంద్రప్రసాద్

కార్యక్రమంలో రాజేంద్ర ప్రసాద్, కామ్నాజెత్మలానీ

గుంటూరు ఎడ్యుకేషన్: 'ఆరోగ్యం కోసం నడక-గుంటూరు కోసం నడక' నినాదంతో నిర్వహించిన 10 కిలోమీటర్ల నడక (10కే వాక్) ఉల్లాసంగా, ఉత్సాహంగా కొనసాగింది. ఆదివారం ఉదయం విద్యానగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన గుంటూరు 10కే వాక్‌ను సినీ, రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖులు ప్రారంభించారు. విద్యానగర్ నుంచి మొదలైన నడక లక్ష్మీపురం, అమరావతిరోడ్డు, చిల్లీస్, ఇన్నర్‌రింగ్‌రోడ్డు, జేకేసీ కళాశాల మీదుగా తిరిగి ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలకు చేరుకుంది. చిన్నారులతో పాటు యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గుంటూరు 10కే వాక్ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కన్వీనర్‌గా కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు వ్యవహరించారు.

సులువుగా చేసే వ్యాయామమే: సినీ నటుడు రాజేంద్రప్రసాద్

గుంటూరు 10కే వాక్‌లో సినీ నటుడు రాజేంద్రప్రసాద్, నటి కామ్నాజెత్మలానీతో పాటు పలువురు జబర్దస్త్ కమెడియన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నడక అనేది ఖరీదైన వ్యాయామం కాదని, ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో నడకను అలవాటు చేసుకోవచ్చని చెప్పారు. కామ్నా జెత్మలానీ మాట్లాడుతూ నిత్యం నడక ద్వారా మహిళల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ నడకతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని, డ్రగ్స్ వాడకం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరిలు మాట్లాడారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలపై ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ సారథ్యంలో పోస్టర్లు ప్రదర్శించారు.

విజేతలకు బహుమతులు

10కే వాక్ పురుష, మహిళల విభాగంలో నాలుగు కేటగిరీలుగా విభజించి, ప్రతి కేటగిరీలో తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. విజేతలకు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వడ్లమూడి పూర్ణచంద్రరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమ కో-కన్వీనర్ పిడికిటి తిలక్‌బాబు, మలినేని పెరుమాళ్లు, టీవీరావు, మాజీ డీజీపీ ఎంవీ రావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నర్సరాజు, చిట్టాబత్తుని చిట్టిబాబు, బీజేపీ నేత తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో ప్రధాన్ హాస్పిటల్స్ ప్రారంభం

హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న పులివర్తి సుధారాణి, పక్కన పులివర్తి శేషగిరిరావు, డాక్టర్ పులివర్తి వెంకటేష్ తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు నగర ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు చేరువ చేసేందుకు, ప్రధాన్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ పులివర్తి వెంకటేష్ చెప్పారు. ఆదివారం గుంటూరు ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ఎదురుగా లక్ష్మీపురం నాలుగో లైన్‌లో నూతనంగా నిర్మించిన ప్రధాన్ హాస్పటల్‌ను డాక్టర్ పులివర్తి వెంకటేష్ తల్లి పులివర్తి సుధారాణి ప్రారంభించారు. వెంకటేష్ కన్‌స్ట్రక్షన్ అధినేత, ప్రముఖ బిల్డర్ పులివర్తి శేషగిరిరావు సమక్షంలో జరిగిన ప్రారంభోత్సవానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. సోమవారం నుంచి వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. జిల్లాలోనే తొలిసారిగా అత్యాధునిక వసతులతో నిర్మించిన 12 పడకల ఐసీయూతో పాటు రోగులకు ఎటువంటి సందర్భంలోనూ ఇన్ఫెక్షన్ సోకకుండా ఐసోలేషన్ పడకలు ఏర్పాటు చేశామన్నారు. శస్త్రచికిత్సల సమయంలో క్లిష్టతరమైన పరిస్థితులు ఏర్పడినప్పటికీ ఇతర ఇన్ఫెక్షనులు సోకకుండా నివారించేందుకు లామినార్ ఎయిర్ ఫ్లో థియేటర్, అడ్వాన్స్‌డ్ అనస్థీషియా వర్క్ స్టేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. క్లిష్టతరమైన ప్రసవాలను చేసే సాంకేతిక నైపుణ్యంతో పాటు అనుభవజ్ఞులైన వైద్యులు ఈ ఆసుపత్రి ప్రత్యేకతగా డాక్టర్ వెంకటేష్ వెల్లడించారు. నగరంలో ఇప్పటివరకు ప్రధాస్ క్లినిక్స్ ద్వారా వైద్య సేవలు అందించిన డాక్టర్ వెంకటేష్ అధునాతన సౌకర్యాలు గల ఈ ఆసుపత్రి ద్వారా మరిన్ని విభాగాల్లో వైద్య సేవలు అందించడం పట్ల వైద్యులతో పాటు రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు అభినందించారు. నిర్మాణ రంగంలో 30 ఏళ్ల సుదీర్ఘ అనుభవంతో నాణ్యత ప్రమాణాలు, నైతిక విలువలకు మారుపేరుగా నిలిచిన వెంకటేష్ కన్‌స్ట్రక్షన్ అధినేత పులివర్తి శేషగిరిరావు ఆధ్వర్యంలో ఆయన కుమారుడు డాక్టర్ వెంకటేష్ నిర్వహించనున్న ఈ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. అతిథులకు వెంకటేష్ కన్‌స్ట్రక్షన్ డైరెక్టర్లు పులివర్తి కమలేష్, పులివర్తి యోగేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనదారులకు ట్రాఫిక్ పోలీసుల సూచనలు

తాడికొండ: తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయపూడిలో సోమవారం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవానికి హాజరయ్యే వీవీఐపీలు, వీఐపీలు, ఇతర ప్రముఖులు, ప్రజల వాహనాల రాకపోకల కోసం ఈ క్రింది ట్రాఫిక్ మార్గాలను కేటాయించామని తుళ్లూరు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

రూట్ నెంబర్ 1 :
వీవీఐపీ, ఏఏ, ఏ1, ఏ2 పాస్‌లు మరియు రైతులు లోటస్ – కరకట్ట మీదుగా – ఎమ్మెస్సార్ ఆశ్రమం – సీడ్ యాక్సెస్ రోడ్ – ఎమ్మెల్యే క్వార్టర్స్ ఎడమవైపు నుంచి వేడుకల మైదానానికి చేరుకోవాలి.

రూట్ నెంబర్ 2:
బీ1, బీ2 పాస్ హోల్డర్స్ మరియు రైతులు ఎమ్మెల్యే క్వార్టర్స్ ముందుకు వెళ్లి వెస్ట్ బైపాస్ రోడ్డు నుంచి వేడుకల మైదానంలోకి చేరుకోవాలి.

- గుంటూరు నుంచి వచ్చే సాధారణ వాహనాలు మురుగన్ హోటల్ సెంటర్ నుంచి వెస్ట్ బైపాస్ మీదుగా వెళ్లి ఈ–8 రోడ్డు అండర్ పాస్ – మందడం గ్రామం – వెలగపూడి – మోదుగు లింగాయపాలెం – ఈ–4 – పాతవెలగపూడి రోడ్డు జంక్షన్ నుంచి ఈ–4 రోడ్ పార్కింగ్ ప్రదేశానికి వెళ్లాలి.
- విజయవాడ వైపు నుంచి వచ్చు సాధారణ వాహనాలు విజయవాడ – ప్రకాశం బ్యారేజ్ – ఉండవల్లి – ఉండవల్లి గుహలు – పెనుమాక – కృష్ణాయపాలెం – మందడం – వెలగపూడి – ఈ4 రోడ్డు జంక్షన్ – మోదుగ లింగాయపాలెం – ఈ4 రోడ్ పార్కింగ్‌కు వెళ్లాలి.
- గొల్లపూడి నుంచి వచ్చు సాధారణ వాహనాలు విజయవాడ – వెంకట పాలెం – ఈ–8 అండర్ పాస్ – మందడం – వెలగపూడి – ఈ–4 జంక్షన్ – మోదుగ లింగాయ పాలెం – ఈ–4 రోడ్ పార్కింగ్ ప్రదేశానికి వెళ్లాలి.
- తుళ్లూరు నుంచి వచ్చే సాధారణ వాహనాలు తుళ్లూరు – ఈ–6 వెస్ట్ పార్క్ రోడ్ – హైకోర్టు ఈ–4 జంక్షన్ నుంచి ఈ–4 పార్కింగ్ ప్రదేశానికి వెళ్లాలి.
- హైకోర్టు లాయర్ల వాహనాలు ప్రకాశం బ్యారేజ్ – ఉండవల్లి – ఉండవల్లి కేవ్స్ – పెనుమాక – కృష్ణాయపాలెం – మందడం – వెలగపూడి – ఈ–4 రోడ్డు పార్కింగ్ ప్రదేశానికి వెళ్లాలి. సభకు వచ్చేవారు అందరూ పోలీస్ వారి సూచనలు గమనించి సహకరించాలని తుళ్లూరు ట్రాఫిక్ పోలీసులు ప్రకటనలో తెలిపారు.

సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మీపార్వతి, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు

పొన్నూరు: స్థానిక శ్రీ భావనారాయణ స్వామి సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. దివంగతులైన తమ గురువులు, ఇతర సిబ్బందిని, మిత్రులను గుర్తు చేసుకుని ముందుగా శ్రద్ధాంజలి ఘటించారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి అక్కడే విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి పలుకరించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకురాలు నందమూరి లక్ష్మీపార్వతి పాల్గొన్నారు. తొలుత శ్రీ సాక్షి భావనారాయణ స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లక్ష్మీపార్వతి మాట్లాడుతూ రాష్ట్రంలోనే శ్రీ భావనారాయణ స్వామి సంస్కృత కళాశాలకు విశేష స్థానముందన్నారు. ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని చెప్పారు. కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ వేదాల వెంకట సీతారామాచార్యులు మాట్లాడుతూ తెలుగు బాషాభివృద్ధికి ఈ కళాశాలలో చదివిన వారు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులుగా విశేషమైన సేవలందించినట్లు అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు రాసిన గ్రంథాలు, పుస్తకాలను ఆవిష్కరించారు. అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో సూరా రామారావు, నారాయణం మురళీధర, పరాశరం శేషకుమారి, మన్నవ అనసూయదేవి, మాజేటి జగన్నాథరావు, గోవర్ధనం రామకృష్ణ, పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహ పరిమళం.. రజతోత్సవ వేడుకలు

30 ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితులు

కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గుంటూరు మెడికల్: సుమారు 30 ఏళ్ల విరామం అనంతరం తమ కుటుంబ సభ్యులతో స్నేహితులతో సంతోషంగా గడిపారు. ఈ మధుర కలయిక స్నేహ పరిమళానికి అమరావతి రోడ్డులోని హిందూ కాలేజీ ఫార్మసీ కళాశాల వేదికైంది. 140 మంది సభ్యులు హాజరయ్యారు. బ్యాచిలర్స్‌గా జీవనాన్ని ప్రారంభించి స్నేహితుడిగా మారి ఇప్పుడు తాతలుగా కలుసుకున్న సరదా అనుభవాలు పంచుకున్నారు. డాక్టర్ కాకాని పథ్వీరాజ్ కన్వీనర్‌గా, డాక్టర్ ఎస్‌వీ రమణ కో–కన్వీనర్‌గా, ఆర్గనైజింగ్ టీంలో ఉన్న లక్ష్మీపతి, సింగం లక్ష్మీ నారాయణ, వేదాంతం వినోద్ కిషన్, జీవీ సూర్యనారాయణ, కొండా రవిశంకర్, పింగళి రాజేశ్వరరావు, బుచ్చిబాబు, సలీమ్, రమేష్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించారు. ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్, ఒక కిట్ బహుమతిగా ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. 75 సంవత్సరాలు నిండిన వారికి సన్మానం చేశారు. సన్మాన గ్రహీతలలో డాక్టర్ కాకాని పథ్వీరాజు డాక్టర్ ఎస్వీ రమణ, డాక్టర్ పీవీ రావు, డాక్టర్ ఎస్వీరావు తదితరులు ఉన్నారు. ఒకే కంపెనీలో 25 సంవత్సరాలు పనిచేసిన 25 మంది సభ్యులకు జ్ఞాపికలు అందజేసి సన్మానం చేశారు.

నేటి పీజీఆర్ఎస్‌కు సెలవు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌ల నిర్వహణ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం ఉండదని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా యంత్రాంగం గణతంత్ర దినోత్సవ నిర్వహణలో నిమగ్నమై ఉన్నందున పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌ల నిర్వహణ జరగదని, ప్రజలు దీనిని గమనించి వ్యయ ప్రయాసలకు లోనై రావద్దని విజ్ఞప్తి చేశారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్ తాత్కాలిక రద్దు

నగరంపాలెం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా పోలీస్ కార్యాలయపు వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలోని అర్జీదారులు గుర్తించాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COMPUTER EDUCATION

■ Artificial Inteligence workshop for first Sem BA / B.Com / BBA / B.Sc by Dr Kishore.P 26Jan 12.30 to 3.30pm, PLNM Degree College. Contact: 9177408565

REAL ESTATE

PLOT FOR SALE

■ అమరావతి ORR దగ్గరగా సత్తెనపల్లి పట్టణంలో CRDA, RERA అప్రూవల్‌లో మంచినీటి వసతితో 80%లోన్ సౌకర్యంతో చ.గ।। 10,999/- గల ప్లాట్ల కొరకు సం।। బాబు - 9912353046

SERVICES

GOLD FINANCE

■ Best Money Gold బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. Nlr Dt. 9150011538, 9750497504

WANTED

■ ఆఫీసు మేనేజర్ కావలెను. డిగ్రీ, పి.జి, అడ్మినిస్ట్రేషన్‌లో 10సం।।ల అనుభవం, కంప్యూటర్‌పై అవగాహన, 40సం।। లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.comకు పంపగలరు.

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 50సం।। వయస్సు వారు కావలెను. 7036761665

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌చార్జ్‌స్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480429

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు క్లాసు ఇన్‌చార్జ్‌స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం: 12000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్ వారికి ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు : ఇంటర్ నుండి డిగ్రీ వరకు వయస్సు: 22సంవత్సరాలు నుండి 40సంవత్సరాలు ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 9248733320

■ Wanted Staff. Wanted Lady AO / Incharge, Primary Lady Teachers English, Science, Maths. Apple Techno School, Krishnababu Nagar, Gunjjanagundla, Guntur. 63010 36083

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జ్‌స్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. విద్యాఅర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు : 22 సంవత్సరాలు నుండి 45సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్, 89784 80435

■ శ్రీశాంతి హోమ్‌కేర్ నందు పనిచేయుటకు ఆయాలు, నర్సులు, కేర్‌టేకర్స్ (M/F) కావలెను. జీతం: 18,000/- సంప్రదించండి. 7995123705 / 9618485329

■ తాడేపల్లి, కుంచనపల్లి, పాతూరు పరిసర ప్రాంతలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 hrs. డ్యూటీ, జీతం:12000, భోజనం ఫ్రీ.Q. 10th, 50సం।। లోపు ✆ 88014 37437

■ ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్, గుంటూరు నందు పనిచేయుటకు ఇంటర్ విద్యార్హతతో వివాహిత స్త్రీలకు మార్కెటింగ్ మరియు ఆఫీసు జాబు చేయుటకు పోస్టులు కలవు ✆ 90309 93895, 86396 89939

■ త్రివేణిహోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధుల ను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 18k - 20k, Ph: 9640400073, 9160900024

■ శ్రీ లక్ష్మి హోంకేర్ సంస్థ Hyd నందు వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు. కావలెను. జీ : 18,000 to 30,000. రూం+మీల్స్ ఫ్రీ. 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు
రూ. 475
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం

గుంటూరు
7075167663
7075167541

గమనిక

క్లుప్తంగా

ఘనంగా ఎమ్మెల్సీ మురుగుడుకు సన్మానం

తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ ఆత్మకూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావును ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల తాడేపల్లికి చెందిన మేకా అంజిరెడ్డికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పదవి దక్కింది. దీంతో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావును మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డితో కలిసి సత్కరించి ఆయన చిత్రపటాన్ని మేకా అంజిరెడ్డి అందజేశారు. తమపై నమ్మకంతో ఈ పదవి వచ్చేందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలని.. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అంజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, గుంటూరు జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు ఊట్ల పాలశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి ఉండవల్లి హరిజనవాడలో పైప్‌లైన్ పగిలి గత రెండు రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 6 వాటర్ ట్యాంకర్ల తాగునీటిని సరఫరా చేశారు. ఉండవల్లి హరిజనవాడకు వెళ్లే మార్గంలో గుంటూరు చానల్ హెడ్‌స్లూయిస్ వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీరు సరఫరా చేసే పైప్ పగిలింది. కార్పొరేషన్ అధికారులు మరమ్మతులు చేయడానికి రెండు రోజుల సమయం పట్టింది. కార్పొరేషన్ అధికారులు పంపించే ట్యాంకర్లు అరకొరగా ఉండడంతో హరిజనవాడ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఉండవల్లి వైఎస్సార్ సీపీ అధ్యక్షులు మున్నంగి వీరశివారెడ్డి దృష్టికి ఆ ప్రాంత ప్రజలు తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన పార్టీ నాయకుల సహకారంతో తాగునీటి సరఫరా చేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత

తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ పెదవడ్లపూడికి చెందిన ఓ విద్యార్థినికి స్థానిక టీడీపీ నాయకులు ఆదివారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ మాట్లాడుతూ.. పెదవడ్లపూడికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని శిరీషకు టీడీపీ శాశ్వత సభ్యులు అన్నే చంద్రశేఖర్ రూ.10 వేలు, లింగమనేని సుధాకర్‌బాబు రూ.10 వేలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శివరామయ్య, మాదాల రమేష్, మొద్దుకూరి రమేష్, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, శంకరరావు, వెగలపూడి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు సుభాని, అంకయ్య, సూర్యప్రకాష్, యహోషువాలతో కలిసి ఆయన సందర్శించి మద్దతు తెలియజేసి మాట్లాడారు. గత 418 రోజులుగా కార్మికులు దీక్షలు చేస్తున్నారని అన్నారు. కార్మికులకు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. దీక్షలో కొండ, గువరయ్య, హగ్గయ్య, నవనీతం, రిబ్కా కూర్చొన్నారు. కార్యక్రమంలో డి.నాగేశ్వరరావు, ఎం.సాంబశివరావు, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలు లేక తీవ్ర అవస్థలు!

- ఇంకుడు గుంతలు నిండి రోడ్డుమీదకు వస్తున్న మురుగు
- పట్టపగలే దోమలతో ప్రజల సహవాసం

నిర్మాణానికి నోచుకోని మురుగు కాలువ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ జాతీయ రహదారికి, విజయవాడకు అతి సమీపంగా కుంచనపల్లి గ్రామం ఉండడంతో రవాణాకు సులువుగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారు స్థానికంగా స్థలాలు కొనుగోలు చేసి బహుళ అంతస్తులు నిర్మించుకుని జీవిస్తున్నారు. సంపన్నులు బహుళ అంతస్తుల్లో సంపులు ఏర్పాటు చేసుకుని సెప్టిక్ ట్యాంకుల ద్వారా మురుగు నీటిని తోడించి బయటకు పంపుతున్నారు. ఇదే గ్రామంలో సంపన్నులతో పాటు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు కూడా నివసిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో సైతం ఎక్కడా డ్రెయిన్‌లు కనబడక స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆ ఊరి పల్లెల్లో ఒక్కటంటే ఒక్క డ్రెయిన్ కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

నేటికీ ఇంకుడు గుంతలే దిక్కు..

గ్రామంలో వ్యవసాయ పనులు ఎక్కువగా ఉండడంతో చిన్నాచితకా పనిచేసుకునే వారు వివిధ ప్రభుత్వాల సహకారంతో సొంతగా సంపాదించుకున్న డబ్బులతో పక్కా నివాసాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ భవనం ఎంత అందంగా ఉన్నా మురుగు పారే పరిస్థితి కనిపించడం లేదు. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకుని అందులోకి మురుగును పంపిస్తున్నారు. ఇంకుడు గుంత నిండితే మురుగు ఇంటిగుమ్మం ముందుకు రావడంతో అందులో నుంచే ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఎక్కడ చూసినా గ్రామంలో ఇంకుడు గుంతలు ఉండడం, మురుగు రోడ్డుపై పారుతుండడంతో పట్టపగలు దోమలు సంచరిస్తున్నాయి. పంచాయతీ కార్యాలయంలో సైతం దోమలు స్వైర విహారం చేస్తుండడంతో పనిచేస్తున్న సిబ్బంది దోమల నివారణకు ఎలక్ట్రికల్ బ్యాట్లు, మస్కిటో కాయిల్స్‌తో దండయాత్ర చేస్తున్నారు.

కుంచనపల్లి గ్రామంలో ఇంకుడు గుంత

ఇంకుడు గుంత నిండడంతో రోడ్డుపై పారుతున్న మురుగు

వైఎస్సార్ సీపీ హయాంలో సీసీ రోడ్లు..

కుంచనపల్లి గ్రామంలో దాదాపుగా 20 కి.మీ. డ్రెయినేజీ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీ నాయకులను అడిగితే ఇదుగో.. అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. స్థానిక గ్రామస్తులు పలుమార్లు గత ఎమ్మెల్యే ఆర్కేకు, వైఎస్సార్ సీపీ నాయకులకు విన్నవించుకోగా పలుచోట్ల సీసీ రోడ్లు ఏర్పాటు చేసి డ్రెయిన్‌లు నిర్మించారు. ఇంకా పలుచోట్ల డ్రెయిన్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాగా ప్రస్తుత సమస్యపై టీడీపీ నాయకులను డ్రెయినేజీల గురించి అడుగగా అండర్ గ్రౌండ్ డ్రెయిన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఓపిక పట్టండి అంటూ చెబుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు అండర్ గ్రౌండ్ డ్రెయిన్ వస్తుందో.. మా సమస్య ఎప్పుడు తీరుతుందో అని ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

ఫిరంగిపురం: గ్రామస్థాయిలో వైఎస్సార్ సీపీ పటిష్ట నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. మండలంలోని అల్లంవారిపాలెంలో వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తల నుంచి సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వజ్రబాబు మాట్లాడుతూ.. పార్టీ జెండా పట్టుకున్న ప్రతి కార్యకర్తను గుర్తించాలని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నట్లు తెలిపారు. అధినేత సలహా, సూచనలతో పార్టీ గ్రామ స్థాయిలో పటిష్టంగా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే సమావేశాలకు సంబంధిత నాయకులు, కార్యకర్తలు తప్పని సరిగా హాజరుకావాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కె.చిన్నప్పరెడ్డి, డి.సురేష్, కె.ప్రవీణ్‌రెడ్డి, పెరికల చిన్నా, చేవూరి రామమోహన్ రెడ్డి, షేక్.మస్తాన్‌వలి, సాల్మన్, యెంగ్రెడ్డి హేమలతారెడ్డి, బి.అంజిరెడ్డి, డి.నరేంద్రకుమార్, ఆర్.రంజన్‌బాబు, వై.ఆశీర్వాదం, రవి, రాయప్ప, ఫ్రాన్సిస్, కె.రాజు, ఎన్.నిర్మల, బీవీ మరియకుమారి, షేక్.మస్తాన్‌బీ, డి.జ్యోతి, ఎస్.జ్యోతి, పి.సుజాత, షేక్.జాని, షేక్ గౌస్, రసూల్, టి.రమేష్, సతీష్, ఇజ్రాయిల్, ఎ.చిన్నప్పరెడ్డి, సుబ్బారావు, వెంకటస్వామి, మల్లికార్జున, వీరాస్వామి, వినోద్, డి.అంజిరెడ్డి, ప్రతాప్, కె.శ్రీనివాసరెడ్డి, యర్రాబ్బాయి, కె.రాజు, ఆర్.రత్నబాబు, తిరుపతయ్య, బాలిరెడ్డి, ఎం.రాజు పాల్గొన్నారు.

పాల్గొన్న నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు

నియోజకవర్గ స్థాయి సమావేశం నేడు

తాడికొండ: తాడికొండలోని శ్రీ షిర్డీ సాయిబాబా కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రామ కమిటీల నియామకంపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షులు అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల రెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు, పోతిన మహేష్ హాజరుకానున్నట్లు వివరించారు. మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా కమిటీ అన్ని విభాగాల సభ్యులు, నియోజకవర్గ సెల్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలి

తాడేపల్లి రూరల్: గుంటూరులో ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగే అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలో రైతు సంఘం, సీఐటీయూ నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలను తీసుకువచ్చారని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సీఐటీయూ నాయకులు షేక్ గన్, ప్రభుదాసు, బుజ్జి, రామాంజనేయులు, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు శివశంకరరావు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

తాడేపల్లి రూరల్: ఫిబ్రవరి 12వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య పిలుపునిచ్చారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ నాయకులు శివ అధ్యక్షతన ఆదివారం క్లాప్ ఆటోడ్రైవర్ల యూనియన్ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని మండిపడ్డారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చారని విమర్శించారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రైతు సంఘాలు, కార్మిక సంఘాలు పాల్గొంటున్నాయని స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రవి, కృష్ణ, సీఐటీయూ పట్టణ కన్వీనింగ్ కార్యదర్శి ఎం.బాలాజీ, కోకన్వీనర్ కె.బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు కోరారు. ఆదివారం తాడేపల్లి బ్రహ్మానందపురంలో నాయకులు స్టీవెన్ అధ్యక్షతన కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మికుల శ్రమను దోచుకోవడమేనని విమర్శించారు. కనీస వేతనాలు అమలు జరపాలని.. 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని.. ప్రైవేటీకరణ ఆపాలని.. తదితర సమస్యలపై ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, అంకయ్య, నాగేశ్వరరావు, సాంబయ్య, నరసింహారావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భావనాఋషి కల్యాణ మహోత్సవం

ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో దొంతిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీశ్రీ భద్రావతి సమేత శ్రీ భావనాఋషి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. వీరి రాకను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఇరువురినీ ఆశీర్వదించి స్వామివారి పట్టువస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, గుంటూరు జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు ఊట్ల పాలశ్రీనివాసరావు, తమ్మిశెట్టి గౌతమి, సాంబశివరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త వేమారెడ్డిని ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

నూతన మహిళా కమిటీ ఎన్నిక

తాడేపల్లి రూరల్: ప్రజా కాపునాడు తాడేపల్లి నూతన మహిళా కమిటీ ఎన్నిక ఆదివారం తాడేపల్లి పట్టణంలోని ప్రజా కాపునాడు కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు పుల్లెపు భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రజా కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు విచ్చేశారు. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని అభినందించి నియామక పత్రాలను అందజేశారు. ప్రజా కాపునాడు మహిళా అధ్యక్షురాలిగా వీరిశెట్టి శివజ్యోతి, ఉపాధ్యక్షురాలిగా కమినిలి త్రిపురాంబిక, కార్యదర్శిగా పలిశెట్టి రేణుకాదేవి, సహాయ కార్యదర్శిగా దయామంతితో పాటు మరో 15 మందిని నూతన కమిటీగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రజా కాపునాడు నాయకులు వలివేటి రమేష్ నాయుడు, మోహనరావు, యువత అధ్యక్షులు నక్కా నవీన్ రాజా, పూరి రమణ, ఆల్ కమిటీ వర్కింగ్ ఆర్గనైజర్ పెండ్యాల వెంకటరావు, ఎం.వెంకటేష్, కేసిరెడ్డి మురళి, మధు, అడపా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన మహిళా కమిటీకి నియామక పత్రాలు అందజేస్తున్న భాస్కరరావు

ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు కీలకం

ర్యాలీలో మాట్లాడుతున్న తహసీల్దార్ సీతారామయ్య

దుగ్గిరాల ర్యాలీలో మండలస్థాయి అధికారులు

తాడేపల్లి రూరల్: భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి.. సామాజిక అభివృద్ధికి ఓటు హక్కు కీలకమని తాడేపల్లి తహసీల్దార్ డి.సీతారామయ్య అన్నారు. ఆదివారం 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తాడేపల్లి కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఉండవల్లి సెంటర్ వరకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటును వినియోగించుకోవాలని సూచించారు. భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన బలమైన హక్కు ఓటు హక్కు అని వివరించారు. అనంతరం 18 ఏళ్లు నిండి కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి ఓటరు గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఆయుధం లాంటిదని దుగ్గిరాల మండలస్థాయి అధికారులు పేర్కొన్నారు. ఆదివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో ఓటుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తహసీల్దార్ ఐ.సునీత మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కు పొందాలని తెలిపారు. ఉత్తమ నాయకులను ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, డిప్యూటీ ఎంపీడీవో కేజే నెహ్రూ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు కీలకం

ఫిరంగిపురం: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో 16వ జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. మండలంలోని 66 పోలింగ్ స్టేషన్ల పరిధిలో బూత్ లెవల్ అధికారుల ద్వారా ఓటరు ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించినట్లు ఓటరు నమోదు అధికారి, తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ప్రజా ఉద్యమాల స్ఫూర్తి అంజిరెడ్డి

సీపీఎం రాష్ట్ర నాయకులు రాం భూపాల్

పెదకాకాని: తాను నమ్మిన సిద్ధాంతాలకు నిబద్ధతకు అంకితభావంతో సమాజంలో మార్పు కోసం కృషి చేసిన వ్యక్తి తియ్యగూర అంజిరెడ్డి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాం భూపాల్ అన్నారు. నంబూరులో ఇటీవల మృతి చెందిన అంజిరెడ్డి సంతాప సభ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. రాంభూపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఫలాలు పొందుతున్నారంటే ఇలాంటి మహనీయుల కృషి ఫలితమేనని చెప్పారు. కమ్యూనిస్టులకి ఆదర్శంగా నిలిచారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల కోసం పీడిత ప్రజల అభ్యున్నతి కోసం తన చివరి శ్వాస వరకు పోరాడి ప్రజా ఉద్యమకారులకు ఆదర్శంగా నిలిచిన అంజిరెడ్డి అన్నారు. సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి ఈదా మాధవరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పేదల అభ్యున్నతి కోసం అక్రమ కేసులు ఎదుర్కొని సుమారు 300 మంది కుటుంబాలకు భూ పోరాటాల ద్వారా కాలనీ ఏర్పాటు చేశారన్నారు. అంజిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం మాజీ ఉపాధ్యక్షులు పి.నరసింహారావు, సీపీఎం నాయకులు అన్నపురెడ్డి కోటిరెడ్డి, నగర కార్యదర్శి నళినీకాంత్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి కళాధర్, సిహెచ్.కోటిరెడ్డి, కాళిదాసు, ఎం.రవి, ఈమని అప్పారావు, కాకుమాను నాగేశ్వరరావు, ఎస్ఎస్ చెంగయ్య, పిల్లలమర్రి బాలకృష్ణ, భీమిరెడ్డి కోటేశ్వరి, ఎం.శ్రీనివాసరావు, తియ్యగూర శంకర్ రెడ్డి, సీపీఐ నాయకులు కొల్లి రంగారెడ్డి, పుప్పాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఉయ్యూరు సతీష్ రెడ్డి, భీమవరపు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో నిందితులు, రౌడీషీటర్లకు పోలీస్‌లు కౌన్సెలింగ్ నిర్వహించటం జరిగిందని సౌత్ సబ్‌డివిజన్ డీఎస్పీ భానోదయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చ్ ఫాస్ట్ చేయించడం ద్వారా ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించడం, నేరప్రవృత్తులకు పాల్పడే వారిలో భయభ్రాంతులు కలిగించే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ వంశీధర్ మాట్లాడుతూ ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేడుకగా రథ సప్తమి పూజలు

ఫిరంగిపురం మండలంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో రథ సప్తమి పూజలను ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఆలయంలోని ప్రధాన మూర్తులకు అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం విష్ణు అష్టోత్తర, సహస్రనామ పూజలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

– ఫిరంగిపురం

గద్దెలే గర్భగుడులుగా.. గిరిజనులే పూజారులుగా..
వెదురుకర్రలే ఉత్సవమూర్తులుగా.. కుంకుమ భరిణెలే
అమ్మల ప్రతిరూపాలుగా.. బెల్లమే నిలువెత్తు బంగారంగా...
ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే వనదేవతల
పండుగే మేడారం సమ్మక్క- సారలమ్మ జాతర

మేడారం జాతర పర్యాటకంపై ప్రత్యేక కథనం సాక్షి ట్రావెల్ ఈపేపర్‌లో..

ప్రతిభకు పద్మం

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పద్మ అవార్డులను ప్రకటించింది. ధర్మేంద్రను పద్మ విభూషణ్, మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌లను పద్మ భూషణ్, మురళీమోహన్, రాజేంద్రప్రసాద్, మాధవన్‌లను పద్మశ్రీ అవార్డులు వరించాయి.

ఆల్ రౌండర్

పంజాబ్‌లోని ఫాగ్వారా గ్రామం నుంచి ముంబై నగరానికి చేరుకుని సినీ రంగంలో 'స్టార్'గా ఎదిగిన ఘనత ధర్మేంద్ర సొంతం. ఆరు దశాబ్దాలకు పైగా చేసిన చిత్రాలతో 'రొమాంటిక్ హీరో'గా, 'యాక్షన్ హీరో'గా ప్రశంసలు పొంది, 'హీ మ్యాన్'గా ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు ధర్మేంద్ర. 2012లో కేంద్ర ప్రభుత్వం ధర్మేంద్రను 'పద్మ భూషణ్' పురస్కారంతో సత్కరించింది. సినీ రంగానికి చేసిన సేవలకు గాను తాజాగా 'పద్మ విభూషణ్' (మరణానంతరం) ప్రకటించింది.

నాటకాల నుంచి సినిమాల వరకూ...

ధర్మేంద్ర అసలు పేరు ధర్మేంద్ర కేవల్ క్రిషన్ డియోల్. 1935 డిసెంబర్ 8న పంజాబ్‌లోని ఫాగ్వారాలో ఆయన జన్మించారు. ధర్మేంద్ర తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో తనయుడు ప్రొఫెసర్ కావాలని కోరుకున్నారు. అయితే ధర్మేంద్ర మెరిట్ స్టూడెంట్ కాదు. పైగా నాటకాలంటే ఇష్టం. స్కూల్ డేస్‌లో నాటకాల్లో నటించారు. నటనపై ఉన్న ఇష్టం సినిమాల వరకు వచ్చేలా చేసింది. కొత్త ప్రతిభను ప్రోత్సాహించేందుకు ఫిల్మ్‌ఫేర్ మేగజిన్ నిర్వహించిన కార్యక్రమంలో విజేతగా నిలిచి, ముంబై చేరుకున్నారు ధర్మేంద్ర. అప్పటికే ఆయనకు ప్రకాశ్ కౌర్‌తో వివాహం (1954) జరిగింది. వారికి కుమారులు సన్నీ డియోల్, బాబీ డియోల్, కుమార్తెలు విజిత, అజిత ఉన్నారు.

రెండో సినిమాతో తొలి విజయం

'దిల్ భీ తేరా హమ్ భీ తేరే' (1960) సినిమాతో బాలీవుడ్‌లో నటుడిగా ఎంట్రీ ఇచ్చారు ధర్మేంద్ర. అయితే ఆ చిత్రం ఆశించిన విజయం సాధించకపోవడంతో పాటు ధర్మేంద్రకు గుర్తింపు తెచ్చిపెట్టలేదు. ఆ తర్వాత చేసిన 'షోలా ఔర్ షబ్నమ్'తో తొలి విజయం అందుకున్నారు. వరుసగా 'అన్‌పఢ్, బందినీ' (ఉత్తమ చిత్రంగా జాతీయ అవార్డు సాధించింది) వంటి చిత్రాల్లో నటించారు. 'ఆయీ మిలన్ కీ బేలా' (1964) చిత్రంతో బాగా పాపులర్ అయ్యారు. ఈ చిత్రంలో ధర్మేంద్ర నెగటివ్ షేడ్ ఉన్న పాత్ర చేశారు. అదే ఏడాది ఆయన లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'హకీకత్'. ఈ చిత్రం భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. చైనా–ఇండియా యుద్ధం ఆధారంగా రూపొందిన చిత్రం ఇది. 1965లో చేసిన రొమాంటిక్ చిత్రం 'కాజల్'తో మరో భారీ విజయాన్ని అందుకున్నారు ధర్మేంద్ర. ఇక వెనక్కి తిరిగి చూసుకునే అవసరం లేనంతగా బిజీ అయ్యారు.

సెలబుల్ స్టార్‌గా... ధర్మేంద్రకు సెలబుల్ స్టార్ అని పేరు తెచ్చిన చిత్రం 'ఫూల్ ఔర్ పత్థర్'. 1966లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నమోదు అయింది. అదే ఏడాది చేసిన 'మమత, దేవర్, అనుపమ, ఆయే దిన్ బహార్ కే' చిత్రాలు ఆ విజయాన్ని కొనసాగించాయి. 'మేరా గావ్ మేరా దేశ్' (1971)తో తనలో మంచి యాక్షన్ హీరో ఉన్నాడని నిరూపించుకున్న ధర్మేంద్ర, 'రాజా జానీ' (1972), 'జుగ్ను' (1973) వంటి చిత్రాలు ఆ ఇమేజ్ బలపరిచాయి. అయితే అంతకు ముందు చేసిన 'ప్యార్ హీ ప్యార్' (1966), 'ఆయా సావన్ ఝూమ్ కే' (1969), 'మేరే హమ్‌దమ్ మేరే దోస్త్' (1968)... వంటి చిత్రాలతో మంచి రొమాంటిక్ ఇమేజ్ తెచ్చుకున్నారు. ధర్మేంద్ర కెరీర్‌లో 'షోలే' (1975) చిత్రం కీలకం. అమితాబ్ బచ్చన్ కాంబినేషన్‌లో చేసిన ఈ చిత్రం బ్లాక్ బస్టర్‌గా నిలిచింది.

తెరవెనకా హిట్ పెయిర్: అప్పట్లో బాలీవుడ్‌లో హిట్ పెయిర్ అనిపించుకున్నవారిలో ధర్మేంద్ర–హేమ మాలిని'లది ప్రత్యేకమైన స్థానం. 1970 లలో ఈ ఇద్దరూ 'తుమ్ హసీన్ మే జవాన్, షరాఫత్, సీతా ఔర్ గీతా, రాజా జానీ, జుగ్ను, ప్రతిజ్ఞ, షోలే, చరస్, ఆజాద్' వంటి చిత్రాలు బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. ఇలా తెరపై హిట్ జోడీ అనిపించుకున్న ఈ ఇద్దరూ తెరవెనకా హిట్ పెయిర్. డ్రీమ్ గర్ల్ అనిపించుకున్న హేమ మాలిని, హీ మ్యాన్‌గా పేరు తెచ్చుకున్న ధర్మేంద్ర వరుసగా సినిమాలు చేస్తున్న సమయంలో ప్రేమలో పడ్డారు. 1980లో వివాహం చేసుకుని రియల్ లైఫ్ జోడీగా మారారు. వీరికి కుమార్తెలు ఈషా డియోల్, అహానా డియోల్ ఉన్నారు.

క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా... ఒకవైపు భారీ మాస్ కమర్షియల్ మూవీ 'షోలే'లో నటించిన ధర్మేంద్ర మరోవైపు 'సత్యకామ్'వంటి ఆఫ్‌బీట్ చిత్రాలకు జీవం పోశారు. కామెడీ పాత్రల నుంచి యాక్షన్ పాత్రల వరకు... 'చుప్కే చుప్కే'లోని హాస్య పాత్ర నుంచి 'ఫూల్ ఔర్ పత్థర్'లోని యాక్షన్ హీరో ఇమేజ్ వరకు ఆయన 'ఆల్ రౌండర్' అనిపించుకున్నారు. 1973లో ఎనిమిది హిట్స్, 1987లో వరుసగా ఏడు హిట్స్‌తో పాటు అదే ఏడాది తొమ్మిది విజయవంతమైన చిత్రాల్లో నటించిన ఘనత ఆయన సొంతం చేసుకున్నారు. 1983లో విజయ ఫిల్మ్స్ అనే నిర్మాణ సంస్థను స్థాపించి, తన పెద్ద కుమారుడు సన్నీ డియోల్ హీరోగా 'ఘాయల్' వంటి సూపర్‌హిట్ మూవీని నిర్మించారు. తన కుమారులు బాబీ డియోల్, సన్నీ డియోల్‌లతో కలిసి 'అప్నే, యమలా పగ్లా దీవానా' వంటి సినిమాల్లో నటించారు ధర్మేంద్ర. 1995 తర్వాత ధర్మేంద్ర క్యారెక్టర్ నటుడిగా మారారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ధర్మేంద్ర నటించిన ఆఖరి చిత్రం 'ఇక్కీస్' (2025).

రాజకీయాల్లోనూ... భారతీయ జనతా పార్టీ 2004లో చేపట్టిన 'షైనింగ్ ఇండియా' ప్రచారం ధర్మేంద్రను బాగా ప్రభావితం చేసింది. ధర్మేంద్రను రాజస్థాన్‌లోని బికనీర్ పార్లమెంట్ అభ్యర్థిగా నిలబెట్టింది బీజేపీ. కాంగ్రెస్ అభ్యర్థి రామేశ్వర్ లాల్ డూడీని దాదాపు 60 వేల ఓట్ల తేడాతో ఓడించి, ఎంపీగా ఘనవిజయం సాధించారు ధర్మేంద్ర. నటుడిగా ఎన్నో విజయాలు చవి చూసిన ధర్మేంద్ర రాజకీయాల్లోనూ సక్సెస్. 2004 నుండి 2009 వరకు ఆయన బికనీర్‌కి ప్రాతినిధ్యం వహించారు. 2009లో తన పదవీ కాలం ముగిసిన అనంతరం ఆయన రాజకీయాల నుంచి వైదొలిగారు.

2012లో పద్మభూషణ్: 1991లో 'ఘాయల్' సినిమాకుగానూ ధర్మేంద్ర నిర్మాతగా జాతీయ అవార్డు అందుకున్నారు. కళామతల్లికి ధర్మేంద్ర చేసిన సేవలకుగానూ 2012లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది. ఇప్పుడు పద్మ విభూషణ్ ప్రకటించింది.

ఎవర్‌గ్రీన్

డిఫరెంట్ జానర్స్‌లో నటించిన విలక్షణమైన నటుడు మమ్ముట్టి. ఏడు పదుల వయసులోనూ వరుస సినిమాలు చేస్తూ బిజీ. అందుకే మమ్ముట్టి ఎవర్‌గ్రీన్ స్టార్. సినీ పరిశ్రమకు మమ్ముట్టి చేసిన సేవలకు గుర్తింపుగా పద్మభూషణ్ అవార్డు వరించింది.

మమ్ముట్టి పూర్తి పేరు ముహమ్మద్ కుట్టి ఇస్మాయిల్ పెనిపరంబిల్. ఇస్మాయిల్, ఫాతిమా దంపతులకు 1951 సెప్టెంబర్ 7న కేరళలోని అలప్పుళ జిల్లా చండీరూర్‌లో ఆయన జన్మించారు. పెరిగింది మాత్రం కేరళలోని కొట్టాయం జిల్లాలో. మమ్ముట్టిది మధ్యతరగతి ముస్లిం కుటుంబం. ఇద్దరు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెళ్లు ఉన్నారు. ఎర్నాకులంలోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ డిగ్రీ పట్టా పొందారు మమ్ముట్టి. ఆ తర్వాత రెండేళ్లు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. మరోవైపు సినిమాల్లో నటించే ప్రయత్నాలు చేశారు.

చిన్న రోల్స్‌తో ప్రారంభం: 1971లో 'అనుభవంగళ్ పాలిచకల్' చిత్రంలో ఓ చిన్న పాత్రతో నటన ప్రారంభించారు మమ్ముట్టి. ఆ తర్వాత చిన్న చిన్న పాత్రలు చేసుకుంటూ వచ్చారు. వాసుదేవ్ నాయర్ తన డైరెక్షన్‌లోని 'విల్కన్ ఉండూ స్వప్నంగళ్'లో మమ్ముట్టిని మెయిన్ లీడ్‌గా ఎంచుకున్నారు. ఈ చిత్రంతో మమ్ముట్టికి మంచి గుర్తింపు లభించింది. 1971– 1982 మధ్యకాలంలో మమ్ముట్టి ఎక్కువగా సపోర్టింగ్ రోల్స్, కీలక పాత్రల్లో నటించారు. త్రిష్ణ (1981), అహింస (1981) చిత్రాల్లో లీడ్ రోల్స్ చేశారు.

ఏడాదికి ఇరవైకి పైగా చిత్రాలు..

జోషియ్ డైరెక్షన్‌లో 1987లో వచ్చిన 'న్యూ ఢిల్లీ' సినిమా మమ్ముట్టి కెరీర్‌లో ఓ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. పౌరాణిక చిత్రం 'ఒరు వడక్కన్ వీర గాథ' చిత్రంతో మమ్ముట్టికి తొలి జాతీయ అవార్డు వచ్చింది. ఏడు పదుల వయసులో 'కన్నూర్ స్క్వాడ్', 'భ్రమయుగం', 'టర్బో', 'కలంకావల్' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించారు. 'భ్రమయుగం', 'కలంకావల్' చిత్రాల్లో మమ్ముట్టి నెగటివ్ షేడ్స్ ఉన్న రోల్స్ చేయడం విశేషం.

తెలుగు ప్రేక్షకులు మెచ్చిన హీరో

ఇక టాలీవుడ్‌తో మమ్ముట్టికి ప్రత్యేక అనుబంధం ఉందని చెప్పవచ్చు. కె. విశ్వనాథ్ డైరెక్షన్‌లో మమ్ముట్టి నటించిన 'స్వాతి కిరణం' సినిమా 1992లో విడుదలై, ఎంతటి సక్సెస్ సాధించిందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జీవితంలోని ముఖ్య సంఘటనల ఆధారంగా రూపొందిన 'యాత్ర' (2019) సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇందులో రాజశేఖర రెడ్డి పాత్రలో నటించారు మమ్ముట్టి. అలాగే ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవితం ఆధారంగా రూపొందిన 'యాత్ర 2' చిత్రంలోనూ మమ్ముట్టి నటించారు. 2024 ఫిబ్రవరిలో విడుదలైన ఈ చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ రెండు చిత్రాలకూ (యాత్ర, యాత్ర 2) మహి వి. రాఘవ్ దర్శకత్వం వహించారు. గతంలో కోడి రామకృష్ణ డైరెక్షన్‌లో వచ్చిన 'రైల్వే కూలి' (2001) చిత్రంలో మమ్ముట్టి హీరోగా నటించారు. హిందీ హిట్ ఫిల్మ్ 'దివార్'కు ఇది రీమేక్‌గా రూపొందింది.

తండ్రికి తగ్గ తనయుడిగా...

1979లో సుల్ఫత్‌ను వివాహం చేసుకున్నారు మమ్ముట్టి. వీరిది పెద్దలు కుదిర్చిన వివాహం. ఈ దంపతులకు కుమార్తె సురుమి, కుమారుడు దుల్కర్ సల్మాన్ ఉన్నారు. నటుడిగా–నిర్మాతగా దుల్కర్ సల్మాన్ తండ్రికి తగ్గ తనయుడిగా దూసుకెళుతున్నారు. 'మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్, కాంత' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు దుల్కర్.

పలు అవార్డులు..

మమ్ముట్టికి మూడు జాతీయ అవార్డులు (ఒరు వడక్కన్ వీరగాథ, పొంతన్ మదా అండ్ విధేయన్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రాలకుగాను) సాధించారు. 1998లో ఆయన్ను పద్మశ్రీ అవార్డు వరించగా, ఈ ఏడాది పద్మభూషణ్ అవార్డు దక్కింది.

మధుర గానం

సంగీత ప్రపంచంలో తన మధుర గాత్రంతో శ్రోతలను మైమరిపిస్తున్న ప్రముఖ గాయని అల్కా యాగ్నిక్‌ను పద్మభూషణ్ అవార్డు వరించింది. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైన కెరీర్‌లో నేపథ్య గాయనిగా తనదైన ముద్ర వేశారు. హిందీ, గుజరాతీ, ఒరిస్సా, మణిపురి, నేపాలీ, రాజస్థానీ... ఇలా దాదాపు పాతిక భాషల్లో వెయ్యికి పైగా చిత్రాల్లో పాడారు. సంగీత ప్రపంచానికి యాగ్నిక్ చేస్తున్న సేవలను గుర్తించి, కేంద్ర ప్రభుత్వం ఆమెను పద్మభూషణ్ పురస్కారానికి ఎంపిక చేసింది.

ధర్మేంద్ర శంకర్, శుభా దంపతులకు 1966 మార్చి 20న కోల్‌కతాలో అల్కా యాగ్నిక్ జన్మించారు. అల్కా యాగ్నిక్ తల్లి శుభా భారతీయ శాస్త్రీయ సంగీత గాయకురాలు. అలా తల్లి బాటలోనే అల్కా నడిచారు. తన ఆరో సంవత్సరంలోనే ఆమె కోల్‌కతాలోని ఆల్ ఇండియా రేడియో కోసం పాట పాడారు. పదేళ్ల వయసులో అల్కా యాగ్నిక్ ముంబైలో అడుగు పెట్టారు. ఆ సమయంలో కోల్‌కతాలోని ఓ సినిమా డిస్ట్రిబ్యూటర్ యాగ్నిక్ గురించి రాజ్ కపూర్‌కు ఓ లేఖ రాయగా, రాజ్ కపూర్ ఆమె స్వరం విని, మ్యూజిక్ డైరెక్టర్ లక్ష్మీకాంత్‌కు లేఖ రాశారట. అలా లక్ష్మీకాంత్ ఆమెకు వరుస అవకాశాలు కల్పించడంతో యాగ్నిక్ తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఇక ఆమిర్ ఖాన్ నటించిన 'హమ్ హై రహీ ప్యార్ కే' సినిమాలోని 'ఘూంఘట్ కి ఆద్ సే', షారుక్ ఖాన్ నటించిన 'కుచ్ కుచ్ హోతా హై' చిత్రంలోని 'కుచ్ కుచ్ హోతా హై' పాటలకు గాను యాగ్నిక్‌ను జాతీయ అవార్డులు వరించాయి.

హిందీ చిత్రపరిశ్రమలో ప్రఖ్యాత గాయనీమణులు లతా మంగేష్కర్, ఆశా భోంస్లేల తర్వాత ఎక్కువ పాటలు పాడిన మహిళా గాయనిగా అల్కా యాగ్నిక్ పేరును ప్రత్యేకంగా చెప్పుకుంటారు. అలాగే 'రైజింగ్ స్టార్, సూపర్‌స్టార్ సింగర్, ఇండియన్ ఐడల్' టీవీ రియాలిటీ షోలకు అల్కా న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. షిల్లాంగ్‌కు చెందిన వ్యాపారవేత్త నీరజ్ కపూర్‌ను 1989లో వివాహం చేసుకున్నారామె. ఈ దంపతులకు సాయేషా అనే కుమార్తె ఉన్నారు. గాయనిగా పలు అవార్డులు పొందిన అల్కా యాగ్నిక్ మధుర స్వరానికి 'పద్మ భూషణం' ఓ ఆభరణం.

ఏ పాత్ర అయినా ఓకే



హీరోగా కెరీర్ ఆరంభించి, ఆ తర్వాత క్యారెక్టర్ నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న మురళీమోహన్ నిర్మాతగా కూడా సక్సెస్‌ఫుల్. 50 ఏళ్ల సినీ ప్రయాణంలో ఎన్నో అవార్డులు పొందిన ఆయనకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించింది.

1940 జూన్ 24 పశ్చిమ గోదావరి జిల్లా చాటపర్రు గ్రామంలో జన్మించారు మురళీమోహన్. అసలు పేరు మాగంటి రాజబాబు. మురళీమోహన్ విద్యాభ్యాసం ఏలూరులో గడిచింది. ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో డిగ్రీ విద్యాభ్యాసం చేశారు. 1963లో ఎలక్ట్రికల్ మోటార్లు, ఆయిల్ ఇంజన్ల వ్యాపారం ఆరంభించారు. వ్యాపారం చేస్తూనే నాటకాల్లో నటించేవారు. అలాగే వ్యాపారంలో భాగంగా మదరాసు (చెన్నై) వెళ్లేవారు.

'జగమే మాయ'తో... అట్లూరి పూర్ణచంద్రరావు నిర్మించాలనుకున్న 'జగమే మాయ' (1973)లో నటించే అవకాశం మురళీమోహన్‌కి దక్కింది. ఆ చిత్రంతో సినిమా రంగ ప్రవేశం చేశారు. 1974లో దాసరి నారాయణరావు దర్శకత్వంలో నటించిన 'తిరుపతి సినిమాతో మురళీమోహన్‌కి గుర్తింపు వచ్చింది. ఒకవైపు హీరోగా నటిస్తూనే... మరోవైపు ఏ పాత్ర వస్తే అది కాదనకుండా చేశారు మురళీమోహన్.

'పాడిపంటలు పున్నమ్మ'తో భారీ విజయం: హీరోగా మురళీమోహన్ కెరీర్‌లో భారీ విజయవంతమైన చిత్రం 'పాడిపంటలు పున్నమ్మ'. 1978లో విడుదలైన ఈ చిత్రం ఆ ఏడాది బ్లాక్ బస్టర్ చిత్రంగా నమోదు అయింది. 50 ఏళ్ల కెరీర్ దాదాపు 350 చిత్రాల్లో నటించారు.

నిర్మాతగా జయభేరి: మురళీమోహన్ తన సోదరుడు కిశోర్‌తో కలిసి 'జయభేరి ఆర్ట్స్'ని ఆరంభించారు. ఈ బేనర్‌పై రూపొందిన తొలి చిత్రం 'రామదండు' (1981). ఈ చిత్రంలో మురళీమోహన్ హీరోగా నటించారు. అదే ఏడాది ఈ సంస్థ నిర్మించిన 'వారలబ్బాయ్' లోనూ హీరోగా నటించారు. నటుడిగా ఇది మురళీమోహన్‌కు నూరవ చిత్రం. జయభేరి ఆర్ట్స్‌పై రూపొందిన చిత్రాల్లో మహేశ్‌బాబు హీరోగా నటించిన 'అతడు' (2005) ఒకటి. ఈ నిర్మాణ సంస్థలో దాదాపు 25 చిత్రాలు వచ్చాయి.

పలు బాధ్యతలతో... నేషనల్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్లలో వివిధ హోదాలలో బాధ్యతలు నిర్వర్తించారు మురళీమోహన్. 2015 వరకు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా)కు గౌరవాధ్యక్షునిగా చేశారు.

రాజకీయ రంగంలో... 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా రాజమండ్రి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మళ్లీ 2014లో రాజమండ్రి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. మురళీమోహన్‌కు భార్య విజయలక్ష్మి, కుమార్తె మధు బిందు, కుమారుడు రామ్మోహన్ ఉన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్‌లో 85 శాతం పొందిన పేద విద్యార్థులను మురళీమోహన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చదివిస్తున్నారు. ఇక ఉత్తమ నటుడిగా 'ఓ తండ్రి తీర్పు' (1985)కి, ఉత్తమ సహాయ నటుడిగా 'ప్రేమించు' (2001), 'వేగు చుక్కలు' (2003) చిత్రాలకు గాను మురళీమోహన్ నంది అవార్డులు అందుకున్నారు. తాజాగా ఆయన అవార్డుల జాబితాలో ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డు చేరింది.

కీర్తి కిరీటంలో పద్మం

నట కిరీటి అనిపించుకున్న రాజేంద్రప్రసాద్ కీర్తి కిరీటంలో పద్మశ్రీ అవార్డు చేరింది. కృష్ణా జిల్లా పామర్రు మండలం నిమ్మకూరు గ్రామంలో గద్దె నారాయణ, విజయ చాముండేశ్వరీ దంపతులకు 1956 జూలై 19న రాజేంద్రప్రసాద్ జన్మించారు. నిమ్మకూరు గ్రామంలోని ఎన్టీఆర్ నివాసంలోనే ఉండేవారు నారాయణ. ఆ గ్రామంలోని నందమూరి హరికృష్ణ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించేవారు. ఎన్టీఆర్ కుటుంబ సభ్యులకు రాజేంద్రప్రసాద్‌కు చిన్ననాటి నుంచి మంచి అనుబంధం ఉంది. కాగా రాజేంద్రప్రసాద్ సిరామిక్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా పట్టభద్రుడయ్యాడు. ఓ కంపెనీలో ఉద్యోగానికి చేరినప్పటికీ వయసు చిన్నది కావడంతో రాజీనామా చేయాల్సిన పరిస్థితి. 'తాతమ్మ కల' షూటింగ్ చూసిన తర్వాత రాజేంద్రప్రసాద్‌కి సినిమాల్లోకి వెళ్లాలనే ఆలోచన వచ్చింది. అప్పుడు ఎన్టీఆర్, ఆయన సోదరుడు త్రివిక్రమ రావు సూచన మేరకు నటనలో శిక్షణ తీసుకున్నారు.

'స్నేహం'తో... బాపు దర్శకత్వంలో రూపొందిన 'స్నేహం' (1977) నటుడిగా రాజేంద్రప్రసాద్ తొలి చిత్రం. ఆ తర్వాత 'మంచుపల్లకి, ఈ చరిత్ర ఏ సిరాతో, పెళ్ళి చూపులు, రామరాజ్యంలో భీమరాజు' తదితర చిత్రాల్లో చేసిన పాత్రలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 'ప్రేమించు పెళ్లాడు' సినిమాతో రాజేంద్రప్రసాద్‌ని హీరోగా పరిచయ చేశారు దర్శకుడు వంశీ. ఆ తర్వాత వంశీ దర్శకత్వంలోనే చేసిన 'లేడీస్ టైలర్'తో రాజేంద్రప్రసాద్‌కి హీరోగా మంచి గుర్తింపు వచ్చింది. జంధ్యాల దర్శకత్వంలో హీరోగా నటించిన 'అహ నా పెళ్ళంట' స్టార్‌ని చేసింది. 'క్విక్ గన్ మురుగన్' అనే హాలీవుడ్ చిత్రంలో నటించారు. 'మేడమ్ ' సినిమాలో ప్రయోగాత్మకంగా మహిళ పాత్ర పోషించి, తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఇంకా 'ఆ నలుగురు, ఓనమాలు, మీ శ్రేయోభిలాషి' వంటి చిత్రాల్లో నటుడిగా ప్రేక్షకుల మనసులను తాకారు రాజేంద్రప్రసాద్.

అవార్డులు: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా)కు 2015లో అధ్యక్షుడిగా చేశారు రాజేంద్రప్రసాద్. అవార్డుల విషయానికొస్తే... 'ఎర్ర మందారం' (1991)తో ఉత్తమ నటుడిగా, 'మేడమ్' (1994)కి స్పెషల్ జ్యూరీ, 'ఆ నలుగురు' (2004)కి ఉత్తమ నటుడిగా, 'టామీ' (2014)కి ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డులు అందుకున్నారు రాజేంద్రప్రసాద్. తాజాగా పద్మశ్రీ వరించింది.

విలక్షణ నటుడు

హీరో, విలన్, క్యారెక్టర్ ఆరిస్టు... ఇలా భిన్న కోణాల్లో నిరూపించుకున్న మాధవన్‌ను పద్మశ్రీ పురస్కారం వరించింది.

మాధవన్ అసలు పేరు రంగనాథన్ మాధవన్. 1970లో జూన్ 1న జంషెడ్పూర్‌లోని ఓ తమిళ కుటుంబంలో జన్మించారు. మాధవన్ విద్యాభాసం కొల్హాపూర్‌లో సాగింది. చదువుకునే రోజుల్లో మాధవన్ సాంస్కృతిక కార్యక్రమాల్లో చాలా యాక్టివ్‌గా ఉండేవారు. చదువు పూర్తయ్యాక ముంబైకి రావడం, టీవీ ఇండస్ట్రీలో అవకాశం దక్కడం జరిగింది.

పాటతో ప్రయాణం: తొలుత 'ఇస్ రాత్ కీ సుబా నహీ' అనే హిందీ చిత్రంలోని ఓ పాట పాడి, ఇదే పాటలో గెస్ట్‌గా కనిపించారు మాధవన్. మణిరత్నం దర్శకత్వం వహించిన 'అలై పాయుదే..' (2000) చిత్రంతో మాధవన్‌కి నటుడిగా బ్రేక్ వచ్చింది. 'మిన్నలే, డుమ్ డుమ్ డుమ్' చిత్రాలూ మాధవన్‌కు గుర్తింపును తెచ్చిపెట్టాయి. కానీ 2002లో 'రన్' సినిమా మాధవన్‌కు మంచి కమర్షియల్ సక్సెస్‌ను తెచ్చిపెట్టింది. 'రెహ్నా హై తేరే దిల్ మే' ('మిన్నలే' సినిమాకు రీమేక్) హిందీలో మాధవన్‌కు తొలి చిత్రం. ఆ తర్వాత 'రంగ్ దే బసంతి, గురు, త్రీ ఇడియట్స్, తను వెడ్స్ మను, సైతాన్, ధురంధర్' చిత్రాల్లో నటించారు. తెలుగులో ప్రకాశ్ దంతులూరి డైరెక్షన్‌లో నవదీప్, కాజల్ అగర్వాల్ జంటగా నటించిన 'ఓం శాంతి' చిత్రంలో నటించారు. నాగచైతన్య 'సవ్యసాచి'లో మాధవన్ విలన్‌గా నటించి, మెప్పించారు. మాధవన్ నటించి, స్వీయదర్శకత్వంలో నిర్మించిన బయోగ్రాఫికల్ డ్రామా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' బెస్ట్ ఫీచర్ ఫిల్మ్‌గా జాతీయ అవార్డు దక్కింది. నటుడిగా–దర్శకుడిగా మాధవన్ ప్రతిభకు ఇప్పుడు పద్మశ్రీ పురస్కారం దక్కింది.

మంచిమాట

వర్తమానంలోనే ఉందాం..

వర్తమానంలో జీవించడం అనేది ఒక అద్భుతమైన కళ. దీనినే మనం 'మైండ్‌ఫుల్‌నెస్' అని కూడా పిలుస్తాం. గతం గురించి పశ్చాత్తాపం చెందకుండా, భవిష్యత్తు గురించి ఆందోళన పడకుండా, ప్రస్తుతం ముందున్న క్షణాన్ని పూర్తిగా అనుభవించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం.

మనం చాలా పనులు యాంత్రికంగా చేస్తుంటాం. ఉదాహరణకు: అన్నం తినేటప్పుడు టీవీ చూడటం, స్నానం చేసేటప్పుడు ఆఫీసు పనుల గురించి ఆలోచించడం. ఆహారం రుచి, వాసన, అది మీ నోటిలో ఎలా ఉందో గమనిస్తూ తినండి. నేలపై మీ అడుగుల స్పర్శను, గాలిని అనుభూతి చెందండి. తీర్పులు ఇవ్వడం మానుకోండి. మనకు ఏదైనా పరిస్థితి ఎదురైనప్పుడు అది 'మంచి' లేదా 'చెడు' అని వెంటనే ముద్ర వేస్తాం. అలా కాకుండా, ఆ పరిస్థితిని ఉన్నది ఉన్నట్లుగా గమనించండి. ఆలోచనలు వస్తుంటాయి, పోతుంటాయి. వాటిని మేఘాలను చూస్తున్నట్లు వదిలేయండి. కానీ వాటితోపాటు కొట్టుకుపోకండి. మనం నియంత్రించలేని విషయాల గురించి (ఉదాహరణకు: ఇతరుల ప్రవర్తన) ఆలోచించడం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. ఆందోళన అనేది నిజానికి మన మెదడు మనల్ని రక్షించుకోవడానికి ఇచ్చే ఒక సంకేతం. కానీ అది పరిమితి దాటినప్పుడు మన పనితీరును దెబ్బతీస్తుంది. భవిష్యత్తు ఎప్పుడూ అస్పష్టంగానే ఉంటుంది. అస్పష్టతను భయంగా కాకుండా ఒక అవకాశంగా చూడటం అలవాటు చేసుకోవాలి. వర్తమానంలో జీవించడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. భవిష్యత్తు గురించిన అనవసర భయాలు తొలగిపోతాయి. ఏకాగ్రత పెరుగుతుంది. పనిలో నాణ్యత పెరుగుతుంది. సంబంధాలు మెరుగుపడతాయి. ఎదుటివారితో మాట్లాడేటప్పుడు పూర్తి శ్రద్ధతో ఉంటారు కాబట్టి బంధాలు బలపడతాయి. చిన్న చిన్న విషయాల్లో కూడా ఆనందాన్ని వెతకడం అలవాటవుతుంది.

మనసు పరిగెత్తడం సహజం. అలా వెళ్ళిన ప్రతిసారీ కోప్పడకుండా, ప్రేమగా మళ్ళీ ప్రస్తుత క్షణానికి తీసుకురండి. ఇది ఒక సాధన.

పని చేస్తున్నప్పుడు / ప్రయాణంలో ఉన్నప్పుడు ఇష్టదైవ నామాన్ని మెల్లగా జపించండి.

సన్నిధి

వర్తమాన కాలంలో ప్రశాంతంగా, సంతృప్తిగా జీవించడం భగవంతుని ఆరాధనలో ఒక అద్భుతమైన మార్గం. రేపటి గురించి ఆందోళన పడకుండా, నిన్నటి గురించి బాధపడకుండా 'ఈ క్షణంలో' దైవాన్ని ఎలా అనుభవించాలో మనస్సు పాత జ్ఞాపకాల్లోకో లేదా భవిష్యత్తు భయాల్లోకో వెళ్తున్నప్పుడు, దైవనామాన్ని స్మరించడం వల్ల మనస్సు మళ్లీ వర్తమానంలోకి వస్తుంది.

ఇది మనస్సును నిలకడగా ఉంచుతుంది. భగవంతుడిని కేవలం గుడిలోనో, పూజాగదిలోనో చూడకుండా, చేసే ప్రతి పనిలోనూ చూడటం. 'నేను చేసే ఈ పని భగవంతుడికి అర్పితం' అనే భావనతో పని చేయండి. అప్పుడు ఆ పనిలో నాణ్యత పెరుగుతుంది. ఒత్తిడి తగ్గుతుంది. 'జరగబోయేది ఏదో భగవంతుడికి తెలుసు, ఆయన చూసుకుంటాడనే నమ్మకం వర్తమానంలో ప్రశాంతతను ఇస్తుంది. ఫలితం మీద ఆశ వదిలేసి, కర్తవ్యాన్ని నిర్వహించడమే గీతలో చెప్పిన సారాంశం. నిశ్శబ్దంగా కూర్చుని శ్వాసను గమనించడం కూడా ఒక రకమైన ఆరాధనే. శ్వాస అనేది మన శరీరంలో వర్తమానానికి గుర్తు. దేవుడు ఎక్కడో లేడు, మనలో ఉన్న 'శాంతి' రూపంలోనే ఉన్నాడు. వర్తమానంలో జీవించడమే భగవంతుడికి మనం ఇచ్చే అతిపెద్ద నైవేద్యం.

– రామలక్ష్మి సదానందమ్

అమృత బిందువులు

- తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు... అంటాడు వేమన. మన సమాజంలో కొందరు ఇతరుల్లోని లోపాలను అదేపనిగా వేలెత్తి చూపిస్తూ విమర్శిస్తూంటారు. గురివింద తన మచ్చ ఎరగనట్లు తమలోని లోపాలను గుర్తించకుండా ఎదుటివారిలో తప్పులు వెతుకుతూ వారిని విమర్శించడం వల్ల మిగతా నష్టాలను అలా ఉంచితే ముఖ్యంగా అనుబంధాలు దెబ్బతింటాయి.
- భగవంతుడి దృష్టిలో అందరూ సమానులే. లోపాలు, దోషాలు ఉన్నంతమాత్రాన సాటివారిని తక్కువగా చూడకూడదు. రూప భేదాలు భౌతికం దేహానికే గానీ మనసులకు లేవు. ప్రతీ ప్రాణి హృదయంలో ఆ పరమాత్మ కొలువై ఉంటాడు. అందుకే ఈ సృష్టిలో ప్రతి జీవినీ ప్రేమించాలి. ప్రతి ప్రాణిలోనూ ఆ పరమాత్మను దర్శించే స్థాయికి చేరుకోవాలి.
- మనిషి సంఘజీవి. ఈ సమాజంలో ఒకరి సహకారం లేకుండా మరొకరు బతకలేరు. ఎంత గొప్పవారైనా మరొకరిపై ఆధారపడకుండా జీవించలేరు. అందుకే వత్తి వల్లనో, రూపాన్నిబట్టో, బలహీనతల కారణంగానో ఎవరినీ చిన్న చూపు. చూడకూడదు. పరాక్రమవంతుడైన రాముడికి వానరసేన సాయం చేసి విజయానికి తోడ్పడింది.

నిజాంపట్నం పాలరేవు నుంచి హార్బర్‌కు వెళ్లే కాలువలో విస్తరించి ఉన్న మడ అడవులు

పెనుమూడి వద్ద కృష్ణమ్మ, ఆకట్టుకుంటున్న పుష్కర ఘాటు

హంసలదీవి వద్ద సముద్రంలో కలుస్తున్న కృష్ణమ్మ

తీరం..సొగసు చూడతరమా..!

తీర ప్రాంతం పర్యాటకానికి అనువు

- ఓ వైపు నది మరోవైపు సముద్రంతో కనువిందు
- నది మధ్యలో సహజ సిద్ధంగా ఏర్పడిన దీవులు
- ఆకట్టుకుంటున్న పెనుమూడి రేవు
- పలు సినిమా షూటింగ్‌ల చిత్రీకరణ

నిజాంపట్నం సముద్ర తీరప్రాంతంలో మడ అడవులు

రేపల్లె: సహజ సౌందర్యానికి చిరునామాగా నిలుస్తున్న బాపట్ల జిల్లా రేపల్లె తీర ప్రాంతం పర్యాటక అభివృద్ధికి అపార అవకాశాలను కలిగి ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఓ వైపు కృష్ణానది, మరోవైపు సముద్రం కలిసి రమణీయ దృశ్యాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తుంటాయి. నదీ ప్రవాహం మధ్యలో సహజ సిద్ధంగా ఏర్పడిన చిన్న చిన్న దీవులు ఈ ప్రాంత ప్రత్యేకతగా నిలుస్తున్నాయి. చారిత్రక ప్రాధాన్యం కలిగిన పెనుమూడి రేవు సందర్శకులకు మరింత ఆసక్తిని కలిగిస్తోంది. పర్యాటకులను ఆకర్షిస్తున్న దిండి, నిజాంపట్నం బీచ్‌లు విహారయాత్రలకు అనువుగా ఉన్నాయి. రమణీయంగా విస్తరించిన మడ అడవులు ఈ ప్రాంతానికి మరింత సహజ సౌందర్యాన్ని చేకూరుస్తున్నాయి. ఇన్ని ప్రత్యేకతలతో రేపల్లె తీర ప్రాంతం భవిష్యత్తులో ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందేందుకు ఆపార అవకాశాలు కలిగిఉంది.

పెనుమూడి రేవు ప్రత్యేక ఆకర్షణ:

చారిత్రక ప్రాధాన్యం కలిగిన పెనుమూడి రేవు పర్యాటకులకు ఆకర్షణీయ కేంద్రంగా మారుతోంది. ఒకప్పుడు వాణిజ్యానికి కీలకంగా ఉన్న ఈ రేవు ప్రస్తుతం పర్యాటక దృష్ట్యా మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. అలాగే దిండి, నిజాంపట్నం బీచ్‌లు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ప్రశాంత వాతావరణం, విస్తారమైన సముద్ర తీరం విహారయాత్రలకు అనువుగా ఉన్నాయి.

సహజ సిద్ధంగా ఏర్పడిన దీవులు

పెనుమూడి-పులిగడ్డ మధ్యలో సహజంగా ఏర్పడిన చిన్న చిన్న దీవులు ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. మహాబలేశ్వరంలో పుట్టిన కృష్ణమ్మ కృష్ణా జిల్లా హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. అయితే హంసలదీవిలో కలిసే ముందు కృష్ణా జిల్లా పులిగడ్డ-బాపట్ల జిల్లా పెనుమూడి మధ్యలో మూడు పాయలుగా చీలి ప్రవహిస్తుంది. ఈ పాయల మధ్యలో సహజ సిద్ధంగా ఉన్న దీవులు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. సూర్యాస్తమయ దృశ్యాలు సందర్శకులను కట్టిపడేస్తాయి.

ఆకర్షించే బీచ్‌లు

తీరంలో సరైన మౌలిక వసతులు, బీచ్ అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించే గమ్యస్థానాలుగా మారడం ఖాయం. ప్రకృతి- అభివృద్ధి సమన్వయానికి ప్రతీకగా నిలువగల ఈ తీరప్రాంతాల అభివృద్ధి ఆవశ్యకత ఎంతైనా ఉంది. నిజాంపట్నంహార్బర్‌లో గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.451 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులతో కొంత వరకు రూపురేఖలు మారాయి.

సినిమా షూటింగ్‌లకు కేంద్రం

ఈ ప్రాంతంలోని సహజ దృశ్యాలు ఇప్పటికే పలు సినిమా షూటింగ్‌లకు వేదికయ్యాయి. వెండితెరపై కనిపించిన తీరం అందాలు పర్యాటక ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. గతంలో పెనుమూడి రేవు, కృష్ణానది వారధిపై జయ జానకీ నాయక, పండుగాడు ఫొటో స్టూడియో వంటి సినిమాల షూటింగులతో పాటు పలు టెలిఫిలింల చిత్రీకరణ జరిగాయి.

అభివృద్ధిపై ఆశలు

జాతీయ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో ప్రభుత్వం పర్యాటక అభివృద్ధిపై సమగ్ర దృష్టి సారించి రేపల్లె తీర ప్రాంతంలో మౌలిక వసతులు, రహదారి సౌకర్యాలు, వసతి ఏర్పాట్లు మెరుగుపరిస్తే రేపల్లె తీర ప్రాంతం రాష్ట్ర స్థాయిలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఎదగగలదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పర్యాటక రంగం విస్తరిస్తే ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి గణనీయంగా దోహదపడనుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మడ అడవుల రమణీయత

తీర ప్రాంతంలో విస్తరించిన మడ అడవులు పర్యావరణ పరిరక్షణకు కీలకంగా నిలుస్తూనే ప్రకృతి ప్రేమికులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తున్నాయి. జీవ వైవిధ్యంతో కళకళలాడే ఈ అడవులు ఎకో టూరిజానికి అనువైన ప్రాంతాలుగా గుర్తింపు పొందుతున్నాయి. పక్షి జాతులు, సముద్ర జీవులు సమృద్ధిగా ఉండటంతో ప్రకృతి ప్రేమికులకు ఇది అనుకూల ప్రాంతంగా మారింది.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

డిగ్రీ కాలేజీల బోధనేతర సిబ్బంది సంఘం కార్యవర్గం ఎన్నిక

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): ఏపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోధనేతర సిబ్బంది సంఘం రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం విజయవాడలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యాసాగర్ (కుప్పం), కార్యదర్శిగా మురళి (విజయవాడ), కోశాధికారిగా అబ్దుల్ కరీమ్ (మదనపల్లి), సహ అధ్యక్షుడిగా అశోక్ (మొవ్వ), ఉపాధ్యక్షులుగా ప్రవీణ్ కుమార్ (తూర్పు గోదావరి జిల్లా), శివశంకర్ (నెల్లూరు), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చైతన్య (గుంటూరు), సంయుక్త కార్యదర్శులుగా ఉమామహేశ్వరి (రాజమహేంద్రవరం), బాలాజీ (వాయల్పాడు), జి.వి.ఉమా మహేశ్వరి (విజయవాడ), జోనల్ కార్యదర్శిగా శివప్రసాద్ (అనంతపురం), సునీత (విజయనగరం)ను ఎన్నుకున్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతాం

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్

తిరుపతి సిటీ: చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతామని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్ స్పష్టం చేశారు. తిరుపతిలోని ఎస్వీయూలో ఆదివారం ప్రారంభమైన ఎస్‌ఎఫ్‌ఐ 6వ జిల్లా మహాసభలో ఆయన ప్రసంగించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలను ఎస్‌ఎఫ్‌ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకునేందుకు విద్యార్థులంతా ఉద్యమబాట పట్టాలని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కేంద్రం చర్యలను వ్యతిరేకించాలని కోరారు.

29న సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం

సాక్షి, అమరావతి: సైబర్ మోసాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 29న విజయవాడలో 'సైబర్ సెక్యూరిటీ–కెపాసిటీ బిల్డింగ్' పేరిట అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునేవారు వివరాలకు 9848077227 నంబర్‌లో గానీ, andhrachambervijayawada@gmail.comలో గానీ సంప్రదించాలని సూచించారు.

మహారాష్ట్ర పర్యటనకు పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఉన్న తఖ్త్‌సచ్ కండ్ గురుద్వారాను సందర్శించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో కలిసి సిక్కుల పదోవ మత గురువు శ్రీ గురు గోవింద్ సింగ్ సాయిబా సమాధి మందిరాన్ని దర్శించుకున్నారు. శ్రీ గురు తేగ్ బహదూర్ సింగ్ 350వ షాహిదీ సమాగమంలో పాల్గొనేందుకు పవన్ నాందేడ్ పర్యటనకు వెళ్లినట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

వీధికొ కటీ..

విజయనగరంలోని ఓ టీ స్టాల్‌లో మాటామంతీ...

- వీధివీధినా టీ పాయింట్
- ఆధునిక రచ్చబండలుగా టీ స్టాల్స్
- ఉదయం, సాయంత్రం వేళల్లో సందడి వాతావరణం
- అన్ని రంగాల సమస్యలపై అక్కడే చర్చలు
- వినియోగదారులను ఆకర్షిస్తున్న వివిధ రకాల ఫ్లేవర్లు

విజయనగరం: స్నేహితులు.. వ్యాపారులు.. ఉద్యోగులు.. నిరుద్యోగులు.. యువకులు.. విద్యార్థులు.. ప్రయా ణికులు.. బాటసారులు ఇలా ఏ ఇద్దరు ముగ్గురు కలిసినా... వారి ముచ్చట్లకు టీ స్టాలే వేదిక. కమ్మని టీ తాగుతూ కష్టసుఖాలు.. సమస్యలకు పరిష్కారా లు.. ప్రయాణ సంగతులు.. వ్యాపార లావాదేవీలు.. ఉద్యోగ సమాచారాలు.. ఇలా.. ఒకటేమిటి.. అన్ని ముచ్చట్లకు టీ పాయింట్‌లే ఆధారంగా మారాయి. ఆధునిక రచ్చబండలుగా మారుతున్నాయి. ఒకప్పుడు నలుగురు కలిసి మాట్లాడుకోవాలంటే.. నాలుగు దారులు కలిసే చోటకు చేరేవారు. లేదంటే రచ్చబండను వేదిక చేసుకునే వారు. ఇప్పటికీ కొన్ని పల్లెల్లో ఇవి ఉన్నా.. పల్లె, పట్టణం తేడా లేకుండా టీ స్టాల్స్ అన్నింటికీ వేదిక చేసుకోవడం నయా ట్రెండ్‌గా మారింది.

అన్ని అంశాలూ ఇక్కడే..

ఒకప్పుడు టీ స్టాళ్లు పట్టణాలకే పరిమితం. ఊళ్లలో అసలు ఉండేవి కావు. గత పది, పదిహేనేళ్ల నుంచి పల్లెల్లోనూ ప్రత్యక్షమవుతున్నాయి. ప్రస్తుతం నగరాల్లో వీధికొకటి ఏర్పడ్డాయి. దీనికి కారణం.. ప్రతి చర్చకూ ఇది మంచి వేదికగా దొరకడమే. ఊళ్లో ఏం జరిగినా.. టీ స్టాల్ వద్దకు కచ్చితంగా చేరుతుంది. ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఎవరో ఒకరు ఇక్కడికి వచ్చి అక్కడున్న నలుగురికీ ఆ విషయాన్ని చేరవేస్తారు. ఊరిలో రాజకీయ వాతావరణంపై, సమస్యల పరిష్కారానికి ఇక్కడే ఆలోచనలు మొదలవుతుంటాయి. కాస్త సమాజంపై పట్టున్న వారు ఇక్కడికొచ్చే పత్రికలు చదివి సామాజిక అంశాలపై చర్చిస్తుంటారు. యువత కూడా స్పెషల్ ఛాయ్ ఆర్డర్ చెప్పి చరవాణిలో వచ్చే విద్య, ఇతరత్రా సాంకేతిక అంశాలను పంచుకుంటారు. తమ భవిష్యత్ ప్రణాళికలను చర్చించుకుంటారు.

ఉపాధికి మార్గం..

ఇక్కడ స్నేహితు లు, శ్రేయోభిలా షుల ద్వారా కొత్త పరిచయాలు పెరుగుతున్నా యి. ఉపాధి బాటగానూ టీ స్టాల్‌ను యువత ఎంచుకుంటోంది. రకరకాల ఫ్లేవర్లతో టీ స్టాళ్లను ఏర్పా టు చేసి ప్రస్తుత తరాన్ని ఆకర్షిస్తున్నారు. కొందరు కొన్ని బ్రాండ్ల పేరుతో ఫ్రాంచైజ్‌లనూ ఏర్పాటు చేస్తున్నారు. టీ, కాఫీ ప్రియులను ఆకర్షిస్తున్నారు. ఉపాధి పొందుతూ మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు.

అందుబాటులో వివిధ రకాల ఫ్లేవర్‌లు..

టీ తాగడం మానేస్తే ఆరోగ్యానికి మేలని ఒకప్పటి మాట.. కాలం మారుతున్నట్లే వాటిల్లోనూ 120కి పైగా రకాలు నేడు అందుబాటులోకి వచ్చాయి.. అంతేనా మీ అనారోగ్య ఇబ్బందులు తొలగేందుకు 'ఈ రకమైన టీ తాగండి' అనే సలహాలు ఇస్తున్నారంటే.. ప్రాధాన్యం చెప్పనక్కర్లేదు. కార్పొరేట్ జాబితాలో చేరిన ఈ వ్యాపారం ఉమ్మడి విజయనగరం జిల్లాలో రోజు రోజుకు విస్తరిస్తోంది. ఓ కప్పు టీ రకాన్ని బట్టి రూ.10 నుంచి రూ.100 వరకు ధరలు ఉన్నాయి. కిలో రూ.300 పలికే టీ పొడితో పాటు 50 గ్రాములు రూ.200 ధర పలికే టీపొడి నగరంలో వాడుకలో ఉన్నాయి. రెండు జిల్లాల్లో సుమారుగా 600 టీ స్టాల్స్ ఉన్నాయన్న అంచనా ఉండగా.. 21 కార్పొరేట్ స్థాయిల బ్రాండెడ్ దుకాణాలు ఉన్నాయి. సాధారణ టీల కంటే అల్లం, బెల్లం గ్రీన్ టీలకు ఆదరణ ఎక్కువగా ఉంది. కాఫీలోనూ బెల్లం వాడకం పెంచడంతో వాటి విక్రయాలు పెరిగాయి. మామిడి అల్లం కూడా వాడుకలోకి తెచ్చారు. అల్లం ఘాటుతో మామిడి రుచి ఉండటం దీని ప్రత్యేకత. బెల్లం, శిలాజిత్ కాఫీలకు ఆదరణ ఉంది. లాభాల మాట ఎలా ఉన్నా అవగాహన, విషయ పరిజ్ఞానం లేకుండా దిగితే నష్టాల బాట తప్పదన్నది కొందరిమాట.

సందడిగా ఉంటుంది

గతంలో రోడ్డు వెంట టీ తాగేందుకు వెనకాడేవారు. ఆ బిడియం ఇప్పుడు లేదు. యువకులు, వ్యాపారులు, నాయకులు ఎవరైనా సరే.. కలుసుకోగానే ఇక్కడకొచ్చి టీ తాగుతూ వారికి సంబంధించిన విషయాలపై చర్చించడం అలవాటైంది. వారున్నంత సేపు సందడే. పొద్దున్నే పొలానికి, వివిధ పనులకు, ఉద్యోగాలకు వెళ్లే వాళ్లంతా ఇక్కడే మాట్లాడుకుంటున్నారు.

– సహదేవ్, టీ స్టాల్ నిర్వాహకుడు, విజయనగరం.

కమీషన్‌ల కోసం రోగులను బాదేస్తున్నారు

- అవసరం లేకుండానే వైద్య పరీక్షలు
- నియంత్రణలేని వైద్య పరీక్షల ఫీజులు
- కొంత మంది వైద్యుల్లో లోపిస్తున్న నైతిక ప్రాక్టీస్



గుంటూరు మెడికల్: గుంటూరు శ్రీనివాసరావుతోటకు చెందిన సాంబయ్య అనే వ్యక్తి జ్వరం, ఒళ్ళు నొప్పులతో బాధపడుతూ గుంటూరు కొత్తపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం కోసం చేరాడు. అతడికి సుమారు 15 రకాల వైద్య పరీక్షలు రాసి వారం రోజులకు రూ.లక్షన్నర బిల్లు వేయటంతో ఖంగుతిన్నాడు.

- పల్నాడు జిల్లాకు చెందిన ఖాసిం అనే వ్యక్తి తల నొప్పితో బాధపడుతూ స్పెషాలిటీ వైద్యుల కోసం గుంటూరు నగరంలోని ఓ వైద్యుడిని సంప్రదించాడు. ఖాసిం గదిలోపల ఉన్న వైద్యుడి వద్దకు వెళ్ళక ముందే అక్కడ పనిచేసే కిందిస్థాయి ఉద్యోగులు ఎమ్మారై స్కాన్, రక్తపరీక్షలు చేయించుకు రావాలని కాగితంపై రాసి ఇచ్చారు. ఈ పరీక్షలకు రూ.15వేలు ఖర్చు కావడంతో ఖాసింకు తలతిరిగిపోయింది. ఆ తరువాత డాక్టర్ ఫీజు, మందులు, అన్నీ కలుపుకుని ఒక్కరోజులోనే రూ.20 వేలు ఖర్చు కావడంతో గ్రామీణ ప్రాంతానికి చెందిన ఖాసిం బిక్కముఖం వేసుకుని వెళ్ళిపోయాడు. ఇలా ప్రతిరోజూ ఎంతో మంది రోగులు వివిధ రకాల స్పెషాలిటీ వైద్యుల వద్దకు వెళ్ళి జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు. ఆస్పత్రి నిర్వాహకులకు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్స్ నిర్వాహకులు మధ్య కమీషన్ ఒప్పందం ఉండటంతో అవసరం లేకపోయినా వ్యాధి నిర్ధారణ పరీక్షలు రాసి రోగులకు వైద్యం తడిసి మోపెడయ్యేలా చేస్తున్నారని పలువురు సీనియర్ వైద్య నిపుణులే వాపోతున్నారు. కొంత మంది వైద్యులు కమీషన్ల కోసం కక్కుర్తి పడుతూ రోగి ముఖం కూడా చూడకుండానే వైద్య పరీక్షలు రాస్తున్నారు. కొంత మంది రోగులను వైద్యుల వద్దకు కూడా వెళ్ళనీయకుండా డాక్టర్ వద్ద పనిచేసే అసిస్టెంట్లు వివిధ రకాల టెస్ట్‌ల పేరుతో దోచుకుంటున్నారు.

ఎమ్మారై, సిటీ స్కాన్‌లో సగానికి పైగా వైద్యులకే...

ఎమ్మారై, సిటీ స్కాన్ లాంటి వైద్య పరీక్షలకు రోగుల వద్ద నుంచి వసూలు చేసే ఫీజులో సగానికి పైగా రోగిని తమ వద్దకు పరీక్ష కోసం పంపిన వైద్యులకే అందజేస్తున్నామని స్కాన్ సెంటర్స్ నిర్వాహకులు తెలుపుతున్నారు. సిటీ స్కాన్ పరీక్ష కోసం రూ.5 వేలు నుంచి రూ.10వేలు వరకు ఫీజు తీసుకుంటున్నారు. అందులో సగానికి పైగా డాక్టర్లకు చెల్లిస్తున్నారు. ఎమ్మారై స్కానింగ్ కోసం రూ.10వేల నుంచి రూ. 20వేలు వరకు వసూలు చేసి సగం డబ్బులు వైద్యులకు కమీషన్ రూపంలో అందజేస్తున్నారు. ల్యాబ్‌లలో చేసే వివిధ రకాల రక్త పరీక్షలకు వసూలు చేసే ఫీజులో 40 నుంచి 60 శాతం వరకు వైద్యులకు ముట్టచెబుతున్నారు. సాయంత్రానికి వారికి కమీషన్ పంపించాలని లేకపోతే రెండో రోజు తమ స్కానింగ్ సెంటర్ లేదా ల్యాబ్‌కు సదరు వైద్యులు రోగులను పంపటం లేదని స్కానింగ్ సెంటర్స్ నిర్వాహకులు తెలిపారు. కమీషన్లు తీసుకోకుండా జీజీహెచ్ వైద్యులకు తాము పంపే రోగికి కేవలం రూ.3వేలకే సిటీ స్కాన్ పరీక్ష, రూ.5వేలకు ఎమ్మారై స్కానింగ్ పరీక్షలు ప్రైవేటు ల్యాబ్‌ల్లో చేస్తున్నారు.

జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి...

ఆంధ్రప్రదేశ్ అల్లోపతిక్ ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్, రెగ్యులేషన్) యాక్ట్–2002 ప్రకారం వైద్యులు ఏ రోగానికి ఎంత మేరకు ఫీజులు తీసుకుంటున్నారో నోటీస్ బోర్డులో తెలియజేయాల్సి ఉంది. చాలా ఆస్పత్రుల్లో అలాంటి బోర్డులు కనిపించటం లేదు. కొంత మంది వైద్యులు నోటీస్ బోర్డుల్లో ఫీజులు వివరాలు పెట్టినా వాటికి కంటే అధికంగా వసూలు చేస్తూ ప్రజలను పిండేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించి అల్లోపతిక్ చట్టం అమలు జరిగేలా, వైద్యుల అనైతిక ప్రాక్టీస్‌కు చెక్‌పెట్టి రోగులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని బాధితులు కోరుతున్నారు.

డిస్కంల సీఎండీలతో కలిసి మిషన్ లైఫ్ పోస్టర్ ను విడుదల చేస్తున్న ఏపీఈఆర్సీ చైర్మన్ పీవీఆర్ రెడ్డి

విద్యుత్ ఆదాతో పర్యావరణ పరిరక్షణ

- ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ పీవీఆర్ రెడ్డి
- మిషన్ లైఫ్ (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) పోస్టర్ విడుదల

సాక్షి, అమరావతి : విద్యుత్ ను ఆదా చేస్తే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని, భావి తరాలకు స్వచ్ఛమైన విద్యుత్ వెలుగులను అందించవచ్చని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)చైర్మన్ పీవీఆర్ రెడ్డి అన్నారు. పర్యావరణ అనుకూల జీవనశైలిని ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా, డిస్కంల సీఎండీలు పి.పుల్లారెడ్డి, ఎల్.శివశంకర్ ,ఐ.పృథ్వీతేజ్‌లతో కలిసి మిషన్ లైఫ్ (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) పోస్టర్‌ను విజయవాడలో ఆయన ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను అరికట్టడం అందరి బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో ఇంధన శాఖ అదనపు కార్యదర్శి కిశోర్ కుమార్, ఏపీఈఆర్సీ జాయింట్ డైరెక్టర్ డి.రామనయ్య శెట్టి, కార్యదర్శి పి. కృష్ణ పాల్గొన్నారు.

పర్యాటకం: 28 నుంచి 31 వరకు మేడారం జాతర

గద్దెలే గర్భగుడులుగా..
గిరిజనులే పూజారులుగా..
వెదురుకర్రలే ఉత్సవమూర్తులుగా..
కుంకుమ భరిణెలే అమ్మల ప్రతిరూపాలుగా..
బెల్లమే నిలువెత్తు బంగారంగా...
ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు
అద్దం పట్టే వనదేవతల పండుగే
మేడారం సమ్మక్క- సారలమ్మ జాతర.

అడవి బిడ్డలే.. ఆరాధ్య దైవాలై..

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన మేడారం మాఘశుద్ధ పౌర్ణమి వచ్చిందంటే జనారణ్యంగా మారుతుంది. 'జంపన్న వాగులో తడవని వ్యక్తి.. సమ్మక్క, సారలమ్మ జాతరకు పోయిరాని ఊరు' ఉండదంటే అతిశయోక్తి కాదు.. కొండకోనల నడుమ ఓ మారుమూల గ్రామంలో జరిగే జాతరకు ఇంత ఖ్యాతి రావడానికి వెనుక వందల ఏళ్ల నాటి చరిత్ర, లక్షలాది మంది భక్తుల నమ్మకం దాగి ఉంది.

వీరత్వానికి ప్రతీకలు..

సమ్మక్క- సారలమ్మలు ధీర వనితలు.. 800 ఏళ్ల క్రితమే నారీభేరి మోగించిన వీరత్వానికి ప్రతీకలు. నమ్మిన జనం కోసం, నమ్ముకున్న విలువల కోసం, జాతి ఆత్మాభిమానం కోసం కాకతీయ సేనలకు ఎదురొడ్డి నిలిచారు. అపార పోరాట పటిమను ప్రదర్శించారు. ప్రాణాలు త్యజించి అందరి హృదయాల్లో నిలిచారు. మట్టిలో కలిసిపోయి పుడమితల్లిని పుణ్యభూమిగా మార్చారు. అయిన వారి కోసం అసువులు బాసి దేవతలయ్యారు. కాలక్రమేణా అందరికీ అమ్మలయ్యారు. అందుకే ఆదివాసీలు ఆ తల్లులకు గుండెల్లో గుడి కట్టారు. రెండేళ్లకోసారి జాతర నిర్వహిస్తూ వారి త్యాగనిరతిని గుర్తు తెచ్చుకుంటారు. ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ కుంభమేళాగా ఖ్యాతి గాంచిన ఈ జాతరకు కోటి మంది భక్తులు తరలివస్తారు.. అమ్మల ఆశీర్వాదాలు అందుకుంటారు.. భక్తి పారవశ్యంలో మునిగితేలుతారు. మేడారం మహా జాతరలో నెలలు నిండిన గర్భిణులూ అమ్మవార్లను దర్శించుకునే సంప్రదాయం ఉంది. ఆడపిల్లలు జన్మిస్తే సమ్మక్క లేదా సారలమ్మ అని, అబ్బాయి పుడితే జంపన్న అనే పేర్లు పెట్టుకొని కన్నవారు మురిసిపోవడం ఆనవాయితీగా వస్తోంది. జాతరకు అన్ని సమయాల్లోనూ మహిళలూ రావొచ్చు.

ఈ ఏడాది జనవరి 28న (బుధవారం) సాయంత్రం సారలమ్మ, గోవింద రాజు, పగిడిద్ద రాజులను గద్దెలపైకి తీసుకురావడంతో జాతర మొదలవుతుంది. రెండో రోజైన జనవరి 28 (గురువారం)న సమ్మక్క అమ్మవారు గద్దెల మీదకు చేరుకుంటారు. జనవరి 30న (శుక్రవారం) సమ్మక్క- సారలమ్మ అమ్మవార్లు గద్దెల మీద ఉంటారు. ఈ సమయంలో భక్తులు మొక్కులు చెల్లించేందుకు పెద్ద ఎత్తున తరలివస్తారు. జనవరి 31న (శనివారం) సాయంత్రం 6 గంటల సమయంలో సమ్మక్క, సారలమ్మ దేవతలు, గోవింద రాజు, పగిడిద్ద రాజు దేవుళ్ల వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది.

నాలుగు రోజుల వైభవం

జాతర మొదటి రోజున కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దె పైకి తీసుకొస్తారు. రెండో రోజు చిలుకల గుట్టలో కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠిస్తారు. వీరిని తీసుకొచ్చే సమయంలో భక్తులు పూనకంతో ఊగిపోతారు. మూడో రోజు అమ్మవార్లు ఇద్దరు గద్దెలపై కొలువుదీరి భక్తుల పూజలందుకుంటారు. నాలుగవ రోజు సాయంత్రం వన ప్రవేశం చేస్తారు. వంశపారంపర్యంగా వస్తున్న గిరిజనులే పూజార్లు కావడం ఈ జాతర ప్రత్యేకత. ఇంతితై.. వటుడింతై అన్నట్లు.. మేడారం నిత్య నూతనమై అమ్మల ఆశీర్వాదంతో దేదీప్య మానంగా కాంతులీనుతోంది.

– సూడిద ప్రవీణ్‌కుమార్, సాక్షి, మెదక్

ఇతర పర్యాటక ప్రదేశాలు..

ములుగు జిల్లాలోని మేడారం నుంచి 50–60 కిలోమీటర్ల దూరంలో రామప్ప ఆలయం ఉంది. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ చారిత్రక ఆలయం అద్భుతమైన కళా నైపుణ్యంతో విలసిల్లుతుంది. ఈ చారిత్రక ఆలయం ప్రపంచవారసత్వ సంపదగా గుర్తించబడింది. వరంగల్‌లోనే వేయిస్తంభాల గుడి, భద్రకాళి టెంపుల్‌ను సందర్శించుకోవచ్చు. ములుగు జిల్లాకు 17 కి.మీ దూరంలో లక్నవరం సరస్సు ఉంది. ఈ సరస్సుపై వేలాడే వంతెనలపై నడుస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. బోటింగ్ సదుపాయం కూడా ఉంది. ఇదే జిల్లాలో వాజేడు మండలం చీకుపల్లి సమీపంలో తెలంగాణ నయాగారగా పిలిచే బొగత జలపాతం ఉంది. వరంగల్ పట్టణానికి 51 కి.మీ దూరంలో భీముని పాదం జలపాతం ఉంటుంది. పాకాల సరస్సు, ఏటూరు నాగారం అభయారణ్యం, పాండవుల గుట్టలు..., ఈ ప్రాంతపు ఆకర్షణీయ పర్యాటక స్థలాలుగా గుర్తింపుపొందాయి.

మేడారంకు దారులిలా....

హైద్రాబాద్ నుంచి మేడారం 245 కి.మీ. కారులో వెళ్లేవారికి 5.20 గంటల సమయం పడుతుంది. ఎన్‌హెచ్ –163 రహదారి పై ప్రయణించే భక్తులు హైద్రాబాద్, యాదగిరి గుట్ట, జనగామ, రఘునాథపల్లి, కరుణాపురం, కాజీపేట, ఆత్మకూరు, మల్లంపల్లి, ములుగు, జంగాలపల్లి, చల్వాయి, పస్రా, నార్లాపూర్‌ల మీదుగా మేడారం చేరుకోవాలి.

- ఈ రోడ్డు పై పెంబర్తి శివారులో 90 – 90.5 కి.మీలు, వీఓ హోటల్ నుంచి అక్షయ హోటల్ 9.5–94 కి.మీలలో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతాయి.
- జనగామ – నెల్లుట్ల మధ్యలో రోడ్డు దాటేందుకు ఇబ్బందులు తప్పవు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై పలువురు చనిపోయారు. పెంబర్తి, నిడిగొండ, యశ్వంతపూర్, రాఘవపూర్, చాగళ్లు, పెండ్యాల అండర్‌పాస్‌లు లేకపోవడంతో జాతీయ రహదారి దాటేందుకు ఇబ్బందులు తప్పవు.
- నెల్లుట్ల బైపాస్ రోడ్డు ఆర్టీసీ కాలనీ బ్రిడ్జి, నడిగొండ యూటర్న్, రఘునాథ్‌పల్లి శివారు, చాగళ్లు, స్టేషన్‌ఘన్‌పూర్, కరుణాపురం, ధర్మసాగర్ మండల రాంపూర్ క్రాస్ రోడ్డు, మడికొండ కందాల దాబా, కాజీపేట డీజిల్ కాలనీ, కాజీపేట నుంచి ఫాతిమా ఫ్లైవర్, సుబేదారి ఫారెస్టు ఆఫీస్, దామెర మండలం పసరగొండ, ఊరుగొండ శివారు, ఆత్మకూరు మండలం నీరుకుళ్ల క్రాస్ రోడ్, కటాక్షపూర్‌లను 'బ్లాక్‌స్పాట్'లుగా అధికారులు గుర్తించారు.
- మల్లంపల్లి, ములుగు, జంగాలపల్లి, చల్వాయి, పస్రా, నార్లాపూర్ మూలమలుపులు ముప్పును అధిగమించితే మేడారం చేరుకున్నట్లే.
- హైద్రాబాద్ – వరంగల్ జాతీయ రహదారి పై జనగామ జిల్లా చిల్పూరు మండలం చిన్నపెండ్యాల బస్‌స్టేజీ నుంచి వంగాలపల్లి – కరుణాపురం బస్‌స్టేజీల వరకు మూడు యూటర్న్‌లు ఉన్నాయి
- చిన్నపెండ్యాల నుంచి ఘన్‌పూర్ వెళ్లాల్సిన వాహనాలు గ్రానైట్ సమీపంలో యూటర్న్ తీసుకోవాలి. వాహన చోదకులు తక్కువ దూరంలో దాబా హోటల్ సమీపంలో రాంగ్ రూట్‌లో యూటర్న్ తీసుకుంటున్నారు.

హైద్రాబాద్ టు మేడారం : 3 టోల్ గేట్లు

హైద్రాబాద్ నుంచి మేడారం జాతర వచ్చే ప్రయాణికులు మూడు టోల్‌గేట్లు దాటాలి. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ వద్ద, జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమళ్ల వద్ద మరోటి, ములుగు దాటాక జవహర్ నగర్ వద్ద ఇంకో టోల్‌గేట్ ఉంటుంది. అయితే జాతర జరిగే నాలుగు రోజుల పాటు జవహర్‌నగర్ టోల్ ఎత్తేస్తారు.

కరీంనగర్ నుంచి మేడారం 153 కి.మీ

కరీంనగర్, కేశవపట్నం, హుజురాబాద్, కమలాపూర్, రేగొండల మీదుగా ములుగు చేరుకుని వెంకటాపూర్, చల్వాయిల మీదుగా మేడారానికి 3.40 గంటల సమయం పడుతుంది.

భూపాలపల్లి నుంచి మేడారం 53.8 కి.మీ.

- మల్లంపల్లి, రాంపూర్, దూదేకులపల్లి, బయ్యక్కపేట, తక్కళ్లగూడెం, నార్లాపూర్‌ల మీదుగా 1.10 గంటల నుంచి 1.30 గంటల వ్యవధిలో మేడారం చేరుకోవచ్చు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ సమీపంలోని కొత్తపల్లి వద్ద, కాళేశ్వరం – మహదేవపూర్ మధ్య మూల మలుపు ప్రమాద భరితంగా ఉన్నాయి.
- కాళేశ్వరం నుంచి ఇసుక లారీలు ఎక్కువగా 353 సీ జాతీయ రహదారి పై ప్రయాణిస్తాయి. ఒక్కోసారి వీటిని రోడ్డు పక్కనే నిలుపుతారు. వీటివల్ల ప్రమాదాలు జరిగే అస్కారం ఎక్కువ.
- భూపాలపల్లి, పరకాల, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ శివారు ప్రాంతాల్లోనూ రహదారి పక్కనే వాహనాలు నిలుపుతున్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం మీదుగా మేడారం మహాజాతరకు తెలంగాణ పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల భక్తులు ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాల్లో భారీగా తరలివస్తారు. మహారాష్ట్రంలోని గడ్చిరోలి, గొండియా జిల్లాలు, ఛత్తీస్‌గఢ్ నుంచి భూపాలపట్నం, బీజాపూర్ జిల్లాల భక్తులు, తెలంగాణ నుంచి పూర్వపు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, చెన్నూర్‌ల నుంచి ఈ దారి గుండా మేడారం జాతరకు వస్తారు.

వరంగల్ నుంచి మేడారం 95.5 కి.మీ.

- ట్రాఫిక్ ఇబ్బందులు లేకుంటే భక్తులు ఎన్‌హెచ్ 163 రహదారి గుండా 2.20 గంటల నుంచి 2.40 గంటల వ్యవధిలో చేరుకోవచ్చు. వరంగల్ నుంచి మేడారం వెళ్లే భక్తులు హనుమకొండ, ఆరెపల్లి, దామెర, ఆత్మకూరు, జవహర్‌నగర్, మచ్చాపూర్, చల్వాయి, గోవిందరావుపేట, రాఘవపట్నం, ఇప్పలగడ్డ, మొట్లగూడెం, వెంగ్లాపూర్, నార్లాపూర్ ద్వారా మేడారం చేరుకుంటారు.
- వరంగల్ నుంచి ములుగుకు ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు నడుపుతోంది. ఇక ట్రావెల్ బస్సులు, కార్లు, ఇతర వాహనాలలో వివిధ ప్రాంతాల నుంచి జనం మేడారం చేరుకుంటాం.
- కాజీపేట/వరంగల్ రైల్వే స్టేషన్‌లలో దిగిన భక్తులు ఇక్కడ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మేడారంగద్దెల వరకు చేరుకోవచ్చు.
- హనుమకొండ నుంచి మేడారానికి హెలికాప్టర్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి.

మహబూబాబాద్ నుంచి మేడారం 134 కి.మీ

- సూర్యపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచి నర్సంపేట ద్వారా మేడారం వెళ్లే భక్తులు సొంత వాహనంతో అయితే 134 కిలోమీటర్లు ప్రయాణించాలి. గమ్యస్థానానికి 3.20 గంటల్లో మహబూబాబాద్, గూడూరు, ఖానాపూర్, నర్సంపేట, నల్లబెల్లి, మల్లంపల్లి, జాకారం, ములుగు, జంగాలపల్లి, చల్వాయి, పస్రా, నార్లాపూర్‌ల మీదుగా మేడారం చేరుకోవచ్చు.
- నర్సంపేట నుంచి మేడారం వరకు ఈ దారిలో 30 వరకు మూలమలుపులు ఉన్నట్టు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు గుర్తించారు.

– గడ్డం రాజిరెడ్డి, సాక్షి, వరంగల్

గ్రీస్ యాత్ర అంటే ఆహ్లాదకరమైన యాత్ర మాత్రమే కాదు... పురాతన చరిత్రలోకి వెళ్లే యాత్ర. అద్భుతమైన దీవులు, అందమైన బీచ్‌లు. రుచికరమైన ఆహార పదార్థాలతో పర్యాటకులను మంత్రముగ్ధులను చేసే యాత్ర. మ్యూజియంలలోకి వెళ్లి అలనాటి కాలానికి వెళ్లే అద్భుత, ఆనందకర యాత్ర...

చారిత్రక యాత్ర

అడుగడుగునా అద్భుతాల గ్రీస్

గ్రీస్‌లోని ఏథెన్స్‌ను ఉత్సాహభరితమైన నగరం అంటారు. ఎందుకంటే ప్రతి మలుపులోనూ కనువిందు చేసే ప్రాచీన కట్టడాలు, స్మారక చిహ్నాలు కనిపిస్తాయి. ఒకప్పటి ఈ పురాతన సామ్రాజ్యంలోని అత్యంత ప్రసిద్ధ స్మారక చిహ్నాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి...

అదిగదిగో... గ్రీకు వైభవం

పురాతన గ్రీకు వైభవానికి అద్దం పట్టే అందమైన భవనాలు, మ్యూజియంలు, ఉద్యానవనాలు ఎన్నో ప్రయాణికుల మనసు దోచుకుంటాయి.

పురాతన చరిత్రతో వెలిగిపోయే ఏథెన్స్ పాశ్చాత్య నాగరికతకు పుట్టినిల్లు. ప్రజాస్వామ్యం, తత్వశాస్త్రం, నాటకాలకు జన్మస్థలంగా ఏథెన్స్ ప్రసిద్ధి చెందింది. 'గౌలాండ్రిస్ మ్యూజియం ఆఫ్ కాంటెంపరరీ ఆర్ట్'లో ప్రపంచ స్థాయి చిత్రాలు మనసు దోచుకుంటాయి.

అతి పెద్ద పురావస్తు మ్యూజియం

'ది నేషనల్ ఆర్కియాలజికల్ మ్యూజియం' గ్రీస్‌లోని అతి పెద్ద పురావస్తు మ్యూజియం. అయిదు వేల సంవత్సరాల నాటి అద్భుత చిత్రాలు, కళాకృతులు ఈ మ్యూజియంలో ఉన్నాయి. గ్రీస్‌కు సంబంధించి సుసంపన్నమైన చరిత్రను అర్థం చేసుకోవడానికి ఈ మ్యూజియంకు వెళ్లడం తప్పనిసరి.

పురాతన ఏథెన్స్‌లోని 'అగోరా' పౌర జీవితానికి అద్దం పట్టే శక్తిమంతమైన కేంద్రంగా ఉండేది. ఇప్పుడు ఇక్కడ పురాతన గ్రీకు జీవితాన్ని మనోహరంగా కళ్లకు కట్టే మ్యూజియం ఉంది. గ్రీస్ మిలిటరీ చరిత్రను పరిచయం చేసే మ్యూజియం ఏథెన్స్ వార్ మ్యూజియం. 'ది టెంపుల్ ఆఫ్ ఒలింపియస్ జ్యూస్' గ్రీస్‌లోని అతి పెద్ద ఆలయం. ఒలింపియస్ దేవతల రాజు జ్యూస్‌కు అంకితం చేయబడింది. ఆక్రోపోలిస్, సింటాగ్మా స్క్వేర్ సమీపంలోని ఈ ఆలయాన్ని ఎన్నో శతాబ్దాల క్రితం నిర్మించారు. రోమన్ చక్రవర్తి హాడ్రియన్ ఈ ఆలయాన్ని పూర్తి చేశాడు.

టవర్ ఆఫ్ ది విండ్స్

ఆనాటి రోమన్ కాలంలో రోమన్ అగోరా వాణిజ్య కేంద్రంగా ఉండేది. ప్రాచీన కాలంలో వాతావరణ కేంద్రంగా ఉన్న అష్టభుజి ఆకారంలోని 'టవర్ ఆఫ్ ది విండ్స్' ప్రత్యేక ఆకర్షణ. 'బెనకి మ్యూజియం'లో చరిత్ర పూర్వకాలం నుండి ఆధునిక కాలం వరకు గ్రీకు కళాకృతులు కనిపిస్తాయి. ఈ మ్యూజియం నియోక్లాసికల్ భవనంలో ఉంది. గ్రీకు చరిత్ర, సంస్కృతికి సంబంధించి కళాప్రియులకు సమగ్ర వీక్షణను అందిస్తుంది.

పాలరాతి అద్భుతం

పనథెనైక్ స్టేడియం పాలరాతి అద్భుతం. ప్రపంచంలో పూర్తిగా పాలరాయితో నిర్మించబడిన ఏకైక స్టేడియం. ఈ స్టేడియం 1896లో తొలి ఆధునిక ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చింది. ఏథెన్స్‌లోని ప్రధాన సాంస్కృతిక మైలురాయిగా నిలిచింది. స్టేడియం ట్రాక్‌పై నడవడం ద్వారా దాని వైభవాన్ని ఆస్వాదించవచ్చు. 'బైజాంటైన్ అండ్ క్రిస్టియన్' మ్యూజియం బైజాంటైన్ కళలకు సంబంధించి ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన మ్యూజియంలలో ఒకటి. సరళమైన, నైరూప్య విగ్రహాలకు ప్రసిద్ధి చెందిన సైక్లాడిక్ కళాకృతులు ఇందులో ఉన్నాయి. ఈ మ్యూజియానికి పేరు తెచ్చిన ప్రాచీన సైక్లాడిక్ విగ్రహాలను తప్పకుండా చూడాలి.

గ్రీస్ విశేషాలు

- గ్రీకు దీవులు ఆరువేల కంటే ఎక్కువ. వీటిలో 227 మాత్రమే జనావాసాలు ఉన్నప్పటికీ ప్రతి ద్వీపానికి తనదైన సంస్కృతి ఉంది.
- యూరప్‌లోని అత్యంత ఎక్కువ పర్వత దేశాలలో గ్రీస్ ఒకటి.
- అద్భుతమైన తీరప్రాంతానికి గ్రీస్ పెట్టింది పేరు.
- శాంటోరినిలో వివిధ రంగుల బీచ్‌లు ఉన్నాయి. నలుపు, తెలుపు, ఎరుపు బీచ్‌లకు శాంటోరిని ప్రసిద్ధి. అగ్నిపర్వతాల కారణంగా ఏర్పడిన బీచ్‌లు నల్లటి ఇసుక, గులకరాళ్లతో ఉంటాయి.
- ఆలివ్ చెట్లకు గ్రీస్ పెట్టింది పేరు. ప్రపంచంలోని ఏ ఇతర దేశం కంటే ఎక్కువ ఆలివ్ రకాలు గ్రీస్‌లో ఉన్నాయి.
- ప్రపంచంలో ఎక్కువ పురావస్తు మ్యూజియంలు గ్రీస్‌లో ఉన్నాయి. విభిన్నమైన వన్య ప్రాణులు గ్రీస్‌లో కనిపిస్తాయి.

ప్రకృతి అందాల ఏథెన్స్ గార్డెన్

మ్యూజెస్ కొండ అని పిలవబడే 'ఫిలోపాప్పోస్' కొండ ఆక్రోపోలిస్, ఏథెన్స్ నగర అందమైన దృశ్యాలను చూపిస్తుంది. ఇక్కడ ఫిలోపాప్పోస్ స్మారక చిహ్నం ఉంది. ఏథెన్స్ నడిబొడ్డున ఉన్న 'ఏథెన్స్ నేషనల్ గార్డెన్' పచ్చదనానికి కేరాఫ్ అడ్రస్. సందడిగా ఉండే, ఉరుకు పరుగుల నగరజీవితం నుంచి ఉపశమనం కోరుకోవడానికి ఈ ఉద్యానవనం తిరుగులేని ఛాయిస్. 38 ఎకరాల ఈ ఉద్యాన వనంలో నడకమార్గాలు, బాతుల చెరువులు, చిన్న జూ, ఒక మ్యూజియం ఉన్నాయి.

ఆంధ్ర అదుర్స్

- రంజీ ట్రోఫీ డిఫెండింగ్ చాంపియన్ విదర్భపై 8 వికెట్ల తేడాతో ఘనవిజయం
- షేక్ రషీద్ అజేయ సెంచరీ

రషీద్

సాక్షి, అనంతపురం: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన ఆంధ్ర జట్టు రంజీ ట్రోఫీలో కీలక విజయం సాధించింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా ఆదివారం ముగిసిన పోరులో ఆంధ్ర జట్టు 8 వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ విదర్భ జట్టుపై ఘనవిజయం అందుకుంది. 259 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 93/1తో చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 56.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షేక్ రషీద్ (144 బంతుల్లో 132 నాటౌట్; 21 ఫోర్లు) అజేయ సెంచరీతో అదరగొట్టాడు. కెప్టెన్ రికీ భుయ్ (92 బంతుల్లో 64 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీతో ఆకట్టుకున్నాడు. రెండో వికెట్‌కు శ్రీకర్ భరత్ (89 బంతుల్లో 43; 5 ఫోర్లు)తో కలిసి 99 పరుగులు జోడించిన రషీద్... అబేధ్యమైన మూడో వికెట్‌కు రికీ భుయ్‌తో కలిసి 145 పరుగులు జతచేసి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన విదర్భ జట్టు... ఈ మ్యాచ్‌లో ఆంధ్ర ఆల్‌రౌండ్ ప్రదర్శన ముందు నిలువలేకపోయింది. ఆ జట్టు బౌలర్లలో నచికేత్ రెండు వికెట్లు పడగొట్టాడు. 6 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర జట్టు 4 విజయాలు, 2 'డ్రా'లు నమోదు చేసింది. 28 పాయింట్లతో ఆంధ్ర గ్రూప్ 'ఎ'లో అగ్రస్థానంలో ఉంది. జార్ఖండ్, విదర్భ జట్లు చెరో 25 పాయింట్లతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. గ్రూప్ దశలో భాగంగా తమ చివరి మ్యాచ్‌లో గురువారం నుంచి నాగాలాండ్‌తో ఆంధ్ర జట్టు తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ఆంధ్ర జట్టు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.

హైదరాబాద్ పరాజయం

నాకౌట్ దశకు ముంబై అర్హత

ముషీర్

సర్ఫరాజ్

సాక్షి, హైదరాబాద్: దేశవాళీ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో పేలవ ప్రదర్శన కనబర్చిన హైదరాబాద్ జట్టు మరో పరాజయం మూటగట్టుకుంది. ఆదివారం గ్రూప్ 'డి'లో భాగంగా ఉప్పల్ వేదికగా ముగిసిన పోరులో హైదరాబాద్ జట్టు 9 వికెట్ల తేడాతో 42 సార్లు చాంపియన్ ముంబై చేతిలో ఓడింది. ఈ విజయంతో బోనస్ పాయింట్ ఖాతాలో వేసుకున్న ముంబై జట్టు 30 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో నిలిచి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఓవర్‌నైట్ స్కోరు 166/7తో ఆదివారం నాలుగోరోజు 'ఫాలోఆన్' కొనసాగించిన హైదరాబాద్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 69.5 ఓవర్లలో 302 పరుగులకు ఆలౌటైంది. సీవీ మిలింద్ (128 బంతుల్లో 85; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడగా... అతడికి నితిన్ సాయి యాదవ్ (32; 6 ఫోర్లు), కెప్టెన్ సిరాజ్ (32; 5 ఫోర్లు, 1 సిక్స్) సహకారం అందించారు. ముంబై బౌలర్లలో ముషీర్ ఖాన్ 5 వికెట్లు... మోహిత్ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం 10 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబై జట్టు 3.2 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 12 పరుగులు చేసి గెలిచింది. అంతకుముందు ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 560 పరుగులు చేయగా... హైదరాబాద్ 267 పరుగులకు పరిమితమైంది. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో చెలరేగిన ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గ్రూప్ దశలో ఆడిన 6 మ్యాచ్‌ల్లో ఒక విజయం, 2 పరాజయాలు, 3 'డ్రా'లతో 13 పాయింట్లు సాధించిన హైదరాబాద్ జట్టు గ్రూప్‌లో ఐదో స్థానంలో ఉంది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో గురువారం నుంచి ఛత్తీస్‌గఢ్‌తో హైదరాబాద్ తలపడనుంది.

అల్‌కరాజ్ అదరహో

క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ స్టార్ • జొకోవిచ్, జ్వెరెవ్ కూడా ముందంజ

మెల్‌బోర్న్: 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' పూర్తి చేసుకోవాలనే లక్ష్యంతో ఆ్రస్టేలియన్ ఓపెన్ టోర్నీలో బరిలోకి దిగిన స్పెయిన్ టెన్నిస్ స్టార్ అల్‌కరాజ్ ఆ దిశగా మరో అడుగు వేశాడు. వరుసగా నాలుగో మ్యాచ్‌లో మూడు సెట్‌లలో విజయాన్ని అందుకొని వరుసగా మూడో ఏడాది క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. 19వ సీడ్ టామీ పాల్ (అమెరికా)తో ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 7–6 (8/6), 6–4, 7–5తో గెలుపొందాడు. 2 గంటల 44 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో స్పెయిన్ స్టార్ రెండు ఏస్‌లు సంధించి, 35 విన్నర్స్ కొట్టాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆ్రస్టేలియా)తో అల్‌కరాజ్ తలపడతాడు. మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో డిమినార్ 6–4, 6–1, 6–1తో పదో సీడ్ అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్)ను ఓడించాడు. మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6–2, 6–4, 6–4తో సెరున్‌డోలో (అర్జెంటీనా)పై గెలుపొందగా... లెర్నర్ టియెన్ (అమెరికా) 6–4, 6–0, 6–3తో 11వ సీడ్ మెద్వెదెవ్ (రష్యా)ను బోల్తా కొట్టించాడు. ఈ క్రమంలో అమెరికా తరఫున ఆండీ రాడిక్ (2001లో యూఎస్ ఓపెన్) తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరిన పిన్న వయస్కుడిగా లెర్నర్ టియెన్ (20 ఏళ్లు) గుర్తింపు పొందాడు.

సబలెంకా జోరు

మహిళల సింగిల్స్ విభాగంలో రెండుసార్లు చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ఈ బెలారస్ స్టార్ 6–1, 7–6 (7/1)తో విక్టోరియా ఎంబాకో (కెనడా)పై గెలిచింది. 86 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 31 విన్నర్స్ కొట్టిన ఆమె, 24 అనవసర తప్పిదాలు చేసింది. మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో 12వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) 6–2, 6–4తో ఎనిమిదో సీడ్ మిరా ఆంద్రీవా (రష్యా)ను బోల్తా కొట్టించింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6–1, 3–6, 6–3తో కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్)పై, ఇవా జోవిచ్ (అమెరికా) 6–0, 6–1తో పుతింత్‌సెవా (కజకిస్తాన్)పై గెలుపొంది క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు.

జొకోవిచ్ 16వసారి....

రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో ఉన్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ కోర్టులో అడుగు పెట్టకుండానే క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. జాకుబ్ మెన్‌సిఖ్ (చెక్ రిపబ్లిక్)తో నేడు జొకోవిచ్ ప్రిక్వార్టర్ ఫైనల్ జరగాల్సింది. అయితే గాయం కారణంగా మెన్‌సిఖ్ ఈ టోర్నీ నుంచి వైదొలిగాడు. దాంతో జొకోవిచ్ 'వాకోవర్' లభించింది. ఫలితంగా ఆ్రస్టేలియన్ ఓపెన్‌లో 16వసారి ఈ సెర్బియా స్టార్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. తద్వారా ఆ్రస్టేలియన్ ఓపెన్‌లో అత్యధికసార్లు క్వార్టర్ ఫైనల్ చేరిన ప్లేయర్‌గా రోజర్ ఫెడరర్ (15) పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ బద్దలు కొట్టాడు.

మెరిసిన షమీ

సర్వీసెస్‌పై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరిన బెంగాల్

కోల్‌కతా: రంజీ ట్రోఫీలో బెంగాల్ జట్టు నాకౌట్ దశకు దూసుకెళ్లింది. గ్రూప్ 'సి'లో భాగంగా బెంగాల్ ఇన్నింగ్స్ 46 పరుగుల తేడాతో సర్వీసెస్‌ను మట్టికరిపించి బోనస్ పాయింట్ ఖాతాలో వేసుకుంది. బెంగాల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 519 పరుగులు చేయగా... సర్వీసెస్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఆకట్టుకోలేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో 186 పరుగులకే ఆలౌటైన సర్వీసెస్...'ఫాలోఆన్' ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 287 పరుగులకు పరిమితమైంది. ఓవర్‌నైట్ స్కోరు 231/8తో చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సర్వీసెస్ కాస్త ప్రతిఘటించినా ఫలితం లేకపోయింది. జయంత్ (68 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో పోరాడాడు. బెంగాల్ బౌలర్లలో టీమిండియా పేసర్ మొహమ్మద్ షమీ 51 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో 'డబుల్ సెంచరీ' సాధించిన సుదీప్ చటర్జీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గ్రూప్ దశలో 6 మ్యాచ్‌లాడిన బెంగాల్ 4 విజయాలు, 2 'డ్రా'లతో 30 పాయింట్లు ఖాతాలో వేసుకొని క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.

ధ్రుతి కేసరికి 5 వికెట్లు

సాక్షి, హైదరాబాద్: యువ బౌలర్ ధ్రుతి కేసరి ఐదు వికెట్లతో సత్తా చాటినా... హైదరాబాద్ జట్టుకు పరాజయం తప్పలేదు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆదివారం ఏఓసీ సెంటర్‌లో జరిగిన హోరాహోరీ వన్డే మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ జట్టు 1 వికెట్ తేడాతో హైదరాబాద్‌పై విజయం సాధించింది. మొదట హైదరాబాద్ 44.5 ఓవర్లలో 144 పరుగులకు ఆలౌటైంది. సంధ్య గోర (50; 9 ఫోర్లు) అర్ధశతకంతో ఆకట్టుకుంది. అనంతరం లక్ష్యఛేదనలో ఉత్తరాఖండ్ జట్టు 37 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసింది. నందిని కశ్యప్ (63 బంతుల్లో 39; 4 ఫోర్లు) టాప్ స్కోరర్. హైదరాబాద్ బౌలర్ కేసరి ధ్రుతి 10 ఓవర్లలో 44 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టింది. ధ్రుతి ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన ఉత్తరాఖండ్ జట్టు స్వల్ప లక్ష్యాన్ని అతికష్టంపై ఛేదించి గెలిచింది.

అనాహత్ ఓటమి

న్యూఢిల్లీ: భారత స్క్వాష్ రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్ న్యూయార్క్ వేదికగా జరిగిన 'స్పోర్ట్ టోర్నమెంట్ ఆఫ్ చాంపియన్స్' రెండో రౌండ్‌లో పరాజయం పాలైంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 31వ ర్యాంకర్ అనాహత్ 11–6, 11–6, 2–11, 8–11, 6–11తో ప్రపంచ ఏడో ర్యాంకర్ సతోమి వటనాబె (జపాన్) చేతిలో పరాజయం పాలైంది. తొలి రెండు గేమ్‌ల్లో అద్వితీయ ప్రదర్శనతో సంచలనం నమోదు చేసేలా కనిపించిన 17 ఏళ్ల అనాహత్ ఆ తర్వాత వరుసగా మూడు గేమ్‌లు కోల్పోయి పరాజయం వైపు నిలిచింది.

ఫైనల్లో రాంచీ రాయల్స్

భువనేశ్వర్: హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్)లో రాంచీ రాయల్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన క్వాలిఫయర్–2లో రాంచీ రాయల్స్ 3–2 గోల్స్ తేడాతో హైదరాబాద్ తూఫాన్స్‌పై విజయం సాధించింది. టోర్నీ ఆసాంతం రాణించిన హైదరాబాద్ జట్టు క్వాలిఫయర్స్‌లో అదే జోరు కొనసాగించడంలో విఫలమైంది. హోరాహోరీ పోరులో హైదరాబాద్ తరఫున జాకబ్ అండర్సన్ (5వ నిమిషంలో), అమన్‌దీప్ లక్రా (38వ నిమిషంలో) చెరో గోల్ సాధించగా... రాంచీ రాయల్స్ తరఫున టామ్ బూన్ (13వ, 15వ, 34వ నిమిషాల్లో) 'హ్యాట్రిక్' నమోదు చేశాడు. సోమవారం జరగనున్న తుది పోరులో కళింగ లాన్సర్స్‌తో రాంచీ రాయల్స్ తలపడనుంది. మూడో స్థానం కోసం జరగనున్న పోరులో హెచ్‌ఐఎల్ గవర్నింగ్ కౌన్సిల్ జట్టుతో హైదరాబాద్ తూఫాన్స్ ఆడుతుంది.

హరీస్ రవూఫ్‌పై వేటు

- టి20 ప్రపంచకప్ టోర్నీకి పాకిస్తాన్ జట్టు ప్రకటన
- ప్రభుత్వం అనుమతి ఇస్తేనే మెగా ఈవెంట్ బరిలోకి

లాహోర్: వచ్చే నెలలో భారత్–శ్రీలంక వేదికగా జరిగే పురుషుల టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే పాకిస్తాన్ జట్టును ఆదివారం ప్రకటించారు. 15 మంది సభ్యుల పాక్ జట్టుకు సల్మాన్ అలీ ఆఘా నాయకత్వం వహిస్తాడు. గతేడాది ఆసియా కప్ ఫైనల్ ఆడిన పేసర్ హరీస్ రవూఫ్‌పై సెలక్టర్లు వేటు వేయడం గమనార్హం. ఆదివారం ఆ్రస్టేలియాలో ముగిసిన బిగ్‌బాష్ టి20 లీగ్‌లో హరీస్ రవూఫ్ 20 వికెట్లతో లీగ్ 'టాపర్'గా నిలిచాడు. అంతేకాకుండా అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వికెట్లు (94 మ్యాచ్‌ల్లో 133 వికెట్లు) తీసిన పాక్ బౌలర్‌గానూ గుర్తింపు పొందాడు. 'పాక్ తరఫున రవూఫ్ చాలా క్రికెట్ ఆడాడు. శ్రీలంకలో పిచ్ పరిస్థితులను బట్టి జట్టును ఎంపిక చేశాం' అని వివరించాడు. మెగా టోర్నీలో ఆడటం, ఆడకపోవడం అనేది పాక్ ప్రభుత్వం చూసుకుంటుందని జావేద్ అన్నాడు. బంగ్లాదేశ్‌ను ప్రపంచకప్ నుంచి తప్పించగానే పాక్ క్రికెట్ బోర్డు చీఫ్ మోసిన్ నఖ్వీ మాట్లాడుతూ తమ దేశ ప్రధానమంత్రి అదేశాల మేరకే నడుచుకుంటామని, ఐసీసీ ప్రకారం కాదని చెప్పారు. పాక్ ప్రభుత్వం అనుమతి ఇస్తేనే ఈ మెగా ఈవెంట్‌లో పాక్ ఆడుతుందని నఖ్వీ తెలిపారు. ఆతిథ్య భారత్ ఉన్న గ్రూప్ 'ఎ'లో పాకిస్తాన్ ఉంది. ఇందులో నమీబియా, నెదర్లాండ్స్, అమెరికా ఇతర జట్లు. వచ్చేనెల 7 నుంచి జరిగే ప్రపంచకప్‌లో పాక్, నెదర్లాండ్స్‌ల మధ్యే తొలి మ్యాచ్ జరుగనుంది.

పాకిస్తాన్ టి20 జట్టు: సల్మాన్ అలీ ఆఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజమ్, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, ఖ్వాజా మొహమ్మద్ నాఫె, మొహమ్మద్ నవాజ్, సల్మాన్ మీర్జా, నసీమ్ షా, సాహిబ్‌జాదా ఫర్హాన్, సయీమ్ అయూబ్, షాహీన్ అఫ్రిది, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఉస్మాన్ తారీఖ్.

'ఐసీసీ నిర్ణయాన్ని సవాలు చేయబోం'

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వెల్లడి

ఢాకా: టి20 ప్రపంచకప్ నుంచి తమ జట్టును తప్పించడంపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) సవాలు చేయబోవడం లేదు. ఈ మేరకు బీసీబీ మీడియా కమిటీ చైర్మన్ అంజాద్ హుస్సేన్ ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే నెల 7 నుంచి ప్రారంభం కానున్న టి20 వరల్డ్‌కప్‌లో భాగంగా ఆతిథ్య భారత్‌లో మ్యాచ్‌లు ఆడేందుకు నిరాకరించడంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బంగ్లాదేశ్‌ను తప్పించింది. బంగ్లాదేశ్ స్థానంలో ర్యాంకింగ్స్ ఆధారంగా స్కాట్లాండ్ జట్టును ఎంపిక చేసిన విషయం తెలిసిందే. దీనిపై బంగ్లా బోర్డు ఐసీసీ వివాద పరిష్కారాల కమిటీ (డీఆర్‌సీ)ని సంప్రదించినా ఫలితం లేకపోయింది. దీంతో కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఆఫ్ స్పోర్ట్ (సీఏఎస్)కు వెళ్లాలని ముందు అనుకున్న బీసీబీ... ప్రస్తుతం అలాంటి ప్రయత్నాలు విరమించుకుంది. 'ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని అంగీకరిస్తున్నాం. ముందు నుంచి భారత్‌లో ఆడబోమని చెబుతూనే ఉన్నాం. అయినా మా వాదన వినిపించుకోలేదు. దీనిపై ఆర్బిట్రేషన్‌కు వెళ్లే ఉద్దేశం లేదు' అని అంజాద్ అన్నారు. ఆటగాళ్ల భద్రతను దృష్టిలో పెట్టుకొనే భారత్‌లో మ్యాచ్‌లు ఆడకూడదని నిర్ణయించుకున్నామని... ఇది తమ ప్రభుత్వ నిర్ణయమని పేర్కొన్నారు. 'ఐసీసీ బోర్డు మీటింగ్ జరిగిన తర్వాత మంత్రివర్గ భేటీలో వరల్డ్‌కప్ మ్యాచ్‌ల కోసం భారత్‌లో పర్యటించే అంశంపై చర్చ జరిగింది. భారత్‌లో ఆడేందుకు క్యాబినెట్ అంగీకరించలేదు. అదే విషయాన్ని ఐసీసీ దృష్టికి తీసుకెళ్లాం' అని అంజాద్ వివరించారు.

పెర్త్ స్కార్చర్స్ 'సిక్సర్'

ఆరోసారి బీబీఎల్ ట్రోఫీ కైవసం • ఫైనల్లో సిడ్నీ సిక్సర్స్‌పై గెలుపు

పెర్త్: బిగ్‌బాష్ లీగ్ (బీబీఎల్)లో పెర్త్ స్కార్చర్స్ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో పెర్త్ స్కార్చర్స్ 6 వికెట్ల తేడాతో సిడ్నీ సిక్సర్స్‌పై నెగ్గి ఆరోసారి ట్రోఫీ కైవసం చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజీ క్రికెట్‌లో అత్యధికసార్లు ఒక ట్రోఫీ గెలిచిన జట్టుగా పెర్త్ స్కార్చర్స్ రికార్డుల్లో కెక్కింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఐదేసి సార్లు విజేతలుగా నిలవగా... ఇప్పుడా సంఖ్యను పెర్త్ అధిగమించింది. 2013–14; 2014–15; 2016–17; 2021–22; 2022–23 సీజన్‌లో కూడా పెర్త్ జట్టు బీబీఎల్ విజేతగా నిలిచింది. ఫైనల్లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన సిడ్నీ సిక్సర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్ (24; 3 ఫోర్లు, 1 సిక్స్), జోష్ ఫిలిప్ (24; 2 ఫోర్లు), కెప్టెన్ మోజెస్ హెన్రిక్స్ (24; 1 ఫోర్) తలాకొన్ని పరుగులు చేశారు. పెర్త్ బౌలర్లలో జే రిచర్డ్‌సన్, డేవిడ్ పైన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆష్టన్ టర్నర్ సారథ్యంలోని పెర్త్ స్కార్చర్స్ 17.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసి గెలిచింది. మిచెల్ మార్ష్ (43 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఫిన్ అలెన్ (22 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్), ఇన్‌గ్లిస్ (26 బంతుల్లో 29 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. సిడ్నీ బౌలర్లలో అబాట్ 2 వికెట్లు పడగొట్టాడు. డేవిడ్ పైన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', సామ్ హార్పర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

తైపీలోని 101 ఆకాశహర్మ్యం ఎక్కుతున్న అలెక్స్.. ఆకాశహర్మ్యంపై విజయనాదం (ఇన్‌సెట్‌లో) పైకి ఎగబాకుతూ..

అంతటి భవనాన్నీ.. అలవోకగా ఎక్కేశాడు!

తైపీ: తైవాన్‌లోని అత్యంత ఎత్తైన భవనం తైపీ 101ను అమెరికన్ రాక్ క్లైంబర్ అలెక్స్ హోనాల్డ్ అధిరోహించారు. 508 మీటర్ల ఎత్తున్న ఈ భవనాన్ని ఆయన ఎలాంటి తాళ్లు, రక్షణ పరికరాలు లేకుండా ఎక్కేశారు. ఆదివారం నాడు ఆయన చేసిన ఈ సాహసాన్ని చూసేందుకు వేలాది మంది తరలివచ్చారు. వారి హర్షధ్వానాల మధ్య అలెక్స్ సునాయాసంగా ఎక్కేశారు. తైపీ 101 భవనం ఒక మూలలో ఉన్న ఎల్ ఆకారపు నిర్మాణాల సాయంతో ఆయన అధిరోహించారు. టవర్‌పై ఉన్న అలంకార నిర్మాణాలను తప్పించుకుంటూ యుక్తితో ఎక్కేశారు. 1,667 అడుగులు ఎత్తున్న భవనాన్ని ఎక్కేందుకు ఆయనకు గంటన్నర సమయం పట్టింది. ఐకానిక్ భవనంపైకి అలెక్స్ ఆరోహణను నెట్‌ఫ్లిక్స్ ప్రత్యక్ష ప్రసారం చేసింది. శనివారమే ఆరోహణ జరగాల్సి ఉన్నా.. వర్షం కారణంగా ఆదివారానికి వాయిదా పడింది. గతంలో అలెక్స్ కాలిఫోర్నియాలోని యోస్మైట్ నేషనల్ పార్క్‌లో ఉన్న ఎల్ కాపిటన్‌ను కూడా తాడు సాయం లేకుండా అధిరోహించి రికార్డు సాధించారు. భవనంలో 101 అంతస్తులు ఉన్నాయి. వాటిలో కష్టతరమైన భాగం 64 అంతస్తుల మధ్య భాగం. భవనానికి సిగ్నేచర్ లుక్ ఇచ్చే ఈ విభాగంలో వెదురు పెట్టెలు ఉంటాయి. ఈ ఆకాశహర్మ్యన్ని ఎలాంటి తాడు సాయం లేకుండా అధిరోహించిన మొదటి వ్యక్తి అలెక్స్. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఈ భవనం ప్రారంభం రోజే, 2004లో క్రిస్మస్ రోజున ఫ్రెంచ్ రాక్ క్లైంబర్ అలైన్ రాబర్ట్ అధిరోహించారు. ఆయన తాళ్లు, జీను సాయంతో ఎక్కారు. భవనంపైకి చేరుకోవడానికి ఆయనకు నాలుగు గంటల సమయం పట్టింది.

ఆదివారం అచల సప్తమి సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని సంగం వద్దకు తరలివచ్చిన అసంఖ్యాక భక్తులు

పాక్స్ సిలికా... గేమ్ చేంజర్!

కీలకమైన 'ఖనిజ, ఏఐ'కూటమి • అమెరికా సారథ్యంలో తెరపైకి

బ్రిటన్ సహా పలు దేశాల చేరిక • తాజాగా భారత్‌కూ ఆహ్వానం

అమెరికా కొత్త రాయబారి సెర్గియో గార్ ఇటీవల బాధ్యతల స్వీకరణ సందర్భంగా భారత్‌కు అందజేసిన ఆహ్వానం ప్రపంచ దేశాల దృష్టినీ ఆకర్షించింది. 'అరుదైన ఖనిజ, ఏఐ' కూటమి 'పాక్స్ సిలికా'లో భారత్ చేరాలని ఆయన పిలుపునిచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అభిమతం కూడా ఇదేనని చెప్పుకొచ్చారు. దాంతో ఈ కూటమి ఒక్కసారిగా చర్చనీయంగా మారిపోయింది...

అరుదైన ఖనిజాలు. ప్రస్తుతం ప్రపంచమంతా కలవరిస్తున్న అత్యంత విలువైన సంపద ఇది. ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు మొదలుకుని కృత్రిమ మేధ (ఏఐ)కు ప్రాణావసరాలైన పలు అత్యాధునిక పరికరాల దాకా అన్నింట్లోనూ అతి కీలక పాత్ర ఈ అరుదైన ఖనిజాలదే. దాంతో వాటిపై ప్రపంచ దేశాలన్నీ ఒక్కసారిగా దృష్టి సారిస్తున్నాయి. కానీ సిలికాన్, లిథియం వంటి ఈ అరుదైన ఖనిజ నిల్వలు ప్రస్తుతం చాలా తక్కువ దేశాల్లోనే అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా చైనాలో ఇవి విస్తారంగా చైనా ఖనిజ శుద్ధి కర్మాగారాలు, చైనా మార్కెట్ ఆధిపత్యం ఉన్న దేశాల్లో ఉన్నాయి. దాంతో కొంతకాలంగా ఆ దేశం ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగుతోంది. దీనికి చెక్ చెప్పడమే లక్ష్యంగా అమెరికా ఏర్పాటు చేసిన కూటమే పాక్స్ సిలికా. ఇందులో పాక్స్ అంటే శాంతి, సుస్థిరత, ప్రగతికి సూచిక అన్నది అమెరికా చెబుతున్న అర్థం. ఇక సిలికా అన్నది సిలికాన్‌కు ముడి ఖనిజమన్నది తెలిసిందే. కంప్యూటర్ చిప్స్ మొదలుకుని ఏఐ రంగం దాకా అన్నింట్లోనూ ఇప్పుడు సిలికాన్‌కు ఉన్న అత్యంత ప్రాధాన్యత దృష్ట్యా కూటమికి ఆ పేరు పెట్టారు. ఈ కూటమి ఏర్పాటులో అమెరికా ఆర్థిక వ్యవహారాల సహాయ మంత్రి జాకబ్ హెల్‌బర్గ్ కీలక పాత్ర పోషించారు. '20వ శతాబ్ది మొత్తం చమురు, స్టీల్ రాజ్యం చేస్తే 21వ శతాబ్ది అంతా అత్యాధునిక సూపర్ కంప్యూటర్లు, వాటి కీలక విడిభాగాల తయారీకి ఆయువుపట్లయిన అరుదైన ఖనిజాలదే' అన్నది ఆయన అభిప్రాయం. 'రానున్న ఏఐ ఆధారిత ప్రపంచంలో కీలకమైన ఈ అరుదైన ఖనిజాల తవ్వకం, వెలికితీత, అభివృద్ధి, సరఫరాలపై అదుపు సాధించేవారిదే పై చేయి' అని హెల్‌బర్గ్ అన్నారు. సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసుకోవడంతో పాటు ఆర్థికంగా భవిష్యత్తును సురక్షితం చేసుకునేందుకు ఇది తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు.

లక్ష్యమేమిటి?

సభ్య దేశాలన్నీ కలిసి అరుదైన ఖనిజాలకు సంబంధించి ఒక ఆధారపడదగ్గ సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నది పాక్స్ సిలికా ఏర్పాటు తాలూకు ఉద్దేశం. ఈ ఖనిజాల గుర్తింపు, వెలికితీత, శుద్ధీకరణ, సరఫరా మొదలుకుని సాఫ్ట్‌వేర్ తదితర అప్లికేషన్లలో వాటి వినియోగం దాకా అన్ని స్థాయిల్లోనూ కూటమి దేశాలన్నీ సమన్వయంతో పని చేయాలన్నది అమెరికా ఆకాంక్ష.

సభ్య దేశాలెవరు?

పాక్స్ సిలికా కూటమి తొలి శిఖరాగ్ర భేటీ గత డిసెంబర్‌లో జరిగింది. ఆస్ట్రేలియా, జపాన్, బ్రిటన్, దక్షిణ కొరియా, ఇజ్రాయెల్, నెదర్లాండ్స్, యూఏఈ, సింగపూర్ ఇందులో సభ్యులుగా చేరాయి. తాజాగా సోమవారం ఖతర్ ఈ కూటమి సభ్యత్వం స్వీకరించింది. అదే రోజు భారత్‌ను కూడా అమెరికా ఇందులో చేరాల్సిందిగా ఆహ్వానించింది. ''సిలికా కూటమిలో భారత్ చేరాలన్నది మా ఆకాంక్ష. భారత్–అమెరికా సంబంధాల్లో ఇది మైలురాయి అవుతుంది'' అని అమెరికా ఆర్థిక వ్యవహారాల సహాయ మంత్రి హెల్‌బర్గ్ తాజాగా తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

చైనాదే హవా!

ఈ అరుదైన ఖనిజాల వెలికితీతలో ప్రస్తుతానికి చైనా ఎవరికీ అందనంత దూరంలో ఉంది. ఆ దేశం ఇప్పటిదాకా కనీసం 2.7 లక్షల టన్నుల ఖనిజాలను వెలికితీసినట్టు అంచనా. భారత్ గత ఆర్థిక సంవత్సరంలో 57 వేల టన్నుల దాకా అరుదైన ఖనిజాలను దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. అందులో 97 శాతం ఒక్క చైనా వచ్చాయి. ఈ విషయంలో చైనాపై అతిగా ఆధారపడటం భద్రతతో సహా ఏ కోణం నుంచి చూసినా మన ప్రయోజనాలకు శ్రేయస్కరం కాదు. ఎందుకంటే అమెరికా మితిమీరిన టారిఫ్‌లపై ఆగ్రహించి గతేడాది చైనా ఆర్నెల్ల పాటు ఈ ఖనిజాల ఎగుమతులను పూర్తిగా నిలిపేసింది. దాంతో మన దేశ ఆటోమొబైల్ తదితర పరిశ్రమలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. బ్యాటరీల్లో కీలకమైన లిథియం, సిలికాన్ తదితర ఖనిజాల లభ్యత లేక పలు కార్ల తయారీ సంస్థలు అనివార్యంగా ఉత్పత్తిని తగ్గించుకోవాల్సి వచ్చింది. దాంతో ఈ సమస్యకు విరుగుడుగా భారత్ యుద్ధ ప్రాతిపదికన నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. పాక్స్ సిలికాను ఒకరకంగా దీనికి అంతర్జాతీయ రూపంగా భావించవచ్చు. కీలక అరుదైన ఖనిజాల విషయంలో చైనా ఏకఛత్రాధిపత్యానికి ప్రత్యామ్నాయంగా భావసారూప్య దేశాలన్నింటితో కలిసి ఈ కూటమి ఏర్పాటుకు అమెరికా నడుం బిగించింది.

మనవద్ద అపార నిల్వలున్నా...!

సెమీ కండక్టర్లు మొదలుకుని కంప్యూటర్ చిప్స్ దాకా అన్నింట్లోనూ అతి కీలకంగా మారిన అరుదైన ఖనిజ నిల్వలు నిజానికి భారత్‌లో అపారంగా ఉన్నట్టు తేలింది. ఏకంగా 85.2 లక్షల టన్నుల నిక్షేపాలు భారత్‌లో ఉన్నట్టు అంచనా. కానీ ఇప్పటి దాకా మనం వెలికితీయగలిగింది మాత్రం కేవలం 2,900 టన్నులే. దాంతో ఈ అరుదైన ఖనిజాల కోసం ఇతర దేశాలపై, ముఖ్యంగా ఎప్పటికీ నమ్మలేని చైనాపై అనివార్యంగా ఆధారపడాల్సి వస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

982 మంది పోలీసులకు పతకాలు

జమ్మూకశ్మీర్‌కే అత్యధిక శౌర్య పురస్కారాలు

న్యూఢిల్లీ: అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన, విశిష్ట సేవలందించిన పలు విభాగాల్లోని 982 పోలీసులకు వివిధ పతకాలను గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అందించనున్నట్లు కేంద్ర హోంశాఖ పతకాలను ప్రకటించింది. 125 మంది శౌర్య పతకాలకు ఎంపికయ్యారు. వీరిలో నలుగురు ఫైర్‌సర్వీస్ సిబ్బంది ఉన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పలు ఆపరేషన్స్‌లో పాల్గొన్న 45 మంది, నక్సల్ ప్రభావిత ప్రాంతాలకు చెందిన 35 మంది, ఈశాన్య ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐదుగురు శౌర్య పతకాలు అందుకోనున్నారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన పోలీసులకు అత్యధికంగా 33, మహారాష్ట్ర పోలీసులకు 31, ఉత్తరప్రదేశ్ పోలీసులకు 18, ఢిల్లీ పోలీసులకు 14 పతకాలు లభించాయి. కేంద్ర సాయుధ పోలీసు బలగాల్లో సీఆర్‌పీఎఫ్‌కు మాత్రమే 12 శౌర్య పురస్కారాలు దక్కాయి. 101 మంది అధికారులు, సిబ్బంది విశిష్ట సేవా పతకాలు, 756 మంది మెరిటోరియస్ మెడల్స్ తీసుకోనున్నారు. ప్రాణాపాయంలో ఉన్నా కర్తవ్యాన్ని విస్మరించకుండా అసాధారణ శౌర్యాన్ని ప్రదర్శించిన, ప్రజల ప్రాణాలు, ఆస్తిని రక్షించడానికి చేసిన సేవలకు, నేరస్తులను అరెస్టు చేయడంలో చూపిన ధైర్యానికి పోలీసులకు శౌర్య పురస్కారాలు ప్రదానం చేస్తారు.

తమిళనాట హిందీకి స్థానముండదు: స్టాలిన్

చెన్నై: తమిళనాడులో హిందీకి ఎప్పుడూ చోటు లేదని, భవిష్యత్‌లో ఉండబోదని డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ స్పష్టం చేశారు. హిందీని బలవంతంగా తమపై రుద్దడానికి రాష్ట్రం ఎప్పటికీ వ్యతిరేకమని తెలిపారు. ఆదివారం నిర్వహించిన తమిళ భాషా అమరవీరుల దినోత్సవంలో స్టాలిన్ వ్యాఖ్యలు చేశారు. త్రిభాషా విధానంపై తమిళనాడులో వ్యతిరేకత నేపథ్యంలో ముఖ్యమంత్రి మరోమారు ఈ అంశాన్ని తీసుకొచ్చారు. దేశంలో తమ భాషను ప్రాణంగా ప్రేమించే రాష్ట్రం తమిళనాడని, దానిని మరుగుపరిచే ఎలాంటి చర్యలనూ సహించబోరని తెలిపారు. తమిళ ప్రజలు హిందీకి వ్యతిరేకంగా గతంలో తీవ్ర పోరాటం చేశారని, హిందీని తమపై రుద్దాలని చూసిన ప్రతిసారీ అదే తీవ్రతతో నిరసన వ్యక్తం చేస్తామన్నారు. ఈ సందర్భంగా జాతీయ విద్యావిధానం అమలు చేయడం లేదన్న కారణంతో కేంద్రం రాష్ట్రానికి రావాల్సిన నిధులను నిలిపివేస్తోందని ఆయన ఆరోపించారు. అయినప్పటికీ తాము వెనుకడుగు వేయబోమని స్పష్టం చేశారు. 1965లో తమిళనాడులో వెల్లువెత్తిన హిందీ వ్యతిరేక నిరసనలు, భాషా పరిరక్షణకు డీఎంకే దిగ్గజాలు సీఎన్ అన్నాదురై, ఎం.కరుణానిధి చేసిన కృషిని ప్రస్తావించిన వీడియోను ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఆ సందర్భంగా ప్రాణత్యాగం చేసిన తమిళ భాషా అమరవీరులు తలముత్తు, నటరాజన్‌కు ఆయన నివాళులర్పించారు. నగరంలోని చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) భవనంలో వారి విగ్రహాలను ఆవిష్కరించారు. ఏఐఏడీఎంకే చీఫ్ ఎడప్పాడి కె.పళనిస్వామి, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ కూడా అమరవీరులకు నివాళులర్పించారు. తమిళ భాషా పరిరక్షణకు, హిందీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా 1965లో తమిళనాడులో భారీ ఉద్యమం జరిగింది. ఎంతోమంది ఆందోళనకారులు తమ ప్రాణాలర్పించారు. వారి త్యాగాలకు గుర్తుగా తమిళనాడు ప్రభుత్వం గతేడాది నుంచి జనవరి 25ను తమిళ భాషా అమరవీరుల దినోత్సవంగా నిర్వహిస్తోంది.

ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్న ఈసీ

బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

కోల్‌కతా: ఎన్నికల సంఘం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకోవడం విషాదకరమని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభివర్ణించారు. బీజేపీకి సహాయం చేస్తూ ఎన్నికల సంఘం ప్రతిపక్షాలను బుల్డోజ్ చేస్తోందని ఆమె ఆరోపించారు. బీజేపీ ఆర్డర్స్ మేరకే పనిచేస్తున్న ఎన్నికల సంఘం ప్రజల ఓటు హక్కులను లాక్కోవడంలో బిజీగా ఉందన్నారు. ఇవన్నీ నిస్సంకోచంగా చేస్తున్న ఎన్నికల సంఘం ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకోవడం విషాదమన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె ఎక్స్ వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజలను వేధించడానికి, వారి హక్కులను లాక్కోవడానికి తార్కిక వ్యత్యాసం పేరుతో ఎస్ఐఆర్ వంటి కొత్త కొత్త సాకులను వెదుకుతోందని, ఎన్నికల సంఘం తీరు ఆందోళనకరంగా ఉందని పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌లో మరో హిందువు సజీవ దహనం

ఢాకా: బంగ్లాదేశ్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. నర్సింగ్ది జిల్లాలో ఓ గ్యారేజీకి దుండగులు నిప్పంటించగా అందులో ఉన్న హిందూ యువకుడు చంచల్ చంద్ర భౌమిక్(23) సజీవ దహనమయ్యారు. ఇది పథకం ప్రకారం చేసిన హత్యేనని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటన నేపథ్యంలో దేశంలో మైనారిటీల భద్రతపై ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. కుమిల్లా జిల్లా లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన భౌమిక్ కుటుంబ పోషణ కోసం నర్సింగ్దిలోని గ్యారేజీలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. కుటుంబానికి అతడొక్కడే ఆధారం. శుక్రవారం రాత్రి గ్యారేజీలో భౌమిక్ నిద్రిస్తుండగా ఘటన చోటుచేసుకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గ్యారేజీ షట్టర్‌పై పెట్రోల్ చల్లి, దుండగులు నిప్పంటించగానే భగ్గున మంటలు వ్యాపించిన దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డయ్యాయి. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది గంటపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. గ్యారేజీ లోపల పూర్తిగా కాలిపోయిన భౌమిక్ మృతదేహాన్ని గుర్తించారు.ఘటన నేపథ్యంలో ఆ ప్రాంతంలోని మైనారిటీల్లో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగిపోయాయి. ఈ దారుణ హత్యను హిందూ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి. కాగా, కేసు నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. డిసెంబర్ 18వ తేదీన దీపు చంద్రదాస్ అనే దుస్తుల ఫ్యాక్టరీ కార్మికుడు మూకదాడిలో ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే. కాలిగంజ్ జిల్లాలో గత వారం లిటన్ చంద్రదాస్ అనే హిందూ వ్యాపారిని కొందరు కొట్టి చంపేశారు.

కాలుష్యంపై గళం విప్పుదాం: రాహుల్

న్యూఢిల్లీ: వాయు కాలుష్యం వల్ల అనారోగ్యం, ఆర్థిక భారంతో ప్రజలు భారీ మూల్యం చెల్లిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై కాలుష్య ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు, సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు మన గళాన్ని వినిపించాలన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఆదివారం విజ్ఞప్తి చేశారు. వాయు కాలుష్యానికి వ్యతిరేకంగా గళం విప్పాలని, కాలుష్యం ఎలా ప్రభావితం చేస్తోందో తనకు లేఖ ద్వారా తెలపాలని ప్రజలను కోరారు. 'వాయు కాలుష్యం వల్ల మనం భారీ మూల్యం చెల్లిస్తున్నాం. కోట్లాది మంది సామాన్య భారతీయులు ఇబ్బందుఉ పడుతున్నారు. పిల్లలు, వృద్ధుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ముఖ్యంగా నిర్మాణ కార్మికులు, దినసరి కూలీల జీవనోపాధి తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో మొదటి అడుగు మన గళాన్ని వినిపించడమే. ఈ కాలుష్యం మీ ప్రియమైన వారిని ఎలా ప్రభావితం చేసిందనే విషయాన్ని.. https://rahulgandhi.in/awaazbharatki ద్వారా నాతో పంచుకోండి. మీ గళాన్ని వినపించడం నా కర్తవ్యం' అని ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సమయంలో ఈ విషయంపై చర్చ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

వివేకంతో ఓటేయండి

ప్రలోభాలు, పక్షపాతాలు వద్దు • ఓటర్లకు రాష్ట్రపతి పిలుపు

న్యూఢిల్లీ: ప్రలోభాలకు గురి కాకుండా, పక్షపాతం లేకుండా వివేకంతో ఓటేసి దేశ ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్న మహిళా ఓటర్లను ఆమె ప్రశంసించారు. అతంమంత వృద్ధులు, దివ్యాంగులు, మారుమూల ప్రాంతాల్లో నివసించే వారు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారన్నారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఓటు కేవలం రాజకీయ వ్యక్తీకరణ మాత్రమే కాదని, ఇది ఎన్నికల ప్రజాస్వామ్య ప్రక్రియపై పౌరులకు ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పారు. ప్రతి పౌరుడు బాధ్యత, అవగాహనతో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ అన్నారు.

ప్రజాస్వామ్యానికి మూలస్తంభం: సీఈసీ

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రజాస్వామ్య దేశాల్లో బలమైన ప్రజాస్వామ్యానికి ఓటర్ల జాబితా మూలస్తంభమని సీఈసీ జ్ఞానేష్‌కుమార్ అన్నారు. ఈ ప్రాథమిక లక్ష్యాన్ని నెరవేర్చడానికి అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరును వదిలేయకుండా జాబితాలో చేర్చడానికే ఎన్నికల సంఘం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను ప్రారంభించిందని తెలిపారు.

ఈసీ స్వతంత్రతను కాపాడుకోవాలి: ఖర్గే

ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడుకోవడం మన బాధ్యతని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. దీనివల్ల ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇటీవలి కాలంలో ఎన్నికల సంఘం వంటి సంస్థలు నిరంతరం ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రజాస్వామ్యాన్ని 'ఓటు చోరీ', ఎస్ఐఆర్‌వంటి అప్రజాస్వామిక విధానాలతో ఈ ప్రభుత్వం కళంకం చేస్తోందన్నారు. దేశ భవిష్యత్, ప్రజల ఉమ్మడి కలను రూపొందించే శక్తి ప్రజల చేతుల్లోనే ఉందని గుర్తుచేసే వేడుక ఓటర్ల దినోత్సవమన్నారు.

16 ఏళ్లుగా ఓటర్ల దినోత్సవం: 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. ఇందులో ఈసీ ఏర్పాటుకు సంబంధించిన ఒక నిబంధనతో సహా దానిలోని 16 అధికరణలు అమల్లోకి వచ్చాయి. గణతంత్రం అమల్లోకి రావడానికి ఒకరోజు ముందు 1950 జనవరి 25న ఈసీ ఉనికిలోకి వచ్చింది. ఈసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని జాతీయ ఓటర్ల దినోత్సవంగా 16 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు.

వెళ్లిరా పాండా..!

చైనాకు 'పాండా' నేస్తాల తరలింపు • ముక్కలైన జపాన్ గుండె..

అది కేవలం ఒక జూ కాదు..
ఒక దేశపు ఉద్వేగం.. ఆదివారం ఉదయం నుంచే టోక్యోలోని 'ఉయెనో జూ'వెలుపల వేలాది మంది ప్రజలు నిలబడి ఉన్నారు. వారి చేతుల్లో కెమెరాలు, పాండా బొమ్మలు ఉన్నాయి.. కానీ కనులు మాత్రం వర్షిస్తున్నాయి. ఆఖరి నిమిషం.. కేవలం 60 సెకన్ల పాటు తమ ప్రియమైన కవల పాండాలను కళ్లారా చూసుకునేందుకు వారు పడుతున్న ఆరాటం వర్ణనాతీతం. ఎందుకంటే, ఆ నిమిషం తర్వాత జపాన్ గడ్డపై పాండాల శకం శాశ్వతంగా ముగిసిపోతోంది..

టోక్యోలోని ఓ స్టోర్‌లో పాండా బొమ్మలపై ఆసక్తి చూపుతున్న జపనీయులు

సెకనులో.. చెదిరిన కల

వీటిని ఆఖరిసారిగా చూసుకునేందుకు.. ఆన్‌లైన్ లాటరీలో ఒక్కో టికెట్ కోసం 24 మంది పోటీ పడ్డారంటే ఆ పాండాలంటే ఎంత ప్రేమో అర్థం చేసుకోవచ్చు. ఆఖరిసారిగా.. వెదురు ఆకులను నములుతూ, అమాయకంగా అటూ ఇటూ తిరుగుతున్న కవల పాండాలు.. షా జియావో, లీలీలను చూసి అభిమానులు దుఃఖాన్ని నియంత్రించుకోలేకపోయారు. టికెట్ దొరకని వేలాది మంది జనం జూ గోడల బయటే నిలబడి, పాండాల ఉనికిని అనుభూతి చెందుతూ మౌనంగా వీడ్కోలు పలికారు.

రాజకీయాల మధ్య నలిగిన అమాయక ప్రేమ..

పాండాల తరలింపు వెనుక ఒక విషాదకరమైన రాజకీయ నేపథ్యం ఉంది. 1972లో చైనా–జపాన్ దౌత్య సంబంధాల పునరుద్ధరణకు గుర్తుగా వచ్చిన ఈ పాండాలు.. ఇప్పుడు అవే దౌత్య సంబంధాలు క్షీణించడం వల్ల వెళ్లిపోతున్నాయి. తైవాన్ విషయంలో జపాన్ ప్రధాని సనాయే తకైచి చేసిన వ్యాఖ్యలు చైనాకు తీవ్ర ఆగ్రహం కలిగించాయి. సంబంధాలు దెబ్బ తినడంతో, పాండాల లీజు ఒప్పందాలను పొడిగించడానికి చైనా నిరాకరించింది. ఫలితంగా, జనవరి 27న ఈ కవలలు చైనాకు తిరిగి వెళ్లిపోతున్నాయి. మంగళవారం ఈ కవలలు చైనా వెళ్లిపోయాక, జపాన్‌లో ఒక్క పాండా కూడా ఉండదు. అర్ధ శతాబ్దపు చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారి.

అవి మా సొంత బిడ్డలు!

'నేను ఈ పాండాల కోసం 15 ఏళ్లలో ఒక కోటి ఫొటోలు తీశాను. నా సొంత పిల్లలే నన్ను వదిలి వెళ్తున్నట్టు ఉంది'.. అని తకాహిరో అనే అభిమాని భారమైన హృదయంతో చెప్పిన మాటలు అక్కడున్న అందరినీ కదిలించాయి. 'ఈ పాండాలు కేవలం జంతువులు కావు, మా కుటుంబ సభ్యులు. అవి మాకు ఎంతో ఓదార్పునిచ్చాయి'.. అంటూ 54 ఏళ్ల మెచికో కన్నీరు పెట్టుకుంది. పాండాల తరలింపుతో ఏటా సుమారు రూ.1,100 కోట్ల ఆదాయాన్ని జపాన్ కోల్పోనుంది. వ్యాపారులు తమ దుకాణాల బోర్డులు మార్చడానికి నిరాకరిస్తూ, 'అవి మళ్లీ తిరిగి వస్తాయి'.. అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మూగబోయిన జపాన్ హృదయం!

ప్రేమకు, ఓదార్పుకు గుర్తుగా నిలిచిన ఈ మూగజీవాలు.. దేశాల మధ్య సరిహద్దు గొడవలకు బలైపోవడం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మంగళవారం వీటిని తరలించే విమానం గాల్లోకి ఎగిరినప్పుడు, దాని రెక్కలు ఒక దేశపు 54 ఏళ్ల జ్ఞాపకాలు, కోట్లాది మంది భారమైన హృదయాలను కూడా మూటగట్టుకుని వెళ్లిపోతాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

పేదరికాన్ని జయించిన ప్రేమ

భార్య వైద్యానికి 600 కిలోమీటర్ల రిక్షా ప్రయాణం

ఆ రిక్షా చక్రాలు తిరుగుతుంటే.. ఒక పేదవాడి గుండె శబ్దం వినిపిస్తోంది. ఒకవైపు ఎముకలు కొరికే చలి.. మరోవైపు 70 ఏళ్ల వృద్ధాప్యం.. కానీ, తన వెనుక రిక్షాలో పక్షవాతంతో పడి ఉన్న భార్యను చూసినప్పుడు.. ఆ వృద్ధుని కాళ్లకు ఏనుగు బలం వచ్చేసింది. అంబులెన్స్ అద్దెకు తీసుకునేంత స్తోమత లేక, భార్య ప్రాణాలను కాపాడుకునేందుకు ఏకంగా 600 కిలోమీటర్ల రిక్షా యాత్ర చేసిన బాబు లోహర్ కథ ఇప్పుడు ప్రపంచాన్నే కదిలిస్తోంది.

తొమ్మిది రోజుల రిక్షా ప్రయాణం!

సంబల్‌పూర్‌లోని మోడిపాడకు చెందిన బాబు లోహర్ భార్య జ్యోతికి గతేడాది నవంబర్‌లో పక్షవాతం సోకింది. స్థానిక వైద్యులు ఆమెను కటక్‌లోని ఎస్సీబీ వైద్య కళాశాలకు తీసుకెళ్లాలని సూచించారు. చేతిలో చిల్లిగవ్వ లేదు.. వాహనాన్ని అద్దెకు తీసుకునే శక్తి లేదు. కానీ, తన భార్యను చావుకు వదిలేయడం బాబు లోహర్‌కు ఇష్టం లేదు. తన ఏకైక ఆస్తి అయిన రిక్షాను బయటకు తీశాడు. పాత కుషన్లు వేసి భార్యను అందులో పడుకోబెట్టాడు. దైవ నామస్మరణ చేస్తూ సంబల్‌పూర్ నుంచి కటక్ వరకు 300 కిలోమీటర్లు రిక్షా తొక్కుకుంటూ వెళ్లాడు. తొమ్మిది రోజుల పాటు.. పగలు ప్రయాణం.. రాత్రి రోడ్డు పక్కన దుకాణాల ముందు బస.. ఇలా సాగింది బాబు లోహర్ రిక్షా ప్రయాణం.

రెండు నెలల చికిత్స.. రిక్షాలోనే తిరుగు ప్రయాణం

కటక్ ఆసుపత్రిలో రెండు నెలల పాటు చికిత్స తీసుకున్న తర్వాత, జనవరి 19న భార్యతో కలిసి తిరిగి తన ఊరికి ప్రయాణమయ్యాడు. దారిలో ఒక ప్రమాదం జరిగి జ్యోతి కింద పడి తలకు గాయమైనా, బాబు లోహర్ గుండె ధైర్యాన్ని కోల్పోలేదు. స్థానిక ఆసుపత్రిలో బ్యాండేజ్ వేయించుకుని మళ్లీ రిక్షా ఎక్కాడు.

పోలీసుల సాయం వద్దన్న 'ప్రేమ'మూర్తి

దారిలో టాంగీ పోలీస్ ఆఫీసర్ వికాస్ సేథి ఈ వృద్ధుని పరిస్థితిని చూసి చలించిపోయారు. 'మీకు కారు ఏర్పాటు చేస్తాం.. సురక్షితంగా వెళ్ళండి'.. అని ప్రాధేయపడ్డారు. కానీ, బాబు లోహర్ ఆత్మాభిమానంతో సున్నితంగా తిరస్కరించాడు. 'నా జీవితంలో నాకు ఇద్దరే ఇష్టమైన వారు ఉన్నారు. ఒకటి నా భార్య, రెండోది నా రిక్షా. ఈ ఇద్దరినీ నేను వదిలి ఉండలేను'.. అని సగర్వంగా చెప్పాడు. భార్య ప్రాణాలను సొంత రెక్కల కష్టంతో కాపాడుకుంటున్న ఆ వృద్ధుని ప్రేమ చూసి పోలీసులు నివ్వెరపోయారు. చివరికి భోజనం కోసం వారు ఇచ్చిన కొద్దిపాటి నగదును మాత్రం బలవంతం చేయడంతో బాబు లోహర్ స్వీకరించాడు. ప్రభుత్వ సౌకర్యాలు అందని చోట.. ఒక పేదవాడి ప్రేమ ఎలా కొండలను పిండి చేస్తుందో బాబు లోహర్ నిరూపించాడు. ఈ ప్రయాణం కేవలం ఒక ప్రయాణం కాదు.. అది ఒక అపురూప ప్రేమ కావ్యం..

- సాక్షి, నేషనల్ డెస్క్

ప్రముఖ జర్నలిస్టు టుల్లీ కన్నుమూత

న్యూఢిల్లీ: ప్రముఖ జర్నలిస్ట్, చరిత్రకారుడు, రచయిత మార్క్ టుల్లీ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం మధ్యాహ్నం ఢిల్లీలోని ఓ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. 1935 అక్టోబర్ 24న కలకత్తాలో జన్మించిన టుల్లీ 22 ఏళ్లు బీబీసీ న్యూఢిల్లీ బ్యూరో చీఫ్‌గా పనిచేశారు. బీబీసీ రేడియో 4 ప్రోగ్రామ్ 'సమ్‌థింగ్ అండర్‌స్టుడ్' వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భారత్, బ్రిటిష్ పాలన నుంచి రైల్వేస్ వరకు అనేక అంశాలపై డాక్యుమెంటరీలు తీశారు. దేశం గురించి 'నో ఫుల్‌స్టాప్స్ ఇన్ ఇండియా', 'ఇండియా ఇన్ స్లో మోషన్', 'ది హార్ట్ ఆఫ్ ఇండియా' వంటి అనేక పుస్తకాలు రాశారు. టుల్లీకి 2002లో 'నైట్' గౌరవం దక్కింది. భారత ప్రభుత్వం 2005లో ఆయనకు పద్మభూషణ్ ఇచ్చి గౌరవించింది. మార్క్ టుల్లీ మరణం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులకు సంతాపం తెలిపారు.

దేనికి పరారుణ కాంతిని గ్రహించే సామర్థ్యం చాలా ఎక్కువ?

అనాదిగా మానవుడికి ప్రకృతితో విడదీయలేని బంధం ఉంది. అతడు పర్యావరణంతో మమేకమై జీవిస్తాడు. పర్యావరణమే జీవరాశికి ప్రాణాధారం. అనేక అవసరాలు తీర్చడానికి, మానసిక వికాసానికి ప్రకృతి ఒక వరం లాంటిది. మానవ మనుగడకు మూలాధారం ప్రకృతే అనే మౌలిక వాస్తవాన్ని విస్మరించి ఆధునిక మానవుడు పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్నాడు. తాను కూర్చున్న కొమ్మను తానే నరికేస్తున్నాడు. పర్యావరణ వినాశనం వల్ల మానవుడి మనుగడ అసాధ్యం. కాబట్టి పర్యావరణ పరిరక్షణ తక్షణ కర్తవ్యం. ఇది ఏ ఒక్క వ్యక్తికో, దేశానికో సంబంధించిన సమస్య కాదు. దీని కోసం అందరూ కలసికట్టుగా పనిచేయాల్సి ఉంది.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పర్యావరణం

పర్యావరణ ఉద్యమాలు

పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను దశాబ్దాల కిందటే గుర్తించినా ఇప్పటివరకూ ఈ దిశగా సరైన చర్యలు తీసుకోలేదు. దీని కోసం అనేక మంది ఉద్యమాలు చేస్తున్నారు. 1945 నుంచే భూ గోళం పర్యావరణ సంక్షోభంలోకి ప్రవేశించింది. ప్రజలు తమ ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి ప్రకృతిపై అన్ని వైపుల నుంచి దాడి ప్రారంభించారు. ప్రారంభంలో పరిశ్రమల స్థాపన, తర్వాత శాస్త్ర సాంకేతిక విప్లవం, ఇటీవల ప్రపంచీకరణ పర్యావరణ పతనానికి దారితీశాయి. అడవులను నరికి విస్తారమైన వ్యవసాయ క్షేత్రాలను ఏర్పరచడం కూడా పర్యావరణ సమతౌల్యం దెబ్బతినడానికి కారణమైంది. నూతన పారిశ్రామికాభివృద్ధి, శాస్త్ర విజ్ఞానం ఫలితంగా సింథటిక్ ఉత్పత్తుల వినియోగం పెరిగింది. ఈ సింథటిక్ వ్యర్థాలు భూమిలో కలవడానికి కొన్ని వందల ఏళ్లు పడుతుంది. ఇలాంటి ఉత్పత్తులన్నీ ప్రకృతికి విఘాతం కలిగిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ విస్తరించేకొద్దీ మానవుల కార్యకలాపాలు ప్రకృతికి విరుద్ధంగా పరిణమిస్తున్నాయి. ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణం నాశనం అవుతోంది.

పూర్వకాలంలో మానవుల అవసరాలు పరిమితంగా ఉండేవి. వారు ప్రకృతి వనరులను తక్కువగా వినియోగించేవారు. అందువల్ల పర్యావరణ సమతౌల్యం మెరుగ్గా ఉండేది. ప్రస్తుతం విలాసవంతమైన జీవితం, సంపద కోసం ప్రకృతి వనరులపై ఒత్తిడి పెరిగింది. అవసరానికి మించి ప్రకృతి వనరులను వినియోగించడం వల్ల భావి తరాల జీవితం ప్రశ్నార్థకమయ్యే దుస్థితి తలెత్తింది. అమెరికా పర్యావరణ శాస్త్రవేత్త ఎడ్వర్డ్ గోల్డ్ స్మిత్ పేర్కొన్నట్లు అనేక అవసరాల కోసం తాను ఆధారపడే ప్రకృతిని ఆధునిక మానవుడు వేగంగా నాశనం చేస్తున్నాడు. అడవుల్లో బంజరు భూములను దుర్వినియోగం చేస్తున్నారు. పగడాల దీవులను విచక్షణా రహితంగా తవ్వేస్తున్నారు. పంట పొలాలు నాశనమై చౌడు భూములుగా, ఎడారులుగా మారుతున్నాయి. కాలుష్య సమస్య తీవ్రమైంది. ప్రస్తుతం ప్రతి జీవి శరీరంలోనూ పారిశ్రామిక, వ్యవసాయ రసాయనాలు కేన్సర్ కారకాలుగా పరిణమిస్తున్న అంశాన్ని గమనిస్తే.. దీని తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

పర్యావరణం అంటే..?

ఒక జీవి లేదా జీవరాశుల చుట్టూ ఉన్న పరిసరాలు (గాలి, నేల, నీరు, జీవ సమూహాలు), వాటి స్థితిగతుల మొత్తాన్ని కలిపి 'పర్యావరణం' అంటారు. ఆంగ్లంలో దీన్ని 'ఎన్విరాన్‌మెంట్' అంటారు. ఇది ఫ్రెంచి భాషా పదమైన 'ఎన్విరాన్' నుంచి ఆవిర్భవించింది. ఫ్రెంచిలో 'ఎన్విరాన్' అంటే 'ఆవరణం – చుట్టూ ఉన్న ప్రదేశం' అని అర్థం.

పర్యావరణం - మూలకాల సంఘటనం

ప్రకృతిలోని పంచభూతాలు మానవుడికి పంచ ప్రాణాల లాంటివి. గాలిలో, నీటిలో, భూమిపై ఉండాల్సిన మూలకాలు తగిన నిష్పత్తిలో లేకపోతే మానవుడికి ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. అలాంటి వాటి గురించి తెలుసుకుందాం..

కార్బన్ డై ఆక్సైడ్

వాతావరణంలో మానవుడికి పెద్దగా అవసరం లేని కార్బన్ డై ఆక్సైడ్ అధికంగా ఉండగా, అత్యవసరమైన ప్రాణవాయువు (ఆక్సిజన్) తక్కువ పరిమాణంలో ఉంది. దీంతో పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటోంది. ఇది మానవులకు హానికరంగా తయారైంది. సూర్యుడి నుంచి వచ్చే కాంతి, అందులో ఉండే అతినీల లోహిత రేడియో ధార్మికత భూ వాతావరణం ద్వారా నేలను చేరి, దాన్ని వేడెక్కిస్తాయి. ఈ వేడిమి శక్తి తిరిగి పరారుణ రేడియో ధార్మికత రూపంలోకి పరావర్తనం చెందుతుంది. అయితే వాతావరణంలో ఉండే కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి, మరికొన్ని వాయువులు దీన్ని కొంత మేర గ్రహించి భూ ఉపరితలం వేడిగా ఉండేట్లు చేస్తాయి. ఇది కొంతమేర ఉండటం మేలు చేస్తుంది. కానీ వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ స్థాయికి మించితే భూతాపం పెరుగుతుంది. దీన్నే 'గ్రీన్ హౌస్ ప్రభావం' అంటారు. నిత్యం బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువులను మండించడం వల్ల వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి, సల్ఫర్ డై ఆక్సైడ్ (SO_2) లాంటి వాయువుల స్థాయి పెరిగిపోతోంది. పారిశ్రామిక విప్లవానికి ముందు 260 PPMV(పార్ట్స్ పర్ మిలియన్ బై వాల్యూం) మేర ఉన్న కార్బన్ డై ఆక్సైడ్ ప్రస్తుతం 370 PPMVకి చేరింది. ఈ శతాబ్దాంతానికి దీని స్థాయి 500 PPMVకి చేరొచ్చునని ఆందోళన చెందుతున్నారు. అడవుల నరికివేత వల్ల కూడా ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. భారతదేశ విస్తీర్ణంలో భౌగోళికంగా 33 శాతం అడవులు ఉండాలి. ప్రస్తుతం వీటి విస్తీర్ణం 23 శాతంగా ఉంది.

మిథేన్

మిథేన్‌కు పరారుణ కాంతిని గ్రహించే సామర్థ్యం చాలా ఎక్కువ. వాతావరణంలో ఇది స్వల్పంగానే ఉన్నా దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పారిశ్రామిక విప్లవానికి ముందు వాతావరణంలో ఇది 600 PPBV మేర ఉండేది. ఆ తర్వాత క్రమంగా పెరుగుతూ 1950 నాటికి 1300 PPBVకి, 1990 నాటికి 1700 PPBVకి పెరిగింది.

నీరు నిల్వ ఉండే సాగు విధానం, ఈ వాయువును విడుదల చేసే పేడ లాంటి పదార్థాలు పెరగడం, శిలాజ ఇంధనాల వాడకం ఈ వాయువు అధికమవడానికి కారణాలు. మిథేన్ వాతావరణంలోకి ఒకసారి చేరితే గరిష్టంగా పదేళ్లు ఉంటుంది.

క్లోరో ఫ్లోరో కార్బన్లు (CFC)

వాతావరణంలో వీటి ఉనికి ఇటీవల విపరీతంగా పెరిగింది. ఫ్రిజ్‌లు, బెడ్‌ల కోసం ఉపయోగించే ఫోమ్, అగ్నిమాపక రసాయనాల లాంటి వాటి వాడకం పెరగడమే దీనికి కారణం. 1950లో 'సున్నా'గా ఉన్న CFC–11 లేదా R-11 (chloro fluoro methane) 1984 నాటికి 3 లక్షల టన్నులకు చేరింది. 1984 నుంచి CFC–11 క్రమంగా పెరుగుతూ వస్తోంది. 1940లో సున్నాగా ఉన్న CFC–12 లేదా R-12 లేదా freon-12 (DiChloro fluoro methane) పరిమాణం 1984 నాటికి నాలుగు టన్నులకు చేరింది.

నైట్రస్ ఆక్సైడ్

దీన్ని 'లాఫింగ్ గ్యాస్' అంటారు. శిలాజ ఇంధనాలను మండించడం, అమ్మోనియా ఎరువుల వినియోగం, అడవుల నరికివేత లాంటి కారణాల వల్ల వాతావరణంలో నైట్రస్ ఆక్సైడ్ పరిమాణం పెరుగుతోంది. పారిశ్రామికీకరణకు ముందు 275 PPBVగా ఉన్న నైట్రస్ ఆక్సైడ్ 1992 నాటికి 311 PPBVకి పెరిగింది.

ఏరోసాల్స్ (Aerosols)

వాతావరణంలో ఉండే చిన్నపాటి ఘన, ద్రవ రేణువులనే ఏరోసాల్స్ అంటారు. వీటి పరిమాణం పెరిగితే భూమి నుంచి విశ్వంలోకి వెళ్లే రేడియో ధార్మికతను ఇవి అడ్డుకుంటాయి. తద్వారా భూతాపం పెరుగుతుంది. ఈ ఏరోసాల్స్ వల్ల ఓజోన్ పొర క్షీణిస్తుంది. శిలాజ ఇంధనాలను మండించడం, పారిశ్రామిక ఉద్గారాల వల్ల పొగ, ధూళి రేణువులు పెరిగి వాతావరణంలో ఏరోసాల్స్ పరిమాణం అధికం అవుతోంది. ఈ విధంగా వాతావరణంలో వివిధ వాయువుల పరిమాణం అధికమవడం వల్ల 'గ్లోబల్ వార్మింగ్' పెరుగుతోంది. భూగోళంపై ఉష్ణోగ్రత పెరగడం వల్ల గాలి, నీరు, నేల సమతౌల్యం కోల్పోతున్నాయి. దీంతో జీవరాశులన్నింటి మనుగడ దుర్భరమవుతోంది. కాలుష్యాల సాంద్రత, కాలుష్యీకరణ తీవ్రత ఇలాగే కొనసాగితే ప్రపంచ భౌగోళిక ప్రవృత్తుల్లో తీవ్రమైన అనుత్క్రమణీయ (Irreversible) మార్పులు సంభవిస్తాయి. మనల్ని మనం కాపాడుకోవాలంటే పర్యావరణ పరిరక్షణ చేపట్టాల్సిందే.

ప్రముఖుల నిర్వచనాలు

జీవులు, పరిసరాలకు మధ్య ఒక నిర్దిష్ట సమన్వయ సహకారం ఉంటుంది. ఈ జీవ, నిర్జీవ అంశాల సమన్వయ సహకార సంక్లిష్టతనే 'పర్యావరణం'గా పేర్కొనవచ్చు.– **టాలెమీ**

'మన చుట్టూ ఆవరించి ఉన్న భౌతిక రసాయనిక, జీవ రసాయనిక అంశాల మధ్య ఉన్న సమన్వయ సహకార సమ్మేళన వ్యవస్థీకృత స్వరూపాన్ని 'పర్యావరణం' అంటారు. – **ఓడమ్**

పర్యావరణ వాదం

పర్యావరణాన్ని సంరక్షించడం, పునరుద్ధరించడం లేదా మెరుగుపర్చడంపై శ్రద్ధ కలిగి ఉండటాన్ని 'పర్యావరణ వాదం' అంటారు. పర్యావరణ ప్రాముఖ్యాన్ని గుర్తించి వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పుల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ.. పర్యావరణాన్ని రక్షించడానికి కృషి చేయడాన్నే 'పర్యావరణ వాదం'గా పేర్కొంటారు. యూరప్‌లో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, తీవ్రమవుతున్న కాలుష్యానికి ప్రతిచర్యగా దీన్ని ప్రారంభించారు.

1949లో 'ఆల్డో లియోపాల్డ్' అనే అమెరికన్ పర్యావరణవేత్త "A Sand County Almanac" అనే పుస్తకంలో పర్యావరణ కాలుష్యం వల్ల మానవ సమాజం ఎదుర్కొనే సమస్యలను ఎత్తి చూపారు. ఈ గ్రంథం 20వ శతాబ్దంలో పర్యావరణ వాదాన్ని విశేషంగా ప్రభావితం చేసింది. అమెరికాకు చెందిన జీవ శాస్త్రవేత్త 'రేచల్ కార్సన్' 1962లో 'సైలెంట్ స్ప్రింగ్' అనే పుస్తకం రాశారు. ఇందులో డి.డి.టి.(dichloro diphenyl trichloroethane), ఇతర పురుగు మందుల వాడకం కేన్సర్‌ను కలిగిస్తుందని, వ్యవసాయంలో వీటిని వినియోగించడం వల్ల వన్యప్రాణులకు.. ముఖ్యంగా పక్షులకు ప్రమాదం ఏర్పడుతోందని ఆమె పేర్కొన్నారు. దీని ప్రభావంతో 1970లో 'యునైటెడ్ స్టేట్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ'ని స్థాపించారు. ఇది 1972లో అమెరికాలో డి.డి.టి.ని నిషేధించడంలో ప్రధాన పాత్ర పోషించింది. ఈ పుస్తకం వల్ల పర్యావరణ అంశాలపై శ్రద్ధ పెరిగి 'గ్రీన్ పీస్', 'ఫ్రెండ్స్ ఆఫ్ ద ఎర్త్' లాంటి స్వచ్ఛంద సంస్థలు ఆవిర్భవించడానికి నాంది పడింది.

1973లో Endangered Species Act, 1975లో Convention on International Trade in Endangered Species (CITES) ఏర్పడటంతో పర్యావరణ వాదం మరింత ప్రభావవంతమైంది. 1972లో యూఎన్‌వో ఆధ్వర్యంలో 'స్టాక్ హోం'లో జరిగిన 'మానవుడు – పర్యావరణం' అనే అంశంపై నిర్వహించిన యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌లో 114 దేశాలు పాల్గొన్నాయి. ఈ సమావేశం ఫలితంగా 'యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్' ప్రారంభమైంది. పర్యావరణ పరిరక్షణ కోసం 'నేషనల్ వైల్డ్ లైఫ్ ఫెడరేషన్', 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్' (డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్.) లాంటి సంస్థలు ప్రారంభమయ్యాయి. జూన్-5ను 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం'గా యావత్ ప్రపంచం పాటించాలని 1972లో యూఎన్‌వో ప్రతిపాదించింది.

'యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్' (యూఎన్ఈపీ) ఆధ్వర్యంలో గ్రీన్ హౌస్ వాయువుల నియంత్రణ కోసం 1982లో 'ధరిత్రీ సదస్సు' నిర్వహించారు. 1997లో క్యోటో ప్రోటోకాల్ వెలువడింది. 2007లో బాలిలో నిర్వహించిన సదస్సు, 2009లో జరిగిన కోపెన్‌హెగన్ సదస్సులో పర్యావరణ పరిరక్షణకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.2015 డిసెంబర్‌లో పారిస్‌లో నిర్వహించిన కాప్–11 సదస్సులో 2100 నాటికి భూతాపాన్ని రెండు డిగ్రీల కంటే తక్కువకు తగ్గించడానికి 195 దేశాలు అంగీకారం కుదుర్చుకున్నాయి.

వర్ధమాన దేశాలకు 2020 నుంచి ఆర్థిక తోడ్పాటును అందించేందుకు ఏటా వంద బిలియన్ డాలర్ల మేర సమకూర్చడానికి కూడా ఒప్పందం కుదిరింది.

మోహోలిక్ తలం వేటిని వేరు చేస్తుంది?

భూపటలం - శిలలు

సగటున సుమారు 30 కిలోమీటర్ల మందం కలిగిన భూగోళం బాహ్య పొరను 'పటలం' అంటారు. పటలం వివిధ రకాల శిలలతో కూడిన దృఢమైన పొర. ఈ శిలలు అనేక ఖనిజాలతో ఇమిడి ఉంటాయి. పటలంలో ప్రధానంగా తేలికైన సిలికాన్, అల్యూమినియం మూలకాలు కేంద్రీకృతమై ఉంటాయి. అందువల్ల పటలాన్ని 'సియాలిక్' పొరగా కూడా పిలుస్తారు. పటలం సాంద్రత సుమారుగా 2.7. ఇది భూగోళ సగటు సాంద్రత (5.5) కంటే చాలా తక్కువ. పటలం దృఢంగా ఉన్నప్పటికీ.. అవిచ్ఛిన్న పొర మాత్రం కాదు. పటలం అనేక చిన్నా పెద్ద ముక్కలుగా విభజించి ఉంటుంది. ఈ ముక్కలను అస్మావరణ పలకలుగా వ్యవహరిస్తారు.అస్మావరణ పలకలు ఖండాలు, సముద్రాలను కలిగి ఉన్నాయి. పటలానికి చెందిన ఈ అస్మావరణ పలకలు కింద ఉన్న ఆస్థినో ఆవరణ పాక్షిక శిలా ద్రవంలో తేలియాడుతూ వివిధ దశల్లో చలిస్తున్నాయి. అంటే..ఖండాలు,సముద్రాలు వివిధ దశల్లో చలిస్తున్నాయన్నమాట! ఈ పలకల చలనం వల్ల పలకల మధ్య అపసరణ, అభిసరణ లేదా సమాంతర సరిహద్దులు ఏర్పడతాయి. ఈ పలకల సరిహద్దు మండలాల వద్దనే పర్వతోద్భవనం,అగ్నిపర్వత ప్రక్రియ, భూకంప ప్రక్రియ కేంద్రీకృతమై ఉంటుంది.

పటల శిలలు మూడు రకాలు

పటల శిలలను మూడు రకాలుగా విభజించవచ్చు. అవి.. 1. అగ్ని శిలలు 2. రూపాంతర శిలలు 3. అవక్షేప శిలలు

పర్వతోద్భవనం, అగ్నిపర్వత, క్రమక్షయ ప్రక్రియల కారణంగా శిలల స్వభావం మారిపోయి కొత్త శిలలు ఏర్పడుతుంటాయి. శిలా చక్రంలో భాగంగా ఒక తరగతికి చెందిన శిలలు క్రమేపీ మరో రకానికి చెందిన శిలలుగా మార్పు చెందే అవకాశం ఉంది.

పటలంలో మొట్టమొదటగా ఏర్పడే అగ్ని శిలలను 'ప్రాథమిక శిలలు'గా పిలుస్తారు. పటల అంతర్భాగాల్లో అధిక ఉష్ణోగ్రత, పీడనాల వల్ల శిలలు పాక్షిక ద్రవ రూపంలో ఉంటాయి. ఈ పాక్షిక శిలా ద్రవాన్ని 'మాగ్మా' అంటాం. భూ ఉపరితలం పైకి ఉబికి వచ్చిన తర్వాత మాగ్మాను 'లావా'గా పిలుస్తారు. మాగ్మా లేదా లావా చల్లబడి క్రమంగా ఘనీభవించి అగ్ని శిలలు ఏర్పడతాయి. పటలం అంతర్భాగంలో అధిక లోతుల్లో మాగ్మా ఘనీభవించడం వల్ల ఏర్పడే అగ్ని శిలలను 'ప్లుటానిక్ అగ్ని శిలలు'గా వ్యవహరిస్తారు. ఉపరితలానికి చేరే క్రమంలో మార్గ మధ్యంలోనే మాగ్మా ఘనీభవం చెందగా ఏర్పడే శిలలను 'హైప ర్ బేసల్ అగ్ని శిలలు'గా పిలుస్తారు. భూ ఉపరితలం పైకి లావా ఉద్భేదించిన తర్వాత ఘనీభవించగా ఏర్పడే శిలలను 'లావా శిలలు'గా అభివర్ణిస్తారు. గ్రానైట్, బసాల్ట్, గాబ్రో, డయరైట్, ఆండెసైట్ మొదలైనవి ప్రధాన అగ్ని శిలలు. అగ్నిశిలలు కఠినం గా, దృఢంగా ఉంటాయి. సచ్ఛిద్రంగా ఉండవు. వీటిలో శిలాజాలు ఏర్పడవు. అగ్ని శిలల్లో ప్రధానంగా ఫెర్రస్ జాతికి చెందిన లోహ ఖనిజాలు కేంద్రీకృతమై ఉంటాయి. పటల అంత ర్భాగంలోని శిలలు ప్రధానంగా అగ్ని శిలల తరగతికి చెందుతాయి.

భూ ఉపరితలం పైన పని చేసే బాహ్య బలాలు కఠిన పటల శిలలను శిథిలం చేస్తాయి. ఈ ప్రక్రియనే శిలా శైథిల్యం/ క్రమక్ష యంగా పిలుస్తారు. ప్రవహించే నదులు, హిమానీనదాలు, పవనాలు, సముద్ర వేలాతరంగాలు, భూగర్భ జల ప్రవాహాలు ప్రధానమైన బాహ్య బలాలు లేదా క్రమక్షయ కారకాలు. శిథిల శిలా పదార్థాలు నదీ హరివాణాలు, లోయలు, మైదానాలు, సముద్ర భూతలంపై నిక్షేపమై కాలక్రమేణ శిలలుగా రూపొందుతాయి. పై పొరల సంపీడనం వల్ల కింది పొరల్లోని శిలా శిథిలాలు క్రమంగా సంఘటితమై ఏర్పడే ఈ శిలలను అవక్షేప శిలలుగా పరిగణిస్తారు. ఇసుకరాయి, షేల్, సున్నపురాయి, కాంగ్లో మేరేట్ ప్రధాన అవక్షేప శిలల రకాలు. అవక్షేప శిలలు స్తరిత శిలల తరగతికి చెందుతాయి. ఇవి సచ్ఛిద్ర శిలలు. అవక్షేప శిలల్లో శిలాజాలు ఏర్పడతాయి. శిలాజాల వల్ల పురాభౌమ్య యుగంలో శీతోష్ణ స్థితి, సహజ ఉద్భిజ సంపద, జీవజాతుల సమాచారం లభ్యమవుతుంది. అవక్షేప శిలలు కఠినంగా కానీ లేక మృదువుగా కానీ ఉండవచ్చు. అవక్షేప శిలల్లో సాధారణంగానే అనేక పగుళ్లు ఉంటాయి. వివిధ తరగతులకు చెందిన శిలలు అధిక ఉష్ణోగ్రతలు, అధిక పీడనాలు లేదా రెండిటికీ లోనైనప్పుడు వాటి భౌతిక, రసాయనిక ధర్మాలు పూర్తిగా మార్పు చెంది ఏర్పడే సరికొత్త శిలలనే రూపాంతర శిలలుగా పిలుస్తారు. రూపాంతర శిలల మాతృక శిలలు అవక్షేప లేదా అగ్ని లేదా రూపాంతర శిలలుగా ఉండవచ్చు. అగ్ని పర్వత ప్రక్రియ లేదా పర్వతోద్భవన ప్రక్రియ సందర్భంగా ప్రధానంగా రూపాంతర శిలలు ఏర్పడతాయి. పటలంలో మాగ్మా ప్రవహిస్తున్నప్పుడు సమీపంలో శిలలు రూపాంతరం చెందుతాయి. పర్వతోద్భవన మండలంలో అధిక ఉష్ణోగ్రతలు, పీడనం కారణంగా రూపాంతర ప్రక్రియ సంభవిస్తుంది. అందువల్లే పలకల సరిహద్దుల వద్ద రూపాంతర ప్రక్రియ సర్వసాధారణం. అవక్షేప శిలలైన షేల్, ఇసుకరాయి, సున్నపురాయి రూపాంతరం చెందడం వల్ల వరుసగా స్లేట్, క్వార్ట్జైట్, పాలరాయి వంటి రూపాంతర శిలలు ఏర్పడతాయి. గ్రానైట్, గాబ్రో వంటి అగ్ని శిలల రూపాంతరం వల్ల వరుసగా నీస్, ఫిల్లైట్ వంటి రూపాంతర శిలలు ఏర్పడతాయి. స్లేట్, క్వార్ట్జైట్‌లు మర లా రూపాంతర ప్రక్రియకు లోనవడం వల్ల సిస్ట్, ఫిల్లైట్ వంటి రూపాంతర శిలలు ఏర్పడతాయి. అవక్షేప శిలల్లో శిలాజ ఇంధన వనరులైన బొగ్గు, చమురు, సహజవాయువులు విస్తారంగా లభిస్తాయి. రూపాంతర శిలల్లో నాన్ ఫెర్రస్ జాతికి చెంది లోహ ఖనిజాలు, అలోహ ఖనిజాల వనరులు ఉంటాయి. రూపాంతర శిలలు కఠినంగా, దృఢంగా ఉండటం వల్ల భవన నిర్మాణ రంగంలో విశేషంగా ఉపకరిస్తాయి. భూ ఉపరితలం మీద ఉన్న శిలలు ప్రధానంగా అవక్షేప శిలల తరగతికి చెందుతాయి.

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

విశ్వానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు

- చరిత్రకు అందినంత వరకు విశ్వం గురించి తొలిసారిగా పరిశోధనలు చేసిన వ్యక్తి 'టాలమీ'. విశ్వానికి కేంద్రం భూమి అని, సూర్యుడు, గ్రహాలు, ఉపగ్రహాలు సమస్త విశ్వ పదార్థాలు భూమి చుట్టూ పరిభ్రమిస్తున్నాయని ఈయన క్రీ.శ. 130-140 మధ్యకాలంలో ప్రతిపాదించాడు.
- 16వ శతాబ్దంలో పోలండ్ ఖగోళ శాస్త్రవేత్త నికోలస్ కోపర్నికస్ 'టాలమీ' భూకేంద్ర సిద్ధాంతాన్ని తోసిపుచ్చాడు. విశ్వానికి కేంద్రం సూర్యుడు అని ప్రతిపాదించాడు.
- 1609లో జర్మనీ శాస్త్రవేత్త కెప్లర్ సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని సమర్థిస్తూనే 'సూర్యుడు విశ్వానికి కేంద్రం కాదని, సౌర వ్యవస్థకు మాత్రమే కేంద్రం' అని వివరించాడు. గ్రహాల వృత్తాకార కక్ష్యను కూడా నిర్ణయించాడు.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో క్రమక్షయం వల్ల ఏర్పడే శిల ఏది?
ఎ) పాలరాయి బి) సున్నపురాయి
సి) గ్రానైట్ డి) పలకరాయి
2. పాలరాయి ఏ మాతృక శిల రూపాంతరం వల్ల ఏర్పడుతుంది?
ఎ) సున్నపురాయి బి) ఇసుకరాయి
సి) షేల్ డి) బసాల్ట్
3. మహారాష్ట్రలోని దక్కన్ నాపల ప్రాంతం ఏ రకమైన శిలలతో కూడి ఉంది?
ఎ) నీస్ బి) చార్నోకైట్
సి) గ్రానైట్ డి) బసాల్ట్
4. భారతదేశంలోని కింది తరగతికి చెందిన శిలల్లో చమురు సహజవాయువు నిక్షేపాలు కేంద్రీకృతమై ఉన్నాయి?
ఎ) కర్నూలు–కడప శ్రేణి శిలలు
బి) టైపామ్ శ్రేణి ఇసుకరాయి
సి) ధార్వారియన్ శిలలు
డి) చార్నోకైట్‌లు
5. కింది సూచించిన ఏ తరగతికి చెందిన శిలల్లో భూగర్భ జలవనరులు సమృద్ధిగా ఉంటాయి?
ఎ) అవక్షేప శిలలు
బి) రూపాంతర శిలలు
సి) అగ్ని శిలలు డి) పైవన్నీ
6. ఏ మూలకాలు కేంద్రీకృతమవడం వల్ల పటలం అల్ప సాంద్రతను కలిగి ఉంటుంది?
ఎ) ఇనుము, నికెల్
బి) ఇనుము, సిలికాన్
సి) సిలికాన్, మెగ్నీషియం
డి) సిలికాన్, అల్యూమినియం
7. భారతదేశంలో చార్నోకైట్, కోండలైట్ శిలలు ఏ ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి?
ఎ) పశ్చిమ కనుమలు
బి) దక్షిణ పీఠభూమి
సి) తూర్పు కనుమలు
డి) హిమాలయాలు
8. హిమాలయాల్లోని శివాలిక్ కొండలు ప్రధానంగా కింది శిలలతో నిర్మితమై ఉన్నాయి?
ఎ) అవక్షేప శిలలు
బి) రూపాంతర శిలలు
సి) అగ్ని శిలలు డి) పైవేవీ కావు
9. కింది వాటిలో అగ్ని శిల కానిదేది?
ఎ) గ్రానైట్ బి) గాబ్రో
సి) కాంగ్లోమెరేట్ డి) బసాల్ట్
10. మోహోలిక్ తలం వేటిని వేరు చేస్తుంది?
ఎ) ప్రావారం–కేంద్రకం
బి) పటలం–ప్రావారం
సి) సముద్రాలు–ఖండాలు
డి) బాహ్య కేంద్రకం–అంతర్ కేంద్రకం
11. భూమికి సంబంధించిన కింది పొరను 'శిలావరణం'గా వ్యవహరిస్తారు?
ఎ) భూపటలం బి) ప్రావారం
సి) కేంద్రకం డి) పైవేవీ కావు
12. భూకంపాలు భూమికి సంబంధించిన ఏ భాగంలో ఉద్భవిస్తాయి?
ఎ) భూపటలం బి) ప్రావారం
సి) కేంద్రకం డి) పైవేవీ కావు
13. భూఉపరితలం నుంచి అంతర్భాగానికి వెళ్లేకొద్దీ?
ఎ) సాంద్రత తగ్గుతుంది
బి) సాంద్రత పెరుగుతుంది
సి) సాంద్రత తగ్గి, పెరుగుతుంది
డి) సాంద్రత పెరిగి, తగ్గుతుంది
14. మోహోవిక్ తలం భూమిలో సగటున సుమారుగా ఎంత లోతులో ఉంటుంది?
ఎ) 5 కి.మీ. బి) 10 కి.మీ.
సి) 30 కి.మీ. డి) 50 కి.మీ.
15. ఖండాల భూపటలాన్ని ఏమని పిలుస్తారు?
ఎ) సియాలో పొర బి) సీమా పొర
సి) నైఫ్ పొర డి) పైవేవీ కావు
16. భూ అంతర్భాగానికి చెందిన కింది పొరను 'పెరిడోటైట్' కర్పరంగా పిలుస్తారు?
ఎ) భూపటంల బి) ప్రావారం
సి) కేంద్రకం డి) పైవేవీ కావు
17. 'బాథోలిథ్' భూస్వరూపం ఏ రకమైన శిలలతో నిర్మించబడుతుంది?
ఎ) అవక్షేప శిలలు
బి) రూపాంతర శిలలు
సి) అగ్ని శిలలు డి) పైవన్నీ
18. గ్యుటెన్‌బర్గ్ తలం భూ అంతర్భాగంలో సుమారు ఎంత లోతులో ఉంటుంది?
ఎ) 2000 కి.మీ. బి) 2200 కి.మీ.
సి) 2500 కి.మీ. డి) 2900 కి.మీ.
19. రూపాంతర శిలలు ఏర్పడటానికి ఏ అంశాలు దోహదపడతాయి?
1) అధిక పీడం
2) అధిక ఉష్ణోగ్రత
3) అధిక వర్షపాతం
ఎ) 1, 2 బి) 2, 3
సి) 3, 1 డి) పైవన్నీ
20. భూపటలంలో శిలలు ప్రధానంగా ఏ మూలకాలని కలిగి ఉంటాయి?
ఎ) మెగ్నీషియం బి) ఇసుక
సి) ఇనుము డి) సిలికాన్

సమాధానాలు

1) బి	2) ఎ	3) డి	4) బి	5) ఎ
6) డి	7) సి	8) ఎ	9) సి	10) బి
11) ఎ	12) ఎ	13) బి	14) సి	15) ఎ
16) బి	17) సి	18) డి	19) ఎ	20) డి

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐసీడీ-2026 డిగ్రీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

జైపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రాఫ్ట్స్ అండ్ డిజైన్(ఐఐసీడీ) 2025–26 సంవత్సరానికి సంబంధించి బ్యాచిలర్, మాస్టర్స్ ఆఫ్ డిజైన్, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం సీట్ల సంఖ్య:** 260.
- » **కోర్సులు–సీట్ల వివరాలు:** బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీడీఈఎస్)–నాలుగేళ్లు–180 సీట్లు; మాస్టర్స్ ఆఫ్ డిజైన్(ఎండీఈఎస్)–రెండేళ్లు–60 సీట్లు; పీజీ డిప్లొమా ఇన్ డిజైన్ ఫౌండేషన్–ఏడాది–20 సీట్లు
- » **కోర్సులు:** హార్డ్ మెటీరియల్ డిజైన్, సాఫ్ట్ మెటీరియల్ డిజైన్, ఫైర్డ్ మెటీరియల్ డిజైన్, ఫ్యాషన్ క్లాతింగ్ డిజైన్, జ్యూయలరీ డిజైన్, క్రాఫ్ట్ కమ్యూనికేషన్, ఇంటీరియర్ డిజైన్.
- » **అర్హత:** కోర్సును అనుసరించి ఇంటర్మీడియట్, డిజైన్ అండ్ ఆర్కిటెక్చర్‌లో ఏదైనా డిగ్రీ(బీడీఎస్, బీఆర్క్, బీఏ, బీఎస్సీ, వొకేషనల్ డిగ్రీ, పీజీ డిప్లొమా), ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు. (యూసీడ్/సీడ్/నిఫ్ట్/నిడ్‌లో క్వాలిఫైడ్ అభ్యర్థులకు ప్రవేశ పరీక్షలో మినహాయింపు ఉంటుంది).
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **దరఖాస్తులకు చివరితేది:** 31.03.2026.
- » **ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షతేది:** 05.04.2026.
- » **ఇంటర్వ్యూ తేది:** 01.05.2026 నుంచి
- » **ఫలితాలు(మొదట విడత):** 15.05.2026.
- » **వెబ్‌సైట్:** https://www.iicd.ac.in

సీఎఫ్‌టీఆర్ఐ, మైసూరులో ప్రాజెక్ట్ అసోసియేట్-1 పోస్టులు

మైసూరులోని సీఎస్ఐఆర్–సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎఫ్‌టీఆర్ఐ).. తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసోసియేట్–1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, ఎంఎస్సీ (ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కెమిస్ట్రీ) లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.
- » **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రూ.31,000(సీఎస్ఐఆర్–యూజీసీ, నెట్, గేట్ అర్హత గల వారికి) ఇతరులకు రూ.25,000.
- » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.01.2026
- » **వెబ్‌సైట్:** https://www.cftri.res.in

‘వైజయంతీ విలాసం’ రాసిందెవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కుతుబ్‌షాహీల యుగ విశేషాలు

భాషా సాహిత్యాలు

మహమ్మద్ కులీ కుతుబ్‌షా

ఇబ్రహీం కుతుబ్‌షా తర్వాత మహమ్మద్ కులీ కుతుబ్‌షా గోల్కొండ సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడి తల్లి భగీరథి. మహమ్మద్ కులీ తన ప్రేయసి అయిన భాగమతి పేరుమీద భాగ్యనగరాన్ని నిర్మించాడు. చార్మినార్ లాంటి అనేక కట్టడాలను నిర్మించాడు. ఇతడు మీర్జా మహమ్మద్ అమీన్, ముల్లా మూమిన్, మిసాక్ సుబాజ్ వలి అనే పార్సీ కవులను ఆదరించాడు. వజాహి, గవాస్సీ అనే ప్రముఖ ఉర్దూ కవులకు ఆశ్రయమిచ్చాడు. మహమ్మద్ కులీ స్వయంగా కవి, గ్రంథకర్త. ఫారసీ కవితా సంకలన కర్తయిన అలామ మీర్ మోమిన్ ఇతడి కాలంలో పీష్వా పదవిని అలంకరించాడు. పటమట సోమయాజిని ఆస్థాన కవిగా నియమించాడు. సారంగు తమ్మయ్య, కామారెడ్డిలను కులీ సన్మానించాడు. ఇతడి ఆస్థానంలో గణేశ పండితుడు కూడా ఉండేవాడు.

ఉర్దూ కవుల్లో కులీ ప్రథముడు కాకపోయినా ఆ భాషలోని రచనలు ఒక సంపుటంగా పుస్తక రూపంలో వెలువడటం ఈయనతోనే మొదలైంది. మహమ్మద్ కులీ తొలి ఉర్దూ రాజ కవి. ఇతడు పార్సీ, తెలుగు భాషల్లోనూ కవిత్వం రాశాడని భావిస్తారు. కానీ అవి అలభ్యం. మహమ్మద్ కులీ కవితల సంకలనాన్ని అతడి అల్లుడైన సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా ‘దివాన్’ పేరుతో వెలువరించాడు. ఇతడి కవిత్వం పర్షియన్, భారతీయ సంస్కృతుల సమ్మేళనం. కులీ కవితల్లో తెలుగు పదాలు, ఆచార వ్యవహారాలు, హోళీ, బతుకమ్మ పండుగల ప్రస్తావన ఉంది. అప్పటి వరకూ మత సంబంధంగా ఉన్న ఉర్దూ కవిత్వంలో లౌకిక భావనను ప్రవేశపెట్టిన కవుల్లో కులీ ప్రథముడు. నాటి తెలుగు, ఉర్దూ కవిత్వాల తరహాలోనే ఇతడిది ప్రధానంగా శృంగార కవిత్వం.

సారంగు తమ్మయ్య

తమ్మయ కులీ కుతుబ్‌షాకు ఆప్తుడు. గోల్కొండకు కరణీకం చేసేవాడు. అనేక కావ్యాలను రచించాడు. హరిభక్తి సుధోదయం అనే గ్రంథానికి తమ్మయ్య రాసిన వ్యాఖ్యానంలో భగీరథ పట్టణ ప్రస్తావన ఉంది. ఈ పట్టణమే భాగ్యనగరం (హైదరాబాద్). తమ్మయ్య ముఖ్య రచన ‘వైజయంతీ విలాసం’. తెలుగులో వెలువడిన గొప్ప శృంగార కావ్యాల్లో ఇదొకటి. ఇందులో భక్తిని, శృంగారాన్ని మేళవించారు.



నేబతి కృష్ణమంత్రి మహమ్మద్ కులీ ఆస్థాన కవి. కులీకి మంచి స్నేహితుడైన ఇతడు మంత్రిగానూ వ్యవహరించాడు. ఇతడు రాజనీతి రత్నాకరం అనే గ్రంథాన్ని రాశాడు. నాటి రాజకీయ పరిస్థితులు, సాహిత్యం తదితర విషయాల గురించి ఈ గ్రంథం తెలియజేస్తోంది.

దోమకొండ సంస్థానం

దోమకొండ (బిక్కనవోలు, నిజామాబాద్ జిల్లా) సంస్థానాన్ని తెలంగాణలో తొలి సంస్థానంగా భావించవచ్చు. ఈ సంస్థాన మూల పురుషుడు కాచారెడ్డి (1415–35). ఇతడి మునిమనవడైన ఒకటో ఎల్లారెడ్డి (1500–25) కాలం నుంచి ఈ సంస్థానం సాహిత్యాన్ని పోషించింది. బాలభారతం, కిరాతార్జునీయం అనే గ్రంథాలను ఎల్లారెడ్డి అంకితం తీసుకున్నాడు. అనేక మంది కవిపండితుల్ని పోషించాడు. ప్రస్తుతం వారి కావ్యాలేవి లభించడం లేదు. జంగమరెడ్డి, రెండో కామిరెడ్డి, రెండో ఎల్లారెడ్డి, రెండో మల్లారెడ్డి అనే నలుగురు ఇతడి మనవళ్లు. చివరి ముగ్గురు కృతిభర్తలు, కృతికర్తలు. ఈ ముగ్గురూ 16 శతాబ్దం ఉత్తరార్ధానికి చెందిన వారు.

కామిరెడ్డి(1530–1600) తన సహాధ్యాయి అయిన పటమట సోమనాథ సోమయాజిని ఆస్థాన కవిగా నియమించాడు. సోమయాజి ‘సూత సంహిత’ను అనువదించి కామిరెడ్డికి అంకితమిచ్చాడు. బ్రహ్మోత్తర ఖండాన్ని కామిరెడ్డి సోదరుడైన రెండో ఎల్లారెడ్డికి అంకితమిచ్చాడు. సోమయాజి గ్రంథాల ద్వారా దోమకొండ సంస్థాన విషయాలు తెలుస్తున్నాయి. రెండో ఎల్లారెడ్డి కృతికర్త కూడా. ఆయన వాసిష్ఠం, లింగపురాణం రచించాడు. కానీ అవి అలభ్యం. కామిరెడ్డి చివరి తమ్ముడైన రెండో మల్లారెడ్డి రాజకవి మల్లారెడ్డిగా ప్రసిద్ధి చెందాడు. ఇతడు ఎన్నో గ్రంథాలు రచించాడు. కానీ ఆయన రాసిన షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం, పద్మపురాణం అనే గ్రంథాలు మాత్రమే లభిస్తున్నాయి.

ఉర్దూ భాషకు స్వర్ణయుగం..

పైడిమర్రి వెంకటపతి (1570–1640) అనే కవి కులీకుతుబ్‌షా కాలానికి చెందినవాడు. ఇతడు హైదరాబాద్, బీదర్ పరిసర ప్రాంతాల్లో నివసించాడు. బ్రౌన్, బహుజనపల్లి లాంటి వాళ్లు ఈ కవిని ప్రామాణికుడిగా భావించారు. స్కంధపురాణంలోని 11 శ్లోకాల కథను తనదైన శైలిలో వర్ణించాడు. దీన్ని ‘చంద్రాంగద చరిత్ర’ అనే రసవత్ప్రబంధంగా మలిచాడు. తన పూర్వీకుల మాదిరిగానే మహమ్మద్ కులీ కుతుబ్‌షా కూడా కవి పండితులను పోషించాడు. ఇతడి ఆస్థాన కవి మీర్ మోమెన్. సయ్యద్ మీర్ కుతుబుద్దీన్, సయ్యద్ కమాలుద్దీన్, మాజ్ సదరానీ తదితర పండితులు ఇతడి ఆస్థానంలో ఉండేవారు.

మహమ్మద్ కులీ కుతుబ్‌షా తర్వాత సుల్తాన్ అబ్దుల్లా కులీ కుతుబ్‌షా రాజయ్యాడు. ఇతడు సంస్కృత ‘శుకసప్తతి’ని తోతినామా పేరుతో పార్సీ భాషలోకి అనువాదం చేయించాడు. దాన్నే ‘సబ్‌రస్’ (కామరూప కళాకథలు) పేరుతో ఉర్దూలోకి అనువదింపజేశాడు. ఇతడు ఉర్దూ భాషకు చాలా సేవ చేశాడు. ఇతడి పాలనా కాలం ఉర్దూ భాషకు స్వర్ణయుగం. ఇతడు కవిపండిత పోషకుడే కాకుండా స్వయంగా కవి. అబ్దుల్లా పేరుతో కవితలు వెలువరించాడు. ఇతడి ఆస్థానంలో అలామీ మీర్ మజీదుద్దీన్, మౌలానా రౌనఖీ మొదలైన ఎనిమిది మంది కవి పండితులుండేవారు. గవాసీ ఇబిన్ నిషాత్ లాంటి గొప్పకవులను ఇతడు ఆదరించాడు. గవాసి ‘తోతినామా’ అనే కథలు రాశాడు. తబీయ అనే కవి బహురావగుల్ అనే మనోరంజకమైన కథను రాశాడు. అబ్దుల్లా కులీ కుతుబ్‌షా ఆస్థానంలో తులసీమూర్తి లాంటి తెలుగు కవులు కూడా ఉండేవారు. క్షేత్రయ్య ఈ రాజును దర్శించాడు. అబ్దుల్లా పార్సీ, తెలుగు, మరాఠీ భాషల్లో కవిత్వం చెప్పేవాడు.

హరివాసర మహాత్మ్యం రాసిన మరింగంటి వెంకట (ప్రథమ) నరసింహాచార్యులు, శశిబిందు చరిత్రం రచయిత చరిగొండ నరసింహకవి, కూర్మ పురాణాన్ని రచించిన రాజలింగ కవి ఈ కాలానికి చెందినవారే. బమ్మెర కేసకవి – మల్లకవి, వజ్రాభ్యుదయాన్ని రాసిన కోననారాయణ, రాజేశ్వర విలాసం రచయిత పిల్లలమర్రి వెంకటపతి, చెన్న బసవ పురాణాన్ని రచించిన గోపతి లింగకవి తదితరులు కూడా ఈ కాలానికి చెందినవారే. ఓరుగల్లుకు చెందిన కాసెసర్వప్ప (1600) ఏకామ్రనాథుడి ‘ప్రతాపరుద్ర చరిత్ర’ను అనుసరించి ద్విపదలో ‘సిద్దేశ్వర చరిత్ర’ రాశాడు. ఈ గ్రంథాన్ని వ్యవహారిక భాషలో రచించాడు.

ఎలకూచి బాలసరస్వతి

తెలంగాణ కుతుబ్‌షాహీల పాలనలో ఉన్నప్పటికీ సరిహద్దు ప్రాంతాలు ఇతర రాజుల చేతులు మారుతూ వచ్చాయి. సురభి మాధవరాయలు విజయనగర అళియరాయల నుంచి జటప్రోలును(కొల్లాపూర్) కానుకగా పొందాడు. తర్వాత అతడి కుమారులు అబ్దుల్లా కుతుబ్‌షా నుంచి సనదు రూపంలో జటప్రోలు సంస్థానాన్ని పొందారు. రేచర్ల పద్మనాయకులైన వీరికి సురభి వంశ నామమైంది. ఈ వంశానికి చెందిన సురభి మాధవరాయలు(1620–70) చంద్రికా పరిణయమనే ప్రౌఢ కావ్యాన్ని రచించాడు. సురభి మాధవరాయల ఆస్థానకవి ఎలకూచి బాలసరస్వతి (1570–1650). ఆంధ్రశబ్ద చింతామణి ద్వారా ఇతడి పేరు చర్చనీయాంశమైంది. సంస్కృతంలో రాసిన ఈ తొలి తెలుగు వ్యాకరణ గ్రంథం నన్నయ రచనా? కాదా? బాలసరస్వతే రాసి నన్నయ పేరు పెట్టాడా? అనే విషయాలు చర్చనీయమయ్యాయి. మాధవరాయలతోపాటు ఇతడు కూడా ‘చంద్రికా పరిణయం’ రాశాడు. కానీ ఈ రెండింటిలో వేర్వేరు కథలున్నాయి. ఇతడు భర్తృహరి సంస్కృతంలో రాసిన శృంగార, నీతి, వైరాగ్య శతకాలను సుభాషిత రత్నావళి పేరుతో అనువదించాడు. మాధవరాయల తండ్రయిన మల్లభూపాలుడికి సుభాషిత రత్నావళిని అంకితం చేశాడు. ఇది తొలి అనువాదం. ‘యాదవ రాఘవ పాండవీయం’ అనే త్ర్యర్థి కావ్యంతో పాటు మొత్తం పది గ్రంథాలను ఇతడు రచించాడు. ఇతడి గ్రంథాల వల్ల జటప్రోలు, పర్తియాల (జూపల్లి వారు) సంస్థానాల విశేషాలు తెలుస్తున్నాయి.

బాలసరస్వతి ఆంధ్రశబ్ద చింతామణికి వ్యాఖ్య రాసిన కొద్ది కాలానికే కాకునూరి అప్పకవి అదే గ్రంథానికి భాష్యం లాంటి ప్రసిద్ధమైన అప్పకవీయం రాశాడు. అప్పకవి తెలంగాణ వాడేనని బూర్గుల రామకృష్ణారావు నిరూపించారు. అప్పకవీయం లక్షణ గ్రంథమైనా, సందర్భాన్ని బట్టి ‘నిజదేశంబుల వేషభాషలపయిన్ని త్యాభిమానస్థులై ప్రజమెచ్చన్’ అని ప్రాంతాభిమానాన్ని చాటాడు. సాధ్వీజనధర్మం (ద్విపదకావ్యం), అనంత వ్రతకల్పం(కావ్యం), శ్రీశైలమల్లికార్జునుడి మీద శతకం, అంబికావాదం (యక్షగానం), కవి కల్పకం (లక్షణ గ్రంథం) మొదలైన ఇతర గ్రంథాలు కూడా అప్పకవి రచించాడు. కానీ ఇవి లభ్యం కావడం లేదు.

దేవరకొండ పాలకుడైన పొనుగోటి జగన్నాథ రాయలు ‘కుముదవల్లీ విలాసం’ రచించాడు. ఇందులోని ఇతివృత్తం భక్తరామదాసు జీవితానికి దగ్గరగా ఉంటుంది.

కుతుబ్‌షాహి వంశంలో చివరి రాజులైన అబ్దుల్లా కుతుబ్‌షా (1626–72), అబ్దుల్ హసన్ తానీషా (1672–87) వద్ద అక్కన్న, మాదన్న అధికారులుగా పనిచేశారు. వారి మేనల్లుడైన కంచర్ల గోపన్న (భక్తరామదాసు) భద్రాచలం తహశీల్దార్ అయ్యాడు. తొలి సంకీర్తనాచార్యుల్లో ఒకడిగా రామదాసు ప్రసిద్ధి చెందాడు. ఇతడి జీవితం గురించి యక్షగానం వచ్చింది. దీన్ని బట్టి రామదాసు ఎంత గొప్పవాడో అర్థమవుతుంది. ఇతడి కీర్తనల్లో పాండిత్య ప్రకర్ష ఉండదు. అవి ఆర్తితో, సహజభక్తి భావావేశంతో అప్రయత్నంగా వచ్చాయి. దేశీయ గేయ రీతులను పుణికి పుచ్చుకున్నాయి. ఇతడు రాసిన ‘దాశరథి శతకం’ కూడా ప్రసిద్ధి చెందింది. భక్తరామదాసు పేరు వినగానే అబుల్ హసన్ తానీషా పేరు స్ఫురిస్తుంది. రామదాసును జైల్లో పెట్టిన నిర్దయుడిగానే ఇతడి గురించి తెలుసు. కానీ ఇతడు రసహృదయం ఉన్న కవి. ఇతడు పార్సీ, తెలుగు, మరాఠీ భాషల్లో కవిత్వం చెప్పేవాడు. తానీషా ఆస్థానంలో లతీఫ్, షాహినూరి, మీర్జాగులాం అలీ లాంటి ప్రసిద్ధ కవులుండేవారు. ఇతడి కాలంలో వజ్జి, గవాసీ తదితర ఉర్దూ కవులు తమ కవిత్వం ద్వారా ఉర్దూ భాషాభివృద్ధికి తోడ్పడ్డారు. ఉర్దూ రాజభాషగా పరిణతి చెందింది. అక్కన్న, మాదన్న, లింగన్నలకు ముఖ్య పదవులిచ్చాడు. పరమత సహనం చూపి ఉదార స్వభావిగా పేరొందాడు.

అష్టదిగ్గజాల్లో ఒకడైన తెనాలి రామలింగడు (కృష్ణుడు) కాకుండా మరో తెనాలి రామలింగకవి (1666–86) ఉన్నాడు. విశ్వ బ్రాహ్మణుడైన ఇతడు అక్కన్న, మాదన్నల వద్ద ఆశ్రయం పొందాడు. ఇతడు ధీరజనమనో విరాజితం (పరిమళ చోళచరిత్ర) అనే కావ్యాన్ని రాశాడు. విశ్వ బ్రాహ్మణులకు జరిగిన అన్యాయాలే ఈ ప్రబంధంలోని కథావస్తువు.

ఇతర కవులు..

పెన్నలూరి వెంకటాద్రి రామోదాహరణం, భువన మోహినీ విలాసం అనే గ్రంథాలను రచించాడు. పదిహేడో శతాబ్దికి చెందిన విశ్వనాథయ్య సిద్దేశ్వర పురాణం అనే ద్విపద రాశాడు. అన్నంభట్టు తర్క సంగ్రహాన్ని, కర్పూరం కృష్ణమాచార్యులు భగవద్గీత ద్విపదను రచించారు. అత్తాను రామానుజాచార్యుడు శ్రీ రుక్మిణీకురవంజి అనే గ్రంథాన్ని రాయగా, పూడూరి కృష్ణయామాత్యుడు భగవద్గీత యథాశ్లోకానువాదం చేశాడు. శ్రీనాథుని వెంకటరామయ్య అశ్వరాయ చరిత్ర రాశాడు. అన్నమయ్య తర్వాత ఎక్కువ కీర్తనలు (3476) రాసిన ముష్టిపల్లి వేంకటభూపాలుడు ఈ కాలానికి చెందినవాడే. లక్ష్మీశకవి, కాంద్రవేటి రామానుజాచార్యులు, ఎడపాటి ఎర్రన, సింహాద్రి వెంకటాచార్యులు, మరింగంటి వేంకట (ద్వితీయ) నరసింహాచార్యులు (1650–1720), సురభి నర్సింగరావు, బోరవెల్లి కృష్ణప్ప కూడా ఈ కాలానికి చెందిన కవులే. వీరే కాకుండా కుతుబ్‌షాహీల కాలానికి చెందిన ఎంతో మంది కవులు తెలుగు సాహిత్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు

The seriousness of the situation is...

BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q.No. 1-5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

Climate change poses potentially devastating effects on India's agriculture. While the overall parameters of climate change are increasingly accepted – a 1 °C average temperature increase over the next 30 years, sea level rise of less than 10 cm in the same period, and regional monsoon variations and corresponding droughts- the impacts in India are likely to be quite site and crop specific. Some crops may respond favourably to the changing conditions, others may not. This emphasizes the need to **promote** agricultural research and create maximum flexibility in the system to permit adaptations.

The key ingredient for "drought proofing" is the managed recharge of aquifers. To ensure continued yields of important staple crops, it may also be necessary to shift the locations where these crops are grown, in response to temperature changes as well to water availability. The latter will be a key factor in making long term investment decisions.

For example, water runoff from the Himalayas is predicted to increase over the next 30 years as glaciers melt, but then decline substantially thereafter. It will be **critical** to provide incentives to plan for these large-scale shifts in agro-ecological conditions.

India needs to make long term investment in research and development in agriculture. India is likely to experience changed weather patterns in future.

1. Consider the following statements: Climate change may force the shifting of locations of the existing crops due to
a) Melting of glaciers
b) Water availability and temperature suitability at other locations
c) Poor productivity of crops
d) Wider adaptability of crop plants
Which of the statements given above are correct?
1) a, b, & c 2) b & c only
3) a & d only 4) a & c
5) a, b, c, & d

2. To promote agricultural research in India is important because:
1) To predict variations in monsoon patterns and to manage water resources.
2) To make long term investment decisions for economic growth.
3) To facilitate wider adaptability of crops.
4) To predict drought conditions and to recharge aquifers.
5) Changed weather patterns in future.

3. The spillover from the Himalayas is due to
1) large-scale shifts in agro-ecological conditions.
2) changed weather patterns in future
3) productivity of crops
4) melting of glaciers
5) adaptability of crop plants

4. The antonym of **Critical** is
1) waver 2) steady 3) unsure
4) insecure 5) fasten

5. The synonym of **promote** is
1) encompass 2) encourage
3) entangle 4) entrust
5) encode

Directions (Q.No. 06-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. There is a ____ gap between rich and poor.
1) vary 2) variety 3) similar
4) reported 5) yawning

7. She ____ to escape from her office job.
1) earned 2) yelled 3) yearned
4) yielded 5) learn

8. The seriousness of the situation is ____ to appreciate in its ____.
1) easy; complete
2) different; wholesome
3) difficult; totality
4) hard; completeness
5) tough; compliment

9. The new policy was adopted in the ____ of fierce ____.
1) wake; opponent
2) show; postponement
3) teeth; criticism
4) course; outcome
5) reality; injustice

10. The computer is now an ____ tool for the family doctor.
1) value 2) valid
3) price 4) worth
5) invaluable

Directions: (Q.No. 11-15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The magazine is issued <u>year two times.</u>
1) year twice
2) twice yearly
3) yearly two
4) two yearly 5) no correction required

12. She yelled at the child to <u>getting down</u> from the wall.
1) got down 2) get down
3) getting away 4) get upon
5) no correction required

13. All her yesterday's <u>has</u> vanished without a trace.
1) Have 2) had
3) has been 4) have being
5) no correction required

14. My son's 13 but he's <u>younger</u> for his age.
1) Youngest 2) youth
3) older 4) young
5) no correction required

15. When the needle enters the red zone the engine is <u>indicator</u> hot.
1) Too 2) much
3) becomes 4) left
5) no correction required

Directions (Q.No. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. Exam results (1)/ are not the only (2)/ yard stick of a (3)/ school performance. (4)/ no error (5)

17. I have always (1)/ had a yen (2)/ to travel (3)/ around the world. (4)/ no error (5)

18. Because of the rapid progress (1)/ that science has made (2)/ the universe is slow yielding (3)/ up its secrets. (4)/ no error (5)

19. She brings to the job (1)/ a rare combination (2)/ of youth and (3)/ experiences. (4)/ no error (5)

20. The group was made up of (1)/ people with a range of age, (2)/ professions, incomes and (3)/ computer expertise. (4)/ no error (5)

21. Between 1957 and 2007 expenditures (1)/ in all 5 categories changed to some extent, (2)/ but the most marked change (3)/ was in the food category. (4)/ no error (5)

22. It seems that the man (1)/ who is dropping (2)/ off his own water bottle in the recycling bin (3)/ drove there in his car. (4)/ no error (5)

23. Reality TV shows involve real people perform (1)/ ridiculous and often dangerous acts (2)/ and generally behaving horribly (3)/ towards each other. (4)/ no error (5)

24. It is a legal requirement (1)/ for airline operators to provide (2)/ suitable refreshment (3)/ in the event of a long delay. (4)/ no error (5)

25. For some people, the huge increase in public surveillance (1)/ is a threat to the individual's social liberties (2)/ and was a sign that society (3)/ is becoming increasingly authoritarian. (4)/ no error (5)

Directions (Q.No. 26-30): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

26. Several **alarming** (1) incidents **occurred in** recent years (2) and **was widely** (3) **reported in** (4) the press.

27. A (1) general public should **rise to** (2) address the **social evil of** (3) corporal **punishment.** (4)

28. The teacher **was sought** (1) not only for imparting knowledge **and** (2) skills to students **but for also** (3) shaping their minds **and character.** (4)

29. **Prolonged** (1) television **viewvers** (2) have a higher **risk of** (3) fatal pulmonary **embolism.** (4)

30. **I want to** (1) travel to **sea** (2) the world **around** (3) and appreciate new **cultures.** (4)

Directions (Q.No. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Thomas Smart conferred upon Sastri the appellation "Silver Tongued Orator of the British Empire" and he was so called all over the United Kingdom.
B) Srinivasa Sastri was known for his mastery over the English language and his oratory. As a student, he once corrected a few passages in J. C. Nesfield's "English Grammar".
C) The Master of Balliol, Arthur Lionel Smith swore that he had never realized the beauty of the English language until he heard Sastri, while Lord Balfour remarked that listening to Srinivasa Sastri made him realize the heights to which the English language could rise.
D) Whenever he was on visit to the United Kingdom, Sastri was often consulted over spellings and pronunciations.
E) Srinivasa Sastri's inspirations were William Shakespeare, Sir Walter Scott, George Eliot, John Stuart Mill, Thomas Harvey, Victor Hugo and Valmiki - Indian sage and the author of the Hindu epic Ramayana.
F) His mastery over the English language was recognized by King George V, Winston Churchill, Lady Lytton and Lord Balfour who rated him amongst the five best English-language orators of the century.

31. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

32. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

33. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F

34. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) E 5) F

35. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q.No. 36-40): Choose the word which is wrongly spelt from the five options given.

36. 1) pedagogue 2) vilify
3) extraneous 4) bucollic
5) conundrum

37. 1) powwow 2) malignant
3) untenable 4) capricious
5) dissipete

38. 1) railery 2) splenetic
3) palaver 4) lachrymose
5) tenacity

39. 1) exiguity 2) pillary
3) concomitant 4) surfeit
5) adjudicate

40. 1) promulgate 2) cataclysm
3) deluge 4) simulacrom
5) mural

Answers

1) 1; 2) 4; 3) 4; 4) 2; 5) 2;
6) 5; 7) 3; 8) 3; 9) 3; 10) 5;
11) 2; 12) 2; 13) 2; 14) 4; 15) 1;
16) 3; 17) 5; 18) 3; 19) 4; 20) 2;
21) 1; 22) 4; 23) 1; 24) 3; 25) 3;
26) 3; 27) 1; 28) 3; 29) 2; 30) 2;
31) 1; 32) 4; 33) 2; 34) 1; 35) 3;
36) 4; 37) 5; 38) 1; 39) 2; 40) 4.